సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 316

సోమవారం 6-2-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'తెలుగువారి గుండెచప్పుడు వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు... నా జన్మ ధన్యమైనట్టే'



అశు 'కంచు పట్టు'

వరల్డ్ రెజ్లింగ్ ర్యాంకింగ్ సిరీస్ టోర్నీలో భారత రెజ్లర్‌కు కాంస్యం. -12లో



పన్ను ఆదా మార్గాలు..

పన్ను భారం తగ్గించుకునేందుకు ఉన్న మార్గాలపై కథనం.. -13లో



చైనా బెలూన్‌ని పేల్చేసిన అమెరికా

తన గగనతలంపై కలకలం రేపుతున్న అనుమానాస్పద చైనా నిఘా బెలూన్‌ని అమెరికా.. యుద్ధ విమానం ఎఫ్‌-22తో పేల్చేసింది.

- వివరాలు 6లో ▶



మన ఓటర్ల సంఖ్య 94.50 కోట్లు

ఈ ఏడాది జనవరి 1 నాటికి మన దేశంలో రిజిస్టర్డ్ ఓటర్లు 94.50 కోట్లు అని కేంద్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది.

- వివరాలు 6లో ▶



232 విదేశీ యాప్‌లపై నిషేధం

చైనాతోపాటు వివిధ దేశాల సంస్థలు నిర్వహిస్తున్న 232 యాప్‌లపై కేంద్రం నిషేధం విధించింది. వీటి పేర్లను వెల్లడించలేదు.

- వివరాలు 6లో ▶



ముషారఫ్ కన్నుమూత

పాకిస్తాన్ మాజీ సైనిక పాలకుడు, 1999 నాటి కార్గిల్ యుద్ధం సృష్టికర్త జనరల్ పర్వేజ్ ముషారఫ్ అనారోగ్యంతో కన్నుమూశారు.

- వివరాలు 6లో ▶

ఏది నిజం?

సీబీఐ నుంచి రామోజీ 'లైవ్' రిపోర్టింగ్

- ఇద్దరు మాట్లాడుకున్నది 'ఈనాడు'కెలా తెలుస్తోంది?
- బాబు అనుకూల మీడియాకే లీకులెందుకు ఇస్తున్నారు?
- ఇంట్లో కాఫీ, టీలిచ్చే వారిని 'పీఏ' అంటారా?.. ఇంట్లో వ్యక్తులు బిజీగా ఉన్నప్పుడు వారి పనివాళ్లకు సమాచారమివ్వరా?
- అదే పెద్ద నేరమైనట్లుగా పదేపదే భారతమ్మ పేరు తెస్తున్నారెందుకు?
- మరణించిన వివేకా... అవినాశ్ రెడ్డికి చిన్నాయనే కదా?
- పీఏ కృష్ణారెడ్డి దగ్గర దొరికిన లేఖ నాన్న రాసిందే: వివేకా కుమార్తె
- తామొచ్చే వరకూ ఆ లేఖను ఎవరికీ ఇవ్వొద్దని కూడా ఆమె చెప్పారు
- ఈ విషయాన్ని ఆమె డీఐజీకి చెప్పినట్లు వెల్లడించిన ఎస్పీ
- వివేకా మరణించారని తొలుత చెప్పింది ఆయన బావమరిది శివప్రకాశ్ రెడ్డి.. గుండెపోటుతో మరణించారని ఆయనే చెప్పారన్న ఆదినారాయణ రెడ్డి
- తనకూ ఆయన చెబితేనే వచ్చానని వెల్లడించిన అవినాశ్
- మరి కావాలని దుష్ప్రచారమేల?

4 లో



నాందేడ్‌లో జరిగిన బీఆర్‌ఎస్ బహిరంగసభకు హాజరైన వారినుద్దేశించి ప్రసంగిస్తున్న సీఎం కేసీఆర్

రైతులే పాలకులు కావాలి

అందుకే భారత్ రాష్ట్ర సమితి ఆవిర్భవించింది

అబ్ కీ బార్.. కిసాన్ సర్కార్ నినాదంతో ప్రజల ముందుకు వచ్చింది

నాందేడ్ బహిరంగ సభలో ముఖ్యమంత్రి కేసీఆర్

తన కుటుంబాన్ని వదిలి రైతన్న ఎందుకు ఆత్మహత్య చేసుకుంటున్నాడు?

దేశంలో ఈ అగత్యం ఎందుకు ఏర్పడింది? దీని వెనకున్న మతలబేంటి?

- ప్రజలు ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది
- దేశం స్పష్టమైన మార్పును కోరుకుంటోంది
- తన మాటలపై మహారాష్ట్ర ప్రజలు చర్చించాలన్న ముఖ్యమంత్రి కేసీఆర్
- తాను చెప్పింది నిజమైతేనే బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని విజ్ఞప్తి
- మహారాష్ట్రలో 288 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్ పోటీ చేస్తుందని ప్రకటన

నిర్మల్/భైంసా: 'ఒక రైతు.. తన కుటుంబాన్ని, భార్యాపిల్లలను వదిలి ఆత్మహత్య ఎందుకు చేసుకుంటున్నాడు? ఆరుగాలం శ్రమించి దేశానికి అన్నం పెట్టి, జీవితాన్ని ప్రసాదించే రైతన్న ఆత్మహత్య చేసుకోవాల్సిన అగత్యం ఈ దేశంలో ఎందుకు ఏర్పడింది? దీని వెనకున్న మతలబేంటి? ఇంతకంటే దారుణం మరొకటి ఉంటుందా? దేశం ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైంది. ఓవైపు మన రైతులు చనిపోతుంటే, రంగురంగుల జెండాలు, గంటలకు గంటలు

మిగతా 2వ పేజీలో ▶

రైతులు, కార్మికులు కలిస్తే చాలు..

'దేశంలో ఎక్కడా లేనివిధంగా మహారాష్ట్రలోనే రైతు ఆత్మహత్యలు ఎందుకు ఎక్కువగా ఉన్నాయి? రైతులు ఎలాంటి పరిస్థితుల్లో ఆత్మహత్యకు పాల్పడతారో ఆలోచించాలి. దేశంలో రైతుల సంఖ్య జనాభాలో 42 శాతం కంటే అధికంగా ఉంది. వ్యవసాయ కార్మికులను కూడా కలిపితే ఇది 50 శాతం కంటే ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఇంతకన్నా బలం అవసరం లేదు. మీరు ఇంటికి వెళ్లాక కేసీఆర్ చెప్పిన మాటలు నిజమా? అబద్ధమా? అని ఆలోచించండి. ఒక దీపంతో మరో దీపాన్ని వెలిగించినట్టుగా ఈ విషయాన్ని వ్యాప్తి చేయాలి. ఇక రైతులు కేవలం నాగలిని పట్టడమే కాదు.. కలాన్ని పట్టి చట్టం చేసే అవకాశాలను కూడా పొందాలి. రైతులను కేవలం మాటలు, నినాదాలకే పరమితం చేయకుండా ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా చేసేందుకే బీఆర్‌ఎస్ ఆవిర్భవించింది..' అని సీఎం తెలిపారు.

పెద్ద మనసుతో చెప్తున్నా.. బాబ్లీకి ఎత్తిపోసుకోండి

- సమస్యను అర్థం చేసుకుంటే జల వివాదాలకు పరిష్కారం
- అసెంబ్లీ, పార్లమెంటులో మహిళలకు 33% రిజర్వేషన్లు
- తదుపరి ప్రెస్‌మీట్ త్వరలో దేశ రాజధానిలో ఉంటుంది
- నాందేడ్ మీడియా సమావేశంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

2 లో

"జాతీయస్థాయిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేస్తే నీటి వినియోగంలో విప్లవాత్మక ఎజెండా అమలు చేస్తాం. రాష్ట్రాల నడుమ కొట్లాటలు లేని జాతీయ విధానం తెస్తాం. అవసరానికి మించి నదీ జలాలున్న భారత్‌లో భారీ రిజర్వాయర్లు కట్టాల్సిన అవసరం ఉంది.



రూ. 2.9 లక్షల కోట్లు..!

2023-24 బడ్జెట్‌పై ప్రభుత్వ కసరత్తు పూర్తి



నేటి ఉదయం 10:30కి అసెంబ్లీ ముందుకు.. సాగునీటికి రూ.35 వేల కోట్లపైనే.. వ్యవసాయానికి రూ.25 వేల కోట్ల కేటాయింపులు.. విద్య, వైద్యం, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యం

10 లో

దళితబంధుకు మళ్లీ రూ.20 వేల కోట్లు!

'గిరిజన బంధు' ప్రతిపాదిస్తే రూ.5 వేల కోట్ల కేటాయింపు!

రుణమాఫీకి రూ.20 వేల కోట్ల వరకు ప్రతిపాదన

సొంత జాగా ఉంటే రూ.3 లక్షలు, గ్రామానికి రూ.10 లక్షల అభివృద్ధి నిధుల ప్రతిపాదన

రూ.30 వేల కోట్లు దాటనున్న జీతాలు, పింఛన్ల పద్దు..

జీఎస్‌డీపీలో 3.5 శాతం మేరకు రూ.50 వేల కోట్ల వరకు ఈ ఏడాది అప్పుల ప్రతిపాదన.. రూ.2.25 లక్షల కోట్ల వరకు ఈ ఏడాది సవరించిన అంచనాలు?

బడ్జెట్ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం

సాక్షి, హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2023–24) సంబంధించిన రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది. సీఎం కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ఆదివారం ఉదయం ప్రగతిభవన్‌లో సమావేశమైన రాష్ట్ర కేబినెట్ బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించి ఆమోదం తెలిపింది.

'నెలాఖరుకు అసెంబ్లీ రద్దు'..



'నూటికి నూరు శాతం చెబుతున్నాను.. తెలంగాణ శాసనసభ రద్దు కాగానే రాష్ట్రపతి పాలన విధించబోతున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ చిత్తుచిత్తుగా ఓడిపోబోతోంది. బీఆర్‌ఎస్ వారందరినీ ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు' అని కాంగ్రెస్ నేత, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.

- వివరాలు 2లో ▶

జిల్లా కోర్టుల్లో తెలుగులో ప్రొసీడింగ్స్

ఆ దిశగా ఏర్పాట్లు చేస్తున్నాం: హైకోర్టు సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్

పెద్దపల్లి జిల్లా నందిమేడారంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్

సాక్షి, పెద్దపల్లి: కోర్టుల్లో వాడే భాష స్థానిక ప్రజలకు అర్థమయ్యేలా ఉంటే న్యాయవ్యవస్థ మరింత చేరువగా పనిచేయగలుగుతుందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ అభిప్రాయపడ్డారు. జిల్లా స్థాయిలోని కోర్టుల్లో తెలుగులో ప్రొసీడింగ్స్ అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టును హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పి. నవీన్‌రావు, జస్టిస్ ఎన్వీ శ్రవణ్ కుమార్ సహా 14 మంది హైకోర్టు జడ్జీలతో కలసి సీజే జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీజే మాట్లాడుతూ న్యాయ వ్యవస్థపట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని రక్షించే దిశగా అందరూ కృషి చేయాలన్నారు. తనకు తెలుగు భాషపై మక్కువ ఉందని, చిన్నతనంలో స్వర్గీయ ఎన్టీఆర్ ప్రసంగం విన్నానని గుర్తుచేసుకున్నారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరసింహ ఇటీవల నిర్వహించిన సమావేశంలో న్యాయ పుస్తకాలను తెలుగులో

మిగతా 5వ పేజీలో ▶

బీసీల చరిత్రలో ఇది సువర్ణాధ్యాయం

- మంత్రులు గంగుల, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి
- ఉప్పల్ భగాయత్‌లో బీసీ కులసంఘాల ఆత్మగౌరవ భవనాలకు భూమిపూజ

3 లో



భూమిపూజ అనంతరం జరిగిన సభలో అభివాదం చేస్తున్న మంత్రులు మల్లారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, తలసాని, గంగుల తదితరులు



ఆదివారం రాష్ట్రపతిభవన్ ప్రాంగణంలోని అమృత్ ఉద్యాన్ గార్డెన్‌ను సందర్శించిన సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో కలిసి ఫొటో దిగిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, ఇతర న్యాయమూర్తులు, వారి సతీమణులు

నేటి నుంచి.. 'హాథ్ సే హాథ్' యాత్రలు

- రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనున్న కాంగ్రెస్.. మేడారం నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్
- హాజరుకానున్న మాణిక్‌రావ్ ఠాక్రే.. ఇప్పటికే ములుగు చేరుకున్న పలువురు కాంగ్రెస్ నేతలు



సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడోయాత్రలు రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జనవరి 26న లాంఛనంగా ప్రారంభమైన ఈ పాదయాత్రలను సోమవారం నుంచి రెండు నెలలపాటు కొనసాగించనున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ములుగు నియోజకవర్గంలోని మేడారం నుంచి యాత్ర నిర్వహించనున్నారు. ఇప్పటికే ములుగు చేరుకున్న కాంగ్రెస్ నేతలు మల్లు రవి, బలరాంనాయక్, విజయరమణారావు, సిరిసిల్ల రాజయ్య, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు స్థానిక ఎమ్మెల్యే సీతక్కతో కలిసి ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉదయం 8కి హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి రేవంత్ మేడారానికి బయలుదేరనున్నారు. ములుగుకు వెళ్లిన తర్వాత గట్టమ్మ, సాయిబాబా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం మేడారం చేరుకుని అక్కడ సమ్మక్క, సారలమ్మలకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 12 గంటల సమయంలో పాదయాత్ర ప్రారంభించి కొత్తూరు, నార్లాపూర్, ప్రాజెక్ట్ నగర్, పస్రా జంక్షన్‌ల మీదుగా రామప్ప గ్రామానికి చేరుకుంటారు. అక్కడ రాత్రి బస చేసిన తర్వాత మలిరోజు ఆ గ్రామం నుంచే పాదయాత్ర ప్రారంభిస్తారని, వారంపాటు అదే నియోజకవర్గంలో తన పాదయాత్ర సాగిస్తారని టీపీసీసీ వర్గాలు వెల్లడించాయి.

బడ్జెట్ ఆమోదం తర్వాత భట్టి యాత్ర


హాథ్ సే హాథ్ జోడో యాత్రల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొనేందుకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే కూడా

మిగతా 2వ పేజీలో ▶









క్లుప్తంగా...

బీసీల పొట్ట కొడుతున్న కేజ్రీవాల్

ఓబీసీ సంయుక్త సంఘర్ష సమితి ధర్నాలో ఎంపీ లక్ష్మణ్



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ దేశ రాజధానిలో కోట్లాది మందిపైగా ఉన్న వలస బీసీల పొట్ట కొడుతున్నారని బీజేపీ జాతీయ బీసీ మోర్చా అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆరోపించారు. 1993 నుంచి నివసిస్తున్న బీసీలకే ధ్రువీకరణ పత్రాలు ఇస్తానని కేజ్రీవాల్ ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమన్నారు. ఓబీసీ సంయుక్త సంఘర్ష సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన చలో జంతర్‌మంతర్ ధర్నానుద్దేశించి లక్ష్మణ్ మాట్లాడారు. తెలుగు రాష్ట్రాలతో పాటు అనేక రాష్ట్రాల నుంచి వలస వచ్చిన ఓబీసీలు ఢిల్లీలో ఉపాధి పొందుతున్నారని గుర్తు చేశారు. వారికి బీసీ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంటులో ఈ అంశాన్ని లేవనెత్తి కేజ్రీవాల్ మెడలు వంచుతామని ఆయన హెచ్చరించారు.

ముందు తెలంగాణ ప్రజల్ని పట్టించుకోండి

సాక్షి, హైదరాబాద్: దేశంలో భారీ మార్పు లు రావాలని ప్రగల్భా లు పలుకుతున్న సీఎం కేసీఆర్.. ముందుగా తెలంగాణ ప్రజల బతుకులు మార్చాలని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ హితవు పలికారు. కన్నతల్లికి అన్నం పెట్టని వాడు, పిన్నతల్లికి బంగారు గాజులు చేయిస్తాననన్నట్టు.. కేసీఆర్ తీరు ఉందని ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. కేసీఆర్ నాందేడ్ పర్యటనపై అరుణ స్పందిస్తూ తెలంగాణలో రైతులు పిట్టలు రాలినట్టు రాలిపోతుంటే సోయి లేని సీఎం.. మహారాష్ట్రలో ఆత్మహత్యలంటూ మాట్లాడడం సిగ్గుచేటని మండిపడ్డారు.

దేశంలోనే అవినీతిమయం.. కాళేశ్వరం ప్రాజెక్ట్

మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్



సాక్షి, హైదరాబాద్: సొంత సభ, సొంత మైక్, అన్‌లిమిటెడ్ టైం ప్రసంగంతో మంత్రి కేటీఆర్ ఊదరగొట్టారని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో కేటీఆర్ మాటలు విన్నవారికి త్వరలోనే కంటివెలుగు మాదిరిగానే ఈఎన్‌టీ వెలుగు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వ్యంగ్యంగా అన్నారు. మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలసి ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడుతూ దేశంలోనే అత్యంత అవినీతిమయమైన ప్రాజెక్ట్ కాళేశ్వరమని, దీని పేరుతో తప్పుడు లెక్కలు చూపించి నిధులను వెనకేసుకున్నారని ఆరోపించారు. అసలు కాళేశ్వరం డ్యామా? చెక్ డ్యామా? దీనిపై చర్చకు కేటీఆర్ సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. కాళేశ్వరం ద్వారా కొట్టేసిన డబ్బులను మహారాష్ట్ర, ఢిల్లీలో ఖర్చుచేస్తున్నారని మండిపడ్డారు. కాగా, బడ్జెట్‌లో రాష్ట్రానికి కేంద్రం ఏమీ ఇవ్వడం లేదని కేటీఆర్ చేసిన విమర్శలు సరికాదని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. రైల్వే బడ్జెట్‌లో ఉమ్మడి రాష్ట్రంలో కంటే కూడా తెలంగాణకు ఈ ఏడాది అత్యధికంగా రూ.4,418 కోట్లు కేటాయించారన్నారు.

టీపీసీసీ నేతలతో ఠాక్రే సమావేశాలు

సాక్షి, హైదరాబాద్ : టీపీసీసీ నేతలు, అనుబంధ సంఘాల సమావేశాలతో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే ఆదివారం బిజిబిజీగా గడిపారు. ఉదయం ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఇతర నేతలతో భేటీ అయిన ఠాక్రే ఆ తర్వాత టీపీసీసీ ఓబీసీ విభాగం కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి నదీమ్ జావిద్, ఓబీసీ విభాగం చైర్మన్ నూతి శ్రీకాంత్ పాల్గొన్నారు. తర్వాత టీపీసీసీ మైనారిటీ సెల్, ఎస్సీ సెల్ సమావేశాలకు హాజరైన ఠాక్రే రాజకీయ వ్యూహాలు, పార్టీ కార్యక్రమాలపై పలు సూచనలు చేశారు.

మాదిగలను విస్మరిస్తే బీజేపీకి పతనం: మందకృష్ణ



జగిత్యాల టౌన్: ఎస్సీ వర్గీకరణకు అండగా ఉంటామని హామీ ఇచ్చి.. అధికారంలోకి వచ్చాక ఆ ఊసెత్తని బీజేపీ ప్రభుత్వానికి పతనం తప్పదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హెచ్చరించారు. జగిత్యాల ప్రెస్‌క్లబ్‌లో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణ ప్రక్రియ చేపట్టకుండా మాదిగల ఆత్మాభిమానాన్ని దెబ్బ తీసిన బీజేపీ తీరుకు నిరసనగా ఈనెల 13న రెండు తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్ – విజయవాడ మధ్య రహదారులను దిగ్బంధిస్తామని తెలిపారు. ఈనెల 13న ప్రధాని హైదరాబాద్ రానున్న నేపథ్యంలో మాదిగల ఆవేదన, ఆక్రందన పేరిట హైదరాబాద్ – విజయవాడ మధ్య 270 కిలోమీటర్ల మేర జాతీయ రహదారులను దిగ్బంధిస్తామని, ఇందుకోసం ప్రణాళిక సిద్ధం చేశామని వివరించారు. అనాథల సమస్యల పరిష్కారానికి ఈనెల 15న 'అనాథల ఆరిగోస' పేరిట అన్ని కలెక్టరేట్ల ఎదుట దీక్షలు చేపడతామని మందకృష్ణ చెప్పారు.

రైతులే పాలకులు కావాలి

▶ మొదటి పేజీ తరువాయి

ఎక్కడపడితే అక్కడ, అసెంబ్లీల్లో, పార్లమెంటులో ప్రసంగాలతో ఊదరగొడుతున్నారు. ఫలితం మాత్రం శూన్యం. ఈ నేపథ్యంలోనే దేశ ప్రజలు స్పష్టమైన మార్పును కోరుకుంటున్నారు. అందుకే భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) దేశంలోనే మొట్ట మొదటిసారిగా ఏ పార్టీ ఇవ్వని విధంగా 'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' అనే నినాదంతో రైతులనే పాలకులను చేసేందుకు ప్రజల ముందుకు వచ్చింది..' అని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తెలిపారు. మహారాష్ట్ర నాందేడ్ రైల్వేస్టేషన్ సమీపంలోని గురుద్వారా సచ్‌ఖండ్ బోర్డు మైదానంలో ఆదివారం భారత్ రాష్ట్ర సమితి (బీఆర్‌ఎస్) బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఇది రాష్ట్రం బయట బీఆర్‌ఎస్ తొలి సభ కావడం గమనార్హం. కాగా సభలో సీఎం కేసీఆర్ రైతన్నల గోస వినిపిస్తూ, మరాఠా ప్రజల మనసులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. 'ఛత్రపతి శివాజీ మహారాజ్, బీఆర్ అంబేడ్కర్, అన్నాబావ్ సాఠే, మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రీ బాయిపూలే వంటి మహామహులకు జన్మనిచ్చిన పవిత్ర భూమికి ప్రణమిల్లుతున్నాను..' అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

దేశ భావజాలాన్ని మార్చేందుకే..

'బీఆర్‌ఎస్ కొంతకాలం క్రితమే ఆవిర్భవించింది. ఇంతకుముందు టీఆర్‌ఎస్ పేరుతో తెలంగాణకు మాత్రమే పరిమితమై ఉండేది. దేశ పరిస్థితులను అర్థం చేసుకున్నాక, దేశ భావజాలాన్ని మార్చాల్సిన అవసరాన్ని గుర్తించిన తర్వాత జాతీయ స్థాయిలో పనిచేయాలని నిర్ణయించుకున్నాం. ఈ నేపథ్యంలోనే తెలంగాణ బయట తొలిసారిగా మహారాష్ట్ర గడ్డపై బీఆర్‌ఎస్ మీ ముందుకు వచ్చింది. మహారాష్ట్ర ప్రజలు, మీడియా సోదరులతో కొన్ని ముఖ్యమైన విషయాలు పంచుకోవాలనుకుంటున్నా. నా మాటలను ఇక్కడే మర్చిపోవద్దు. మీ ఇండ్లకు, గ్రామాలకు, పట్టణాలకు వెళ్లిన తర్వాత తప్పకుండా చర్చించాలి..' అని కేసీఆర్ కోరారు.

ఒక్కసారి మనం అంతా ఏకం కావాలి..

'దేశ గమనంలో, భావజాలంలో, దేశాన్ని నడపడంలో గొప్ప మార్పు అనివార్యం. అలాంటి మార్పునకు సమయం ఆసన్నమైంది. 75 ఏళ్ల స్వతంత్ర దేశంలో ఎన్నో ప్రభుత్వాలు మారాయి. ఎందరో ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులు, మంత్రులు, నాయకులు మారారు. మనమే వాళ్లందరినీ పదవుల్లో కూర్చోబెట్టాం. నేను చెప్పేది రాకెట్ సైన్స్ కాదు. చాలా సింపుల్‌గా అర్థం అవుతుంది. 75 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ తాగడానికి, సాగుకు నీళ్లుండవు. కరెంటు కూడా లభించదు. ఎందుకు? దేశంలో వనరుల లభ్యత లేదా? ప్రజలకు సౌకర్యాలను సమకూర్చలేమా? మరేంటి మతలబు? దీన్ని మనం అర్థం చేసుకోవాలి. అర్థమయ్యాక కూడా అర్థం కానట్టు ఉండకూడదు. ఒక్కసారి మనం అంతా ఏకం కావాలి..' అని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్, బీజేపీల వల్లే ఈ దుస్థితి

'మన దేశం అమెరికా కంటే ధనిక దేశం. మన నాయకులు సమర్థవంతంగా పనిచేస్తే అంతకంటే గొప్పగా ఎదుగుతుంది. నీరు, భూమి, బొగ్గు, కష్టించి పనిచేసే 140 కోట్ల ప్రజలు దేశానికి ప్రకృతి, దేవుడు ఇచ్చిన వరాలు. భారతదేశంలో మాత్రమే 50 శాతం వ్యవసాయ యోగ్యమైన భూమి ఉంది. దేశ భౌగోళిక విస్తీర్ణం 83 కోట్ల ఎకరాలుంటే, ఇందులో 41 కోట్ల ఎకరాలు వ్యవసాయ యోగ్యంగా ఉంది. దేశంలో 1.40 లక్షల టీఎంసీల వర్షం కురుస్తుంది. కానీ కేవలం 20–21 వేల టీఎంసీల నీటిని మాత్రమే ఉపయోగించుకుంటున్నాం. కాంగ్రెస్, బీజేపీలే దేశ దుస్థితికి కారణం. మహారాష్ట్ర పరిస్థితి మరీ ఆశ్చర్యకరంగా అనిపిస్తుంది. ఇక్కడి నుంచే గోదావరి, కృష్ణా ప్రవహిస్తున్నా.. ప్రవర, పూర్ణ, పెన్‌గంగ, వార్ధా, ఘటప్రభ, మంజీర, భీమా, ప్రాణహిత, ఇంద్రావతి వంటి ఎన్నో నదులున్నా నీటికి కటకట ఎందుకు?' అని విజ్ఞప్తి చేశారు.

జోకిన్ ఇండియాగా మేకిన్ ఇండియా

'ప్రధాని తెచ్చిన మేకిన్ ఇండియా.. జోకిన్ ఇండియాగా మారింది. దేశంలోని చిన్నచిన్న పట్టణాల్లోనూ చైనా బజార్లు ఉన్నాయి. పతంగుల మాంజా, దీపావళి పటాకులు, హోలీ రంగులు, దీపావళి దీపాలు, మనం పూజించే వినాయకుని ప్రతిమలు, చివరకు మన జాతీయ జెండా కూడా చైనా నుంచే వస్తాయి. మేకిన్ ఇండియా అమలైతే చైనా బజార్లున్న చోట భారత్ బజార్లు పెట్టేవారు కదా?..' అని కేసీఆర్ ప్రశ్నించారు.

ఏ బాత్, ఓ బాత్..ఇంకా ఎన్నాళ్లు?

'నేను మీ అన్నను, మీ కొడుకును. బాధాతప్త హృదయంతో మీ దగ్గరికి వచ్చి మాట్లాడుతున్నా. దేశ ప్రజలకు తాగు, సాగు నీరు, విద్యుత్ సమస్యలున్నా.. మన్ కీ బాత్, ఏ బాత్, ఓ బాత్ అంటూ ఇంకా ఎన్నాళ్లు ప్రజల్ని మభ్య పెడతారు. మన దేశం కంటే చాలా చిన్న దేశమైన జింబాబ్వేలో ప్రపంచంలోనే అతిపెద్దదైన రిజర్వాయర్ ఉంది. దీని సామర్థ్యం 6,533 టీఎంసీలు. కానీ సువిశాల భౌగోళిక స్వరూపం, భారీ జనాభాగల భారత్‌లో కనీసం 3–4 రిజర్వాయర్లు ఇలాంటివి ఉండకూడదా? ప్రభుత్వం తలచుకుంటే దేశంలోని ప్రతి ఎకరాకు సాగునీటిని సమకూర్చవచ్చు. కిసాన్ సర్కార్ వస్తేనే దేశం పురోగమిస్తుంది' అని స్పష్టం చేశారు.

గులాబీ జెండా పట్టుకోండి..

'తెలంగాణ, మహారాష్ట్ర మధ్య రోటీ–బేటీ సంబంధం ఉంది. రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగుతుంటాయి. తెలంగాణ ప్రజలు అనుభవిస్తున్న సంక్షేమాన్ని మీరు అనుభవించాలనుకుంటే గులాబీ జెండా పట్టుకొని మీరే నాయకులుగా ముందుకు రండి..' అని కేసీఆర్ పిలుపునిచ్చారు.

దేశవ్యాప్తంగా తెలంగాణ పథకాలు

బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే రైతుబంధు, దళితబంధుతోపాటు తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దేశవ్యాప్తంగా అందిస్తామని ముఖ్యమంత్రి చెప్పారు. త్వరలో బీఆర్‌ఎస్ అన్ని కమిటీలు వేస్తామని తెలిపారు. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ నియోజవర్గాలలో పోటీ చేస్తామని ప్రకటించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ జన్మస్థలమైన శివనేరి వేదికగా ప్రతిన బూని, మహారాష్ట్ర వ్యాప్తంగా రైతు కమిటీలు ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు.

> "ధర్మస్య విజయోస్తు.. అధర్మస్య నాశోస్తు.. ప్రాణిషు సద్భావనాస్తు.. విశ్వస్య కళ్యాణమస్తు.. జై మహారాష్ట్ర, జై భారత్, జై హింద్.."
> అంటూ కేసీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.



ప్రసంగిస్తున్న కేసీఆర్. వేదికపై తోట చంద్రశేఖర్, కవిత, బీబీ పాటిల్, మైనంపల్లి హనుమంతరావు

మనది రోటీ-బేటీ సంబంధం

నిర్మల్: మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ నిర్వహించిన బహిరంగ సభ విజయవంతమయ్యింది. తెలంగాణ నియోజకవర్గాల నుంచి కూడా ఈ సభకు భారీగా ప్రజలు తరలివచ్చారు. ఈ సందర్భంగా స్థానికుల మనసుల్ని హత్తుకునేలా కేసీఆర్ ప్రసంగం కొనసాగింది. ఛత్రపతి శివాజీ మహారాజ్, బాబాసాహెబ్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, మహాత్మ బసవేశ్వర్, అన్నాబావ్ సాఠే తదితరుల పేర్లను ప్రస్తావించడం ద్వారా.. సెంటిమెంట్‌తో మరాఠీలకు చేరువయ్యే ప్రయత్నం చేశారు. స్థానిక సమస్యలను ప్రధానంగా ప్రస్తావించారు. మేకిన్ ఇండియా–జోకిన్ ఇండియా, నామ్ బదల్నా–కామ్ బదల్నా వంటి పదాలతో మోదీ ప్రభుత్వానికి చురకలంటించారు. మనది రోటీ–బేటీ సంబంధమన్నారు. రెండు రాష్ట్రాల మధ్య బంధాలను గుర్తుచేశారు. సభ ప్రారంభానికి ముందు తెలంగాణ సంక్షేమ పథకాలపై మరాఠీలో చేయించి ప్రదర్శించిన ప్రోమో వీడియోలు ఆకట్టుకున్నాయి.

పెద్ద మనసుతో చెప్తున్నా.. బాబ్లీకి ఎత్తిపోసుకోండి

నాందేడ్ మీడియా సమావేశంలో సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: 'గోదావరి నది నుంచి మన కళ్ల ముందే రెండున్నర వేల టీఎంసీల నీరు సముద్రంలో కలుస్తోంది. సమస్యను అర్థం చేసుకునే శక్తి ఉంటే పార్టీలు, ప్రభుత్వాలుగా విడిపోకుండా పరిష్కరించుకుని వాడుకోవచ్చు. బాబ్లీ ప్రాజెక్టు విషయంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. బాబ్లీ ప్రాజెక్టు సామర్థ్యం ఒక టీఎంసీ కూడా లేదు. పెద్ద మనసు చేసుకుని చెప్తున్నా తెలంగాణతో ఒప్పందం చేసుకోండి. గోదావరిలో నీటి లభ్యత ఉందనే విషయాన్ని రుజువు చేసి అవసరమైతే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి బాబ్లీ ప్రాజెక్టుకు నీటిని ఎత్తిపోసుకోండి' అని ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. మహారాష్ట్ర నాందేడ్ పర్యటనలో భాగంగా ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో కేసీఆర్ మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఎనిమిది పదిమార్లు మహారాష్ట్రకు వచ్చి నాటి ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌ను ఒప్పించి తెలంగాణలో భారీ నీటిపారుదల ప్రాజెక్టు కాళేశ్వరాన్ని నిర్మించిన విషయాన్ని కేసీఆర్ గుర్తు చేశారు. జాతీయస్థాయిలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పాటుచేస్తే నీటి వినియోగంలో విప్లవాత్మక ఎజెండా అమలు చేస్తామని, రాష్ట్రాల నడుమ కొట్లాటలు లేని జాతీయ విధానం తెస్తామన్నారు. అవసరానికి మించి నదీ జలాలున్న భారత్‌లో భారీ రిజర్వాయర్లు కట్టాల్సిన అవసరముందన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

ఆరు నెలల్లోపు నియోజకవర్గాల పునర్విభజన

బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించడంతో పార్లమెంటు, అసెంబ్లీల్లో 33శాతం సీట్లు రిజర్వు చేస్తామని కేసీఆర్ ప్రకటించారు. ఆరు నెలల్లోపు నియోజకవర్గాల పునర్విభజన పూర్తి చేసి 33 శాతం సీట్లు పెంచి మహిళలకు ప్రత్యేకిస్తామన్నారు. రాష్ట్రాలు, జిల్లాల పునర్విభజనపై తమ పార్టీ విధానాన్ని దేశ ప్రజల ముందు పెడతామని చెప్పారు. గుణాత్మక అభివృద్ధి కోసం భిన్న ఆలోచనతో దేశ ఆలోచన విధానాన్ని మార్చడం కోసమే బీఆర్‌ఎస్ ఏర్పాటైందని కేసీఆర్ ప్రకటించారు. సింగపూర్, జపాన్, మలేషియా తదితర దేశాల తరహాలో అభివృద్ధిని పరుగులు పెట్టించడం లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. తమ పార్టీ విధానాన్ని అనుసరిస్తే రెండేళ్లలో భారత్ అద్భుతమైన అభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. 90 శాతం విద్యుత్ రంగాన్ని ప్రభుత్వ ఆధీనంలోనే పెడతామని, రెండేళ్లలోనే దేశానికి విద్యుత్ వెలుగులు అందిస్తామని స్పష్టంచేశారు.

దేశంలో సంపూర్ణ పరివర్తన కోసమే...

విద్య, వైద్యం సహా అన్ని రంగాలకు సంబంధించి తమ పార్టీ ఎజెండాపై నిపుణుల బృందం కసరత్తు చేస్తోందని కేసీఆర్ చెప్పారు. అన్ని రంగాల్లో సంపూర్ణ పరివర్తన కోసమే బీఆర్‌ఎస్ పనిచేస్తుందని ప్రకటించారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రభుత్వరంగ కంపెనీ ఎల్‌ఐసీని పారిశ్రామికవేత్త అదానీకి అప్పగించడం వాస్తవం కాదని చెప్తున్న కేంద్రం.. దీనిపై సంయుక్త పార్లమెంటరీ కమిటీని నియమించాలంటే ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. కేంద్రంతో ఉన్న మిత్రుత్వంతోనే అదానీ ప్రపంచంలో రెండో స్థానానికి ఎదిగాడన్నారు. మతం పేరిట దేశ ప్రజల విభజనను బీఆర్‌ఎస్ వ్యతిరేకిస్తోందని తేల్చిచెప్పారు. తన తదుపరి మీడియా సమావేశం త్వరలో ఢిల్లీలో ఉంటుందని ప్రకటించారు.

సచ్‌ఖండ్ గురుద్వారాలో సీఎం కేసీఆర్ ప్రార్థనలు

బీఆర్‌ఎస్‌లో చేరిన మహారాష్ట్ర నేతలు

భైంసా/నిర్మల్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం నాందేడ్‌లోని సచ్‌ఖండ్ గురుద్వారాను సందర్శించారు. సిక్కు మత ఆచారం ప్రకారం తలపాగా ధరించి లోపలికి వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటలకు నాందేడ్ ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న కేసీఆర్‌కు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విఠల్‌రెడ్డి, రేఖా శ్యాం నాయక్, జోగు రామన్న, జీవన్‌రెడ్డి, షకీల్, మైనంపల్లి హన్మంతరావు, మాజీ ఎంపీ నగేశ్‌తోపాటు మహారాష్ట్ర నాయకులు స్వాగతం పలికారు. గురుద్వారాలో ప్రార్థనల అనంతరం 2:50 గంటలకు రైల్వేస్టేషన్ సమీపంలోని గురుద్వారా సచ్‌ఖండ్ బోర్డు మైదానంలోని సభాస్థలికి కేసీఆర్ చేరుకున్నారు. వేదికపై ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిబా పూలే, మహాత్మా బసవేశ్వర్ మహారాజ్, అన్నాబావ్ సాఠే, అహల్యాబాయి హోల్కర్ విగ్రహాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహారాష్ట్రకు చెందిన పలువురు నేతలకు పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. వారిలో ఉద్గిర్ మాజీ ఎమ్మెల్యే పట్వారీ, విదర్భ మరాఠీ రచయిత, లోక్‌జాగర్ వ్యవస్థాపకుడు జ్ఞానేశ్ వాకుడ్కర్, నాందేడ్‌కు చెందిన పారిశ్రామికవేత్త గిరిశ్ గౌరియంటాల్ ఉన్నారు. 3:56 గంటలకు సభను ముగించిన సీఎం.. సాయంత్రం 5:30 గంటలకు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆపై తిరిగి హైదరాబాద్‌కు వెళ్లారు.



నాందేడ్‌లోని సచ్‌ఖండ్ గురుద్వారాలో సీఎం కేసీఆర్, ఎంపీ సంతోష్, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నాందేడ్ సభ విజయవంతం: మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్: బీఆర్‌ఎస్ నేతల సమష్టి కృషితో నాందేడ్ సభ విజయవంతమైందని అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహారాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకులు, తెలంగాణ నాయకులు, కార్యకర్తలు సభ విజయానికి కష్టపడి పనిచేశారన్నారు. కేసీఆర్‌ను చూడాలని రైతులు, ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని చెప్పారు. కేసీఆర్‌పై అభిమానాన్ని చాటిన బీఆర్‌ఎస్ మహారాష్ట్ర ప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. నాందేడ్ సభ సక్సెస్ కావడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపిందని పేర్కొన్నారు.

నేటి నుంచి.. 'హాథ్ సే హాథ్' యాత్రలు

▶ మొదటి పేజీ తరువాయి

మేడారం వెళ్లనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఈ యాత్రలను ప్రారంభించేందుకు కాంగ్రెస్ నేతలు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. అయితే అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో బడ్జెట్‌కు ఆమోదం పొందిన తర్వాత సీఎల్పీ నేత భట్టి విక్రమార్కతోపాటు ఇతర ఎమ్మెల్యేలు ఈ యాత్రలను ప్రారంభిస్తారని తెలుస్తోంది. మరోవైపు నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు పార్టీ ముఖ్య నేతలందరూ సోమవారం తమ తమ నియోజకవర్గాల్లో హాథ్ సే హాథ్ జోడో యాత్రలను ప్రారంభించనున్నారు.

నాందేడ్ సభ తుస్సుమంది

- అబద్ధాలకు ఆస్కార్ అవార్డ్ ఇస్తే అది కేసీఆర్‌కే
- దేశమంతా 24 గంటల కరెంట్ పెద్ద జోక్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎద్దేవా



సాక్షి, హైదరాబాద్: నాందేడ్‌లో బీఆర్‌ఎస్ నిర్వహించిన జాతీయ సభను మహారాష్ట్ర జనం పట్టించుకోకపోవడంతో తుస్సుమందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్‌కు చెందిన 30 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రులు, ఇద్దరు ఎంపీలు 25 రోజులుగా నాందేడ్‌లో మకాం వేసి ఏర్పాట్లు చేసినా ఈ సభ అట్టర్‌ఫ్లాప్ అయిందన్నారు. చివరకు తెలంగాణ సరిహద్దు జిల్లాల నుంచి ఒక్కొక్కరికీ రూ. 500 ఇచ్చి జనాన్ని పట్టుకొచ్చి నాందేడ్ వేదికగా సీఎం కేసీఆర్ పెద్ద డ్రామా చేశారని బండి ఆరోపించారు. తెలంగాణలోనే అతీగతి లేని బీఆర్‌ఎస్‌ను నాందేడ్‌లో ఎవరు పట్టించుకుంటారని ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. నాందేడ్ సభలో, ఆ తర్వాత ప్రెస్‌మీట్‌లో కేసీఆర్ అబద్ధాలు వల్లించారని బండి మండిపడ్డారు.

మహిళలకు ప్రాతినిధ్యం హామీ హాస్యాస్పదం

కేంద్రంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే మహిళలకు చట్ట సభల్లో 33 శాతం ప్రాతినిధ్యం కల్పిస్తామని పేర్కొనడం హాస్యాస్పదమని బండి సంజయ్ పేర్కొన్నారు. కేసీఆర్ తన తొలి కేబినెట్‌లోనే ఐదేళ్లపాటు ఒక్క మహిళకు కూడా చోటు కల్పించలేదని గుర్తుచేశారు. రైతు ఆత్మహత్యల గురించి కేసీఆర్ ప్రస్తావించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని విమర్శించారు. రైతు ఆత్మహత్యల్లో తెలంగాణ దేశంలోనే 4వ స్థానంలో ఉందని, కేసీఆర్ సొంత నియోజకవర్గమైన గజ్వేల్‌లోనే రైతు ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తే దేశమంతటా 24 గంటల విద్యుత్ ఇస్తామనడం పెద్ద జోక్ అని ఎద్దేవా చేశారు. నాందేడ్ సభా ప్రాంతానికి కూతవేటు దూరంలోనే ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని రైతులంతా కనీసం 8 గంటల కరెంట్ అయినా సరఫరా చేయాలని సబ్‌స్టేషన్లను ముట్టడిస్తూ రోడ్లపై ధర్నాలు చేస్తున్నారని... కేసీఆర్ ఈ సంగతి తెలుసుకొని మాట్లాడితే బాగుండేదని బండి సంజయ్ పేర్కొన్నారు. అబద్ధాలకు ఆస్కార్ అవార్డు ఇవ్వాల్సి వస్తే అది కచ్చితంగా కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్‌ఎస్‌ను ప్రజలు సమాధి చేయడం ఖాయమన్నారు.

ఈ నెలాఖరుకు అసెంబ్లీ రద్దవుతుంది

- ఆ వెంటనే రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించబోతున్నారు
- తర్వాత ఆరు నెలలకు ఎన్నికలు
- కాంగ్రెస్ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



కోదాడ: ''నాకు తెలిసినంత వరకు ఈ నెలాఖరుకు రాష్ట్ర అసెంబ్లీ రద్దు కాబోతోంది. ఆ తరువాత ఆరు నెలలకు ఎన్నికలు. నేను నూటికి నూరు శాతం చెబుతున్నాను.. తెలంగాణ శాసనసభ రద్దు కాగానే రాష్ట్రపతి పాలన విధించబోతున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ చిత్తుచిత్తుగా ఓడిపోబోతోంది. బీఆర్‌ఎస్ వారందరినీ ఇంటికి పంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఎన్నికలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నారు''అని కాంగ్రెస్ నేత, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కోదాడలో హాథ్‌సే హాథ్ జోడో యాత్ర సన్నాహక కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో పోలీసులు గులాబీ చొక్కాలు వేసుకొని పని చేస్తున్నారని, ప్రభుత్వ అధికారులు కేసీఆర్ సర్కారుకు తొత్తులుగా మారారని, వారి ఆధ్వర్యంలో ఎన్నికలు జరపడాన్ని తాము అంగీకరించమని అన్నారు. అందుకే రాష్ట్రపతి పాలనలోనే ఎన్నికలు జరపాలని, ఈ అంశాన్ని తాను పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానని చెప్పారు. నాగార్జునసాగర్ ఎడమకాలువపై ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వమే నిర్వహిస్తుందని, రైతులపై ఎటువంటి భారం వేయమని తెలంగాణ ఉద్యమ సమయంలో చెప్పిన కేసీఆర్.. ఇప్పుడు ఆ మాట మర్చిపోయారన్నారు. కోదాడ ఎమ్మెల్యేకు సీఎంను అడిగే ధైర్యం లేదని, ఆయన కేవలం కమీషన్లు వచ్చే పనులు మాత్రమే చేస్తారని ఆరోపించారు. కోదాడ నియోజకవర్గంలోని గుడిబండలో 100 మంది దళితులకు దళితబంధు పథకాన్ని ఇచ్చి, ఒక్కొక్కరి వద్ద రూ.2 లక్షల చొప్పున రూ. 2 కోట్లు వసూలు చేశారని ఆరోపించారు. మట్టి, ఇసుక దందా, వైన్స్‌షాపులు, రియల్ ఎస్టేట్ లేఅవుట్లలో ఎమ్మెల్యే కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. కోదాడ ఆర్డీఓ పెద్ద లంచగొండి అని, ఈ విషయాన్ని అన్ని ఆధారాలతో నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నానని ఉత్తమ్ స్పష్టం చేశారు. అక్రమ కేసులు పెట్టినా ప్రజాక్షేత్రంలో తేల్చుకుందామని, తన ప్రాణం ఉన్నంత వరకు కాంగ్రెస్ కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు.

బీఆర్‌ఎస్‌పై మూడో చార్జిషీట్

- వ్యవసాయ రంగంలోని వైఫల్యాలను ఎత్తిచూపిన కాంగ్రెస్
- పండగ చేస్తామన్న సర్కారు దండగ చేసింది: ఏలేటి



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ చార్జిషీట్ల పరంపర కొనసాగిస్తోంది. తాజాగా ఆదివారం మూడో చార్జిషీట్ వేసింది. హాథ్ సే హాథ్ జోడో యాత్రలు సోమవారం నుంచి ప్రారంభంకానున్న నేపథ్యంలో వ్యవసాయరంగంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ 19 అంశాలతో కూడిన చార్జిషీట్ రూపొందించింది. ఆదివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ కిసాన్ సెల్ వైస్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, హాథ్ సే హాథ్ జోడో యాత్రల సమన్వయ కమిటీ సభ్యులు పాల్వాయి స్రవంతి, రాములు నాయక్, కైలాశ్ తదితరులతో కలిసి ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఈ చార్జిషీట్ విడుదల చేశారు. అనంతరం మహేశ్వర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండుగ చేస్తామన్న ప్రభుత్వం దండుగ చేసిందని విమర్శించారు. కేవలం రైతుబంధు ఇచ్చి ఇతర రైతాంగ సహాయ పథకాలకు గండికొట్టి అన్నదాతలను దగా చేస్తోందని ఆరోపించారు. రైతులకు ఎలాంటి సబ్సిడీలు అందడంలేదని, రుణమాఫీ అమలు కాలేదని, కొత్త అప్పులు పుట్టడం లేదని, కౌలురైతుల పరిస్థితి అధ్వానంగా తయారైందని పేర్కొన్నారు. వరి వేస్తే ఉరి అని సీఎం కేసీఆర్ రైతులను వ్యవసాయానికి దూరం చేశారని ఆరోపించారు. వ్యవసాయ యాంత్రీకరణకు మంగళం పాడారని, కోటి ఎకరాలు మాగాణిని చేస్తామన్న కేసీఆర్ హామీ ఒట్టిమాటగానే మిగిలిపోయిందని ఎద్దేవా చేశారు. రైతుల ఆత్మహత్యలను చులకన చేసి మాట్లాడిన వ్యవసాయ మంత్రి నిరంజన్‌రెడ్డికి ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని విమర్శించారు.

ఆ హామీలేవీ నెరవేర్చలేదు

- కేసీఆర్‌పై వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల ధ్వజం
- వరంగల్, హనుమకొండలో సాగిన ప్రజాప్రస్థానం పాదయాత్ర



ఖిలా వరంగల్/హనుమకొండ చౌరస్తా: పేదలకు డబుల్‌బెడ్రూం, ఇంటికో ఉద్యోగం, ఎస్సీలకు మూడెకరాల భూమి, పోడు భూములకు పట్టాలు, ఉచితంగా ఎరువులు, 57 ఏళ్లకే పింఛన్, ముస్లిం, మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ అంటూ సీఎం కేసీఆర్ వివిధ వర్గాలకు ఇచ్చిన హామీలేవీ నెరవేరలేదని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. ఇప్పటికైనా క్షమాపణ చెప్పి ప్రజల కోసం పనిచేయండి.. చేసిన తప్పులను సరిదిద్దుకోకుంటే ప్రజలు తరమికొట్టడం ఖాయమని అన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు వరంగల్ నక్కలపెల్లి శివారులో ప్రారంభమైన షర్మిల ప్రజాప్రస్థానం పాదయాత్ర ములుగు రోడ్డు వద్ద హనుమకొండ జిల్లాలోకి ప్రవేశించి హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ వరకు చేరుకుంది. వరంగల్–నెక్కొండ రోడ్డుపై రహమత్‌నగర్ వద్ద షర్మిల విలేకరులతో మాట్లాడుతూ కేజీ టు పీజీ ఉచితవిద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఊసేలేదని, ఆరోగ్యశ్రీ పథకాన్ని కోమాలో పెట్టారని విమర్శించారు. సీఎం కుటుంబంలోని ఐదుగురికి పదవులిచ్చుకోవడమే సంక్షేమ పాలనా అన్ని ఎద్దేవా చేశారు. తొలిసారి అధికారంలోకి వచ్చినప్పుడు 65 వేల ఉద్యోగాలు భర్తీ చేసిన బీఆర్‌ఎస్ రెండోసారి పగ్గాలు చేపట్టాక 1.91 లక్షల ఉద్యోగ ఖాళీలను పక్కనబెట్టి నిరుద్యోగం లేదని బుకాయిస్తోందన్నారు. ఉద్యోగాలు భర్తీ చేస్తే యువకుల ఆత్మహత్యలు ఎందుకు పెరిగాయో మంత్రి కేటీఆర్ సమాధానం చెప్పాలన్నారు.

'ఈటల' కాన్వాయ్‌కి బీఆర్‌ఎస్ అడ్డగింపు

- బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య వాగ్వాదం, దాడులు
- బీఆర్‌ఎస్ కార్యకర్తలకు గాయాలు

కమలాపూర్: బీజేపీ హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కాన్వాయ్‌ని హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలో బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆదివారం అడ్డుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకొని దాడులకు దారితీసింది. నలుగురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు గాయపడ్డారు. ఇన్‌స్పెక్టర్ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ మండలం పంగిడిపల్లిలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త వజిరె తిరుమలరావు కుటుంబాన్ని రాజేందర్ పరామర్శించారు. తిరిగి వస్తుండగా పంగిడిపల్లికి చెందిన 10 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు కమలాపూర్–పంగిడిపల్లి రోడ్డు అభివృద్ధి విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లేందుకు వేచి ఉన్నారు. కాన్వాయ్ అక్కడికి రాగానే వాహనాలకు ఎదురు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో బీజేపీ, బీఆర్‌ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదం జరిగి దాడికి దారితీసింది. ఈ ఘటనలో నలుగురు బీఆర్‌ఎస్ కార్యకర్తలు గాయపడ్డారు. ఫిర్యాదుమేరకు ఆరుగురు బీఆర్‌ఎస్ కార్యకర్తలపై కేసు నమోదు చేశారు.



ఇరువర్గాలను నిలువరిస్తున్న పోలీసులు

● నాన్ క్లినికల్ పీజీ...
నాట్ ఇంట్రెస్టెడ్!

వాటిల్లో చేరేందుకు మొగ్గుచూపని ఎంబీబీఎస్ విద్యార్థులు



- దీంతో ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో మిగిలిపోయిన సీట్లు
- దేశవ్యాప్తంగా 25 శాతం సీట్లు మిగులు... తెలంగాణలో 216 సీట్లు
- వైద్య అధ్యాపక పోస్టుల భర్తీ లేకపోవడమే కారణం

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు మెడికల్ పీజీ చేయాలని ఉవ్విళ్లూరుతుంటారు. తద్వారా స్పెషలిస్టు వైద్యులుగా తమ కెరీర్‌ను మలుచుకుంటారు. అందువల్ల క్లినికల్ విభాగంలోని సీట్లకు ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో కోట్లు ఖర్చు చేసి వాటిల్లో చేరుతుంటారు. ఒక్క సీటు కూడా మిగలదు. కానీ నాన్ క్లినికల్ పీజీ సీట్ల పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. ఈ సీట్లను పట్టించుకునే నాథుడే లేడు. ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో ఉండే కన్వీనర్ కోటా సీట్లలోనూ విద్యార్థులు చేరడంలేదంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అంతేకాదు సాధారణ ఫీజు చెల్లిస్తే చాలనీ, డొనేషన్ కూడా వద్దని, ప్రైవేట్ మెడికల్ కాలేజీలు కోరుతున్నా పట్టించుకునే పరిస్థితి ఉండటం లేదని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు చెబుతున్నాయి.

క్లినికల్ సీట్లపైనే అందరి దృష్టి...

క్లినికల్ విభాగంలోని సబ్జెక్టులన్నింటికీ భారీగా డిమాండ్ ఉండగా, నాన్‌క్లినికల్ సబ్జెక్టులకు డిమాండ్ ఉండటం లేదు. నాన్‌క్లినికల్‌లో అనాటమీ, ఫిజియాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, బయో కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, ప్యాథాలజీ, మైక్రో బయోలజీ, ఎస్పీఎం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ వంటి సబ్జెక్టులున్నాయి. ఇవి చేసిన వారికి ప్రధానంగా మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీగా చేయడానికి వీలుంటుంది. ఫోరెన్సిక్ మెడిసిన్ వంటి వాటికి ఇతరత్రా అవకాశాలుంటాయి. కానీ క్లినికల్ కోర్సుల మాదిరి నాన్ క్లినికల్ సబ్జెక్టులకు డిమాండ్ ఉండదు. అయితే కొన్నేళ్లుగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో నాన్‌క్లినికల్ అధ్యాపక ఖాళీలను భర్తీ చేయడంలేదు. దీంతో ఈ కోర్సులు చేసినవాళ్లు చాలామంది ఖాళీగా ఉంటున్నారు. నాన్ క్లినికల్ కోర్సులు చేసినవారి సంఖ్య పెరగడంతో ప్రైవేటు కాలేజీల్లోనూ అవకాశాలు దక్కే పరిస్థితి లేకుండా పోయింది. ఒకప్పుడు ప్రైవేటు మెడికల్ కాలేజీల్లో రూ. లక్షకు పైగా జీతాలు తీసుకున్నవారు, ఇప్పుడు రూ. 40–50 వేలకే పనిచేయాల్సిన పరిస్థితి ఉంది. కొన్నిసార్లు ఆ మేరకైనా అవకాశాలు దొరికే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఎంబీబీఎస్ పూర్తి చేసిన విద్యార్థులు నాన్ క్లినికల్ విభాగాల్లో చేరడానికి ఆసక్తి చూపడంలేదు. క్లినికల్ విభాగాలైన జనరల్ మెడిసిన్, రేడియాలజీ, నెఫ్రాలజీ, న్యూరో, ఆర్థో, గైనిక్ తదితర కీలకమైన వాటిపైనే దృష్టిసారిస్తున్నారు. బయట ప్రాక్టీస్ చేయడానికి, కార్పొరేట్ ఆసుపత్రుల్లో భారీ జీతాలు పొందడానికి క్లినికల్ మెడికల్ కోర్సులే ఉపయోగపడతాయి.

క్లినికల్ సీట్లనైనా పెంచితే...

మెడికల్ కాలేజీల్లో నాన్ క్లినికల్ పీజీ వైద్య సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోతుండటంపై కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. సీట్లుండీ మిగిలిపోవడం వల్ల ప్రయోజనం లేకుండా పోతోందని అంటున్నాయి. ఇన్ సర్వీస్ కోటా కింద భర్తీ చేసుకోవడానికి వీలు కల్పించాలని కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు గతంలో జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ)కు లేఖ రాశాయి. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం 'నీట్'పరీక్ష తప్పనిసరి కాబట్టి తామేమీ చేయలేమని ఎన్‌ఎంసీకి చెందిన కొందరు వ్యాఖ్యానించినట్లు సమాచారం. నాన్ క్లినికల్ సీట్లను తగ్గించి క్లినికల్ సీట్లనైనా పెంచితే బాగుంటుందని ఎంబీబీఎస్ విద్యార్థులు కోరుతున్నారు.

దేశవ్యాప్తంగా పీజీ మెడికల్ సీట్లు (క్లినికల్, నాన్‌క్లినికల్ కలిపి): **42,717**
తెలంగాణలో: **2,501** (ప్రభుత్వ కాలేజీల్లో 1,180... ప్రైవేట్‌లో 1,321)

దేశవ్యాప్తంగా నాన్‌క్లినికల్ పీజీ మెడికల్ సీట్లు: సుమారు **11,000**
దేశవ్యాప్తంగా మిగిలిన నాన్‌క్లినికల్ పీజీ సీట్లు: దాదాపు **25%**
అత్యధికంగా మహారాష్ట్రలో: **325**
కర్ణాటకలో: **268** సీట్లు
తమిళనాడులో: **100** సీట్లు

తెలంగాణలో ఉన్న మొత్తం నాన్‌క్లినికల్ పీజీ సీట్లు : సుమారు **550**
మిగిలిన సీట్లు : **216**

క్లినికల్‌లో ఉండే సబ్జెక్టులు: **14**
నాన్ క్లినికల్‌లో ఉండే సబ్జెక్టులు: **9**

కాంగ్రెస్ ఆందోళనలు నేడు

సాక్షి, హైదరాబాద్: మోదీ ప్రభుత్వ పక్షపాత నిర్ణయాలతో ప్రమాదంలో పడిన ఎల్‌ఐసీ, ఎస్‌బీఐ లాంటి ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకునేందుకు క్షేత్రస్థాయిలో ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించినట్టు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదానీ గ్రూప్ సంస్థలు నష్టాలపాలు కావడంతో.. వాటిలో పెట్టుబడులు పెట్టిన ప్రజల సొమ్ముకు రక్షణ లేకుండా పోతోందని పేర్కొన్నారు. ఎల్‌ఐసీ, ఎస్‌బీఐలను కాపాడాలని కోరుతూ క్షేత్రస్థాయిలో ఆందోళనకు సిద్ధమవుతున్నామని తెలిపారు. జేపీసీని ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో నిర్వహించనున్న జిల్లాస్థాయి ఆందోళనల్లో బ్లాక్, పంచాయతీల నుంచి పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

స్పౌజ్ బదిలీలు చేపట్టాలి



మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: ఎస్జీటీ, పీఈటీ, భాషా పండితులతో పాటు ఇంకా మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్ స్పౌజ్ బదిలీలను తక్షణమే చేపట్టాలని తెలంగాణ స్టేట్ స్పౌజ్ ఫోరం మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్‌ను కోరింది. సంఘం ప్రతినిధులు వివేక్, ఖాదర్ నేతృత్వంలో పలువురు ఉపాధ్యాయులు ఆదివారం మంత్రులను కలిసి, ఈమేరకు వినతి పత్రం సమర్పించారు. ఇటీవల 615 మంది స్కూల్ అసిస్టెంట్ స్పౌజ్‌లను బదిలీ చేశారని, ఇంకా కొన్ని బదిలీలు మిగిలే ఉన్నాయని తెలిపారు. ఎస్జీటీ, పీఈటీ, భాషా పండితుల బదిలీలను నిలిపి వేశారని వివరించారు. ఉపాధ్యాయినులు 200 కిలోమీటర్లు వెళ్లి విధులు నిర్వర్తిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జ్ఞానేశ్వర్‌ను పరామర్శించిన చంద్రబాబు

సాక్షి, హైదరాబాద్: టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను తెలుగుదేశం అధినేత చంద్రబాబు పరామర్శించారు. జ్ఞానేశ్వర్ తల్లి కౌసల్య ఇటీవల మృతి చెందడంతో ఆదివారం చంద్రబాబు బాచుపల్లిలోని కాసాని ఇంటికి వెళ్లారు జ్ఞానేశ్వర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. చంద్రబాబు వెంట టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్ రెడ్డి తదితరులున్నారు.

డీజీపీని ఏపీకి పంపించాలి



సాక్షి, హైదరాబాద్: ఏపీ కేడర్‌కు చెందిన డీజీపీ అంజనీకుమార్‌ను వెంటనే ఆ రాష్ట్రానికి పంపించి వేయాలని బీజేపీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఐపీఎస్ బదిలీల్లో తెలంగాణ అధికారు లకు తీరని అన్యాయం జరిగిందని ఆయన ఆరోపించారు. ఆయన ఆదివారం విలేకరుల తో మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల ను దృష్టిలో పెట్టుకునే సీఎం కేసీఆర్ ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారిని, తనకు అనుకూల మైన అధికారులను కీలక పోస్టుల్లో నియమించారని ఆరోపించారు. ఇటీవల జరిగిన 93 మంది ఐపీఎస్‌ల బదిలీల్లో బిహార్‌కు చెందిన అంజనీకుమార్‌ను డీజీపీగా, సంజయ్‌కుమార్ జైన్‌ను అదనపు డీజీ లా అండ్ ఆర్డర్‌గా, షాన వాజ్ ఖాసింను ఐజీ హైదరాబాద్ జోన్‌గా, స్వాతిలక్రాను స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అద నపు డీజీగా నియమించారని వివరించారు. బిహార్‌కు చెందిన ఐఏఎస్ సోమేశ్‌కుమార్‌ను సీఎస్‌గా, అదే రాష్ట్రానికి చెందిన ఐపీఎస్‌ను అంజనీకుమార్‌ను డీజీపీగా నియమించడాన్ని బట్టి కేసీఆర్ మూలాలు కూడా అదే రాష్ట్రంలోనే ఉన్నాయనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు.

బీసీ సంక్షేమానికి
రూ. 2 వేల కోట్లేనా?

రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: కేంద్ర వార్షిక బడ్జెట్.. బీసీలను తీవ్రంగా అవమానపరిచిందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ భవన్‌లో ఆదివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జనాభాలో 56% ఉన్న బీసీల సంక్షేమానికి కేవలం రూ.2వేల కోట్లు కేటాయించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. బీసీల సంక్షేమానికి కేంద్రం ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదని, రూ.45వేల కోట్లతో రూపొందించిన బడ్జెట్‌లో బీసీలకు కనీసం 0.1 శాతం కూడా కేటాయించలేదన్నారు. బడ్జెట్ సవరణ చేపట్టి బీసీలకు కనీసం రూ.2లక్షల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీలకు అమలు చేస్తున్నట్లు బీసీలకు కూడా ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు అమలు చేయాలని కోరారు. 80శాతం మ్యాచింగ్ గ్రాంటు ఇచ్చి బీసీ వసతిగృహాలను కేంద్రమే నిర్మించాలని, రూ.50 వేల కోట్లతో జాతీయ బీసీ కార్పొరేషన్ ద్వారా 80శాతం బీసీ విద్యార్థులకు విద్యారుణాలు ఇవ్వాలని కోరారు.

బీసీల చరిత్రలో ఇది సువర్ణాధ్యాయం

- మంత్రులు గంగుల, తలసాని, శ్రీనివాస్‌గౌడ్, మల్లారెడ్డి
- ఉప్పల్ భగాయత్‌లో 13 బీసీ కులసంఘాల ఆత్మగౌరవ భవనాలకు భూమి పూజ

ఉప్పల్: దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి తోడ్పాటునందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని మంత్రులు గంగుల కమలాకర్, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, చామకూర మల్లా రెడ్డిలు అన్నారు. వెనుకబడిన వర్గాల చరిత్రలో ఈ రోజు సువర్ణాధ్యాయమని పేర్కొన్నారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో 38 ఎకరాలలో 13 బీసీ కుల సంఘాల ఆత్మగౌరవ భవనాలకు మంత్రులు భూమి పూజ చేశారు. స్థానిక ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారితో పాటు వివిధ కులసంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ గత 75 ఏళ్లలో ఇంతవరకు ఏ ప్రధాని, ముఖ్యమంత్రి చేయని విధంగా వెనుకబడిన వర్గాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ మేలు చేస్తున్నారని అన్నారు. ఈ ఆత్మగౌరవ భవనాలను తమ కులం ప్రతిష్టను ఇనుమడించేలా, సంస్కృతి వెళ్లి విరిసేలా డిజైన్లు చేసి నిర్మించుకునే ఆవకాశం వారికే ఇచ్చారన్నారు. ఆత్మగౌరవ భవనాల్లో దూరప్రాంతాల నుంచి వచ్చే వారికి వసతి, తమ సంస్కృతిని చాటేలా కమ్యూనిటీ హాళ్లు, పిల్లల చదువు కోసం లైబ్రరీలు, రిక్రియేషన్ సెంటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆత్మగౌరవ భవనాలకు రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు ప్రభుత్వమే కల్పిస్తుందని చెప్పారు. తెలంగాణ రావడంతోనే వెనుకబడిన కులాల్లో పెద్ద మార్పు వచ్చిందన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి

అనంతరం మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ..వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవాన్ని పెంచిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. కుల వృత్తులకు చేయూత ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ దోపిడీ చేస్తుందని, బీజేపీ మతం మత్తులో ముంచుతుందని విమర్శిస్తూ కేవలం బీఆర్‌ఎస్ మాత్రమే అభివృద్ధి చేస్తుందని అన్నారు. మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కుల వ్యవస్థపై జోతిబాపూలే అద్భుత పరిశోధన చేసి మనమంతా ఒక్కటే అని, కేవలం వృత్తిపరంగా కులాలకింద విభజితులైనట్లు చెప్పారని పేర్కొన్నారు. అయితే అందరినీ కలపడానికి పూలే పడ్డ ఆవేదన నేడు కేసీఆర్‌లో కనబడుతోందన్నారు. సమూహంగా ఎదగడానికి ఈ భవనాలు దోహదం చేస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణ మోహన్, సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరి శంకర్, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, ఉప్పల్ తహసీల్దార్ గౌతం కుమార్, బీసీ కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఏపీ ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌కు సతీ వియోగం

భవానీపురం (విజయవాడ పశ్చిమ)/ సాక్షి, అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి కార్యక్రమాల సమన్వయకర్త, శాసనమండలి సభ్యుడు తలశిల రఘురామ్‌కు సతీ వియోగం కలిగింది. అనారోగ్య కారణంగా విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రఘురామ్ సతీమణి తలశిల స్వర్ణ కుమారి (45) ఆదివారం ఉదయం 7.30 గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. ఆమె భౌతికకాయాన్ని ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలోని రఘురామ్ నివాసంలో ఉంచారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, భారతి దంపతులు స్వర్ణకుమారి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.







అహంకారి తనను తాను పరిపూర్ణుడిగా భావిస్తాడు.
అహంకారంలోని ఈ ప్రధాన దుర్గుణమే మనిషిలో
పరివర్తన కలుగకుండా అడ్డుపడుతుంది.
- లియో టాల్‌స్టాయ్

సాక్షి

సోమవారం, ఫిబ్రవరి, 6

సకల జన సమ్మతము

ఒక సాధారణ జీకే ప్రశ్నతో దీన్ని మొదలుపెట్టవచ్చు. తెలుగులో తొలి సంకలన కావ్యం ఏది? 'సకల నీతి సమ్మతము' అన్నది జవాబు. దీన్ని తెలుగులో తొలి నీతిశాస్త్ర గ్రంథంగానూ చెబుతారు. దీని సంకలనకర్త మడికి సింగన. తెలుగులో ఇలాంటి సంకలన గ్రంథాలకు శ్రీకారం చుట్టింది ఆయనే. సింగనది ప్రధానంగా రాజనీతి దృష్టి. తనకు పూర్వులైన ఆంధ్రకవుల గ్రంథాల నుండి అందుకు సంబంధించిన పద్యాలను మాల కట్టాడు. పంచతంత్రి (మనకు తెలిసిన పంచతంత్రం కాదు), కామందకము, ముద్రామాత్యము, నీతిభూషణము, బద్దెన నీతి, కుమార సంభవము, భారతము, రామాయణము, మార్కండేయ పురాణము, విదురనీతి, చారుచర్య, పురుషార్థసారము, పద్మ పురాణము లాంటి మిక్కిలి కావ్యాలు ఆయనకు ఆధారం. ఆ పద్యాలను తిరిగి నీతిశాస్త్ర ప్రశంస, ప్రజా పాలనము, రాజాదాయవ్యయ ప్రకారము, రాజునకు గొఱగాని గుణములు, కరణికపు నీతులు, పురోహిత నీతి, రాయబార ప్రకారము, చారుల నీతులు, అష్టాదశ వ్యసనములు అంటూ మూడు ఆశ్వాసములుగా విభజించాడు. పద్దు లెక్కలు ఎలా వేయాలో, రుణ పత్రాలు ఎలా రాయాలో కూడా ఇందులో ఉంటుంది. ఆయన గొప్పతనం పద్యాలను ఏర్చడంలోనే కాదు, కూర్చడంలోనూ ఉంది. ఆయా వర్గాల పద్యాలకు అతుకులుగా తన సొంత పద్యాలను రాశాడు. అందుకనో, అంతకుమునుపు ఈ సంకలన ప్రక్రియ లేనందునో తన కావ్యాన్ని ప్రబంధమనే చెప్పుకొన్నాడు. కానంతమాత్రాన దీని విలువ ఏమీ తగ్గలేదు. తరువాతి కాలంలో వచ్చిన సంకలన గ్రంథాలకు ఇది ఒక స్ఫూర్తిగా నిలిచింది.

ఇలాంటి ఉత్తమ గ్రంథాన్ని మానవల్లి రామకృష్ణ కవి 1923లో సంపాదించి ప్రకటించారు. ఆ ప్రచురణకు ఇది శతాబ్ది సంవత్సరం. విస్మృత కవుల కృతులలో ఒకటిగా మానవల్లి దీన్ని వెలువరించారు. 'ఆంధ్రపత్రికా ముద్రాక్షర శాల'లో ముద్రితమైంది. తిరిగి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ 1979లో దీన్ని 'విద్యారత్న' నిడుదవోలు వేంకటరావు, డాక్టర్ పోణంగి శ్రీరామ అప్పారావు సంపాదకులుగా ప్రచురించింది. తెలంగాణ సాహిత్య అకాడెమీ కూడా ప్రపంచ తెలుగు మహాసభల్లో భాగంగా ముద్రించింది.

మడికి సింగన క్రీ.శ.1420 ప్రాంతపువాడు. 'ఓరుగల్లున కుత్తరమున నుండు రామగిరి పట్టణమున కధీశ్వరుండగు కందన మంత్రి కాశ్రితుడై బహు గ్రంథముల రచించె'నని మానవల్లి రామకృష్ణ కవి రాశారు. ఇప్పటి వ్యవహారంలో చెప్పాలంటే తెలంగాణలోని 'పెద్దపల్లి జిల్లా రామగిరి నివాసి'. పద్మ పురాణోత్తర ఖండము, భాగవతము దశమ స్కంధము(ద్విపద), జ్ఞాన వాసిష్ఠ రామాయణము ఆయన లభ్య రచనలు. ఆయన పేరు నిలిచి ఉన్నది మాత్రం సకల నీతి సమ్మత సంకలనకర్తగానే! 'అల్లకల్లోలమైన దుగ్ధనిధి ద్రచ్చి / దేవామృతము తేటదేర్చుపగిది/ గంధకారుడు మున్నుగల వస్తువులు జోక గూర్చి సుగంధంబు గూడినట్లు/ అడవి పువ్వుల తేనెలన్నియు మధుపాళి యిట్టలంబుగ జున్ను వెట్టుభంగి/ దననేర్పు మెఱసి వర్తకుడు ముత్తెములీడు గూర్చి హారంబు తాగ్రుచ్చు కరణి' రీతిలో ఈ గ్రంథం కూర్చానని సింగన చెప్పుకొన్నాడు. రాజసభలలో పద్యాలను గమకముతో, అంటే రసోచిత స్థాయులతో చదివే వారి వాచకం ఎట్లుండాలో– 'వెనుకకు బోక హాయనక వేసట నొందక బంతి బంతిలో బెనపక... యక్షరాక్షరము కందువు దప్పక యేకచిత్తుడై యనుపమ భక్తితో జదువునాతని వాచకుడండ్రు సజ్జనుల్' పద్యం చెబుతుంది. 'రవికి మఱుగైన గొందిని దివియ' ప్రకాశింపజేసినట్టుగా, అధికుడు తెలుపని యుక్తివిశేషాన్ని 'చిఱుతవాడు' చెప్పగలండంటుంది ఇంకొక పద్యం. 'సరస కవిత రుచి యెఱుగని పురుషుల బశువులని నిక్కముగ నెఱుగు'మంటుంది మరొకటి. 'కుక్క తోక బట్టుకొని మహాంబుధి దాట'డం, 'తల్లి సచ్చినను జూదరి లేచిపోవండు' లాంటి వాడుకలు, జాతీయాలు ఇందులో కనిపిస్తాయి.

వాఙ్మయ పరిశోధన మనకు 15వ శతాబ్దిలోనే, అంటే మడికి సింగనతోనే మొదలైందంటారు పెద్దలు. అంతకుముందున్న కావ్యాలను చదివి, వాటిని క్రోడీకరించి, ఒక్కచోట అందుబాటులో ఉంచారు కదా! ''ఆంధ్ర సాహిత్య పరిశోధనా రంగమున సింగన ప్రథముడు; అతని కృతి తెలుగున ప్రథమ పరిశోధనా గ్రంథము'' అంటారు నిడుదవోలు వేంకటరావు. ''అయితే, ప్రస్తుత కాలము వలె, ఆ కాలమున పరిశోధనకు పట్ట ప్రదానము లేదు. అంతే భేదము.'' మనం సంబరపడటానికి ఇంకొక విషయం కూడా ఉన్నది. అంతకుముందు ఇంత నిధి ఉన్నదని మరోమారు రుజువవుతోంది కదా! సకల నీతి సమ్మతమును వెలికి తెచ్చిన మానవల్లి రామకృష్ణ కవి(1866–1957) మద్రాసులో జన్మించిన బహుభాషా పండితుడు. పదహారేళ్లకే 'కవి' బిరుదును పొందినవాడు. తెలుగు 'కుమార సంభవం' కావ్యాన్ని వెలికి తీసి, నన్నెచోడుని పేరును లోకానికి చాటిన మహానుభావుడు. అనంతర గొప్ప పరిశోధకులైన వేటూరి ప్రభాకర శాస్త్రి, తిరుమల రామచంద్ర వంటివారికి మార్గదర్శి. తాళపత్ర గ్రంథాల కోసం ఆయన ఊరూరా తిరిగేవారు. వాటిని ఇవ్వడానికి ఆ యజమానులు ఒప్పుకోకపోతే అక్కడే చదివి ఏకసంథాగ్రాహిలా బసకు వచ్చి అక్షరం పొల్లుపోకుండా రాసుకునేవారట. 'నైజాము రాజ్యమున... అమరచింత రాజాస్థానామున' ఆయన 'సకల నీతి సమ్మతము' లిఖిత ప్రతిని చూశారు. మానవల్లి తన అవసాన దశలో కఠిన దారిద్ర్యాన్ని అనుభవించి, వీధుల వెంట భిక్షాటన చేస్తూ బతికాడంటారు. కానీ ఆయనే తెలుగు సాహిత్య లోకానికి కావ్య సిరులను భిక్షగా వేశారని చెప్పాలి. ఆయన తన పేరును 'మా– రామకృష్ణ కవి' అని పూర్వపు తెలుగు పద్ధతిలో రాసుకునేవారు. అలా ఆయన 'మా రామకృష్ణ కవి' అవుతారు, మన రామకృష్ణ కవి అవుతారు. మన మడికి సింగన! మన రామకృష్ణ కవి!!

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.పాడ్యమి రా.1.17 వరకు తదుపరి విదియ, **నక్షత్రం:** ఆశ్లేష ప.2.30 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** రా.3.43 నుండి 5.28 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.35 నుండి 1.22 వరకు, తదుపరి ప.2.53 నుండి 3.38 వరకు, **అమృతఘడియలు:** ప.2.14 నుండి 3.43 వరకు; **సూర్యోదయం :** 6.35 ; **సూర్యాస్తమయం:** 5.53 ; **రాహుకాలం :** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం :** ఉ.10.30 నుండి 12.00 వరకు

తెలుగు టాకీకి పుట్టినరోజు చేద్దాం!

తొలి పూర్తి తెలుగు టాకీ సినిమా 'భక్త ప్రహ్లాద' విడుదలై నేటికి సరిగ్గా 91 ఏళ్లు నిండాయి. ఇది తెలుగు సినిమా పరిశ్రమలో ఒక చరిత్రాత్మక సంఘటన. అంతకు ముందు సగం తెలుగు, సగం తమిళంతో 1931 అక్టోబర్ 31న తొలి దక్షిణ భారతీయ భాషా టాకీ 'కాళిదాస్' వచ్చింది. ఆ పైన పూర్తిగా తెలుగు మాటలు, పాటలతో 'భక్త ప్రహ్లాద' 1932 ఫిబ్రవరి 6న విడుదలై సంచలనం సృష్టించింది. అందుకే ఫిబ్రవరి 6న మొదటి పూర్తి తెలుగు టాకీ ఆవిర్భావ సంబరాలు జరుపుకొంటారు. గతంలో ఈ సినిమా సెప్టెంబరు 15న విడుదల అయినట్టు ప్రచారం జరిగింది. కాని సీనియర్ జర్నలిస్టు డా॥ రెంటాల జయదేవ ఎన్నో యేళ్ళు ఊరూరా తిరిగి, ఎంతో పరిశోధించి, సాక్ష్యాలు సేకరించి, ఈ సినిమా 1932 జనవరి 21న బొంబాయిలో సెన్సారై, ఫిబ్రవరి 6న అక్కడే తొలిసారి విడుదలైనట్లు ఆధారాలతో నిరూపించారు.



ఆ విధంగా 1932 ఫిబ్రవరి 6న బొంబాయి శ్రీకృష్ణా సినిమా థియేటర్‌లో విడుదలైన తర్వాత, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాలకు వెళ్ళి, విజయవంతంగా ఆడింది. 1932 ఏప్రిల్ 2న మద్రాసులోని 'నేషనల్ పిక్చర్ ప్యాలస్'లో విడుదల చేశారు. ఈ చిత్ర దర్శకుడు హెచ్‌ఎమ్ రెడ్డి. సురభి కళాకారులు సహా పలువురిని బొంబాయి తీసుకెళ్ళి అక్కడ స్టూడియోలో 20 రోజుల్లో షూటింగ్ పూర్తిచేశారు. ఆ రోజుల్లో చిత్ర నిర్మాణానికి సుమారు రూ. 20 వేలు ఖర్చయింది. ఈ సినిమా సహజంగానే అనేక రికార్డులు నమోదు చేసుకుంది. ఇందులో లీలావతిగా నటించిన 'సురభి' కమలాబాయి తొలి తెలుగు తెర 'కథానాయిక'. ఈ చిత్ర నిర్మాణానికి ప్రధాన కారకులు పూర్ణా మంగరాజు. ఆంధ్రాలో తొలి సినీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ 'క్వాలిటీ పిక్చర్స్' వ్యవస్థాపకుడు. ఈ చిత్ర గీత రచయిత 'చందాల కేశవదాసు'. ఆ విధంగా తొలి పూర్తి తెలుగు సినిమా తయారై సంచలనం సృష్టించింది. దురదృష్టవశాత్తూ ఈ ఫిల్మ్ ప్రింట్ ఇప్పుడు లభ్యం కావడం లేదు.

నిజానికి, టాకీలు రావడానికి చాలాకాలం ముందే మూకీల కాలం నుంచి మన సినీ పితామహులు రఘుపతి వెంకయ్య నాయుడు వంటివారెందరో మన గడ్డపై సినిమా నిలదొక్కుకొని, అభివృద్ధి చెందడానికి ఎంతో కృషి చేశారు. అప్పట్లోనే తన కుమారుడు ప్రకాశ్‌ని విదేశాలకు పంపి ప్రత్యేక సాంకేతిక శిక్షణనిప్పించి, సినిమాలు తీసి తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి దోహదం చేశారు వెంకయ్య. ఇలాంటి వారి గురించి ముందు తరాల వారికి తెలియజేసే కార్యక్రమాలను సినిమా పెద్దలు, ఫిల్మ్ ఛాంబర్ లాంటి సంస్థలు, పాలకులు నిర్వహించాలి. తెలుగు సినిమా ఆవిర్భావ దినాన్ని ఒక ఉత్సవంగా నిర్వహించి... భావి తరాలకు తెలుగు సినీ పరిశ్రమ అభివృద్ధికి సంబంధించిన విషయాలు తెలియజేయాల్సిన అవసరం ఉంది. అలాగే పాత చిత్రాలు అన్నీ సేకరించి ఒక సినీ మ్యూజియం ఏర్పాటు చేయాలి. ఇటువంటిది దేశంలో పుణేలో ఉంది. ప్రపంచ ఉత్తమ చిత్రాలు ప్రదర్శిస్తున్న వైజాగ్ ఫిలిం సొసైటీ 'తెలుగు టాకీ సినిమా ఆవిర్భావ దినోత్సవం' సందర్భంగా ఫిబ్రవరి 6 నుండి 8 వరకు క్లాసిక్ చిత్రాలు ప్రదర్శిస్తోంది. ఉచిత ఫిల్మ్ వర్క్‌షాప్ నిర్వహిస్తోంది.

– నరవ ప్రకాశరావు; గౌరవ కార్యదర్శి,
వైజాగ్ ఫిలిం సొసైటీ
('భక్త ప్రహ్లాద' విడుదలై నేటికి 91 ఏళ్లు)

సీబీఐ నుంచి రామోజీ 'లైవ్' రిపోర్టింగ్

లేఖ గురించి వైఎస్‌వివేకా కుమార్తె సునీత చెప్పిన అంశాలను విలేకరులకు వెల్లడించిన డీఐజీ (నాటి ఈనాడు క్లిప్పింగ్)



అవినాష్‌రెడ్డి పీఏ నుంచే తొలి కాల్

• వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తు వివరాలను వెల్లడించిన కడప ఎస్పీ రాహుల్ దేవ్

ముమ్మరంగా విచారణ

సీబీఐ లీకులా... వైస్రాయ్ మాదిరిగా రామోజీ అబద్ధాల రిపోర్టింగా?

అప్పుడు హోటల్లో పట్టుమని పదిమంది ఎమ్మెల్యేలు కూడా లేరు. కానీ... "ఇదిగో యాభై మంది వచ్చేశారు... అదిగో ఆ సంఖ్య 100కు పెరిగింది. ఇంకేముంది... అంతా ఇక్కడికే చేరారు... అందరూ చంద్రబాబుకే మద్దతు పలుకుతున్నారు" అంటూ 1995 ఆగస్టులో పచ్చి అబద్ధాలతో 'లైవ్' రిపోర్టింగ్ చేశారు రామోజీరావు గారు. ఫలితంగా ఎన్‌టీఆర్ ప్రభుత్వం కూలిపోయింది. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయ్యారు. ఇది జరిగి 26 ఏళ్లు గడిచిపోయినా 'ఈనాడు' మారలేదు. ఆ తరహా 'లైవ్' రిపోర్టింగ్ మానలేదు!!.

'ఈనాడు' మారకపోయినా కాలం మారింది. మీడియా మారింది. రామోజీ చెప్పిందే నిజమనే భ్రమలు పోయి.. ఆయన అబద్ధాలు తప్ప ఏమీ చెప్పలేరనే నిజం బయటపడింది. వైఎస్ వివేకా హత్యకేసులో కొద్దిరోజులుగా సీబీఐ పేరు చెబుతూ 'ఈనాడు' వండి వారుస్తున్న కథనాల వెనక ఉద్దేశాలు సుస్పష్టం. ఎన్ని అబద్ధాలు చెప్పయినా కడప ఎంపీ అవినాశ్ రెడ్డిపై బురదజల్లాలి. అలా చేస్తే.. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌కు ఆయన బంధువు కనక సీఎం కుటుంబానికి కూడా కాస్త బురద అంటించొచ్చు. తద్వారా పూర్తిగా గ్రాఫ్ పడిపోయి... ఉత్త పుత్రుడిని, దత్తపుత్రుడిని కలిపి మరీ జనం మీదికి పంపిన తన చంద్రబాబుకు కాస్తయినా మేలు జరగొచ్చు. ఇదే రామోజీ ఏకసూత్ర అజెండా!!. తాజా కథనాలన్నీ ఈ అజెండాలో భాగమే.

ఇక్కడ ప్రధాన ప్రశ్న ఒక్కటే!. ఒక వ్యక్తిని సీబీఐ విచారించిందనుకుందాం. సీబీఐ ప్రశ్నలకు తను సమాధానాలు చెబుతాడు. అది వాళ్లిద్దరికే తెలుస్తుంది. మరి రామోజీరావుకు, ఆయన తోక పత్రికకు, టీవీ5కు ఎలా తెలుస్తోంది? వాళ్లు మాత్రమే 'లైవ్' రిపోర్టింగ్ ఎందుకు చేస్తున్నారు? ఎలా చేయగలుగుతున్నారు? సీబీఐ ఎవరికి నోటీసులిచ్చిందో... ఎవరికి ఇవ్వబోతోందో వారికి మాత్రమే ఎలా తెలుస్తోంది? రామోజీకి అతీంద్రియ శక్తులున్నాయా? లేక సీబీఐ ఆఫీసులో పొంచి వింటున్నారా? ఇదంతా కావాలనే చేస్తున్నారని... ప్రభుత్వం, ముఖ్యమంత్రి ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్రలో ఇదంతా భాగమేనని తెలియటం లేదా?

అటెండరుకు, పీఏకు తేడా తెలీదా?

బురద జల్లటానికి, జనంలో అపోహలు సృష్టించడానికి 'ఈనాడు' తనకు ఏది అనుకూలంగా ఉంటే అది రాసేస్తుందన్నది పచ్చినిజం. ఇంటికి వచ్చిన వారికి కాఫీ–టీ అందిస్తూ అటెండరుగా ఉన్న వ్యక్తిని 'పీఏ'గా 'ఈనాడు' రాస్తుండటం కూడా ఇలాంటిదే. ముఖ్యమంత్రి ఇంట్లో ఇలాంటి పనిచేసే నవీన్‌ను భారతమ్మ పీఏ అంటూ రామోజీ రాసిన రాతలు... దిగజారుడుకు పరాకాష్ట. చంద్రబాబు గ్రాఫ్ పెంచడానికి 'ఈనాడు' ఈ స్థాయికి పతనమైపోతుందని ఎవ్వరూ ఊహించి కూడా ఉండరు. సహజంగా ఇంట్లోవాళ్లకు ఫోన్ చేసినపుడు వాళ్లు గనక అందుబాటులో లేకుంటే అక్కడ పనిచేసే వాచ్‌మెన్, తోటమాలి, డ్రైవర్... ఇలా తెలిసిన వారికి ఫోన్ చేస్తారు. అలా నవీన్ ఫోన్‌కు కాల్స్ వచ్చాయంటూ భారతమ్మను టార్గెట్ చేశారంటే వీళ్లు ఎంత నీచంగా ఆలోచిస్తున్నారన్నది అర్థం కావటం లేదా?

మరణించిన వై.ఎస్.వివేకానందరెడ్డి ఎంపీ అవినాశ్ రెడ్డికి చిన్నాయన. అవినాశ్ రెడ్డి అప్పటికే సిటింగ్ ఎంపీ. ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడటంతో మళ్లీ టికెట్‌ను ఆయనకే కన్‌ఫర్మ్ చేశారు. దీంతో అవినాశ్‌కు మద్దతుగా వైఎస్ వివేకా ప్రచారం కూడా మొదలెట్టారు. హత్య గురించి తనకు తెలియటంతో అది చెప్పటానికి ఆయన కొందరు బంధువులకు ఫోన్ చేసి ఉండొచ్చు. అందులో తప్పేమయినా ఉందా? ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సభలు... అక్కడ మాట్లాడాల్సిన ప్రసంగాలు... తదితరాలపై అంతా బిజీగా ఉన్న సమయంలో ఓఎస్‌డీకి ఫోన్ చేసి... ఆయన దొరక్కపోతే అటెండర్‌కో, డ్రైవర్‌కో ఫోన్ చేసి సమాచారాన్ని చెప్పమని కోరితే తప్పా? అదేమైనా ఘోరమా? దానికి చిలవలు పలవలు జోడించి ఇంత దుష్ప్రచారం చేయాలా? ఫిలిం సిటీ కోటలో రామోజీరావుకు ఇలాంటి అటెండర్లు లేరా? ఎందుకీ దిగజారుడు రాతలు?

ఇవన్నీ వాస్తవాలు కాదా?

మొదటి నుంచీ స్థానిక పోలీసులు చెబుతున్నదాని ప్రకారం ఎంపీ అవినాశ్ రెడ్డి అక్కడకు చేరేసరికే జనం పోగై ఉన్నారు. వివేకానంద రెడ్డి గుండెపోటుతో చనిపోయారని, సిగరెట్లు ఎక్కువ తాగటం వల్లే ఇలా జరిగిందని తనతో వివేకా బావమరిది శివప్రకాశ్ రెడ్డి చెప్పినట్లు స్వయంగా నాటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రి ఆదినారాయణరెడ్డి వీడియో సహితంగా చెప్పారు. అదే శివప్రకాశ్ రెడ్డి తనకూ చెప్పినట్లు అవినాశ్ రెడ్డి చెబుతున్నారు. ఎన్నికల ప్రచారానికని బయలుదేరిన తాను... వివేకా మృతి గురించి శివప్రకాశ్ రెడ్డి చెబితే తిరిగి వెనక్కి వచ్చానని చెప్పారాయన. మరి అందరికీ చెప్పింది శివప్రకాశ్ రెడ్డే అయినపుడు... అవినాశ్‌నే ఎందుకు టార్గెట్ చేస్తున్నారు? వివేకానందరెడ్డి పీఏ కృష్ణారెడ్డికి ఉదయం 5 లేదా 5.30 గంటలకు అక్కడొక లేఖ దొరికింది. ఆ లేఖ రాసింది వివేకానందరెడ్డేనని, అందులోని రాత ఆయనదేనని వివేకా కుమార్తె స్వయంగా డీఐజీ ఎదుట అంగీకరించారు. ఆ విషయాన్ని నాటి కడప ఎస్పీ రాహుల్ దేవ్ వెల్లడించారు కూడా. ఆ లేఖనెవరు చూసినా... అది సహజ మరణం కాదని అర్థమయ్యేది. పోలీసులకో, అక్కడికి వచ్చిన వారికో వెంటనే ఆ లేఖను ఇచ్చి ఉంటే... అక్కడి వ్యవహారం మరోలా ఉండేది. కానీ పీఏకు ఆ లేఖను, వివేకా ఫోన్‌ను ఎవ్వరికీ ఇవ్వవద్దని తాము వచ్చేవరకూ అలాగే ఉంచుకోవాలని కృష్ణారెడ్డికి వివేకా కుమార్తె, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి చెప్పారు. ఈ విషయాన్ని కూడా కుమార్తె సునీత పోలీసుల దగ్గర అంగీకరించారు. అలా ఎందుకు చెప్పారని అడిగితే... డ్రైవర్ ప్రసాద్‌కు ప్రాణభయం ఉంటుందనే ఉద్దేశంతోనే అలా చెప్పామన్నారు. మరి ఆ దిశగా ఎందుకు దర్యాప్తు సాగలేదు? రామోజీరావుకు ఇది తెలీదా? ఎందుకీ దుర్మార్గపు రాతలు?



వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయాడని ఆయన బావమరిది శివప్రకాష్‌రెడ్డి విజయవాడలో ఉన్న తనకు ఫోన్ చేసి చెప్పాడని టీడీపీ నాయకుడు, ఆదినారాయణరెడ్డి సిట్ విచారణ సందర్భంగా చెబుతున్న దృశ్యం.. ఇందుకు సంబంధించిన వీడియో లింక్
https://www.youtube.com/watch?v=uGiQpc&ANqw


కుమార్తెకు-రెండో భార్యకు విభేదాలు లేవా?

వైఎస్ వివేకా కుమార్తెకు, ఆయన రెండో భార్యకు మధ్య విభేదాలున్నాయనేది బహిరంగ రహస్యం. వాళ్లిద్దరి మధ్య సామాజిక మాధ్యమాల్లో నడిచిన దారుణమైన మెసేజీలే ఇందుకు సాక్ష్యం. వివేకా కుమార్తె, అల్లుడికి బీటెక్ రవితో ఇప్పటికీ మంచి సంబంధాలున్నాయి. బీటెక్ రవిని అప్పట్లో పోలీసులు విచారించినా కూడా ఆ వివరాలెందుకు వెల్లడించలేదు? రామోజీకి ఇవన్నీ తెలిసినా... ఒక బీటెక్ రవిని కాపాడటానికో, ఒక చంద్రబాబు గ్రాఫ్ పెంచటానికో మరీ ఇంత దారుణంగా పతనమైపోయి రాయటం న్యాయమేనా? సీబీఐ అంటే చంద్రబాబు బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కాదు కదా? మరి రామోజీకి అన్ని విషయాలూ ఎలా తెలుస్తున్నాయి? హత్య జరిగిన సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడే. అప్పుడే ఆ లెటర్ కూడా దొరికింది. దాని ఆధారంగా అప్పటి నుంచీ ఇన్వెస్టిగేషన్ ఎందుకు సాగలేదు? రకరకాలుగా తిప్పి... ఇప్పుడు ముఖ్యమంత్రి సన్నిహిత కుటుంబీకులకు అంటగట్టడానికి ప్రయత్నిస్తుండటంలో కుట్ర స్పష్టంగా కనిపించటం లేదా? ఇంకెప్పుడు మారతారు రామోజీరావు గారూ?

ఏది నిజం?

విచారించింది సాక్షిగానే అని తెలిసీ బురదజల్లడం...

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ ఇప్పటి వరకు 200మందికిపైగా సాక్షులను విచారించింది. అదే రీతిలో ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డిని ఈ కేసులో సాక్షిగానే విచారించింది. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి, ఆయన నివాసంలో పని చేసే నవీన్‌లను సాక్షులుగానే విచారణకు పిలిచింది. బాధ్యతాయుతమైన పౌరులుగా సాక్షులుగానే సీబీఐ విచారణకు హాజరై సహకరించారు. కానీ దీనికి రాజకీయ రంగు పులిమి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబం పై బురద జల్లేందుకు ప్రయత్నించడం ఈనాడు మార్కు దిగజారుడు జర్నలిజం. ఈ కేసులో గతంలో వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివ ప్రకాశ్ రెడ్డిలను గతంలో సీబీఐ సాక్షులుగా విచారించింది. అప్పుడు మాత్రం ఈనాడు కళ్లకు గంతలు కట్టుకుని కూర్చుందా.? అప్పుడులేని హడావుడి ఇప్పుడు ఎందుకంటే...కేవలం చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనం కల్పించడానికే అన్నది సుస్పష్టమవుతోంది.



మరీ ఇంత దిగజారుడా రామోజీ...!

సాక్షిగా సీబీఐ అధికారుల ఎదుట విచారణకు హాజరైన అనంతరం ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి శుక్రవారం రాత్రి 7 గంటల సమయంలో తనంతట తాను వెనుదిరిగారు. కానీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి వచ్చి ఆయన్ని తన వాహనంలో ఎక్కించుకుని తీసుకువెళ్లారని ఈనాడు రాయడం కంటే అవాస్తవం మరొకటి ఉండదు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి రావడం హైదరాబాద్‌లోని ఫిల్మ్‌సిటీలోని కొండపై అక్రమంగా నిర్మించుకున్న రాజప్రాసాదం నుంచి శాటిలైట్ ద్వారా రామోజీరావు చూశారా..! అసలు ఆయన అక్కడకు రానే లేదు. కానీ కేఎస్ జవహర్ రెడ్డి వచ్చి కృష్ణమోహన్‌రెడ్డిని తీసుకువెళ్లినట్టుగా రాయడం ఏ పాత్రికేయ నీతో రామోజీరావుకే తెలియాలి మరి. ప్రభుత్వంపై దుష్ప్రచారం కోసం మరీ ఇంత బరితెగించాలా రామోజీ...!

హంతకుడే అప్రూవరా..! కళ్లుమూసుకున్నావా రామోజీ

వైఎస్ వివేకానందరెడ్డిని గొడ్డలితో నరికి హత్య చేశాను అని ఈ కేసులో నిందితుడు దస్తగిరి అంగీకరించారు. అటువంటి అతన్ని సీబీఐ ఈ కేసులో అప్రూవర్‌గా పేర్కొనడం విస్మయపరుస్తోంది. పైగా దస్తగిరి బెయిల్ పిటిషన్‌ను సీబీఐ వ్యతిరేకించకపోవడంపై న్యాయ నిపుణులే అవాక్కయ్యారు. హత్య చేసిన వ్యక్తి జైలులో ఉండాలి. కానీ అతను దర్జాగా బయట తిరుగుతున్నాడు. ఇవేవీ ఈనాడు రామోజీ రావు కంటికి కనిపించడం లేదా... మరెందుకు ప్రశ్నించ లేదు...!? ఇక హంతకుడు అయిన దస్తగిరి చెప్పిన కల్పితాలను ఆధారంగా చేసుకుని సీబీఐ దర్యాప్తు చేస్తుండటం వెనుక ఉన్న మర్మమేమిటీ... ఎవరు ప్రభావితం చేశారన్నది నిపుణులు లేవనెత్తుతున్న సందేహం. దీనిపై కూడా ఈనాడు దృష్టిసారించలేదు. ఎందుకంటే చంద్రబాబు పలుకులు పలుకుతున్న చిలక దస్తగిరి. అందుకే దస్తగిరి చెబుతున్న కట్టుకథలకు వంత పాడుతున్నావా రామోజీ...!

ఎంపీ టికెట్ అవినాశ్‌రెడ్డికి అని నిర్ధారించాకా రాద్ధాంతం ఏమిటో...

2019 ఎన్నికల్లో కడప ఎంపీ టికెట్ పై సందిగ్ధత ఉందనే అభూత కల్పనలతో ఈనాడు రామోజీరావు ప్రజలను పక్కదారి పట్టించేందుకు నానా పాట్లూ పడుతున్నారు. కానీ వాస్తవం ఏమిటన్నదీ అందరికీ తెలుసు. 2019 ఎన్నికల్లో కడప ఎంపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డి అభ్యర్థిత్వాన్ని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుగానే ఖరారు చేశారు. కడప లోక్‌సభ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్‌గా వైఎస్ వివేకానంద రెడ్డిని నియమించారు. అవినాశ్ రెడ్డి గెలుపు కోసం వివేకానందరెడ్డి అప్పటికే ప్రచారం కూడా ప్రారంభించారు. వివేకానందరెడ్డి హత్య తరువాత కూడా ఆయన కుమార్తె వైఎస్ సునీత అదే విషయాన్ని మీడియా సమావేశంలోనూ చెప్పారు ఎంపీ టికెట్‌పై ఇంత స్పష్టత ఉన్న తరువాత కూడా అదేదో ఎంపీ టికెట్ కోసం వైఎస్ కుటుంబంలో పోటీ నెలకొందని అవాస్తవాలను ఈనాడు ప్రముఖంగా ప్రచురిస్తుండటం కేవలం ఎల్లో జర్నలిజమే.

వైఎస్ వివేకాను కుట్ర పూరితంగా ఓడించింది చంద్రబాబే

వైఎస్ వివేకానందరెడ్డి హత్యను రాజకీయంగా వాడుకోవాలని చంద్రబాబు, రామోజీరావు కుయుక్తులు పన్నుతున్నారు. అందుకే వైఎస్ వివేకానంద రెడ్డిపై ఎక్కడలేని ఆపేక్ష చూపిస్తున్నట్టు డ్రామాకు తెరతీశారు. కానీ కడప జిల్లాలో స్థానిక సంస్థల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్‌వివేకానందరెడ్డిని కుట్రపూరితంగా ఓడించింది చంద్రబాబే కదా. వైఎస్సార్ మరణానంతరం భార్య, కుమార్తె ఒత్తిడితో వైఎస్‌వివేకానందరెడ్డి కాంగ్రెస్‌పార్టీలో ఉండిపోయారు. వైఎస్‌విజయమ్మపై పులివెందులలో పోటీ చేశారు కూడా. అయినా సరే అనంతర పరిణామాల్లో పార్టీలోకి వస్తానంటే చిన్నాన్న మీద గౌరవ, అభిమానాలు ఉన్న వైఎస్ జగన్ ఆయన్ని సాదరంగా స్వాగతం పలికారు. కడప స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం కల్పించారు. ఎందుకంటే కడప జిల్లాలో స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీకే మెజార్టీ ఉంది. కానీ అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు కుట్రపూరితంగా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను ప్రలోభాలకు గురి చేసి వైఎస్ వివేకానంద రెడ్డిని ఓడించారు. అందుకు ఈనాడు, ఎల్లో మీడియా వత్తాసు పలికింది నిజం కాదా రామోజీ...!

అధికారంలో ఉంటే సీబీఐని నిషేధించింది బాబే కదా...

ప్రస్తుతం సీబీఐ దర్యాప్తును వక్రీకరిస్తూ కథనాలు రాస్తున్న ఈనాడు రామోజీరావు టీడీపీ ప్రభుత్వ హయాంలో మాత్రం నిద్ర పోయారనిపిస్తోంది. పోలవరం ప్రాజెక్టులో తమ అవినీతిని ఎక్కడ బయటపెడుతుందో అని చంద్రబాబు ఆనాడు రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశించకుండా నిషేధించారు. కేంద్ర దర్యాప్తు సంస్థపై నిషేధం విధిస్తే ఈనాడు కనీసం ప్రశ్నించలేదు. సరి కదా స్వాగతించింది. అంటే అప్పట్లో సీబీఐ అంటే ఓ పనికిమాలిన సంస్థగా చంద్రబాబు, ఈనాడు రామోజీరావు భావించారు. అటువంటి వారిద్దరూ ప్రస్తుతం సీబీఐ ని ఆకాశానికెత్తుతుండటం గమనార్హం. టీడీపీ అధికారంలో ఉంటే ఓ రీతి... ప్రతిపక్షంలో ఉంటే మరో రీతా ...! చంద్రబాబు సీబీఐపై విధించిన నిషేధాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎత్తివేశారు. సీబీఐ అంటే భయముంటే ఆ పని ఎందుకు చేస్తారు. కానీ ఈ విషయాన్ని మాత్రం ఈనాడు ప్రస్తావించదు.

తులసమ్మ లేవనెత్తిన సందేహాలపై దర్యాప్తు ఏదీ...?

ఈ కేసులో అరెస్టు అయిన శివశంకర్‌రెడ్డి భార్య తులసమ్మ సీబీఐ దర్యాప్తు తీరును తప్పుబడుతూ న్యాయస్థానంలో ఓ పిటిషన్ వేశారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య ఎవరు చేసి ఉంటారనే సహేతుక ఆధారాలతో ఆమే నివేదించారు. వైఎస్ వివేకానందరెడ్డి రెండో వివాహంతో ఆ కుటుంబంలో తలెత్తిన విభేదాలు... రెండో భార్య కుమారునికి ఆస్తిలో వాటా ఇస్తానని ఆయన చెప్పడంతో విభేదించిన మొదటి భార్య, కుమార్తె సునీత. అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, పెద్ద బావమరిది శివ ప్రకాశ్ రెడ్డిలు పాల్పడిన కుట్రలు... పులివెందులలో రాజకీయ ఆధిపత్యంపై కన్నేసిన టీడీపీ నేత బీటెక్ రవి అందుకు అడ్డుగా ఉన్న వివేకానందరెడ్డిపై కక్ష పెంచుకోవడం... ఆర్థిక విభేదాలతో వైఎస్ వివేకానందరెడ్డిపై కక్ష పెంచుకున్న అనుచరుడు కొమ్మారెడ్డి పరమేశ్వరరెడ్డి... ఆయనతో రాజకీయంగా విభేదిస్తున్న తాడిపత్రి నేత రాజేశ్వరరెడ్డి, సహకరించిన నీరుగట్టు ప్రసాద్ ... ఇలా వీరందరి పాత్రపై దర్యాప్తు జరపాలని కోరుతూ తులసమ్మ ఇచ్చిన వాంగ్మూలాన్ని న్యాయస్థానం నమోదు చేసింది. ఇంతటి కీలక అంశాలు మాత్రం ఈనాడు కంటికి కనిపించలేదు. ఆమె ఆవేదనను ప్రచురించాలని భావించనూ లేదు. కేసు దర్యాప్తు సక్రమంగా జరగాలని కోరుకోనూ లేదు. కేవలం చంద్రబాబుకు రాజకీయ ప్రయోజనం కలిగించేందుకు కేసు దర్యాప్తును తప్పుదోవ పట్టిస్తూ... వైఎస్ కుటుంబం పై దుష్ప్రచారం చేయడమే ఈనాడు రామోజీ రావు పనిగా పెట్టుకున్నారు...

కానీ చంద్రబాబు గానీ రామోజీరావు గానీ గుర్తించని నిజం ఏమిటంటే... ఇవి 1995నాటి రోజులు కావు...చంద్రబాబు చెప్పే అవాస్తవాలు... ఈనాడు వండి వార్చే అభూత కల్పనలను ప్రజలు నమ్మే రోజులు పోయాయి. వారి కుట్రలు, దుష్ప్రచారాన్ని, తాము నమ్మడం లేదని 2019 ఎన్నికల్లో ప్రజలు ఘంటాపథంగా తేల్చి చెప్పారు. ఇప్పటికీ ప్రజల ఏకకంఠంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే బలపరుస్తున్నారన్నది సుస్పష్టం. ఆ నిజాన్ని గుర్తించి కూడా గుర్తించనట్టు వ్యవహరిస్తుండటం చంద్రబాబు, ఈనాడు అజ్ఞానం.



పోరండ్ల విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట బైఠాయించిన రైతులు

కరెంట్ కోతలపై అన్నదాతల నిరసన

- విద్యుత్ సబ్‌స్టేషన్ ముట్టడి
- కార్యాలయ గదికి తాళం వేసిన రైతులు

జగిత్యాల రూరల్: అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ జగిత్యాల జిల్లా పోరండ్ల గ్రామంలోని రైతులు ఆదివారం స్థానిక సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. వ్యవసాయ రంగానికి వచ్చే త్రీఫేజ్ కరెంట్ సరఫరాలో అంతరాయంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉద్యోగులను కార్యాలయంలోని ఓ గదిలో ఉంచి తాళం వేశారు. సబ్‌స్టేషన్ ఎదుట సుమారు రెండు గంటలపాటు బైఠాయించారు. వ్యవసాయ రంగానికి నిరంతరం త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా.. కనీసం ఐదు గంటలు కూడా ఇవ్వడంలేదని ఆరోపించారు. సమయపాలన లేకుండా అధికారులు కోతలు విధిస్తున్నారని ధ్వజమెత్తారు. రాత్రి, పగలు తేడాలేకుండా 24 గంటలపాటూ వ్యవసాయ బావుల వద్ద కరెంట్ కోసం పడిగాపులు కాస్తున్నామని పేర్కొన్నారు. కాగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఉద్యోగులు హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. గది తాళం తీసి వారికి విముక్తి కల్పించారు.

'ఒమేగా'లో ఏఐ కేన్సర్ రేడియేషన్ మెషీన్

- దేశంలోనే మొదటిసారి హైదరాబాద్‌లో అందుబాటులోకి
- ఒమేగా ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ మోహన వంశీ వెల్లడి
- గచ్చిబౌలిలో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభం



మీడియాతో మాట్లాడుతున్న ఒమేగా ఆసుపత్రి చైర్మన్ మోహన వంశీ

సాక్షి, హైదరాబాద్: ఒమేగా ఆధ్వర్యంలో హైదరాబాద్ గచ్చిబౌలిలో కొత్తగా మరో మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఆదివారం ప్రారంభమైంది. 500 పడకలతో ఈ ఆసుపత్రిని తీర్చిదిద్దారు. ఇక్కడ కేన్సర్ చికిత్సతోపాటు ఇతర అన్ని రకాల స్పెషాలిటీ వైద్య సేవలను అత్యాధునిక వైద్య సేవలతో అందుబాటులోకి తెచ్చినట్లు ఆసుపత్రి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మోహన వంశీ మీడియా సమావేశంలో వెల్లడించారు. దేశంలోనే తొలిసారిగా కృత్రిమ మేధ(ఏఐ)తో పనిచేసే కేన్సర్ రేడియేషన్ మెషీన్ (ఎథోస్)ను అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన తెలిపారు. ప్రజలకు తక్కువ ఖర్చుతో ప్రపంచ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో గచ్చిబౌలిలో ఆసుపత్రిని అందుబాటులోకి తెచ్చామన్నారు. ఏఐతో పనిచేసే 'ఎథోస్' రోగుల చికిత్సను ప్రారంభ దశ నుంచి చివరి వరకు పూర్తిస్థాయిలో పర్యవేక్షిస్తుందని చెప్పా రు. ఇది కేన్సర్ రేడియేషన్ చికిత్సలో ఒక విప్లవమని చెప్పారు. కొన్ని నిమిషాల వ్యవధిలోనే వ్యాధిని పూర్తిగా విశ్లేషించి చికిత్స అందించగలగడం దీని ప్రత్యేకత అన్నారు. దేశంలో డిజిటల్ పెట్ ఎంఆర్, డిజిటల్ పెట్ సీటీ పరికరాలతో కూడిన అత్యుత్తమ న్యూక్లియర్ మెడిసిన్ డిపార్ట్‌మెంట్‌ను ప్రారంభించిన మొదటి ఆసుపత్రిగా ఒమేగా నిలిచిందని డాక్టర్ వంశీ వెల్లడించారు. ఐసీయూ, హై ఎండ్ క్యాథ్‌ల్యాబ్ సదుపాయాలతో 24 గంటలూ అత్యవసర సేవలను అందించడానికి అందుబాటులో ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సీఈవో శ్రీకాంత్ నంబూరి, స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ రవి రాజు, డాక్టర్ గణేష్ మాథన్, డాక్టర్ విక్రమ్ శర్మ, డాక్టర్ ఆదిత్య కపూర్ పాల్గొన్నారు.

కొత్తగా ముగ్గురికి కరోనా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆదివారం 2534 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, వారిలో ముగ్గురు వైరస్ బారిన పడినట్లు ప్రజారోగ్య సంచాలకుడు శ్రీనివాసరావు తెలిపారు. ఒక్కరోజులో కరోనా నుంచి ఇద్దరు కోలుకోగా, ప్రస్తుతం 32 మంది ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నట్లు ఆయన వెల్లడించారు.

నిజామాబాద్ జిల్లాలో స్వల్ప భూకంపం!

సుభాష్‌నగర్ (నిజామాబాద్ అర్బన్): నిజామాబాద్ నగర పరిసర ప్రాంతాల్లో ఆదివారం తెల్లవారుజామున స్వల్ప భూకంపం సంభవించినట్లు తెలిసింది. రిక్టర్ స్కేల్‌పై 3.1 తీవ్రత నమోదైంది. తక్కువ తీవ్రత నమోదు కావడంతో ఎలాంటి ప్రభావం కనిపించలేదు. కాగా ఇదే విషయాన్ని వాతావరణ శాఖాధికారులను సంప్రదించగా, రిక్టర్ స్కేల్‌పై భూకంపం సంభవించినట్లు నమోదు కాలేదని తెలిపారు. 4.0కు పైగా తీవ్రత ఉన్నప్పుడే ప్రభావం కనిపిస్తుందని వారు స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి భయాందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

ఎద్దు ఖరీదు రూ.1.3 లక్షలు

- భారీ ఎత్తున పశువుల సంత



న్యాల్‌కల్(జహీరాబాద్): సంగారెడ్డి జిల్లాలోని న్యాల్‌కల్ గ్రామ సమీపంలో కొనసాగుతున్న ఉర్సే షరీఫ్ పీర్ గైబ్ సాహెబ్ దర్గా ఉత్సవాల్లో ఆదివారం భారీ పశువుల సంత నిర్వహించారు. ఝరాసంగం మండల పరిధిలోని ప్యాల వరం గ్రామానికి చెందిన రైతు తన ఎడ్ల జత ధర రూ.3 లక్షలని చెప్పగా.. అందులోని ఒక్క ఎద్దును మునిపల్లి మండలం పెద్దలోడి గ్రామానికి చెందిన రైతు సంగమేశ్వర్ రూ.1.3 లక్షలు పెట్టి కొనుగోలు చేశాడు. మరో ఎడ్ల జత రూ.1.45 లక్షలు పలికింది. సదాశివపేట మండలం కొల్కూర్‌కు చెందిన శివకుమార్ అనే రైతు తన ఆవు ధర రూ.6 లక్షలుగా నిర్ణయించగా.. రూ.3 లక్షలకు ఇవ్వమని రైతులు కోరినా అంగీకరించలేదు.

జిల్లా కోర్టుల్లో తెలుగులో ప్రొసీడింగ్స్

▶ మొదటి పేజీ తరువాయి

ముద్రించడం, తెలుగు భాషలో న్యాయ కోర్సులు, బోధనకు గల ఆవశ్యకత గురించి వివరించారని పేర్కొన్నారు. బాంబే హైకోర్టులో మరాఠీలో కోర్టు ప్రొసీడింగ్స్ అందిస్తే అదనపు ఫలితాలు వచ్చాయన్నారు. న్యాయవ్యవస్థలో రూల్ ఆఫ్ లా అందరికీ సమానంగా అమలు కావాలని, సమాజంలోని ప్రతి పౌరుడికి, వెనుకబడిన వర్గాలకు సమాంతర న్యాయసేవలు అందాలని తెలిపారు. కోర్టులో న్యాయవాదులు, జడ్జీలు మర్యాదపూర్వకంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి ఎం.నాగరాజు, కలెక్టర్ సంగీత, రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, పెద్దపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.సురేష్‌బాబు, సెక్రటరీ భాస్కర్, ప్రజాప్రతినిధులు, న్యాయాధికారులు, న్యాయవాదులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పనులు వేగిరం.. పరిహారం దూరం!

సీతమ్మసాగర్ నిర్వాసితుల ఆందోళన బాట



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతు మద్దూరి శ్రీనివాస రావు. చర్ల మండలం కుదునూరు గ్రామపంచాయతీ పరిధిలో 36 గుంటల భూమే ఈయనకు జీవనాధారం. ఈ స్థలం సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణం కారణంగా ముంపునకు గురవుతోంది. దీంతో పరిహారంగా రూ.7.20 లక్షలు అందిస్తామని ప్రకటించారు. కానీ నేటికీ ఒక్క పైసా అందలేదు. సదరు భూమి శ్రీనివాసరావు తల్లి పేరు మీద ఉండటం, ఆమె గతేడాది చనిపోవడంతో.. పట్టాపై ఉన్న భూయజమాని లేరనే కారణంతో పరిహారం నిలిపేశారు.



ఈయన చీకటి కిశోర్. సీతమ్మసాగర్ కింద ఇతని కుటుంబానికి సంబంధించిన భూమి ముంపునకు గురవుతోంది. దీంతో ఏడాది క్రితమే రూ.3.50 లక్షల పరిహారం ఇస్తామని ప్రకటించారు. కానీ ఆ స్థలం పట్టా కిశోర్ తండ్రి శాంతయ్య పేరిట ఉంది. ఆయన ఇటీవల మరణించారు. శాంతయ్య లేడనే కారణంతో ఆ కుటుంబానికి నేటికీ పరిహారం అందించలేదు.



పొలంలోకి వెళ్లేందుకు వీలు లేకుండా కొనసాగుతున్న నిర్మాణ పనులు

- పరిహారం అందక, పొలం సాగు చేసుకునే వీల్లేక అవస్థలు
- పట్టా పుస్తకంలో పేరున్న భూయజమాని మృతితో సమస్య
- ధ్రువీకరణ పత్రాలు సమర్పించినా వారసులకు అందని సొమ్ము
- కోర్టు వివాదాల కారణంగా కొందరికి ఆగిన చెల్లింపులు



పరిహారం చెల్లించాలంటూ ఆందోళన చేస్తున్న రైతులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలో 6.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందివ్వడంతో పాటు 320 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా సీతమ్మ సాగర్ బహుళార్ధ సాధక ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టింది. ఇందుకోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం, అశ్వాపురం మండలాల మధ్య గోదావరి నదిపై బ్యారేజీ నిర్మిస్తోంది. దీనివల్ల ఇటు దుమ్ముగూడెం, చర్ల, అటు మణుగూరు, అశ్వాపురం మండలాల్లో సుమారు 3,267 ఎకరాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందని గుర్తించారు. నిర్వాసితులకు పరిహారం అందించేందుకు రూ.160 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే కోర్టు వివాదాలు, పట్టా పుస్తకం ఎవరి పేరుతో ఉందో ఆ భూ యజమానులు మరణించడం, ఇతర సాంకేతిక కారణాల వల్ల సుమారు 100 మంది రైతులకు నేటికీ పరిహారం అందలేదు. సమస్యలు పరిష్కరించి ముంపు బాధితులకు పరిహారం అందజేయాల్సిన రెవెన్యూ అధికారులు ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుతూ ముప్పుతిప్పలు పెడుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ప్రాజెక్టు పనులు మొదలు కావడంతో భూమి సాగు చేసేందుకు వీలుకాక, మరోవైపు పరిహారం అందక నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో ఆందోళనలకు దిగుతున్నారు.

ధ్రువీకరణ పత్రాలు సమర్పించినా..

ఇటీవల సీతమ్మసాగర్ బ్యారేజీ, ఫ్లడ్‌బ్యాంక్, వరద కాలువ నిర్మాణ పనులు ఊపందుకున్నాయి. పరిహారం చెల్లించిన భూముల్లో జోరుగా కొనసాగుతున్నాయి. భారీ యంత్రాలు తిరిగేందుకు వీలుగా పొలాల్లో తాత్కాలిక రోడ్లు వేస్తున్నారు. ఎక్కడికక్కడ కందకాలు తీశారు. దీంతో చాలా పొలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో పరిహారం అందని రైతుల భూములు కూడా ఎందుకూ కొరగాకుండా పోతున్నాయి. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌ను రైతులు నష్టపోగా ఇప్పుడు రబీ సీజన్‌లో అదే పరిస్థితి నెలకొంది. దీంతో ముంపు రైతులు తమకు వెంటనే పరిహారం చెల్లించాలని కోరుతూ ఆందోళన బాట పట్టారు. ఈ క్రమంలోనే బుధవారం చర్లలో బ్యారేజీ పనులు జరుగుతున్న ప్రాంతంలో ఆందోళనకు దిగారు. తమ తల్లిదండ్రుల మరణ ధ్రువీకరణ పత్రాలు, అలాగే సంబంధిత వారసత్వ ధ్రువీకరణ పత్రాలు సమర్పించినా నేటికి కొత్త పాస్ పుస్తకాలు జారీ చేయలేదని ముంపు బాధితులు వాపోతున్నారు. పరిహారం అందకపోయినా ఇన్నాళ్లూ భూములు సాగు చేస్తూ జీవించామని, ఇప్పుడు పనులు మొదలు కావడంతో సాగుకు అవకాశం లేకుండా పోయిందని చెబుతున్నారు. ఉన్న ఒక్క జీవనాధారం కోల్పోవడంతో కడుపు నింపుకునేందుకు కూలీ పనులకు వెళుతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిక్కుతోచనిస్థితిలో కొందరు రైతులు పట్టణాలకు వలస వెళ్తుంటే, ఆసరా కోల్పోయిన వృద్ధులు ఆదుకునే హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

రెండు వారాల్లో నష్ట పరిహారం

పెండింగ్‌లో ఉన్న పరిహారం ఫైళ్ల పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. ముంపు బాధితులకు రెండు వారాల్లో పూర్తి స్థాయిలో నష్టపరిహారం చెల్లిస్తాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– భరణిబాబు, తహసీల్దార్, చర్ల

పొంగులేటి వర్గీయులపై వేటు

- 26 మందిని సస్పెండ్ చేసిన బీఆర్‌ఎస్
- వారిలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్, వైరా మున్సిపల్ చైర్మన్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరులపై వేటు పడింది. గత కొంతకాలంగా బీఆర్‌ఎస్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తూ వస్తున్న పొంగులేటి... ఆదివారం వైరా నియోజకవర్గంలోని పలు మండలాల్లో పర్యటించారు. అంతకుముందు ఖమ్మం క్యాంప్ ఆఫీసులో ఆయన మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వైరా నియోజకవర్గం నుంచి విజయాబాయి పోటీ చేస్తారని ప్రకటించారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఖమ్మం క్యాంప్ ఆఫీసులో జరిగిన సమావేశంతోపాటు మండల పర్యటనల్లో పాల్గొన్న పొంగులేటి అనుచరులపై వేటు వేస్తూ ఆయా మండలాల బీఆర్‌ఎస్ అధ్యక్షుల పేర్లతో ఆదివారం ప్రకటనలు విడుదలయ్యాయి. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారంటూ వైరా, కొణిజర్ల, జూలూరుపాడు, కారేపల్లి మండలాల నుంచి మొత్తం 26 మందిని సస్పెండ్ చేశారు. వారిలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతగాని జైపాల్, 'ఆత్మ' కమిటీ చైర్మన్ కోసూరి శ్రీను, కొణిజర్ల ఎంపీపీ గోసు మధుసూదన్‌రావుతోపాటు ముగ్గురు సర్పంచ్‌లు, ఇద్దరు ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్, ఇద్దరు రైతుబంధు కన్వీనర్లు ఉన్నారు. పొంగులేటి ఈ ఏడాది జనవరి ఒకటిన ఖమ్మంలో ఆత్మీయ సమావేశం నిర్వహించి బీఆర్‌ఎస్‌పై ధిక్కార స్వరం వినిపించారు. బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహించిన ఆవిర్భావ సభకు కూడా ఆయన హాజరు కాలేదు. ఆ తర్వాత పలు నియోజకవర్గాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ బీఆర్‌ఎస్‌పై విమర్శలు చేస్తున్నారు. అయితే నామినేటెడ్ పదవుల్లో ఉన్న నేతలపై మండల పార్టీ అధ్యక్షులు వేటు వేయడం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు సస్పెన్షన్‌కు గురైన వారిలో కొంత మంది బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

ANDHRA PRADESH STATE COUNCIL OF HIGHER EDUCATION
3rd, 4th and 5th Floors, Neeladri Towers, Sri Ram Nagar, 6th Battalion Road, Atmakur Village, Mangalagiri Mandal, GUNTUR-522503, A.P.
website: www.apsche.org

AP e-PROCUREMENT SHORT TENDER NOTICE
RFP No : APSCHE/PMU/02/2022-23 Date : 06.02.2023
Online tenders are invited through AP e-Procurement platform for the Establishment of Project Monitoring Unit (PMU) at APSCHE to implement and monitor Internships, Skill Development initiatives and other programs of APSCHE. For online submission of bids visit: www.apeprocurement.gov.in. Bid document downloaded start date: 06.02.2023 at 10:00 AM. Last date for Bid submission online is 15.02.2023, 03:00 PM.
Date: 06.02.2023, Mangalagiri Sd/- SECRETARY, APSCHE

JAWAHAR NAVODAYA VIDYALAYA: GOPANAPALLY:: RANGA REDDY DT (TS)
Letter.No.5-1/JNVRR/2022-23/ 05.02.2023
SHORT TENDER NOTICE
Invited Sealed Tenders for (1) 25 Seater Vehicle Hiring Purpose (2) Reference Books & Books for Competitive Exams (3) Shoes Cheppal & Socks (4) Sports Equipment. The tender forms can be had from the above office on payment of Rs.200/- by cash/Demand Draft drawn in favour of Principal, Jawahar Navodaya Vidyalaya Payable at UBI Sherlingampally from 06.02.2023 to 19.02.2023 between 9.30 AM to 4.00 PM and up to 10.30 AM on 20.02.2023 on all working days. Last date for submission of Tender forms in the above office is 20.02.2023 at 11.00 AM. The sealed Tenders will be opened on 20.02.2023 at 11.30 AM in the presence of the tenderers present at JNV Ranga Reddy. Tenders forms can also be downloaded from the Vidyalaya website https://www.navodaya.gov.in/nvs/nvs-school/RANGAREDDY/en/home/. Those who download the tender schedule from the website has to enclose Demand Draft for Rs.200/- along with tender schedule drawn in favour of "Principal, JNV Ranga Reddy" payable at UBI Sherlingampally towards the cost of tender schedule.
Sd/- (R. DANIEL RETNAKUMAR)
Principal

ANDHRA PRADESH FOREST DEVELOPMENT CORPORATION LIMITED
HO: Sri Venkateswara Arcade, 80/A & 81/A, 6th Lane, Annapurna Nagar, Gorantla, Guntur, AP
E mail: vcmd_apfdc@yahoo.co.in, vcmd.apfdcl@gmail.com
RED SANDERS WOOD SALE (PHASE - XV) 2023- NOTICE
Andhra Pradesh Forest Development Corporation Limited hereby notifies the sale of 417.550 Metric Tonnes of Red Sanders Wood (RSW) through International competitive bidding by way of e-tender-cum-e-auction on 23rd February 2023 in the First cycle. The unsold RSW lots, if any, would be put for sale on 2nd March 2023 in the Second cycle. The Government of Andhra Pradesh has all the necessary statutory approvals for the sale and export of RSW. The details of the sale conditions and related information are available in the following: http://www.apfdcl.com; http://www.forests.ap.gov.in; https://www.mstcindia.co.in; https://www.mstcecommerce.com
Sd/
(M. REVATHI, IFS.,)
Date: 3.2.2023 VICE CHAIRMAN AND MANAGING DIRECTOR (FAC)

తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న అద్భుతమైన అవకాశం
బిల్డర్లు/ డెవలపర్లు/ సంస్థలు/ కంపెనీలు/ కార్పొరేట్ కార్యాలయాలు/ వ్యక్తులకు
హైదరాబాద్ మరియు పరిసరాలలోని ప్రధాన ప్రాంతాలలో అపార్ట్ మెంట్లు/
కార్యాలయ సముదాయాలు/ బహుళ ప్రయోజనాల సముదాయాలు/ ఇండ్లు నిర్మించుటకు
hmda Growing Global

క్రింద తెలిపిన ల్యాండ్ పార్సెల్లకు ఈ-వేలం ప్రతిపాదించడమైనది
(మిగిలిన కొన్ని బిట్ల కొనుగోలుకు చివరి అవకాశం)

రంగారెడ్డి జిల్లా

	గ్రామం & మండలం	విస్తీర్ణం చ.గ.లలో	నిర్ధారించిన ధర చ.గ.కి
1.	సర్వే నం. 17 (పి1), బైరాగిగూడ, గండిపేట	411	35,000/-
2.	సర్వే నం. 17 (పి2), బైరాగిగూడ, గండిపేట	413	35,000/-
3.	సర్వే నం. 44, పీరంచెరువు, గండిపేట	3,637	60,000/-
4.	సర్వే నం. 34 (పి1), దర్గా హుస్సేన్ షవాలి, శేరిలింగంపల్లి	728	80,000/-
5.	సర్వే నం. 34 (పి2), దర్గా హుస్సేన్ షవాలి, శేరిలింగంపల్లి	786	80,000/-
6.	సర్వే నం. 34 (పి3), దర్గా హుస్సేన్ షవాలి, శేరిలింగంపల్లి	1535	80,000/-
7.	సర్వే నం. 174, చందానగర్, శేరిలింగంపల్లి	1,210	80,000/-
8.	సర్వే నం. 100, ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం	10,164	20,000/-
9.	సర్వే నం. 101, ఆదిబట్ల, ఇబ్రహీంపట్నం	6,655	20,000/-
10.	సర్వే నం. 26, కంచ గచ్చిబౌలి, శేరిలింగంపల్లి	1,210	1,00,000/-

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

	గ్రామం & మండలం	విస్తీర్ణం చ.గ.లలో	నిర్ధారించిన ధర చ.గ.కి
1.	సర్వే నం. 391, బాచుపల్లి, బాచుపల్లి	484	40,000/-
2.	సర్వే నం. 199, పీర్జాదిగూడ, మేడిపల్లి	363	28,000/-
3.	సర్వే నం. 103, మేడిపల్లి, మేడిపల్లి	302.5	33,600/-
4.	సర్వే నం. 103, మేడిపల్లి, మేడిపల్లి	302.5	33,600/-
5.	సర్వే నం. 33/1, చెంగిచెర్ల, మేడిపల్లి	1210	20,000/-
6.	సర్వే నం. 2 & 10, పోచారం, ఘట్‌కేసర్	5,445	40,000/-

సంగారెడ్డి జిల్లా

	గ్రామం & మండలం	విస్తీర్ణం చ.గ.లలో	నిర్ధారించిన ధర చ.గ.కి
1.	సర్వే నం. 287, వెలిమల, ఆర్. సి. పురం	3,630	20,000/-
2.	సర్వే నం. 598, వెలిమల, ఆర్. సి. పురం	1,694	35,000/-
3.	సర్వే నం. 823 (పి1), అమీన్‌పూర్, అమీన్‌పూర్	514.25	57,000/-
4.	సర్వే నం. 823 (పి2), అమీన్‌పూర్, అమీన్‌పూర్	514.25	57,000/-
5.	సర్వే నం. 823 (పి3), అమీన్‌పూర్, అమీన్‌పూర్	302.5	57,000/-
6.	సర్వే నం. 88 పటేల్ గూడ, అమీన్‌పూర్	2,178	57,000/-
7.	సర్వే నం. 439 (పి1), సుల్తాన్‌పూర్, అమీన్‌పూర్	2,487	30,000/-
8.	సర్వే నం. 439 (పి2), సుల్తాన్‌పూర్, అమీన్‌పూర్	1,482	30,000/-
9.	సర్వే నం. 439 (పి3), సుల్తాన్‌పూర్, అమీన్‌పూర్	1,229	30,000/-
10.	సర్వే నం. 439 (పి4), సుల్తాన్‌పూర్, అమీన్‌పూర్	1,204	30,000/-
11.	సర్వే నం. 439 (పి5), సుల్తాన్‌పూర్, అమీన్‌పూర్	1,226	30,000/-
12.	సర్వే నం. 439 (పి6), సుల్తాన్‌పూర్, అమీన్‌పూర్	2,442	30,000/-
13.	సర్వే నం. 439 (పి7), సుల్తాన్‌పూర్, అమీన్‌పూర్	1,982	30,000/-
14.	సర్వే నం. 439 (పి8), సుల్తాన్‌పూర్, అమీన్‌పూర్	1,212	30,000/-
15.	సర్వే నం. 439 (పి9), సుల్తాన్‌పూర్, అమీన్‌పూర్	793	30,000/-
16.	సర్వే నం. 439 (పి10), సుల్తాన్‌పూర్, అమీన్‌పూర్	422	30,000/-
17.	సర్వే నం. 439 (పి11), సుల్తాన్‌పూర్, అమీన్‌పూర్	430	30,000/-
18.	సర్వే నం. 439 (పి12), సుల్తాన్‌పూర్, అమీన్‌పూర్	434	30,000/-
19.	సర్వే నం. 291, వెలిమల, ఆర్. సి. పురం	605	20,000/-
20.	సర్వే నం. 291, వెలిమల, ఆర్. సి. పురం	605	20,000/-
21.	సర్వే నం. 236, వెలిమల, ఆర్. సి. పురం	121	20,000/-
22.	సర్వే నం. 197, వెలిమల, ఆర్. సి. పురం	605	20,000/-
23.	సర్వే నం. 117, ఖాజీపల్లి, జిన్నారం	1,089	20,000/-

డౌన్‌లోడ్ కొరకు క్రింది QR కోడ్ ను స్కాన్ చేయగలరు
KML ఫైల్ | బ్రోచర్
గూగుల్ ఎర్త్ పై ప్లాట్ లు సరిగ్గా ఎక్కడ ఉన్నాయో తెలుసుకోవడానికి, క్రింది సూచనలను పాటించండి
1. గూగుల్ ఎర్త్ డౌన్ లోడ్ చేసుకోండి
Google Earth | App Store | Google Play
2. KML ఫైల్ డౌన్‌లోడ్ చేసుకోవడానికి QR కోడ్ ను స్కాన్ చేయగలరు

గమనిక
ఎవరూ బిడ్ చేయని పక్షాన లేదా ఏదైనా సైట్ అమ్మకం కాకపోయినా వాటిని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కమ్యూనిటీ హాల్స్ లేదా ఇతర సామాజిక వసతుల నిర్మాణానికి వినియోగించబడును

దరఖాస్తు విధానం
- https://www.mstcecommerce.com/auctionhome/govts/index.jsp ను సందర్శించి, Register as Bidder పైన క్లిక్ చేయగలరు. సూచనలను పాటిస్తూ రిజిస్ట్రేషన్ ఫారం పూర్తి చేసి, రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించుటకు లాగిన్ పేజీ https://www.mstcecommerce.com/auctionhome/govts/index.jsp పై ఉన్న e-payment for new/deactivated buyers ను క్లిక్ చేయగలరు
- వివరణాత్మక సూచనల కొరకు బ్రోచర్ చూడగలరు

ఈ-వేలం (e-Auction) షెడ్యూలు

ప్రకటన తేది	06-02-2023
రిజిస్ట్రేషన్‌కు చివరి తేది మరియు సమయం	27.02.2023 సా॥ 5 గం॥ల వరకు
రిజిస్ట్రేషన్ ఫీజు	రూ. 1,180/- జీఎస్‌టీ తో సహా (వాపసు రాదు)
ఈఎమ్‌డి	రూ. 5,00,000/- ఒక్కొక్క ప్లాటుకు
ఈఎమ్‌డి చెల్లింపుకు చివరి తేది	28.02.2023 సా॥ 5 గం॥ల వరకు
ప్రీ-బిడ్ సమావేశం సమయం మరియు వేదిక	21.02.2023 ఉ॥ 11.00 గంటలకు రంగారెడ్డి మరియు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలకు 22.02.2023 ఉ॥ 11.00 గంటలకు సంగారెడ్డి జిల్లాకు https://www.hmda.gov.in/auctions/ లో సమావేశ వేదిక వివరాలు తెలియజేయబడును
ఈ-వేలం (e-Auction) తేది మరియు సమయం	01.03.2023 మొదటి సెషన్ : ఉ॥ 11 నుండి మ॥ 2 వరకు రంగారెడ్డి జిల్లాలో మిగిలిన (10) బిట్లకు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మిగిలిన (05) బిట్లకు, పోచారంలో (1) గృహ నిర్మాణ ప్లాటు రెండవ సెషన్ : మ॥ 3 నుండి సా॥ 6 వరకు సంగారెడ్డి జిల్లాలో మిగిలిన (23) బిట్లకు
కనీస బిడ్ పెంపుదల చ॥గ॥కి	రూ. 1000/- చొప్పున లేదా వేలల్లో

వేలంలో పాల్గొనడానికి కావలసిన అర్హతలు
- వ్యక్తిగాని లేదా వ్యక్తుల సమూహం (18 సం॥లు నిండిన భారతీయ పౌరులు), కంపెనీ (ప్రైవేటు/పబ్లిక్/లిమిటెడ్ లయబిలిటీ పార్ట్నర్‌షిప్), ప్రొప్రైటరీ సంస్థలు, భాగస్వామ్య సంస్థలు/ఎల్‌ఎల్‌పి, ట్రస్టులు, రిజిస్టరైన సొసైటీలు, ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, ఎన్‌బిఎఫ్‌సిలు, రియల్ ఎస్టేట్ ఫండ్స్, కేంద్రం లేదా రాష్ట్ర ప్రభుత్వాల పబ్లిక్ మరియు సెమీపబ్లిక్ సంస్థలు, ప్రభుత్వ విభాగాలు, జాయింట్ వెంచర్ కన్సార్టియం.
- వేలంలో పాల్గొనేవారు భారతదేశంలో వాణిజ్య పరమైన/బహుళ ప్రయోజనాలకోసం ఆస్తులను కలిగి ఉండటానికి, నిర్మించడానికి అర్హత కలిగి ఉండాలి మరియు కాంట్రాక్టు చేసుకోవడానికి యోగ్యత కలిగి ఉండాలి.
- DIP-GoI నియమాలననుసరించి ఆటోమాటిక్ మార్గంలో 100% ప్రత్యక్ష విదేశీ పెట్టుబడులకు అవకాశం.
- RBI, GoI / FEMA / FERA నియమాల ఆధారంగా విదేశీ కంపెనీ ఏదైనా భారతదేశంలో బ్రాంచ్ ఆఫీస్ ప్రారంభించి కార్యకలాపాలు కొనసాగిస్తున్నా లేదా ఏదైనా వ్యాపారం చేస్తున్నా, వారి వ్యాపార నిమిత్తం భారతదేశంలో స్థిరాస్తులు కొనడానికి అనుమతి ఉన్నట్లైతే.*

*https://www.mea.gov.in/images/pdf/acquisition-and-transfer-of-immovable-property-in-india.pdf

ప్రత్యేకతలు
1. 100 % ఎటువంటి చిక్కులు లేని క్లియర్ టైటిల్ ఉన్న ప్రభుత్వ భూమి
2. సంపూర్ణమైన భూ యాజమాన్య హక్కులు
3. నివాస గృహాలు / బహుళ ప్రయోజన కోర్సు కార్యాలయాలు, ఐటీ, గృహాలు, వాణిజ్యం, సంస్థలకు మిశ్రమ వినియోగం
4. భూమి వినియోగానికి సంబంధించిన మార్పులు చేయాల్సిన అవసరంలేదు
5. సత్వర నిర్మాణానికి అనువైన ప్లాట్లు
6. ముఖ్యమైన ప్రాంతాలలో లేఅవుట్లు
7. వివిధ రంగాలకు, వర్గాలకు అనువైన విస్తీర్ణాలలో
8. అన్ని ప్లాట్లకు చక్కని రోడ్డు అనుసంధానం

స్థల సందర్శన మరియు వివరాల కోసం సంప్రదించవలసిన నెంబర్లు: హెచ్.ఎం.డి.ఏ: 9154843213, ఎమ్ ఎస్ టి సి: 9177067332, 9650554645 అన్ని పని దినములలో.
లాగిన్ అవ్వండి : https://www.hmda.gov.in/auctions/ | www.mstcecommerce.com | www.mstcindia.co.in

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం.

క్లుప్తంగా...

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 4 శాతం డీఏ పెంపు?

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు కరవు భత్యం(డీఏ) 4 శాతం మేర పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే డీఏ పర్సంటేజీ ప్రస్తుతమున్న 38% నుంచి 42%కి చేరుకుంటుంది. కార్మిక శాఖ నెలవారీగా విడుదల చేసే పారిశ్రామిక సిబ్బంది వినియోగ ధరల సూచీ(సీపీఐ–ఐడబ్ల్యూ) ప్రాతిపదికగా తీసుకుని కేంద్రం ఉద్యోగులు, పింఛనుదారుల డీఏను ఖరారు చేస్తుంటుంది. ఆల్ ఇండియా రైల్వేమెన్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ శివ గోపాల్ మిశ్రా తాజా వార్తలపై స్పందిస్తూ..'డిసెంబర్ 2022 సీపీఐ–ఐడబ్ల్యూ జనవరి 31, 2023న విడుదలైంది. దీని ప్రకారంగా డీఏ పెంపు 4% ఉంటుంది. అప్పుడు 42%కి చేరుకుంటుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రతిపాదనలను తయారు చేసి కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం పంపుతుంది'అని ఆయన అన్నారు. ఒకవేళ ఈ ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపితే డీఏ ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి అమలవుతుంది. ప్రస్తుతం ఒక కోటి మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులు 38% డీఏను పొందుతున్నారు. సెప్టెంబర్ 28, 2022ను రివిజన్ డీఏ 2022 జూలై నుంచి అమల్లోకి వచ్చింది.

నేడు ఐదుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ప్రమాణం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు నూతన న్యాయమూర్తులుగా నియమితులైన ఐదుగురు సోమవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాజస్తాన్, పాట్నా, మణిపూర్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ పంకజ్ మిట్టల్, జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ పీవీ సంజయ్ కుమార్, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లా, అలహాబాద్ హైకోర్టు జస్టిస్ మనోజ్ మిశ్రా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులైన సంగతి తెలిసిందే.

నేడు కర్ణాటకకు మోదీ

బెంగళూరు: ప్రధాని మోదీ సోమవారం కర్ణాటకలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. బెంగళూరులో ఇండియా ఎనర్జీ వీక్ 2023ను ప్రారంభిస్తారు. పెట్రోల్‌లో 20% ఇథనాల్‌ను కలిపిన 'ఈ20 ఫ్యూయెల్' 84 రిటైల్ అవుట్‌లెట్లను ప్రారంభిస్తారు. గ్రీన్ మొబిలిటీ ర్యాలీని ప్రారంభిస్తారు. వీటిని వివిధ చమురు సంస్థలు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఏర్పాటు చేశాయి. మధ్యాహ్నం 3.30 గంటలకు తుమకూరులోని హెచ్ఏఎల్ ఫ్యాక్టరీని జాతికి అంకితం చేస్తారు. ఇది ఆసియాలోనే అతిపెద్ద హెలికాప్టర్ ఉత్పత్తి కర్మాగారం. మరికొన్ని అభివృద్ధి పనులకూ ప్రధాని శంకుస్థాపన చేస్తారు.

అంతరిక్షంలో బంగారం!

వాషింగ్టన్: మన పాలపుంతలో గ్రహాలతోపాటు కోట్ల సంఖ్యలో నక్షత్రాలు ఉన్నాయి. సమీపంలోని రెండు నక్షత్రాలు పరస్పరం ఢీకొని శక్తివంతమైన కొత్త నక్షత్రంగా ఏర్పడుతుంటాయి. ఇలాంటి పరిణామాన్ని కిలోనోవా అంటారు. మనం ఉంటున్న నక్షత్ర మండలంలో మరో అరుదైన కిలోనోవాకు అంకురార్పణ జరిగినట్లు అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ(నాసా) ఖగోళ శాస్త్రవేత్తలు గుర్తించారు. భూగోళం నుంచి 11,000 కాంతి సంవత్సరాల దూరంలో రెండు న్యూట్రాన్ నక్షత్రాలు ఒకదానికొకటి ఢీకొట్టబోతున్నట్లు తేల్చారు. తొలుత నాసాకు చెందిన నీల్ గెహ్రెల్స్ స్విఫ్ట్ అబ్జర్వేటరీ శాస్త్రవేత్తలు గమనించారు. అనంతరం చిలీలో అమెరికన్ అబ్జర్వేటరీలో ఉన్న స్మార్ట్ 1.5 మీటర్ టెలిస్కోప్ సాయంతో కిలోనోవా పరిణామాన్ని నిర్ధారించారు. అధ్యయనం ఫలితాలను నేచర్ జర్నల్‌లో ప్రచురించారు. త్వరలో సంభవించబోయే కిలోనోవా కోసం శాస్త్రవేత్తలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. రెండు నక్షత్రాలు కలిసిపోయినప్పుడు భారీ పేలుడు సంభవిస్తుందని, ఇందులో బంగారం లాంటి లోహాలు ఉత్పత్తి అవుతుందని చెబుతున్నారు. అంతేకాకుండా నక్షత్రాలు, గ్రహాల పుట్టుకతోపాటు అంతరిక్ష రహస్యాలను ఛేదించేందుకు ఈ కిలోనోవా దోహదపడుతుందని భావిస్తున్నారు. విశ్వంలో ఇప్పటిదాకా 10 కిలోనోవాలో సంభవించినట్లు అంచనా వేస్తున్నారు. ఒక భారీ నక్షత్రం జీవితకాలం కనీసం 10 లక్షల సంవత్సరాలు ఉంటుందని, ఆ తర్వాత అందులో పేలుడు జరిగి, న్యూట్రాన్ స్టార్ ఉద్భవిస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు వివరించారు.




గాల్లో గూఢచారులు

కాక రేపుతున్న నిఘా బెలూన్లు • శతాబ్దాలుగా కొనసాగుతున్న వాడకం

ఓ బెలూన్ కొద్ది రోజులుగా అంతర్జాతీయంగా కలకలం రేపుతోంది. అమెరికా గగనతలంపై 60 వేల అడుగుల ఎత్తున ఎగురుతూ కన్పించిన ఈ చైనా బెలూన్ కచ్చితంగా ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను భారీగా పెంచేసింది. అది కచ్చితంగా నిఘా బాపతేనని అమెరికా, వాతావరణ పరిశోధనలు చేస్తూ దారి తప్పిందని చైనా వాదిస్తున్నాయి. సైనిక రంగంలో నిఘా బెలూన్ల వాడకం ఈ ఉదంతంతో మరోసారి తెరపైకి వచ్చింది...

– సాక్షి, నేషనల్ డెస్క్



ఈ కాలంలోనూ అవసరముందా?

సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతూ ఉపగ్రహాలు, డ్రోన్లు అందుబాటులోకి వచ్చాక ఈ నిఘా బెలూన్లతో పనేమిటన్న సందేహాలు సహజం . కానీ ఇప్పటికీ మిలటరీలో ఈ బెలూన్లకు ఎంతో ప్రాధాన్యముంది. ఉపగ్రహాలతో పోలిస్తే వీటిని చాలా చౌకలో తయారు చేయొచ్చు. నిర్దిష్ట గగనతలాలకు పంపడమూ ఎంతో సులభం. గాలివాటానికి అనుగుణంగా బెలూన్ల దిశను మార్చవచ్చు. అత్యంత ఎత్తులో ప్రయాణించే ఈ బెలూన్లు సేకరించే సమాచారం, ఫొటోలు చాలా నాణ్యతతో ఉంటాయి. లక్షిత గగనతలాల్లో రోజుల తరబడి ప్రయాణించే సత్తా వీటికుంది.

చైనా ప్రయోగం వెనక...

అమెరికా, చైనా మధ్య తరచూ ఉద్రిక్తతలు నెలకొంటూనే ఉన్నాయి. తైవాన్ నుంచి దక్షిణ చైనా సముద్రం వరకు, చైనాలో మానవహక్కుల నుంచి హాంగ్‌కాంగ్‌లో ప్రజాస్వామ్యం నిర్వీర్యం చేసే చర్యల దాకా తరచూ ఘర్షణాత్మక వాతావరణం నెలకొంటూనే ఉంది. కొంతకాలం క్రితం అప్పటి అమెరికా ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ తైవాన్ సందర్శన నాటి నుంచీ విభేదాలు మరింత ముదిరాయి. చైనా 34 యుద్ధ విమానాలను,, 9 యుద్ధ నౌకలను దక్షిణ చైనా సముద్రంలో మోహరించింది. ప్రతిగా తైవాన్ కూడా యుద్ధ విమానాల్ని సన్నద్ధం చేయడం, తైవాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తామని అమెరికా అధ్యక్షుడు బైడెన్ ప్రకటించడం ఉద్రిక్తతల్ని పెంచింది. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగ మంత్రి బ్లింకెన్ చైనా పర్యటనకు కొద్ది రోజుల ముందే చైనా నిఘా బెలూన్ ఇలా అమెరికా గగనతలంలోకి ప్రవేశించి కలకలం రేపింది. తద్వారా అగ్రరాజ్యానికి చైనా ఓ రకంగా హెచ్చరికలు పంపిందని భావిస్తున్నారు.

ఎప్పట్నుంచి వాడుకలో ఉన్నాయి?

- ఈ బెలూన్లను ఫ్రెంచి విప్లవం కాలం నుంచే వాడుతున్నారు. యుద్ధ భూమిలో ఆస్ట్రియా, డచ్ సైనిక దళాల కదలికలు తెలుసుకునేందుకు 1794లో ఫ్రాన్స్ వీటిని తొలిసారి వాడింది.
- గాల్లో చాలా ఎత్తున ఎగిరే ఈ బెలూన్ల ద్వారా సమాచార సేకరణ తేలిక కావడంతో అమెరికా అంతర్యుద్ధం, మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో వీటి వాడకం పెరిగింది.
- రెండో ప్రపంచ యుద్ధం సమయంలో ఒక అడుగు ముందుకేసి ప్రత్యర్థులపై ఈ బెలూన్లతో బాంబు దాడులకు దిగిన సందర్భాలూ ఉన్నాయి! జపాన్ సైన్యం ప్రయోగించిన బెలూన్ బాంబు అమెరికాలో ఒరెగాన్ వుడ్‌ల్యాండ్‌లో పడి ముగ్గురు పౌరులు మరణించారు.
- రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ప్రాజెక్ట్ జెనెట్రిక్స్ పేరుతో అమెరికా ఈ బెలూన్లపై విస్తృతంగా ప్రయోగాలు చేసింది. 1950లో వీటి సాయంతో సోవియట్ భూభాగాన్ని ఫొటోలు తీసింది.
- అమెరికా ఆర్మీ ప్రాజెక్టు మొగల్ పేరుతో బెలూన్లకు మైక్రోఫోన్లను అమర్చి సోవియట్ యూనియన్ అణు పరీక్షలకు సంబంధించిన శబ్దాలను రికార్డు చేసింది.

ఏమిటీ నిఘా బెలూన్లు?

నిఘా బెలూన్లను అత్యంత తేలికైన హీలియం వాయువుతో నింపుతారు. కెమెరాలు, రాడార్లు, సెన్సార్లు, కమ్యూనికేషన్ పరికరాలు అమర్చుతారు. అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన కెమెరాలు సుదూర ప్రాంతాల్లోని సమాచారాన్ని కూడా అత్యంత స్పష్టతతో సేకరించగలవు. ప్రయాణికుల విమానాలు 40 వేల అడుగుల ఎత్తు దాటవు. ఈ స్పై బెలూన్లు భూమికి 60 వేల నుంచి, లక్షా 50 వేల అడుగుల ఎత్తులో రోజుల తరబడి ప్రయాణించే సామర్థ్యం కలిగినవి.

చైనా బెలూన్ పేల్చివేత

అట్లాంటిక్ సముద్రంలో కూల్చేసిన అమెరికా • గట్టిగా బదులిస్తామన్న చైనా

వాషింగ్టన్/బీజింగ్: అమెరికా గగనతలం మీదుగా ఎగురుతూ కొద్ది రోజులుగా కలకలం రేపుతున్న అనుమానాస్పద చైనా నిఘా బెలూన్‌ను అగ్రరాజ్యం కూల్చివేసింది. అట్లాంటిక్ సముద్రంపైకి వచ్చేదాకా వేచి చూసి అత్యాధునిక ఎఫ్–22 యుద్ధ విమానంతో దాన్ని పేల్చేసింది. అమెరికా అణుక్షిపణుల్ని భద్రపరిచిన మోంటానా స్థావరంపై ఈ చైనా బెలూన్ ఎగురుతూ కన్పించడం, అది ఇరు దేశాల మధ్య చిచ్చు రేపడం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆదేశాల మేరకు దక్షిణ కరోలినాకు ఆరు మైళ్ల దూరంలో అట్లాంటిక్ సముద్ర జలాల్లో దాన్ని కూల్చివేశామని రక్షణ శాఖ ప్రకటించింది. దీని వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగలేదని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. దక్షిణ కరోలినా మిర్టిల్ బీచ్ సమీపంలో సముద్ర జలాల్లో 11కి.మీ. మేరకు పడిపోయిన బెలూన్, దాని విడి భాగాల కోసం రెండు నేవీ నౌకలు, ఇతర భారీ నౌకల సాయంతో అన్వేషిస్తున్నారు. బెలూన్ని కూల్చివేసే మిషన్‌ను బైడెన్ స్వయంగా పర్యవేక్షించారు. ''దాన్ని పేల్చివేసినప్పుడు ఎలాంటి నష్టం జరగకూడదని ఒత్తిడి ఎదుర్కొన్నాను. సైనిక సిబ్బంది విజయవంతంగా పని పూర్తి చేశారు. వారికి అభినందనలు'' అన్నారు.

నిబంధనల ఉల్లంఘన: చైనా

అమెరికా తమ బెలూన్‌ను కూల్చివేయడంపై చైనా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అమెరికా చేసిన పనికి తగిన సమయంలో దీటుగా బదులిస్తామని చైనా విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదలలో పేర్కొంది. అది పౌర వినియోగం కోసం ప్రయోగించిన బెలూన్ మాత్రమేనని పునరుద్ఘాటించింది. వాతావరణ పరిస్థితులను అంచనా వేయడానికి ప్రయోగించిన బెలూన్‌ను అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధంగా కూల్చేసినందుకు తమ నుంచి త్వరలోనే గట్టి ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించింది.

ఇలా కూల్చేశారు...



- దాదాపు మూడు స్కూలు బస్సుల పరిమాణంలో ఉన్న ఈ బెలూన్ తొలిసారిగా జనవరి 28న అమెరికా గగనతలంలోకి ప్రవేశించింది.
- దాదాపు 60 వేల అడుగుల ఎత్తులో ఎగురుతూ అమెరికా నిఘా కంటికి చిక్కింది. వెంటనే కెనడా వైపుగా వెళ్లి 30వ తేదీన తిరిగి అమెరికాలోకి ప్రవేశించింది.
- అణ్వాయుధ క్షిపణి ప్రయోగశాల తదితరాలున్న మొంటానాపై కూడా తిరుగుతుండటంతో కలకలం రేగింది.
- బెలూన్ కూల్చివేతకు మల్టిపుల్ ఫైటర్, రీ ఫ్యూయలింగ్ యుద్ధ విమానాలను రంగంలోకి దించారు. వర్జీనియాలోని లాంగ్లీ ఎయిర్ ఫోర్స్ బేస్ నుంచి దూసుకెళ్లిన ఎఫ్22 ఫైటర్ జెట్ పని పూర్తి చేసింది. భారత కాలమానం ప్రకారం శనివారం అర్ధ రాత్రి దాటాక ఏఐఎం–9ఎక్స్ సూపర్‌సానిక్ ఎయిర్ టు ఎయిర్ క్షిపణిని ప్రయోగించింది. వేడిని అనుసరిస్తూ దూసుకెళ్లే ఆ క్షిపణి పూర్తి కచ్చితత్వంతో లక్ష్యాన్ని ఛేదించింది.
- ముందుజాగ్రత్తగా సమీప విల్మింగ్టన్, మిర్టిల్ బీచ్, చార్లెస్టన్ ప్రాంతీయ విమానాశ్రయాల నుంచి విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపేశారు.
- బెలూన్‌కు అమర్చిన నిఘా పరికరాలను అమెరికా సేకరించి పరిశీలించనుంది. సముద్రంలో 47 అడుగుల లోతుకు పడిపోయిన సెన్సర్లు తదితర విడి భాగాల కోసం నేవీ డిస్ట్రాయర్ యూఎస్ఎస్ ఆస్కార్ ఆస్టిన్, డాక్ లాండింగ్ షిప్ యూఎస్ఎస్ కార్టర్ హాల్ వంటివాటితో పాటు నేవీ డైవర్లు గాలిస్తున్నారు.

విదేశాల నుంచి అమెరికా వీసా

భారతీయులకు కొత్త సదుపాయం



న్యూఢిల్లీ: అమెరికా వీసా కోసం ఇకపై సుదీర్ఘంగా నిరీక్షించాల్సిన అవసరం లేకుండా భారతీయులకు అమెరికన్ రాయబార కార్యాలయం అరుదైన అవకాశం ఇచ్చింది. తక్షణమే అమెరికా వెళ్లాల్సిన అవసరం ఉన్న వారు ఇతర దేశాల్లో ఎంబసీల నుంచి కూడా వీసా కోసం దరఖాస్తు చేసుకునే సౌలభ్యాన్ని కల్పించింది. బిజినెస్, పర్యాటక వీసాలైన బీ1, బీ2 వీసాలు పొందాలంటే కోల్‌కతాలో 589 రోజులు, ముంబైలో 638 రోజులు ఎదురు చూడాల్సిన పరిస్థితులున్నాయి. అయితే బ్యాంకాంక్‌కు వెళితే కేవలం 14 రోజుల్లోనే అపాయింట్‌మెంట్ దొరుకుతుంది. అందుకే అత్యవసరంగా అమెరికా వెళ్లాలనుకునేవారు విదేశీ ఎంబసీల్లో వీసాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఢిల్లీలోని అమెరికా రాయబార కార్యాలయం అధికారులు వెల్లడించారు. సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాం దేశాల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉంది. ఇప్పటికే ఈ సౌకర్యంతో వీసాలు పొందిన వారు ఉన్నారు. ''భారత్‌లో నా క్లయింట్‌కి హెచ్1బీ వీసా స్టాంపింగ్ కోసం అపాయింట్‌మెంట్ దొరకకపోవడంతో బ్రెజిల్‌లో రియో డే జెనేరియోలో చేయించాము. అక్కడ పని పూర్తయింది'' అని ఢిల్లీకి చెందిన ట్రావెల్ ఏజెంట్ కల్సి చెప్పారు. భారత్ బయట కూడా వీసాలు పొందే అవకాశం కల్పించడం ద్వారా వీసాల కోసం ఎదురు చూసే సమయం బాగా తగ్గిపోనుంది. హైదరాబాద్‌లో పర్యాటక వీసా కావాలంటే 609 రోజులు అంటే ఏడాదిన్నరకు పైగా ఎదురు చూడాల్సిన పరిస్థితులున్నాయి. కరోనా తర్వాత సిబ్బంది కొరతతో భారత్‌లో వీసాల జారీ చాలా ఆలస్యమైంది.

పాకిస్తాన్‌లో పేలుళ్లు... ఐదుగురికి గాయాలు

కరాచీ: పాకిస్తాన్‌లోని క్వెట్టాలో తాలిబన్లు జరిపిన పేలుళ్లలో అయిదుగురు గాయపడ్డారు. వారిలో పోలీసులే ఎక్కువ మంది ఉన్నారు. భద్రతా అధికారులు లక్ష్యంగా క్వెట్టాలోని పోలీసు లైన్స్ ప్రాంతంలో ఈ పేలుళ్లు జరిగాయి. తెహ్రీకీ తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) ఈ దాడులకి తమదే బాధ్యతని ప్రకటించుకుంది. క్వెట్టాలోని నవాబ్ అక్బర్ స్టేడియంలో హైప్రొఫైల్ క్రికెట్ క్రీడాకారులు కెప్టెన్ బాబర్ అజామ్, మాజీ ఆల్‌రౌండర్ షాహిద్ అఫ్రిది తదితరులు పాకిస్తాన్ సూపర్ లీగ్ మ్యాచ్ ఆడుతుండగా పేలుళ్లు జరగడంతో కాసేపు మ్యాచ్ నిలిపివేశారు. అయితే క్రీడాకారులందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు.

మన ఓటర్లు 94.5 కోట్లు



న్యూఢిల్లీ: మన దేశంలో ఓటర్ల సంఖ్య ఏడాదికేడాది పెరిగిపోతోంది. 1951 నుంచి ఇప్పటి వరకు చూస్తే ఓటర్ల సంఖ్య ఆరు రెట్లు పెరిగింది. ఈ ఏడాది జనవరి 1 నాటికి మన దేశంలో రిజిస్టర్ ఓటర్లు 94.50 కోట్లు అని కేంద్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. అయితే ఈ ఓటర్లలో దాదాపుగా మూడో వంతు మంది ఓటుకి దూరంగా ఉండడం ప్రజాస్వామ్యంలోనే విషాదకరం. ఈ ఏడాది పలు రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు, వచ్చే ఏడాది లోక్‌సభ ఎన్నికలు ఉండడంతో ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచడానికి ఇప్పట్నుంచే కేంద్ర ఎన్నికల సంఘం వ్యూహాలు పన్నుతోంది. మొట్టమొదటిసారి 1951లో ఓటర్ల జాబితాను రూపొందించినప్పుడు 17.32 కోట్ల మంది తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్నారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో 45.67% ఓటింగ్ నమోదైంది. 1957 సార్వత్రిక ఎన్నికల సమయానికి ఓటర్ల సంఖ్య 19.37 కోట్లు ఉంటే 47.44% మంది ఓటు వేశారు. 2009 నాటికి ఓటర్ల సంఖ్య భారీగా 71.7 కోట్లకు పెరిగినప్పటికీ ఓటింగ్ శాతం 58.21 మాత్రమే. 2019 సార్వత్రిక ఎన్నికల్లో 91.20 రిజిస్టర్డ్ ఓటర్లు ఉంటే 67.40శాతం మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

రాజకీయ నేతలూ జడ్జిలయ్యారు: రిజిజు

న్యూఢిల్లీ: రాజకీయ నేపథ్యం ఉన్నవారు సైతం గతంలో హైకోర్టుల్లో న్యాయమూర్తులయ్యారని కేంద్ర న్యాయ శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఉద్ఘాటించారు. ఈ మేరకు సుప్రీంకోర్టు అడ్వొకేట్, మాజీ గవర్నర్ స్వరాజ్ కౌశల్ చేసిన ట్వీట్‌ను రిజిజు ఆదివారం రీట్వీట్ చేశారు. కాంగ్రెస్ ఎంపీలుగా పనిచేసిన కేఎస్ హెగ్డే, బహరుల్ ఇస్లామ్ తర్వాతి కాలంలో హైకోర్టు న్యాయమూర్తులుగా నియమితులయ్యారని వెల్లడించారు. కేరళలో కేబినెట్ మంత్రిగా పనిచేసిన వీఆర్ కృష్ణ అయ్యర్ సైతం జడ్జిగా మారారని పేర్కొన్నారు. కొలీజియం విషయంలో ప్రభుత్వం, న్యాయ వ్యవస్థ మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే.

232 విదేశీ యాప్‌లపై నిషేధం

న్యూఢిల్లీ: చైనాతోపాటు వివిధ దేశాలకు చెందిన సంస్థలు నిర్వహిస్తున్న 232 బెట్టింగ్, గ్యాంబ్లింగ్, అనధికారిక రుణ యాప్‌లపై కేంద్రం నిషేధం విధించింది. ఇవి దేశ ఆర్థిక స్థిరతకు ముప్పుగా మారాయని ఓ అధికారి చెప్పారు. బ్లాక్ చేసిన యాప్‌ల పేర్లను కేంద్రం వెల్లడించలేదు.

'అదానీ'పై మోదీ మాట్లాడాల్సిందే: కాంగ్రెస్

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ ఆర్థిక అవకతవకల ఆరోపణలకు సంబంధించి కేంద్రంలోని మోదీ సర్కారుపై విమర్శల దాడిని కాంగ్రెస్ తీవ్రతరం చేసింది. ఈ విషయమై ప్రధాని నరేంద్ర మోదీ మౌనం మాటున దాక్కోలేరని పేర్కొంది. అదానీతో ఆయన అంటకాగారన్న ఆరోపణలకు ఈ మౌనం మరింత బలం చేకూరుతోందని అభిప్రాయపడింది. 'అదానీతో ఉన్న సంబంధం ఏమిటి? (హమ్ అదానీ కే హై కౌన్)' అన్నదానికి బదులివ్వకుండా తప్పించుకోవడం కుదరదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. అదానీ ఉదంతానికి సంబంధించి మోదీకి రోజుకు మూడు ప్రశ్నల చొప్పున సంధిస్తామని ఆదివారం వెల్లడించారు.

బెదురుతున్న బీజేపీ: టీఎంసీ

అదానీ ఉదంతంపై పార్లమెంటులో చర్చకు అధికార బీజేపీ బెదిరిపోతోందని తృణమూల్ కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. దీనిపై ఉభయ సభల్లోనూ కేంద్రాన్ని గట్టి నిలదీస్తామని పార్టీ ఎంపీ డెరెక్ ఒబ్రియాన్ చెప్పారు. అదానీ దెబ్బకు స్టాక్ మార్కెట్ల పతనం తాలూకు ప్రతికూల ప్రభావం దేశ ఆర్థిక వ్యవస్థపై, సామాన్యుల పొరులపై చాలాకాలం పాటు ఉంటుందని బీఎస్పీ అధినేత్రి మాయావతి అభిప్రాయపడ్డారు.

భారత్-యూకే ఎన్ఎస్ఏల చర్చల్లో రిషి



లండన్: భారత, బ్రిటన్ జాతీయ భద్రతా సలహాదార్లు (ఎన్ఎస్ఏ) అజిత్ ధోవల్, టిమ్ బర్రోల మధ్య లండన్లో జరుగుతున్న చర్చల్లో ప్రధాని రిషి సునాక్ ప్రత్యేకంగా పాల్గొన్నారు! ఇరు దేశాల మధ్య సంబంధాలను దృఢతరం చేసుకునేందుకు బ్రిటన్ ఎంతో ఆసక్తిగా ఉందని ఈ సందర్భంగా ఆయన చెప్పినట్టు భారత విదేశాంగ శాఖ పేర్కొంది. అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకునేందుకు ఆ దేశ జాతీయ భద్రతా సలహాదారు జాక్ సలివాన్‌తో చర్చల అనంతరం ధోవల్ శుక్రవారం యూకేకు చేరుకున్నారు.

బ్రిటన్లోకి అక్రమ వలసలకు చెక్!

బ్రిటన్లోకి అక్రమ వలసలను పూర్తిస్థాయిలో నిరోధించాలని సునాక్ నిర్ణయించుకున్నారు. దీనికి అడ్డంకిగా మారేలా కన్పిస్తున్న యూరప్ మానవ హక్కుల ఒప్పందం (ఈసీహెచ్ఆర్) నుంచి వైదొలగాలని నిర్ణయించుకున్నట్టు సమాచారం. ఈ ఏడాది 65 వేల మందికి పైగా అక్రమ వలసదారులు ఇంగ్లండ్‌లో ప్రవేశించవచ్చని వార్తలు వస్తున్నాయి.

అస్సాంలో బాల్య వివాహాలపై కొరడా

గువాహటి: పద్నాలుగేళ్లలోపు బాలికలను వివాహమాడిన వారిపై అస్సాం ప్రభుత్వం కొరడా ఝళిపిస్తోంది. మూడు రోజులుగా కొనసాగుతున్న ప్రత్యేక డ్రైవ్‌లో ఆదివారం నాటికి 2,278 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. 4,074 కేసులు పెట్టారు. ప్రస్తుతానికి తల్లిదండ్రులకు నోటీసులతో సరిపెడుతున్నామని సీఎం హిమంత బిశ్వ శర్మ చెప్పారు. స్పెషల్ డ్రైవ్ 2026 అసెంబ్లీ ఎన్నికల వరకు కొనసాగుతుందన్నారు.

ముషారఫ్ కన్నుమూత



2019లో దుబాయ్ ఆస్పత్రిలో ముషారఫ్



- పాకిస్తాన్‌లోనే త్వరలో అంత్యక్రియలు
- కార్గిల్ సూత్రధారిగా శాశ్వత అపకీర్తి

ఇస్లామాబాద్/దుబాయ్: పాకిస్తాన్ మాజీ సైనిక పాలకుడు, 1999 నాటి కార్గిల్ యుద్ధం సృష్టికర్త జనరల్ పర్వేజ్ ముషారఫ్(79) అనారోగ్యంతో కన్నుమూశారు. చాలా రోజులుగా అమిలాయిడోసిస్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఆయన దుబాయ్‌లోని అమెరికన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం తుది శ్వాస విడిచారు. ముషారఫ్ భౌతికకాయాన్ని పాకిస్తాన్‌కు తరలించి, అక్కడే అంత్యక్రియలు నిర్వహించాలని ఆయన కుటుంబ సభ్యులు నిర్ణయించారు. ఇందుకు సహకరించాలని కోరుతూ దుబాయ్‌లోని పాకిస్తాన్ కాన్సులేట్‌లో దరఖాస్తు సమర్పించారు. ముషారఫ్ పార్థివదేహాన్ని స్వదేశానికి తీసుకురావడానికి పాక్ ప్రభుత్వం రావల్పిండిలోని నూర్‌ఖాన్ ఎయిర్‌బేస్ నుంచి ప్రత్యేక విమానాన్ని దుబాయ్‌కి పంపించనుంది. అంత్యక్రియలు కరాచీలో నిర్వహించాలని నిర్ణయించారు. స్వదేశంలో పలు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ముషారఫ్ 2016 మార్చి నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లో ప్రవాస జీవితం గడుపుతున్న సంగతి తెలిసిందే. భారత్–పాకిస్తాన్ మధ్య జరిగిన కార్గిల్ యుద్ధానికి ప్రధాన సూత్రధారిగా, సైనిక నియంతగా ముషారఫ్ అపకీర్తిని మూటగట్టుకున్నారు. ముషారఫ్ మరణం పట్ల పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ సంతాపం వ్యక్తం చేశారు. త్రివిధ దళాల అధిపతులు సైతం సంతాపం తెలిపారు. ముషారఫ్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికి భగవంతుడు మానసిక స్థైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నట్లు వెల్లడించింది.

ఏమిటీ అమిలాయిడోసిస్?

చికిత్సతో నయం కాని ఇదొక అరుదైన వ్యాధి. శరీరంలోని అవయవాలు, కణజాలంలో అమిలాయిడ్ అనే ప్రొటీన్ అసాధారణంగా పెరిగిపోవడాన్ని అమిలాయిడోసిస్‌గా పరిగణిస్తారు. ఈ వ్యాధి వల్ల అవయవాలు పనిచేయడం క్రమంగా ఆగిపోతుంది. ముషారఫ్‌కు ఈ వ్యాధి సోకినట్లు తొలిసారిగా 2018లో బయటపడింది. ఆయన సొంత పార్టీ ఆల్ పాకిస్తాన్ ముస్లిం లీగ్(ఏపీఎంఎల్) ఈ విషయాన్ని ప్రకటించింది. ఆయన గత ఏడాది జూన్‌లో దుబాయ్‌లో ఆసుపత్రిలో చేరారు. 3 వారాల పాటు అసుపత్రిలోనే ఉన్నారు. అప్పట్లోనే ఆయన చనిపోయినట్లు సోషల్ మీడియాలో వార్తలు వచ్చాయి.

కాంగ్రెస్, బీజేపీ మాటల యుద్ధం

ముషారఫ్ మృతి పట్ల కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ సంతాపం ప్రకటించారు. భారత్‌కు శత్రువే అయినప్పటికీ శాంతి కోసం కృషి చేశారని కొనియాడారు. ఈ ట్వీట్‌పై కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్, బీజేపీ నేత షెహజాదా పూనావాలా ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయకుల ప్రాణాలను బలి తీసుకున్న నియంతను కీర్తించడం దారుణమని మండిపడ్డారు.

'కార్గిల్' విలన్

కరడుగట్టిన సైనిక నియంత



భారత గడ్డపై పుట్టి, కార్గిల్ యుద్ధంతో మనల్ని దొంగదెబ్బ తీసిన తెంపరి ముషారఫ్! కశ్మీర్ సమస్యను అంతర్జాతీయ అంశంగా మార్చడానికే అందుకు తెగించినట్టు తన ఆత్మకథ 'ఇన్ ద లైన్ ఆఫ్ ఫైర్'లో రాసుకున్నారు కూడా. నాటి ప్రధాని నవాజ్ షరీఫ్‌కు కూడా తెలియకుండా ముషారఫ్ స్వయంగా పథక రచన చేసిన కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్‌కు ఘోర పరాభవం మిగిలింది. 1999 మే 3న మొదలైన యుద్ధం జూలై 26న ముగిసింది. భారత్ 527 మంది సైనికులను కోల్పోగా 4,000 మందికిపైగా పాక్ జవాన్లు హతమయ్యారు.

ఢిల్లీలో పుట్టి...

పర్వేజ్ ముషారఫ్ 1943 ఆగస్టు 11న నాటి ఉమ్మడి భారతదేశ రాజధాని ఢిల్లీలో సాధారణ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. మాతృ భాష ఉర్దూ. 1947లో దేశ విభజనతో ఆయన కుటుంబం పాకిస్తాన్‌లోని కరాచీకి తరలివెళ్లింది. తండ్రి సయీద్ ముషారఫుద్దీన్ ఉద్యోగరీత్యా ముషారఫ్ 1956 దాకా టర్కీలో ఉన్నారు. తర్వాత కరాచీ, లాహోర్లలో చదువుకున్నారు. 1961లో పాకిస్తాన్ మిలటరీ అకాడమీలో చేరారు. 1964లో ఆర్టిలరీ రెజిమెంట్‌లో అడుగుపెట్టారు. 1971లో కంపెనీ కమాండర్‌గా భారత్–పాక్ యుద్ధంలో పాల్గొన్నారు. తర్వాత సైన్యంలో అంచెలంచెలుగా ఎదిగారు. 1998లో నాటి ప్రధాని నవాజ్ షరీఫ్ ఆయన్ను చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా నియమించారు. 'జాయింట్ చీఫ్స్ స్టాఫ్ కమిటీ' చైర్మన్‌గా 1999 ఏప్రిల్ 9న అదనపు బాధ్యతలు సైతం అప్పగించారు.

నియంత పాలన

పాక్, భారత్ ప్రధాన మంత్రులు షరీఫ్, వాజ్‌పేయి మధ్య 1999 ఫిబ్రవరి 21న చరిత్రాత్మక లాహోర్ శాంతి ఒప్పందం కుదిరిన కొన్ని నెలలకే కార్గిల్ యుద్ధానికి ముషారఫ్ తెగబడ్డారు. దీనిపై ఇంటా బయటా విమర్శలు ఎదుర్కొన్నారు. తనను తొలగించేందుకు నవాజ్ షరీఫ్ ప్రయత్నించడంతో 1999 అక్టోబర్‌లో సైనిక కుట్రతో ఆయన్ను గద్దె దింపారు. పాకిస్తాన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్‌గా ప్రకటించుకుని పాలకునిగా మారారు. 2001లో దేశాధ్యక్షుడిగా ప్రకటించుకున్నారు. తొమ్మిదేళ్లపాటు పాలించారు. ఉగ్రవాదంపై యుద్ధం పేరిట అమెరికాతో చేతులు కలిపారు. మితవాద, ప్రగతిశీల ఇమేజీ కోసం ఇస్లామిక్ తీవ్రవాద సంస్థలను నిషేధించి వాటి ఆగ్రహానికి గురయ్యారు. ముషార్రఫ్‌పై పలుమార్లు హత్యాయత్నాలూ జరిగాయి. 2008లో తప్పనిసరిగా పరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహిస్తానని ప్రకటించారు. ఎన్నికల తర్వాతి పరిణామాల్లో రాజీనామా చేసి దుబాయ్ పారిపోయారు. 2013 మార్చిలో తిరిగొచ్చి ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రయత్నించినా అనర్హత వేటు పడింది. నవాజ్ గెలిచాక ముషార్రఫ్‌పై మాజీ ప్రధాని బెనజీర్ భుట్టో హత్య సహా పలు కేసులు నమోదయ్యాయి. 2019లో ప్రత్యేక కోర్టు ఆయనకు మరణశిక్ష విధించింది!

– సాక్షి, నేషనల్ డెస్క్



2001 జూలైలో భారత పర్యటన సందర్భంగా రాష్ట్రపతి కేఆర్ నారాయణన్, ప్రధాని వాజ్‌పేయిలతో ముషారఫ్

సాక్షి హైదరాబాద్

సోమవారం ၊ 6 ၊ ఫిబ్రవరి ၊ 2023



ఎన్ఐఏ చేతికి 'ఉగ్ర త్రయం' కేసు

నగరంలో గత ఏడాది దసరా ఉత్సవాల ! నేపథ్యంలో హ్యాండ్ గ్రెనేడ్లతో భారీ విధ్వంసానికి కుట్ర పన్ని చిక్కిన లష్కరేతొయిబా ఉగ్రవాదులకు సంబంధించిన కేసు ఎన్ఐఏకి బదిలీ అయింది. -8లో



'సహజ'ంగానే బాదేశారు!

సహజ వాయువు ధరల పెరుగుదలతో సీఎన్జీ ధర ఎగబాకుతోంది. తాజాగా నగరంలో కిలోపై రూ. 2 పెరిగి రూ.97కు చేరింది. పది నెలల వ్యవధిలో కిలోపై రూ.28 భారం పడింది. -8లో

నేడు ఓయూ బంద్

ఉస్మానియా యూనివర్సిటీ: పీహెచ్డీ ప్రవేశాలకు యూజీసీ నిబంధనల పేరుతో వీసీ ప్రొ.రవిందర్ వ్యవహరిస్తున్న మొండివైఖరికి నిరసనగా సోమవారం ఓయూ బంద్ నిర్వహించనున్నట్లు ఐక్య విద్యార్థి సంఘం నాయకులు ఆదివారం పేర్కొన్నారు. క్యాంపస్లోని కాలేజీలు, కార్యాలయాల బంద్కు విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులు సహకరించాలని కోరారు.

న్యూస్‌రీల్

90 శాతం పూర్తయిన దక్కన్ భవనం కూల్చివేత



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ మినిస్టర్ రోడ్‌లో ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయిన దక్కన్ భవనం కూల్చివేత మరో 10 శాతం మాత్రమే మిగిలి ఉంది. గత నెల 19వ తేదీన ఆరు అంతస్తుల భవనంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గల్లంతు కావడం తెలిసిందే. గత నెల 26వ తేదీ నుంచి కూల్చివేతలు చేపట్టారు. ఆదివారం వరకు ఈ భవనం 90 శాతం కూల్చివేతలు పూర్తయ్యాయి. మరో 10 శాతం మిగిలింది. ఈ 10 శాతాన్ని సోమవారం రాత్రి వరకు కూల్చివేస్తామని అధికారులు తెలిపారు.

21 నుంచి 'ఖేల్ తెలంగాణ జీతో తెలంగాణ'

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కిషన్‌రెడ్డి తదితరులు

హిమాయత్‌నగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 'ఖేల్ తెలంగాణ జీతో తెలంగాణ' పేరుతో క్రీడా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం క్రీడలకు సంబంధించిన పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావులతో కలిసి హైదర్‌గూడలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 21, 22, 23 తేదీల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో పలు క్రీడలు నిర్వహించనున్నారని చెప్పారు. కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడా విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. సమావేశంలో కృష్ణ గౌడ్, సందీప్ సాయి, కిలారి మనోహర్, వనం రమేష్, సుమంత్, సందీప్ యాదవ్, సూర్య ప్రకాశ్ సింగ్, చిట్టి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

వేడి నీటిలో పడి 19 నెలల చిన్నారి మృతి

మియాపూర్: వేడి నీటిలో పడి 19 నెలల చిన్నారి మృతి చెందిన విషాదకర ఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అంగూర్ నాయక్, సుమిత్ర దంపతులు. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి హఫీజ్‌పేటలోని మార్తాండనగర్ కాలనీలో నివాసముంటున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అంగూర్ నాయక్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 3వ తేదీన సాయంత్రం సమయంలో స్నానం చేసేందుకు బాత్రూం వద్ద బకెట్‌లో వేడి నీళ్లు పెట్టి వెళ్లాడు. అతని వెంట వచ్చిన పెద్ద కూతురు నిహారిక (19 నెలలు) ప్రమాదవశాత్తు వేడి నీటిలో పడిపోయింది. దీంతో చిన్నారి ఒళ్లంతా కాలిపోయింది. వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిహారిక ఆదివారం మృతి చెందింది. మియాపూర్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





ర్యాలీని ప్రారంభిస్తున్న జయేశ్ రంజన్, నాగ్ అశ్విన్, అడివి శేషు తదితరులు




ఈవీ ర్యాలీ అదుర్స్

దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రికల్ (ఈవీ) ర్యాలీ ఈ-మొబిలిటీ వీక్ ఆదివారం పీపుల్స్ ప్లాజా వేదికగా ఘనంగా షురువైంది. ర్యాలీని ఐటీ కార్యదర్శి జయేష్ రంజన్ ప్రారంభించారు. మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా గ్రావ్‌టన్ మోటార్స్‌కు చెందిన షెరాజ్, రాహుల్ ఎలక్ట్రిక్ వాహనాలతో చేసిన విన్యాసాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ర్యాలీలో సినీ నటుడు అడివి శేషు, దర్శకుడు నాగ్ అశ్విన్, సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జామర్స్ బ్యాండ్, గీత రచయిత కృష్ణ చైతన్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. ర్యాలీలో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, ఆటో రిక్షాలు, కార్లు, ఆర్టీసీ బస్సులు మొత్తం 400కు పైగా ఎలక్ట్రిక్ వాహనాలతో ర్యాలీ సాగింది. – ఖైరతాబాద్/మాదాపూర్



ఆశల పల్లకిలో..

- నేడు రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న హరీశ్‌రావు
- నగరానికి ప్రాధాన్యంపై గ్రేటర్ వాసుల ఎదురుచూపులు



రాష్ట్ర సర్కారు సోమవారం ప్రవేశపెట్టే బడ్జెట్‌పై నగరవాసులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో జరిగే అభివృద్ధి ప్రాజెక్టులకు నిధుల వరద పారుతుందనే ఆశాభావాన్ని వ్యక్తంచేస్తున్నారు. ముఖ్యంగా ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయిస్తారని మెట్రో వర్గాలు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నాయి. అలాగే పోలీస్ విభాగం సైతం బడ్జెట్ కేటాయింపులపై పెద్ద ఆశలే పెట్టుకుంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పునర్ వ్యవస్థీకరణతో పాటు ఇటీవలే ఆమోదముద్ర పడిన బ్యూరోలు, కొత్త పోస్టులు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు (ఐసీసీసీ) అవసరమైన అత్యాధునిక టెక్నాలజీ కోసమూ నిధుల కేటాయింపు కీలకంగా మారింది. గ్రేటర్ ఆర్టీసీని ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఎంతో ఉంది. డొక్కు బస్సుల స్థానంలో కొత్తవి ప్రవేశపెట్టి, ఔటర్‌కు వెలుపల ఉన్న కాలనీలకు ప్రజా రవాణా వసతి కల్పించాల్సిన అవసరముంది. ఇవే కాకుండా మిగతా సమస్యల పరిష్కారానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని గ్రేటర్ ప్రజలు కోరుతున్నారు.

డొక్కు బస్సులే దిక్కా?

- సాయం కోసం గ్రేటర్ ఆర్టీసీ ఎదురుచూపులు
- రోజురోజుకూ తగ్గిపోతున్న సర్వీసుల సంఖ్య
- విస్తరిస్తున్న మహా నగరం
- ఇంకా రోడ్డెక్కని 300 ఎలక్ట్రిక్ బస్సులు



సాక్షి, సిటీబ్యూరో: ఏడాదికోసారి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెడుతూనే ఉంది. ప్రతి సంవత్సరం ఊరించి ఉసూరుమనిపిస్తూనే ఉంది. ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్‌లో ఏళ్లకు ఏళ్లుగా కాలం చెల్లిన సిటీ బస్సులే నడుస్తున్నాయి. దశాబ్ద కాలంగా ఒక్క కొత్త బస్సు కూడా రోడ్డెక్కలేదు. మరోవైపు హైదరాబాద్ మహానగరం విస్తరిస్తోంది. ఔటర్‌కు వెలుపల సైతం వందలాది కాలనీలు వెలిశాయి. ఆయా కాలనీలన్నీ ప్రజా రవాణాకు దూరంగానే ఉన్నాయి. ప్రైవేట్ వాహనాలు, ఆటోలు, వ్యక్తిగత వాహనాలపైనే ఆధారపడి లక్షలాది మంది నగరవాసులు రోజువారీ రాకపోకలు సాగిస్తున్నారు. పొరుగున ఉన్న ముంబై, బెంగళూరు వంటి నగరాల్లో ప్రజా రవాణా పరుగులు తీస్తుండగా హైదరాబాద్‌లో మాత్రం చతికిలపడటం గమనార్హం.

6 వేల బస్సులు అవసరం..

రవాణా రంగ నిపుణుల అంచనా మేరకు విస్తరిస్తున్న హైదరాబాద్ అవసరాల మేరకు ఇప్పటికిప్పుడు కనీసం 6 వేల బస్సులు కావాలి. ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి నగరాల్లో వేల కొద్దీ బస్సులు అందుబాటులో ఉన్నాయి. బెంగళూరులో ప్రతి రోజు 6వేల బస్సులు నడుస్తుండగా అదనంగా మరిన్ని బస్సులను కొనుగోలు చేసేందుక చర్యలు చేపట్టారు. ముంబైలో ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. వాహన కాలుష్య నియంత్రణ కోసం ఢిల్లీలో సీఎన్‌జీ బస్సులను భారీ ఎత్తున కొనుగోలు చేసి నడుపుతున్నారు. కానీ గ్రేటర్ హైదరాబాద్‌లో అందుకు విరుద్ధంగా బస్సుల సంఖ్య తగ్గిపోవడం గమనార్హం.

ఈ– బస్సులేవీ?

రెండేళ్లుగా ఎలక్ట్రిక్ బస్సులపై ఊరిస్తున్నప్పటికీ ఇప్పటి వరకు ఒక్క సర్వీసు కూడా అందుబాటులోకి రాలేదు. అద్దె ప్రాతిపదికన ఈ బస్సులను నడిపేందుకు గతేడాది టెండర్లు ఆహ్వానించారు. కొన్ని సంస్థలు ముందుకొచ్చాయి. వాటిలో ఒక సంస్థ సాంకేతిక సామర్థ్యంపై అనర్హత కారణంగా టెండర్ల ప్రక్రియలో వివాదం చోటుచేసుకుంది. అనంతరం న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ వివాదం పరిష్కారమైనప్పటికీ ఇంకా ప్రతిష్టంభన తొలగిపోలేదు. దీంతో గతేడాది డిసెంబర్ నాటికే నగరంలోని వివిధ మార్గాల్లో సుమారు 300 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వస్తారని భావించినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదు.

- ప్రస్తుతం గ్రేటర్‌లోని 28 డిపోల పరిధిలో సుమారు 2,850 బస్సులు ఉన్నాయి. వీటిలో కనీసం వెయ్యికిపైగా డొక్కు బస్సులే. కాలం చెల్లిన వీటితోనే ప్రయాణికులకు రవాణా సదుపాయాన్ని అందజేస్తున్నారు. ప్రతి రోజు సుమారు 22 లక్షల మంది ప్రయాణం చేస్తుండగా ఈ అరకొర బస్సులతోనే ఆర్టీసీ అధికారులు పాట్లు పడుతున్నారు. ప్రయాణికుల డిమాండ్ మేరకు బస్సులను ఏర్పాటు చేయలేకపోతున్నట్లు విచారం వ్యక్తం చేస్తున్నారు. శివారు ప్రాంతాల్లోని కాలనీలకు రోజుకు 8 ట్రిప్పుల డిమాండ్ ఉంటే కేవలం 4 ట్రిప్పులే నడుపుతున్నారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

'ఎయిర్‌పోర్ట్ మెట్రో'పై భారీ అంచనాలు..!

- రూ.6,250 కోట్ల అంచనా వ్యయంతో 31 కి.మీ మెట్రో ప్రతిపాదన
- పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టాల్సిన ప్రాజెక్టు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ వాసుల చిరకాల వాంఛ ఎయిర్‌పోర్ట్ మెట్రో ప్రాజెక్టుకు నేటి రాష్ట్ర బడ్జెట్‌లో నిధుల వరద పారుతుందని మెట్రో వర్గాలు ఆశిస్తున్నాయి. రాయదుర్గం మైండ్‌స్పేస్ జంక్షన్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం వరకు 31 కి.మీ మార్గంలో సుమారు రూ.6,250 కోట్ల అంచనా వ్యయంతో ఈ పనులను చేపడుతున్న విషయం విదితమే. ఈ ప్రాజెక్టు పనులను పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ బడ్జెటరీ నిధులతో చేపడతామని గతంలో రాష్ట్ర సర్కారు పెద్దలు ప్రకటించిన నేపథ్యంలో తాజా బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు భారీగా నిధులు కేటాయించాల్సి ఉంది. ఇక పాతనగరంలో ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5 కి.మీ మెట్రో పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతేడాది బడ్జెటరీ నిధులు రూ.500 కోట్లు కేటాయించినప్పటికీ నిధుల లేమి కారణంగా పూర్తిస్థాయిలో విడుదల చేయలేదు. ఈసారైనా పెండింగ్ ప్రాజెక్టుకు సైతం ప్రభుత్వం అధిక నిధులు కేటాయిస్తుందని మెట్రో వర్గాలు ఎదురుచూస్తున్నాయి.

ఎయిర్‌పోర్ట్ మెట్రోతో రియల్ భూమ్..



ఎక్స్‌ప్రెస్ మెట్రో మార్గాన్ని ఔటర్‌రింగ్ రోడ్డుకు సమాంతరంగా.. రాయదుర్గం–ఖాజాగూడ– నానక్‌రాంగూడ– నార్సింగి అప్పా జంక్షన్– రాజేంద్రనగర్–శంషాబాద్ఎయిర్‌పోర్ట్ కార్గో ఎయిర్‌పోర్ట్ టర్మినల్ (31 కి.మీ) వరకు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఈ మార్గంలో రియల్ ఎస్టేట్ బూమ్ భారీగా పెరగగా.. మెట్రో విస్తరణతో రియల్ రంగానికి మరింత బూస్టప్ తథ్యమని రియల్టీ వర్గాలు చెబుతున్నాయి.

- ఈ ప్రాంతాల్లో ఇప్పటికే గేటెడ్ కమ్యూనిటీలు, బహుళ అంతస్తుల భవనాలు, విల్లా ప్రాజెక్టులు, ఆఫీస్ స్పేస్‌లు, వాణిజ్య భవనాలు, స్టార్టప్‌లు, ఐటీ, ఇన్సూరెన్స్, బ్యాకింగ్ సంస్థలు, అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థలు, ఆర్థిక సంస్థల కార్యకలాపాలు కొనసాగుతుండగా.. ఎక్స్‌ప్రెస్ మెట్రో కారిడార్ మరిన్ని ప్రాజెక్టులు, దేశ, విదేశీ, బహుళ జాతి కంపెనీలకు రెడ్ కార్పెట్ పరుస్తుందని అంచనా వేస్తున్నారు. కాగా ఈ మార్గంలో అధికార, విపక్ష పార్టీలకు అనుకూలురైన పలువురు నేతలు, వారి అనుచరులు, సానుభూతిపరులైన రియల్ వ్యాపారులకు విలువైన స్థలాలుండడంతో ఈ ప్రాజెక్టు ప్రజా రవాణా కంటే ముమ్మాటికీ ప్రభుత్వ ప్రాయోజిత రియల్ ఎస్టేట్ ప్రాజెక్టేనని కొందరు నిపుణులు పెదవి విరుస్తున్నారు.

పెళ్లిరోజు నాడే మృత్యు ఒడికి

- కీసర ఓఆర్‌ఆర్‌పై ఘోర రోడ్డు ప్రమాదం
- ఓ వ్యక్తితో పాటు 12 ఏళ్ల బాలుడి దుర్మరణం
- మరో ఏడుగురికి గాయాలు



జహంగీర్ (ఫైల్)



సంపత్ (ఫైల్)

కీసర: తానొకటి తలిస్తే దైవమొకటి తలించిందన్నట్లు.. విధి కాటేసింది. పెళ్లి రోజు నాడే మృత్యువు ఓ వ్యక్తిని బలి తీసుకుంది. పన్నెండేళ్ల బాలుడిని పొట్టపెట్టుకుంది. రెండు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చింది. నగరంలో బతుకుదామని సొంతూరు నుంచి సామగ్రి తెచ్చేందుకు వెళ్తున్న క్రమంలో ఆదివారం ఉదయం కీసర ఓఆర్‌ఆర్ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తితో పాటు పన్నెండేళ్ల బాలుడు దుర్మరణం చెందారు. మరో ఏడుగురు గాయాల పాలయ్యారు. కీసర సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు డ్రైవర్స్ కాలనీకి చెందిన జహంగీర్ (45) నగరంలోని అల్వాల్, సూరారం ప్రాంతాల్లో తన సొంత వాహనం డీసీఎం వ్యాన్‌ను నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇటీవల సూరారంలోని జియో కేబుల్ పనులు జరిగే చోట తన వ్యాన్‌ను ఎంగేజ్‌కు పెట్టి నడుపుతున్నాడు. సొంతూరుకు వెళ్లి రావడం ఇబ్బందిగా ఉండటంతో అల్వాల్ సుచిత్ర వద్ద ఇటీవల ఓ ఇంటిని అద్దెకు తీసుకున్నాడు. ఆదివారం తన భార్య సుల్తానా, కుమారుడు నజీర్‌తో కలిసి అద్దె ఇంటిని శుభ్రం చేశారు. అనంతరం సొంతూరులో ఉన్న ఇంటి సామగ్రిని తెచ్చుకోవాలని నిర్ణయించుకున్నారు. సూరారంలోని జియో కేబుల్ పనులు చేస్తున్న మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన అన్నదమ్ములు రాపోలు శ్రీను, రాపోలు రవిలు జహంగీర్‌కు అప్పటికే పరిచయం. ఆదివారం సెలవు రోజు కావడంతో జియో కేబుల్ కంపెనీ సూపర్‌వైజర్ పీరూకు చెందిన స్విఫ్ట్ డిజైర్ కారులో స్వగ్రామానికి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. పీరూ కారు నడుపుతుండగా.. సుచిత్ర వద్ద జహంగీర్, భార్య, కొడుకుతో పాటు రాపోలు శ్రీను, రాపోలు రవి, రవి కుమారుడు సంపత్ (12)లను ఎక్కించుకుని శామీర్‌పేట వద్ద ఓటర్‌రింగురోడ్డు ఎక్కి ఘట్‌కేసర్ వైపు వెళ్తున్నారు. కీసర వద్ద రింగురోడ్డుపై ఘట్‌కేసర్ నుంచి శామీర్‌పేట వైపు అతివేగంగా వెళ్తున్న బెంజ్ కారు డివైడర్‌ను ఢీకొట్టి ఓర్‌ఆర్ అవతల వైపు ఘట్‌కేసర్ వైపు వెళ్తున్న స్విఫ్ట్ డిజైర్ కారును ఢీకొట్టింది. దీంతో రెండు కార్ల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. స్విఫ్ట్ కారులో ఉన్న జహంగీర్‌తో పాటు, బాలుడు సంపత్‌లకు బలమైన గాయాలు కావడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రంగా గాయపడిన సుల్తానా, నజీర్, శ్రీను, రవి, పీరూలను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బెంజ్ కారులో ఉన్న డానియల్, జెస్సికకు స్వల్పంగా గాయాలయ్యాయి. వీరు నాగోల్ బండ్లగూడలోని సన్‌సిటీలో నివసిస్తూ గచ్చిబౌలిలో ఆటోమెటిక్ డాటా ప్రాసెసింగ్ (ఏడీపీ సెంటర్) కంపెనీలో పని చేస్తున్నారు. బెంజ్ కారు టైరు పంక్చర్ కావడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిందని డానియల్ చెప్పినట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ రఘువీర్‌రెడ్డి తెలిపారు. కాగా.. ఆదివారం జహంగీర్ 30వ పెళ్లిరోజు కావడం.. ఇదే రోజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన ఇద్దరు కూతుళ్లు, కుటుంబ సభ్యులు గాంధీ ఆస్పత్రి వద్ద బోరున విలపించారు.

'బ్యూరో'ల అమలులో నిధులే కీలకం

- కొత్త పోస్టుల మంజూరు నేపథ్యంలోనూ..
- పునర్ వ్యవస్థీకరణతో భవనాల అవసరం
- ఐసీసీసీ టెక్నాలజీ కోసమూ కేటాయించే అవకాశం

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో కేటాయింపులపై పోలీసు విభాగం భారీ ఆశలే పెట్టుకుంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పునర్ వ్యవస్థీకరణతో పాటు ఇటీవలే ఆమోదముద్ర పడిన బ్యూరోలు, కొత్త పోస్టులు, ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు (ఐసీసీసీ) అవసరమైన అత్యాధునిక టెక్నాలజీ కోసమూ నిధుల కేటాయింపు కీలకంగా మారింది. ఎన్నికల సంవత్సరం కావడంతో తమకు అవసరమైన నిధులు వచ్చే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

సొంత భవనం లేని పెద్ద కమిషనరేట్...

- శివార్లలో పెరుగుతున్న జనాభా, అభివృద్ధితో పాటు ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకున్న రాష్ట్ర ప్రభుత్వం దాదాపు ఏడేళ్ల క్రితం రాచకొండ పోలీసు కమిషనరేట్‌కు రూపమిచ్చింది. సైబరాబాద్‌తో పాటు మేడ్చల్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలను కలుపుతూ ఏర్పడిన ఈ కమిషనరేట్ పరిధి పరంగా దేశంలోనే అతి పెద్దదిగా అవతరించింది. ఇప్పటి వరకు దీనికంటూ సొంత భవనం లేదు. కొన్నాళ్లు గచ్చిబౌలిలో ఉన్న సైబరాబాద్ కమిషనరేట్‌లో కొనసాగింది. ప్రస్తుతం నేరేడ్‌మెట్‌లోని మల్కాజిగిరి డీసీపీ కార్యాలయం రాచకొండ కమిషనరేట్‌గా మారింది. అనేక వివాదాల తర్వాత దీనికోసం వరంగల్ హైవేపై స్థలం కేటాయించారు. భూమి పూజ, ప్రహరీ నిర్మాణ పనుల మినహా ఇది ముందుకు వెళ్లలేదు. ఈ బడ్జెట్‌లో కమిషనరేట్ నిర్మాణానికి నిధులు కేటాయిస్తారని అధికారులు భావిస్తున్నారు.
- రాజధానిలోని మూడు కమిషనరేట్లను పునర్ వ్యవస్థీకరించాలని నిర్ణయించిన ప్రభుత్వం ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో కసరత్తు చేసిన ఉన్నతాధికారులు కొత్త జోన్లు, డివిజన్లతో పాటు పోలీసుస్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. ఇప్పటికే హైదరాబాద్, సైబరాబాద్‌ల్లో కొత్త జోన్లకు అధికారులనూ కేటాయించారు. వీరితో పాటు డివిజన్లు, పోలీసుస్టేషన్లు కలిపి దాదాపు 40 కొత్తగా రానున్నాయి. తొలినాళ్లల్లో వారిని తాత్కాలిక భవనాల్లో కూర్చోబెట్టినా వీలైనంత త్వరగా భవనాలు నిర్మించాల్సి ఉంది. ఇప్పటికే సైదాబాద్ సహా దాదాపు ఎనిమిది పోలీసుస్టేషన్ల భవనాలు నిర్మాణంలో ఉన్నాయి. పునర్ వ్యవస్థీకరణ ద్వారా వచ్చే కార్యాలయాలకు అవసరమైన భవనాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది.



సైబర్ క్రైమ్స్, డ్రగ్స్ కట్టడికి...

నానాటికీ కొత్త పుంతలు తొక్కుతున్న సైబర్ నేరాలు, యువతను నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాలు... వీటిని నిరోధించడానికి రాష్ట్ర పోలీసు విభాగం వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తోంది. దీనికోసం ప్రత్యేకంగా తెలంగాణ స్టేట్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో, తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరోలను ఏర్పాటు చేసి వీటి బాధ్యతలు హైదరాబాద్, సైబరాబాద్ కమిషనర్లు సీవీ ఆనంద్, ఎం.స్టీఫెన్ రవీంద్రకు అప్పగించింది. ఐసీసీసీ కేంద్రంగా పని చేసే ఈ రెండు విభాగాలు నిఘా, ఆపరేషన్స్, దర్యాప్తు బాధ్యతల్ని నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇప్పటికే కొందరు అధికారులనూ కేటాయించినప్పటికీ అవసరమైన నిధులు మాత్రం అందలేదు. వనరులు, మౌలికవసతులు, సాంకేతిక పరిజ్ఞానం సమకూర్చుకోవడానికి ఈ బడ్జెట్‌లో భారీ మొత్తం కేటాయించే అవకాశం ఉంది. దీంతో పాటు తుది మెరుగులు దిద్దుకుంటున్న ఐసీసీసీ టెక్నాలజీ, అదనంగా వస్తున్న సిబ్బంది కోసమూ నిధుల కేటాయింపు అనివార్యంగా మారింది.

ఎన్‌ఐఏ చేతికి 'ఉగ్ర త్రయం' కేసు

- గతేడాది దసరా నేపథ్యంలో విధ్వంసాలకు లష్కరే కుట్ర
- జాహెద్, సమీయుద్దీన్, మాజ్‌లను పట్టుకున్న సిటీ సిట్
- విదేశీ లింకులు, వాంటెడ్‌గా ఉన్న పలువురు ఉగ్రవాదులు
- జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించిన కేంద్ర ప్రభుత్వం



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో గత ఏడాది దసరా ఉత్సవాల నేపథ్యంలో హ్యాండ్ గ్రెనేడ్లతో భారీ విధ్వంసానికి కుట్ర పన్ని చిక్కిన లష్కరేతొయిబా (ఎల్‌ఈటీ) ఉగ్రవాదులు అబ్దుల్ జాహెద్, మహ్మద్ సమీయుద్దీన్, మాజ్ హసన్ ఫారూఖ్‌లకు సంబంధించిన కేసు జాతీయ దర్యాప్తు సంస్థకు (ఎన్‌ఐఏ) బదిలీ అయింది. ఈ కేసుకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్‌ఏ) ఆదేశాలు జారీ చేసింది. వీటి ఆధారంగా గత నెల 25న తాజా ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన ఎన్‌ఐఏ హైదరాబాద్ యూనిట్ దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసుకు ఎన్‌ఐఏ డీఎస్పీ రాజీవ్ కుమార్ సింగ్ ఇన్వెస్టిగేటింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ తన అధికారిక వెబ్‌సైట్‌లో ఈ ఎఫ్‌ఐఆర్‌ను ఆదివారం అప్‌లోడ్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. గత ఏడాది అక్టోబర్ 2న అరెస్టు అయిన ఈ ఉగ్ర త్రయంపై తొలుత సీసీఎస్ ఆధీనంలోని సిట్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు ఉగ్రవాదులను సిట్ అధికారులతో పాటు రాష్ట్ర, కేంద్ర నిఘా వర్గాలకు చెందిన బృందాలు వివిధ కోణాల్లో విచారించాయి. ఈ కేసులో వెలుగులోకి రావాల్సిన జాతీయ, అంతర్జాతీయ కోణాలు అనేకం ఉన్నాయని నగర పోలీసులు గుర్తించారు. పాకిస్తాన్‌లోని రావల్పిండిలో ఉన్న హ్యాండ్లర్స్, మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులు ఫర్హతుల్లా ఘోరీ, సిద్ధిఖ్ బిన్ ఉస్మాన్, అబ్దుల్ మాజిద్‌కు సంబంధించిన కీలక వివరాలను దర్యాప్తు చేయాల్సి ఉంది. వీరి నుంచి ఈ త్రయానికి విధ్వంసాలకు పాల్పడాలంటూ ఆదేశాలు అందాయి. చైనాలో తయారైన హ్యాండ్ గ్రెనేడ్లు అక్కడ నుంచే లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్ (ఎల్‌ఏసీ) మీదుగా కాశ్మీర్‌కు డ్రోన్ల ద్వారా డెడ్ డ్రాప్ విధానంలో చేరాయి. వాటిని అక్కడ నుంచి మెదక్ జిల్లాలోని మనోహరాబాద్ వరకు చేర్చిన స్లీపర్‌సెల్స్ ఓ రహస్య ప్రదేశంలో దాచాయి. అక్కడకు వెళ్లిన సమీయుద్దీన్ నాలుగు గ్రెనేడ్స్‌ను తీసుకువచ్చారు. ఈ స్లీపర్ సెల్స్ ఎవరనేది దాంతో పాటు ఈ ఆపరేషన్‌లో పాల్గొనాలని భావించిన వాళ్లు ఇంకా ఎవరైనా ఉన్నారా? అనే అంశాన్నీ ఆరా తీయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పోలీసులు నిర్ధారించారు. వీటితో పాటు ఉగ్రవాదుల సంప్రదింపుల మార్గాలు, నగదు లావాదేవీలు గుర్తించడంతో సహా కీలక వివరాలు వెలుగులోకి తేవాల్సి ఉంది. వీటితో పాటు ఈ కేసులో పోలీసులు అన్ లాఫుల్ యాక్టివిటీస్ ప్రివెన్షన్ యాక్ట్ (యూఏపీఏ) కింద ఆరోపణలు చేర్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో కేసు దర్యాప్తు ఎన్‌ఐఏకు అప్పగిస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేయడంతో ఆ విభాగం అధికారులు రంగంలోకి దిగారు. చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ముగ్గురు ఉగ్రవాదులను కస్టడీకి తీసుకోవడానికి ఎన్‌ఐఏ అధికారులు కోర్టు అనుమతి కోరే అవకాశం ఉంది.

ప్రభుత్వ వైద్య పథకాలలో ఐఎంఏను భాగస్వామ్యం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బి.ఎస్.రావు తదితరులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే వైద్య పథకాలపరంగా తీసుకునే నిర్ణయాల్లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌ను భాగస్వామ్యం చేయాలని ఐఎంఏ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బీఎస్.రావు అన్నారు. ఆదివారం కోఠిలోని ఐఎంఏ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 4 లక్షల మంది వైద్యులు ఐఎంఏలో సభ్యులుగా ఉన్నారని, తెలంగాణలో 20 వేల మంది సభ్యులుగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర ఐఎంఏ సామాజిక బాధ్యతలో ముందుంటుందన్నారు. పబ్లిక్ హెల్త్ సర్వీసెలను ప్రజలకు అందించేందుకు గ్రామాలను వైద్యులు దత్తత తీసుకుని వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఆకాంక్షతో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని తీసుకువచ్చారని గుర్తుచేశారు. కానీ ప్రస్తుతం రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ అంతంత మాత్రంగానే అమలవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజయరావు, కోశాధికారి డాక్టర్ రాజేంద్రకుమార్ యాదవ్, మాజీ అధ్యక్షులు డాక్టర్ ప్రతాప్‌రెడ్డి, సంపత్‌రావు, ఉపాధ్యక్షులు గట్టు శ్రీనివాసరావు, రంగారెడ్డి, లింగమూర్తి, నరేందర్ రెడ్డి, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

రవి కుమార్‌కు రెండు పతకాలు

సాక్షి, హైదరాబాద్: ఆలిండియా మాస్టర్స్ గేమ్స్‌లో స్విమ్మింగ్ ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన ఎస్.రవి కుమార్ రెండు పతకాలు సాధించాడు. పురుషుల 30–34 వయో విభాగంలో బరిలోకి దిగిన రవి కుమార్ 100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో (1ని:32 సెకన్లు) స్వర్ణ పతకం సొంతం చేసుకోగా.. 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో (00.56 సెకన్లు) రజత పతకం దక్కించుకున్నాడు. గత డిసెంబర్‌లో జరిగిన తెలంగాణ మాస్టర్స్ స్విమ్మింగ్ టోర్నీలో రవి మూడు స్వర్ణ పతకాలు సాధించి ఆలిండియా మాస్టర్స్ గేమ్స్‌కు అర్హత సాధించాడు.



ఆర్థిక శక్తికి తోడు ఆరోగ్య శక్తి అవసరం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు



స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

శంషాబాద్ రూరల్: 'ఆరోగ్యవంతమైన దేశం వేగంగా ఆర్థికాభివృద్ధి సాధిస్తుంది..ప్రతి ఒక్కరికి ఆర్థిక శక్తితో పాటు ఆరోగ్యశక్తి కూడా అవసరం' అని భారత మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు అన్నారు. శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ శివారులో ఉన్న స్వర్ణ భారతి ట్రస్టు ఆవరణలో కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. మంచి ఆరోగ్యం కోసం మన జీవన శైలిలో మార్పులు, ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లు ఎంతో ముఖ్యమన్నారు. యోగా, నడక, వ్యాయామంతో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కాపాడుకోవచ్చన్నారు. రైతులు, యువత, మహిళల అభ్యున్నతికి సేవా దృక్పథంతో స్వర్ణ భారత్ ట్రస్టు చేపడుతున్న కార్యక్రమాలు అద్భుతమని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమానికి ముందు ఆవరణలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జయసుధకు జీవిత సాఫల్య పురస్కారం



జయసుధకు పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న సుబ్బరామిరెడ్డి తదితరులు

గన్‌ఫౌండ్రీ: సహజ నటిగా జయసుధ ప్రేక్షకుల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారని కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బిరామిరెడ్డి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో వంశీ ఇంటర్నేషనల్ సంస్థ ఆధ్వర్యంలో స్వర్గీయ ఎన్టీఆర్ శతజయంతిని పురస్కరిచుకుని సినీ నటి జయసుధకు ఎన్టీఆర్ జాతీయ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. అంతకుముందు ఆకునూరి శారద నిర్వహణలో సినీ సంగీత విభావరి ఆహూతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఏపీ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, సినీ దర్శకులు ఎ.కోదండరామిరెడ్డి, బి.గోపాల్, రేలంగి నర్సింహారావు, వైవీఎస్ చౌదరి, వంశీ సంస్థల వ్యవస్థాపకులు వంశీ రామరాజు తదితరులు పాల్గొన్నారు.

భక్తిరస భరితంగా త్యాగరాజ ఆరాధనోత్సవం

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని రవీంద్రభారతి మినీ హాల్‌లో వాగ్దేవి సంగీత విద్యాలయం ఆధ్వర్యంలో ప్రముఖ వాగ్గేయకారుడు త్యాగరాజస్వామి ఆరాధన సంగీతోత్సవం ఆదివారం భక్తిరసభరితంగా సాగింది. నగరంలోని ప్రముఖ సంగీత విద్యాంసులు, ఔత్సాహిక కళాకారులు, విద్యార్థులు హాజరై గాత్రం, మృదంగం, వేణువు, వీణ కచేరీలు నిర్వహించారు. త్యాగరాజ స్వామి వారి సంగీత వైభవాన్ని చాటుతూ..ఆయన రచించిన పంచరత్న కృతులను శ్రావ్యంగా ఆలపించారు. పిల్లలు చిన్నప్పటి నుంచే చదువుతోపాటు లలిత కళలు నేర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని వాగ్దేవి సంగీత విద్యాలయం ప్రిన్సిపాల్ తాడేపల్లి సుబ్బలక్ష్మి, డైరెక్టర్ తాడేపల్లి ఉమాశంకర్ అన్నారు.



'సహజ'ంగానే బాదేశారు!

- రూ.2 పెరిగిన సీఎన్జీ గ్యాస్
- నగరంలో రూ.97కు చేరిన కిలో ధర
- ఇతర మెట్రో నగరాలతో పోల్చితే అధికమే

సాక్షి, సిటీబ్యూరో: సహజ వాయువు ధరల పెరుగుదలతో సీఎన్జీ ధర ఎగబాకుతోంది. తాజాగా నగరంలో కిలోపై రూ. 2 పెరిగి రూ.97కు చేరింది. గత పది నెలల వ్యవధిలో ఆరు పర్యాయాలుగా పెరగడంతో కిలోపై రూ.28 భారం పడినట్లయింది. ఆయిల్ ఇండియా సరఫరా చేసే గ్యాస్ ధరను కేంద్రం గతేడాది ఏప్రిల్‌లో వంద శాతానికిపైగా పెంచింది. అప్పటి నుంచి ధరల పెంపు ప్రక్రియ కొనసాగుతోంది. సహజ వాయువును కంప్రెస్ చేసినప్పుడు అది వాహనాలను నడపడానికి ఉపయోగించే సీఎన్జీగా మారుతుంది. ఇది వంట గ్యాస్‌గానూ వినియోగిస్తారు. ధరలకు అనుగుణంగా సీఎన్జీ రేట్లను పెంచుతున్నట్లు ఆయిల్ కంపెనీలు పేర్కొంటున్నాయి. ధరల పెంపుతో సీఎన్‌జీ డీజిల్ ధర మధ్య కేవలం రూ. 2.84 పైసల వ్యత్యాసం ఉండటం గమనార్హం.

సీఎన్జీ వైపు మొగ్గు..

పెట్రో, డీజిల్ ధరల పెరుగుదలతో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్జీ)కి డిమాండ్ పెరిగింది. మైలేజీ కూడా అధికం కావడంతో కార్లు, ఆటో వాహనదారులు సీఎన్జీ మొగ్గు చూపుతున్నారు. నగరం మొత్తం మీద సుమారు 84 ప్రత్యేక సీఎన్జీ కేంద్రాలు ఉండగా, దాదాపు 42,705 సీఎన్జీ వాహనాలు ఉన్నట్లు అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా కొందరు అధికారికంగా అనుమతి తీసుకొని వాహనాల ట్యాంకులు గ్యాస్‌కు అనుగుణంగా మార్చుకుంటుండగా.. మరి కొందరు అనధికారికంగానే వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా గ్యాస్ స్టేషన్లకు ప్రతిరోజు 5వేల వరకు ఆటోలు, వెయ్యి వరకు కార్ల తాకిడి ఉంటుంది. ఆటోల సీఎన్జీ కిట్స్ సామర్థ్యం నాలుగున్నర కిలోలు, కాగా నాలుగు కిలలో వరకు, కార్ల సామర్థ్యం పది కిలోలకుగాను ఎనిమిది కిలోల వరకు గ్యాస్ నింపుతారు. ఒక్కో స్టేషన్‌కు ప్రతిరోజు 6 వేల కిలో వరకు గ్యాస్ డిమాండ్ ఉంటుందన్నది అంచనా.

హైదరాబాద్‌లో కిలో సీఎన్జీ ధరలు ఇలా

నెల	ధర	పెంపు
ఫిబ్రవరి	రూ.97	రూ.2
నవంబర్	రూ. 95	రూ.3
సెప్టెంబర్	రూ.92	రూ.2
ఆగస్టు	రూ.90	రూ.3
జూలై	రూ. 87	రూ.2
మే	రూ.85	రూ.16
మార్చి	రూ. 69	-

మెట్రో నగరాల్లో ఇలా..

మెట్రోనగరం	ధర
హైదరాబాద్	రూ.97.00
ముంబై	రూ.87.00
బెంగళూర్	రూ.87.50
ఢిల్లీ	రూ.79.56

స్పాల ముసుగులో వ్యభిచారం

నాలుగు సెంటర్ల సీజ్...నలుగురిపై కేసు

బంజారాహిల్స్: స్పా ముసుగులో క్రాస్ మసాజ్ చేస్తూ వ్యభిచార గృహాలుగా మార్చిన నాలుగు స్పాలపై బంజారాహిల్స్ పోలీసులు దాడులు చేసి నిర్వాహకులను అరెస్ట్ చేయడమే కాకుండా వ్యభిచారానికి పాల్పడుతున్న యువతులను పునరావాసకేంద్రాలకు తరలించారు. ఈ స్పాలన్నీ బంజారాహిల్స్ రోడ్ నెం.12 ప్రధాన రహదారిలో కొనసాగుతున్నాయి. వివరాల్లోకి వెళ్తే... బంజారాహిల్స్ రోడ్ నెం 12లోని కృష్ణ టవర్‌లో కొనసాగుతున్న ఔరం సెలూన్ అండ్ స్పా, రోడ్ నెం.12లోని హదర్వా హమామ్ స్పా, కిమ్షి స్వేర్‌లోని ఎఫ్2 లగ్జరీ థాయ్ స్పా, బంజారాగార్డెన్ బిల్డింగ్‌లోని హెవెన్ ఫ్యామిలీ స్పాలపై దాడులు చేశారు. మసాజ్ థెరపిస్ట్‌ల పేరుతో కొంత మంది యువతులను నియమించుకొని క్రాస్ మసాజ్‌కు పాల్పడుతూ వ్యభిచారం నిర్వహిస్తున్నట్లుగా పోలీసుల దాడుల్లో తేలింది. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఈ సెలూన్ అండ్ స్పాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. ఔరం సెలూన్ అండ్ స్పాలో థాయ్‌లాండ్ నుంచి ఐదుగురు యువతులను రప్పించి వీరికి మసాజ్ థెరపిస్ట్ అనే పేరు తగిలించి క్రాస్ మసాజ్‌కు పాల్పడుతున్నట్లుగా తనిఖీల్లో వెల్లడైంది. థాయ్‌లాండ్ యువతులను పునరావాస కేంద్రానికి తరలించి మేనేజర్ సమీర్‌పై కేసు నమోదు చేశారు. నిర్వాహకుడు జంగం సుధాకర్ పరారీలో ఉన్నారు. అలాగే హదర్వ హమామ్ స్పా మేనేజర్ యామిన్ జిలానీ, యజమాని భీమ్‌సింగ్‌లను కూడా అరెస్ట్ చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోకుండా కస్టమర్ ఎంట్రీ రిజిష్టర్ లేకుండా, జీహెచ్‌ఎంసీ ట్రేడ్ లైసెన్స్ లేకుండా వీటిని కొనసాగిస్తున్నట్లుగా బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠా అరెస్టు



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌తో పోలీసు అధికారులు

భాగ్యనగర్‌కాలనీ: సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో ముఠాగా ఏర్పడిన గ్యాంగ్ డ్రగ్స్ విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. బాలానగర్ డీసీపీ శ్రీనివాసరావు సమాచారం మేరకు... దాసరి హరికృష్ణ(21), నెమలికంటి పవన్‌కుమార్(24), గుంటూరు జిల్లాకు చెందిన జంగం కిరణ్ తేజ్(20), బెంగుళూరుకు చెందిన నాయిర్ సాయికుమార్(24), గుంటూరు జిల్లాకు చెందిన అమర రఘునందన సాంబమూర్తి(23)లు ఓ ముఠాగా ఏర్పడి సులువుగా డబ్బు సంపాదించాలనే ఆశతో డ్రగ్స్ కొనుగోలు చేసి నగరంలో విక్రయించేందుకు పథకం పన్నారు. ఈ క్రమంలోనే 4వ తేదీన ఐడీఎల్ చెరువు రోడ్డులో డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న మాదాపూర్ ఎస్‌ఓటీ, కూకట్‌పల్లి పోలీసులు దాడి చేయగా వారి వద్ద ఉన్న సుమారు రూ.లక్ష విలువ చేసే 18 గ్రాములు ఎండీఎంఏ డ్రగ్స్‌తో పాటు ఐదుగురు నిందితులను, నాలుగు సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. వారిని రిమాండ్‌కు తరలించారు. కాగా నైజీరియాకు చెందిన నదిలా అలీ పరారీలో ఉన్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

టాటా ఆధ్వర్యంలో 'కైసే కా కేన్సర్' ప్రచారం

సాక్షి,సిటీబ్యూరో: టాటా ట్రస్ట్స్ ఆధ్వర్యంలో కై సే కా కేన్సర్ పేరిట ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. అవేర్‌నెస్, యాక్సెసబులిటీ, క్వాలిటీ కేర్, అఫర్డబులిటీ...అనే 4 అంశాలపై ఈ ప్రచారం దృష్టి సారిస్తుందని, చిన్న పట్టణాలు, వైద్య వసతి లేని గ్రామీణులలో, కేన్సర్ బాధిత కుటుంబాలలో ఏర్పడే గందరగోళాన్ని నివారించడానికి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. దీని కోసం 3 ప్రచార చిత్రాలు రూపొందిస్తున్నామన్నారు.

'ఆయుధ్ హైదరాబాద్' ఆధ్వర్యంలో వర్క్‌షాప్



వర్క్ షాప్‌లో పాల్గొన్న యువత

సాక్షి, సిటీబ్యూరో: యువత వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు సామాజిక శ్రేయస్సు, సాధికారతకు ఎలా దోహదపడాలో ప్రజలకు అవగాహన కలిప్చంచడం చాలా ముఖ్యమైన అంశమని సీ–20 వర్కింగ్ గ్రూప్ చైర్‌పర్సన్, అమృత హాస్పిటల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ ప్రియా నాయర్ అన్నారు. మారేడ్‌పల్లి మహీంద్రా హిల్స్‌లో మాతా అమృతానందమయి మఠం వేదికగా 'ఆయుధ్ హైదరాబాద్' ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ అండ్ హోలిస్టిక్ హెల్త్‌పై సీ–20 వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రియా నాయర్ మాట్లాడుతూ., వర్క్‌షాప్‌లో భాగంగా యువతకు సామాజిక అంశాల్లో పాలుపంచుకోవడానికి, ఆరోగ్యం పరంగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై అవగాహన కల్పించామన్నారు. ఈ వర్క్‌షాప్ సీ–20 మిషన్‌కు యువత అంబాసిడర్‌లుగా మారడానికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ బి.వెంకటరామన్, ప్రాపీపిక్ ఫౌండర్ అశుతోష్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికీ నాణ్యమైన విద్య

వినూత్న ఆలోచనతో ఈశ్వ ఫౌండేషన్ ముందడుగు



మీట్‌లో పాల్గొన్న ఈశ్వ సభ్యులు

సాక్షి, సిటీబ్యూరో: వివిధ కారణాలతో మౌలిక వసతులు, నాణ్యమైన విద్యకు నోచుకోని విద్యార్థులకు అండగా ఉండటం సామాజిక బాధ్యతని ఈశ్వ ఫౌండేషన్ అధ్యక్షులు హైమంతి పాల్ సర్కర్ అన్నారు. నగరం వేదికగా పలు ప్రాంతాల బస్తీల్లోని విద్యార్థులకు తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యాబోధన చేస్తున్నట్లు పేర్కొన్నారు. నగరంలో సేవలను అందించడానికి 6 అభ్యాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈమేరకు ఈశ్వ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దుర్గం చెరువు (ది యాచ్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్) వేదికగా 'పవర్ యువర్ డ్రీమ్స్ టు రియాలిటీ' పేరిట ఈశ్వ మెంటర్స్ మీట్ – 2023 నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ., తమ ప్రతి అభ్యాస కేంద్రంలోని విద్యార్థుల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈశ్వ విద్యార్థులంతా ఫలితాల్లో 8 పైనే జీపీఏ సాధించారని అన్నారు. 76 శాతం 9జీపీఏ పైన, 52 శాతం విద్యార్థులు పదవ తరగతిలో 10/10 సాధించారని అన్నారు. ఈ సమావేశంలో వాలంటీర్లకు ఫౌండేషన్ ప్రాజెక్టులకు సంబంధించిన పలు అంశాలపైన అవగాహన కల్పించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■ HMDA అప్రూవ్డ్ విజయవాడ హైవే ఫేసింగ్ కొయ్యలగూడెం దగ్గర న్యూవెంచర్ లో ప్లాట్లు అమ్మబడును. ఫోన్ : 8309376230. [H-787494]

FLAT FOR SALE

■ Near ECIL Cross Road 2, 3BHK Flats for Resale: Gated Community Club House, Swimmingpool. No GST: Brand New Call: 9502277099. [H-793315]

LAND FOR SALE

■ 200చ॥ గజాల ఈస్ట్ ఫేసింగ్ ప్లాటు అమ్మబడును, మహేశ్వరం మండల హెడ్ క్వార్టర్ కు ఆనుకొని ఉన్నది. గజం : 7999/-. ఫోన్ : 9966521191. [H-792822]

PLOT FOR SALE

■ షాద్‌నగర్ మున్సిపాలిటీ RRR లోపల DTCP, RERA ప్లాట్లు, 9,999/- గజం 30 నెలల EMI కలదు స్పాట్ రిజిస్ట్రేషన్ పై డిస్కౌంట్ కలదు. ఫోన్ 7842408719 [HA-9947]

■ హైదరాబాద్ @ రామోజీఫిల్మ్‌సిటీ దగ్గర కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ & HMDA లాజిస్టిక్ హబ్ పక్కనే ఉన్న మాన్యూ HMDA వెంచర్‌లో ఇల్లు కట్టుకునే ప్లాట్లు కలవు. ఫోన్ :9666645756. [HA-5582]

■ విజయవాడ హైవే @ రామోజీఫిల్మ్‌సిటీ, వరంగల్ హైవే @ వంగపల్లి నందు HMDA & DTCP అప్రూవల్ కలిగి ఇళ్ళ నిర్మాణం జరుగుతున్న వెంచర్‌లో డైరెక్ట్ కంపెనీ ప్లాట్లు కలవు. 9515438614 [G-3064]

■ షాద్‌నగర్ @ రాజాపూర్ దగ్గర 0% ఇంట్రెస్ట్ తో 30 నెలల EMIతో అన్ని డెవలప్‌మెంట్స్‌తో 147 గజాల MUDA=(HMDA) లేఔట్లో ఓపెన్ PLOTS కలవు. ఫ్రీ సైట్ విజిట్‌కు సంప్ర.: 9949695027 [HA-950]

■ వేగంగా అభివృద్ధి చెందుతున్న మహానగరం షాద్‌నగర్ టౌన్, R.R.(D) 147గ. నుండి విల్లా ప్లాట్స్ గ॥ 7000/లు, DTCP, RERA అప్రూవ్డ్, లిమిటెడ్ ప్లాట్స్, విలేజ్ ప్రక్కన, 100% వాస్తు. 9494256069. [HA-10820]

■ VRK Green Vally Mega Launching offer Hmda LP Aprvd for sq.yd 18000/- Offer 15,999/- per Sq.yd SPOT REG 15grms gold Near Masenpally Subanpur Ph: 7780238388 [HA-28752]

Services

■ బాలాజీ గోల్డ్ : మీ బంగారం బ్యాంకులో గాని ఏ ఇతర సంస్థలో ఉన్నా మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును (స్పాట్ క్యాష్), తాకట్టు షిఫ్టింగ్ చేయబడును. 9032040019. [T-1746]

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-792810]

■ మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మరియు ఏ ఇతర ఫైనాన్స్ లో ఉన్నా మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ఫోన్ : 9494995999 [H-787432]

■ ఒక సరైయిన రోజువారి ఆదాయ అవకాశం. కేవలం అతి తక్కువ పెట్టుబడితో ఒక మంచి ప్రయత్నం ఇప్పుడే ప్రారంభించండి. Dont Miss. సంప్ర॥ 7793987988 [G-776082]

■ 5 సంవత్సరాల నుండి నడుస్తున్నటువంటి విజయవంతమైన ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ ద్వారా రోజువారి మంచి ఆదాయాన్ని సంపాదించే అవకాశం. No. MLM, No Joinings Ph: 8099111616. [WB-51696]

HOME NEEDS

PEST CONTROL

■ Reddortins Pest Control: ఫోన్ 9989956152, కాక్రోచ్‌జెల్, చెదలు, ఫర్నీచర్ పౌడర్ రాలుట, నల్లులు, బల్లులు, చీమలు, ఎలుకలు, తేనెటీగలు, దోమలు. Covid Sanitization Treatment [HA-69894]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Tatavarthy Kumara Swamy S/o: T C S Hariprasad Rao, R/o: 6-40/4, Venkat Sai Nagar, R P Nilayam, West Venkatapuram Last Bus Stop, Tirumalagiri, Hyderabad Telangana - 500015, I have changed the name of my minor Son Ganasaivenkatahari Vishnu Lalithkumar Talavarthy aged about 9 year and He shall hereafter be known as Joshnavsaai Talavarthy. [UA-28737]

■ I, Imran S/o: Beni Prasad, R/o 17-1-175/174. Ist Floor, Nehru Nagar, Charminar, Hyderabad, Telangana-500023, have changed my name and shall hereafter be Known as Shaik Imran. [UA-28738]

■ I, Ananth Kumar Thammineni S/o: Venkataiah Thammineni, R/o: Flat No-102 B Block Sri Sai Corona Apartment, Vennalagadda, Suchitra, Near Vasavi Square, Jeedimetla, k.v. Rangareddy, Telangana-500067, have changed my name and shall hereafter be Known as Prajeet Kumar Thammineni. [UA-28739]

■ I, Rajendar Narsingh Ailwar S/o: Kannuri Bondyalu, R/o: 1-64, dharyapur, MulharamManthani Mandal, Dharyapur, Karimnagar, Telangana-505153, have changed my name and shall hereafter be Known as Kannuri Rajendar. [UA-28740]

LOST

■ It is notified that my Original Passport No: L4823774 has been Lost. Shridhar Pisapati Add: H.No : 4-9-37/301,Raja Ratna Residency, H.M.T Nagar, Nacharam, Hyderabad 500076 # 9324001454. [DA-7364]

OLD AGE HOME

■ లేపాక్షి హెల్త్‌కేర్ 24/7 గం॥లు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు కేర్‌టేకర్స్/నర్సులను మీ ఇంటికీ పంపబడును. తెలంగాణ. Ph: 9640400073 [HA-940]

■ Dr.BR Home Care Services, 24/7, చిన్న పిల్లలను, వృద్ధులను, బెడ్‌పై వున్న పేషెంట్స్‌ను చూసుకొనుటకు మగ/ఆడ Exp. కేర్ టేకర్స్‌ను పంపబడును. 9704415166. [T-625]

Wanted

■ ఇంటి పని, బేబీకేర్, పేషెంట్ కేర్, వంటపని, ఆఫీస్ స్టాఫ్ కావలెను. 15k-18k, రూం+భోజనం ఫ్రీ, 8, 10, 24 Hrs. ఫోన్ : 9160002192, 9160002193. [H-776399]

■ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో పని చేయుటకు బ్రాహ్మణ వంట మనిషి ఆయాలు వార్డ్ బాయ్స్ కావలెను. మంచి జీతం, ఉచిత వసతి భోజన సౌకర్యం. ఫోన్ 9246241153 / 9246201153. [H-778964]

■ టిఫిన్ సెంటర్ లో పనిచేయుటకు స్టాల్ బాయ్స్, కూరగాయల కటింగ్ మాస్టర్, క్యాషియర్, టీ మాస్టర్ కావలెను. మంచి జీతం + భోజన వసతి కలదు. ఫోన్.9666934949, 7330608776 [H-793558]

■ ప్రముఖ R/E కంపెనీ (బంజారాహిల్స్)కి టెలీకాలర్స్, మార్కెటింగ్ సిబ్బంది & సోషల్ మీడియా ఎక్స్‌పర్ట్స్ కావలెను. చిరు నిరుద్యోగులు, రిటైర్డ్, ఫుల్/పార్ట్, సాలరీ/కమీషన్+Inc.ఫోన్: 9440190279, 8919735040. [HA-5987]

■ అమీర్‌పేట్, మైత్రివనం దగ్గర ప్రముఖ రియల్ ఎస్టేట్ కం॥లో పనిచే॥ (F) టెలికాలర్స్, (M/F) మార్కెటింగ్ ఎగ్జి॥ జీతం+ఇన్సెంటివ్ VRS, LIC, Chits, Rtd Emp. హౌస్‌వైఫ్స్ సంప్ర: 7842161232 [H-793310]

■ ప్రహస్య బేబీకేర్ పిల్లలను చూడటానికి, పెద్దలకు సేవ చేయటానికి మహిళలు కావలెను. 12 Hrs or 24 Hrs, హైదరాబాద్. ఫోన్ : 9533909627, 8125784389. [H-787377]

■ తెలంగాణ వార్తలు TV ఛానెల్ లో 1-2సం॥ల అనుభవం గల టెలికాలర్స్ (F) కావలెను, జీ: 15వేలు, Q: ఇంటర్, సన్ సిటీ Hyd ఫోన్: 9494980424, 9391431692 [H-793556]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రసులు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-779878]

■ అర్జెంటుగా (తెలుగు) మాట్లాడే టెలికాలర్స్, సె॥గార్డ్స్, డేటాఎంట్రీ Marketing (M/F) స్టాఫ్ కావలెను. Q:10th-PG (No-Target) Sal: 15k-20k స్పాట్ జాయినింగ్. 6309433980, 7396900132. [H-787492]

■ స్పాట్ జాయినింగ్ జీ: 30,000 (Fixed) HDFC, ICICI, SBI, Axis బ్యాంక్‌లకై M/F ఆఫీస్ స్టాఫ్ కావలెను. All Areas. Q: 10th - PG, Age: 18-30 ఫోన్ 7997067340 [HA-10074]

■ క్రాంతిరోడ్ ట్రాన్స్‌పోర్ట్ HYD ఆటోనగర్ ఆఫీస్ నందు గుమస్తాలుగా పనిచేయుటకు 10th ఆపై చదివినవారు 30 సం॥లోపు గల మేల్ అభ్యర్థులు ఈ క్రింది ఫోన్ నెం. నందు సంప్రదించగలరు. బ్యాచిలర్స్‌కు వసతి సౌకర్యం కలదు. ✆ 87901 91999 [B-3]

■ సేల్స్ చేయుటకు లేడీస్ & జెంట్స్ వెంటనే కావలెను. ఫుల్ టైమ్ & పార్ట్ టైమ్, శాలరీ నెలకు 30,000/- To 60,000/- వరకు సంప్ర॥ 7901373777, 9885690883 [H-792821]

■ SPOT JOBS (Q: 10th to PG) హెల్పర్స్, సూ॥వైజర్స్, క్యాషియర్స్ క్యాటరింగ్ బాయ్స్, సె॥గార్డ్స్, డెలివరి ఎగ్జిక్యూటివ్ మేనేజర్స్, అటెండర్స్ M/F (రూం+మీల్స్ జీతం+15-42K). Ph: 8466882075, 9703006077 [H-792969]

■ త్రివేణి హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొడానికి వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి+భోజనం. జీ: 18K. ఏజెంట్స్ కమీషన్. 3K Ph: 7569955551, 9848571888 [H-786830]

■ ప్రముఖ టాక్సీ కంపెనీలో వెంటనే చేరండి. హైదరాబాద్ అంతటా పని చేయుటకు కావలెను. ఆటోమేటిక్ కార్ ప్రాబ్లమ్ ఉండదు. జీతం: 17,600 - 20,000 P/M + కుటుంబానికి ప్రైవేట్ ఇన్సూరెన్స్ + పిల్లల చదువు కోసం చేయూత ఉటుంది. సంప్రదించండి: 040-49170007. [QA-1702]

■ Wanted Data Entry Operators to work at Balanagar, Contact:9848984834,7002013375 [HA-6843]

■ Sales Cum Marketing Person for Textile Dealer, Auto Drivers for City Sales& delivery for Whole sale Linning, Blouse, Crape,Raw Silk Free Delivery. 9391644112 [HA-10076]

■ Wanted Site Engineer (Gents), Architects (Gents or Ladies), Interior Designers (Ladies), Autocad Operator (Ladies) and Accountant with min 2 years Experience. Office at Himayat Nagar, Hyderabad Mail your resume to: akhilassociates@gmail.com [HA-10082]

■ Looking for M/F SAP Operator for Medical Billing & Data Entry (1-5yrs Exp.) @ Zydus Life Sciences, IDA Uppal. Ph: 7981715101, 9177158833. [HA-2546]

■ Wanted 1.Administration Principal. Salary Upto: 28000/- 2.Vice Principal Salary Upto 20,000/- 3.Marketing Incharges. Salary Upto : 25,000/-. 4.Telecallers Salary Upto:11000/- Age: Below 45Yrs. Qualification: Any Degree. Experienced Persons preferred Job Location: Dilsukhnagar. Hyd. Contact: 9248733362, 9100069079 [G-3937]

■ Wanted Accountant with Computer Knowledge, MS Office, Tally, Hindi / Eng. Near by mehdipalnam Areas Prefer. Ph: 9391144144. [HA-10088]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజిగిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహిదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్ : శాలివాహననగర్ 11కేవీ ఫీడర్ ఎల్లారెడ్డిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల సోమవారం ఉదయం 10 నుంచి ఒంటిగంట వరకు అంబేడ్కర్‌నగర్, సారథీస్టూడియో వెనుకవైపు, జేపీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు బంజారాహిల్స్ సీబీడీ ఏడీఈ ఏ.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాగార్జుననగర్ 11కెవి ఫీడర్ శ్రీనగర్ కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల నాగార్జుననగర్, ఎల్లారెడ్డిగూడ, ఇమేజ్ హాస్పిటల్ ఏరియా, అమీర్‌పేట మెయిన్‌రోడ్డు ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ ఉండదన్నారు. జె.పి.నగర్ 11కెవి ఫీడర్ ఎల్లారెడ్డిగూడ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మసీదు వెనుకవైపు ఏరియా, జేపీ నగర్ పార్కు, రాజా ఆసుపత్రి ఏరియాల్లో విద్యుత్ ఉండదన్నారు. అదేవిధంగా శ్రీనగర్‌కాలనీ 11కెవి ఫీడర్ శ్రీనగర్‌కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న మరమ్మతుల వల్ల శ్రీనగర్‌కాలనీ మెయిన్‌రోడ్డు ఏరియా, ఆంధ్రాబ్యాంకు వెనుకవైపు ఏరియా, కర్నాటక బ్యాంకు ఏరియా పరిధిల్లో సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

వాణీ జయరాం మృతి చిత్ర సీమకు తీరని లోటు

లిబర్టీ: ఎన్నో ఆణిముత్యాలు లాంటి పాటలతో సంగీత ప్రియులను అలరించిన అగ్ర గాయని వాణి జయరామని లోక్ దళ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పి.వి.రాజేశ్వరరావు అన్నారు. పాటలోని భావం ఏదైనా సరే ఆమె గొంతులో నుంచి జాలువారుతుందని పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 19 భాషల్లో 20 వేలకు పైగా పాటలు పాడి తెలుగు చిత్ర సీమలో తన పేరును సుసంపన్నం చేసుకున్నారని గుర్తు చేశారు. వాణిజయరాం పాడిన తొలి పాటకే ఐదు అవార్డులు రావడం గర్వకారణమన్నారు. వాణి జయరాం మృతికి తీవ్ర సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతిని వ్యక్తం చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఆమె పేరు మీద ప్రత్యేక అవార్డు ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం ఉత్తమ గాయనికి అందించాలని విన్నవించారు.

దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పాటుపడాలి

లిబర్టీ: దళితుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం దళిత బహుజన పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023–24 వార్షిక బడ్జెట్ సోమవారం ఆర్థిక మంత్రి ప్రవేశపెడుతున్న క్రమంలో దళితుల ఆర్థిక అభ్యున్నతి కోసం నిధులు కేటాయించి దళితులపై ఉన్న ప్రేమను నిరూపించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దళిత బంధు అమలు చేసేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ట



రహమత్‌నగర్ : బోరబండ వినాయకరావునగర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం వీరాంజనేయ స్వామి విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త లక్ష్మణ్ గౌడ్ ఆలయ కమిటీ సభ్యులతో పాటు స్వామి వారి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశ్వనాథ్ కుటుంబానికి చంద్రబాబు పరామర్శ



విశ్వనాథ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న చంద్రబాబు

బంజారాహిల్స్: ఇటీవల మృతి చెందిన కళాతపస్వి దిగ్గజ దర్శకుడు కె. విశ్వనాథ్ కుటుంబ సభ్యులను ఆదివారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫిలింనగర్‌లోని ఆయన నివాసానికి వెళ్ళి పరామర్శించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

పారా హుషార్

- పంజగుట్ట ఘటనతో అప్రమత్తమైన పోలీస్ యంత్రాంగం
- పెట్రోకార్లపై షాడో టీమ్ నిఘా
- జీపీఎస్ సిస్టమ్‌తో కదలికలపై ఆరా
- రాత్రివేళ పెట్రోకార్ సిబ్బందికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు
- రెండు రోజులుగా తనిఖీలు ముమ్మరం చేసిన ఇన్‌స్పెక్టర్లు



పెట్రోకార్..

బంజారాహిల్స్: విధుల్లో ఉండగానే రాత్రిపూట రోడ్డుపక్కన పెట్రోకార్‌ను ఆపుకొని ఖాకీ డ్రెస్‌లో మద్యం సేవిస్తూ పంజగుట్ట పోలీసులు పట్టుబడ్డ ఘటన పోలీస్ శాఖలో సంచలనం సృష్టించింది. ఈ ఘటనతో ఖంగుతున్న ఉన్నతాధికారులు ఆయా పోలీస్ స్టేషన్ల సిబ్బందికి గట్టి ఆదేశాలు జారీచేసి ప్రత్యేకంగా హోంగార్డులు, కానిస్టేబుళ్ళతో రోల్‌కాల్ నిర్వహిస్తూ అప్రమత్తం చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి.వీవీఐపీలు, ముఖ్యమంత్రి, గవర్నర్, మంత్రులు నివాసం ఉండే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్ఆర్‌నగర్, సైఫాబాద్, బేగంపేట, తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో పెట్రోకార్ల సిబ్బందిపై నిఘా మరింత పెంచింది. ముఖ్యంగా మోడల్ పోలీస్ స్టేషన్‌లో ప్రఖ్యాతి చెందిన పంజగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం అక్కడి పోలీసులతో పాటు పోలీసు ఉన్నతాధికారులను జీర్ణించుకోలేక చేస్తున్నది. దీంతో తప్పును సరిదిద్దుకునేందుకు పోలీసులు అప్రమత్తమయ్యారు. పెట్రోకార్లపై ప్రత్యేక నిఘా ఉంచారు. గత రెండు రోజుల నుంచి వెస్ట్‌జోన్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్లు అర్ధరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకు రోడ్లపైన తిరుగుతూ పెట్రోకార్ల కదలికలపై దృష్టి పెట్టారు. తనిఖీలు ముమ్మరం చేశారు. పంజగుట్ట ఘటన పునరావృతం కాకుండా దిద్దుబాటుచర్యలకు శ్రీకారం చుట్టారు.

కమిషనర్ కార్యాలయం నుంచి షాడో టీమ్‌లు..

ఇప్పటికే కమిషనర్ కార్యాలయం నుంచి షాడో టీమ్‌లు అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతిరోజూ రాత్రి 11 గంటలనుంచి తెల్లవారుజాము 5 గంటల వరకు పెట్రోకార్ల కదలికలపై నిఘా ఉంచాయి. పంజగుట్ట ఘటనలో షాడో టీమ్‌ల తనిఖీల్లోనే ఓ కానిస్టేబుల్, ఓ హోంగార్డు రోడ్డుపక్కనే ఫుట్‌పాత్‌పై కూర్చొని మద్యం సేవిస్తూ కెమెరాకు చిక్కారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు మరింత కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటుచేస్తున్నారు.

పెట్రోకార్ సిబ్బందికి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లు

వాస్తవానికి గత నెల రోజుల నుంచి కమిషనర్ కార్యాలయం నుంచి ఓ షాడో టీమ్ ఆకస్మిక తనిఖీలు చేస్తూ పెట్రోకార్ల డ్రైవర్లు, కానిస్టేబుళ్ళకు బ్రీత్ ఎనలైజర్ టెస్టులు చేస్తున్నారు. మద్యం సేవించినట్లు తేలితే అక్కడికక్కడే రిపోర్ట్ రాసి పోలీస్ కమిషనర్‌కు అందజేస్తున్నారు.ఈ మొత్తం వ్యవహారాన్ని వీడియో తీస్తున్నారు. ఇంత జరుగుతున్నా. నగర నడిబొడ్డున పోలీసులు దర్జాగా మద్యం సేవిస్తుండటం పట్ల ఉన్నతాధికారులు షాక్‌కు గురయ్యారు. ఒక్కో పోలీస్ స్టేషన్ పరిధిలో మూడు నుంచి నాలుగు పెట్రోకార్లు ఉన్నాయి.

అసలు పనులకంటే కొసరువైపే మొగ్గు

వీరు డయల్ 100 కేసులను అయిదు నుంచి పది నిమిషాల్లోపు అటెండ్ కావాలి. తమ పరిధిలో ఎక్కడైనా గొడవలు జరుగుతుంటే క్షణాల్లో అక్కడికి వెళ్ళడం, పరిస్థితిని అదుపులోకి తీసుకురావడం, విషయాన్ని నైట్ డ్యూటీ ఆఫీసర్‌కు తెలియజేయడం వీరి పని. అంతే కాకుండా రాత్రి పూట బస్తీలు, కాలనీల్లో అక్కడక్కడ పోలీస్ సైరన్లు వేయడంపట్ల అసాంఘిక శక్తులకు కొంత భయం ఉంటుందన్న ఉద్దేశంతో వీటికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందజేశారు మరోవైపు పెట్రోకార్లు ఎక్కడెక్కడ తిరుగుతున్నాయో ఆ వివరాలు తెలుసుకునేందుకు ప్రతి కారుకు జీపీఎస్ సిస్టమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఆకస్మిక తనిఖీలు జరుగుతున్నాయి. ఎక్కడా పావుగంటకంటే ఎక్కువ పెట్రోకార్లు నిలబడరాదు. అంతేకంటే ఎక్కువ సేపు నిలబెడితే ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్తుంది. ఇన్ని పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నా కొన్ని చోట్ల పోలీసులు కట్టుబాట్లు తప్పుతూ పోలీస్ శాఖకు కలంకం తెస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పంజగుట్ట ఘటనను ఏ ఒక్కరూ సమర్థించలేకపోతున్నారు. ఖాకీ డ్రెస్‌లో ఉండి మద్యం సేవించడం ఏంటని ప్రశ్నలు గుప్పిస్తున్నారు. వెస్ట్‌జోన్ పరిధిలో కొన్ని పోలీస్ స్టేషన్లలో పెట్రోకార్లు డబ్బుల వసూలుతో పాటు చిరు వ్యాపారులు, నిర్మాణ రంగ సంస్థల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లుగా గతంలోనే ఫిర్యాదులు అందాయి. తాజా నిర్ణయాలతో వీరిలో పరివర్తన వస్తుందేమో వేచి చూడాల్సి ఉంది.

ఉచిత న్యాయసేవలు అందించేందుకు ఫౌండేషన్ ఏర్పాటు



బస్తీవాసులతో మాట్లాడుతున్న ట్రస్టీ బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి

ఫిలింనగర్: బడుగు, బలహీన వర్గాలకు న్యాయం సలహాలు అందించేందుకు జస్టిస్ బి. సుభాషణ్ రెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు ఫౌండర్ ట్రస్టీ బొల్లంపల్లి ఇంద్రసేన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఫిలింనగర్‌లోని మహిళా భవనంలో బస్తీవాసులకు, స్థానికులకు ఉచిత న్యాయ సేవలు, సలహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంద్రసేన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో పేద వారు న్యాయపరమైన సమస్యల్లో చిక్కుకుంటే ఎక్కడికి వెళ్ళాలో, ఎలా వెళ్ళాలో తెలియని పరిస్థితి నెలకొందని అలాంటి వారి కోసం తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యాయసలహాలు, న్యాయసేవలు ఉచితంగా అందిస్తామని తెలిపారు. ప్రస్తుత తరుణంలో ఒక న్యాయవాదిని నియమించుకొని న్యాయం పొందడం అనేది బడుగులకు తలకుమించిన భారంగా మారుతున్నదని ఆయన అన్నారు. నగరంలోని అన్ని బస్తీల్లో ప్రతి వారం మూడు రోజులు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి సేవలు అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కరపత్రాన్ని, హెల్ప్‌లైన్ నెంబర్‌ను ఆయన బస్తీవాసులకు అందించారు. అనంతరం బస్తీవాసులు తమ న్యాయపరమైన సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కారాలను పొందారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, రాహుల్‌రెడ్డి, స్థానిక నేతలు పద్మ, కుమార్, మారెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిటీ డిజైనర్లు పాపులర్ అవుతున్నారు



కార్యక్రమంలో పాల్గొన్న సింగర్ శ్రీరామచంద్ర, డిజైనర్లు

బంజారాహిల్స్: గతంలో సినిమా రంగంలో ముంబై, చెన్నై, బెంగళూరుకు చెందిన డిజైనర్లు పాపులర్‌గా ఉండేవారని కానీ ఇప్పుడు సీన్ మారిందని నగరానికి చెందిన ఎందరో డిజైనర్లు దేశ వ్యాప్తంగా పాపులర్ అవుతున్నారని సింగర్ శ్రీరామచంద్ర అన్నారు. ప్రముఖ సెలబ్రిటీ డిజైనర్ జీషన్ ఆజం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో నూతనంగా ఏర్పాటు చేసిన టెర్జీ బై జీషన్ పేరుతో ఏర్పాటు చేసిన సెలబ్రిటీ బొటిక్‌ను ఆయన ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మాట్లాడుతూ రోజురోజుకు ఫ్యాషన్ రంగంలో వినూత్న మార్పులు వస్తున్నాయని వాటన్నింటిని అందిపుచ్చుకుంటూ నగర డిజైనర్లు ముందు వరుసలో ఉంటున్నారని ఇది సంతోషించదగ్గ విషయం అన్నారు. కార్యక్రమంలో నటి చాందిని భగ్వనాని, ఎంటీవీ స్ప్లిట్స్‌విల్లా విన్నర్ బసీర్‌అలీ, నికితా భమిడిపాటితో పాటు పలువురు ప్రముఖ డిజైనర్లు, నటులు పాల్గొన్నారు.

పార్టీ కార్యక్రమాల్లో బూత్ కమిటీ పాత్ర కీలకం



బూత్ కమిటీ కన్వీనర్లను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్ : పార్టీని ముందుకు నడపించడంలో బూత్ కమిటీల పాత్ర కీలకమని జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరోసారి గుర్తు చేశారు. తెలంగాణ ప్రభుత్వ పథకాలను క్షేత్ర స్థాయిలో ప్రచారం చేయాల్సిన బాధ్యత బూత్ కన్వీనర్లదేనని స్పష్టం చేశారు. బోరబండ డివిజన్ బూత్ కమిటీల సమావేశం ఆదివారం ఆచార్య జయశంకర్ సార్ కమ్యూనిటీ హాలులో జరిగింది.ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గోపీనాథ్ మాట్లాడుతూ బూత్ కన్వీనర్లు తమకు కేటాయించిన పరిధిలోని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించాలని సూచించారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి

లిబర్టీ: రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పట్ల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తోందని దళిత సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ రాజువస్తాద్ ఆరోపించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని వివిధ రూపాల్లో పోరాటాలు సాగిస్తున్నప్పటికి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందని ప్రశ్నించారు. ఆదివారం జేఏసీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంజాగుట్టలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే జీహెచ్‌ఎంసీ యంత్రాంగం విగ్రహాన్ని కూలిస్తే ఇతర ప్రాంతానికి తరలించిందని అన్నారు. విగ్రహం కూల్చివేసిన స్థలంలోనే తిరిగి అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు.

బీసీ జనగణన చేస్తామన్న పార్టీకే మద్దతు



జోడో బిసి, జాగో బిసి, జీతో బిసి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: బీసీల జనగణతో పాటు కుల గణన చేయాలని, చట్టసభల్లో బిసిలకు రిజర్వేషన్లు కల్పించాలని బిసి పొలిటికల్ ఫ్రంట్ డిమాండ్ చేసింది. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ పొలిటికల్ ఫ్రంట్ ఆధ్వర్యంలో బీసీల జనాభా, బీసీసబ్ ప్లాన్ పేరుతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఫ్రంట్ అధ్యక్షులు ప్రొఫెసర్ మురళీ మనోహర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, బీసీ నాయకురాలు ఇందిరా శోభన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫ్రంట్ ఆధ్వర్యంలో రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌ను పరిశీలించిన ట్రాఫిక్ డీసీపీ

బంజారాహిల్స్: బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ ట్రాఫిక్‌పోలీస్ స్టేషన్ల పరిధిలో శనివారం రాత్రి వేర్వేరు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వెస్ట్, నార్త్ జోన్ ట్రాఫిక్ డీసీపీ డీకే. రాహుల్ హెగ్డే పరిశీలించారు. జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు పరిధిలో ఈ సందర్భంగా మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ తొమ్మిది మంది పట్టుబడ్డారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో శ్వాస పరీక్షలు నిర్వహించే విధానం, తదుపరి కేసుల నమోదు, తదితర వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం



సయ్యద్ చాంద్‌పాషా

బంజారాహిల్స్: వేర్వేరు ఘటనల్లో అనుమానాస్పద స్థితిలో ఇద్దరు వ్యక్తులు అదృశ్యమైన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగరాజు తెలిపిన మేరకు.. యూసుఫ్‌గూడ సమీపంలోని కార్మికనగర్‌లో నివసించే చలపతి ఆదినారాయణగౌడ్(55) కార్పెంటర్‌గా పని చేస్తుంటాడు. ఇటీవల విజయవాడకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బయటికి వెళ్లిపోయాడు. అయితే రెండు, మూడురోజులైనా తిరిగిరాకపోవడంతో భార్య సీతారత్నం అన్ని ప్రాంతాల్లో గాలించింది. తన భర్త కనిపించడం లేదంటూ ఫిర్యాదు చేయగా పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో...

బోరబండ సమీపంలోని హబీబ్‌ఫాతిమా నగర్‌లో నివసించే సయ్యద్ చాంద్‌పాషా(42) పూల వ్యాపారం చేస్తుంటాడు. మోతీనగర్ వెళుతున్నానని ఇంట్లో చెప్పి రెండు రోజులు గడిచినా తిరిగి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు సయ్యద్ హిదాయత్ అలీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. జూబ్లీహిల్స్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడోత్సవాల్లో భాగస్వాములవ్వాలి

సనత్‌నగర్: ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా 'ఖేలో తెలంగాణ-జీతో తెలంగాణ' క్రీడోత్సవాల్లో భాగస్వాములవ్వాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. సనత్‌నగర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్, జిల్లా స్పోర్ట్స్ సెల్ కన్వీనర్ దయానంద్ ఆధ్వర్యంలో క్రీడా మైదానాలను సందర్శించి అక్కడి క్రీడా కారులందరికీ రిజిస్ట్రేషన్ పత్రాలను అందించారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా నియోజకవర్గాల వారీగా పోటీలు జరుగుతాయన్నారు. క్రికెట్, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ (రన్నింగ్) 100మీ, 200మీ విభాగాల్లో పోటీలు జరుగుతాయని వివరించారు. 10వ తేదీ వరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతుందని, 21, 22, 23 తేదీల్లో పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆకూరి శ్రీనివాసరావు, కన్నూరి చంద్రకుమార్, సిర్మనీ నరేష్, సరితాగౌడ్, మాధవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బాబాకు సపోట రసంతో అభిషేకం



మాఘ మాసోత్సవాల్లో సాయిబాబా దివ్య దర్శనం

ఫిలింనగర్: బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని శ్రీ విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన సాయిబాబా మాఘ మాస మహోత్సవాల్లో భాగంగా ఆదివారం బాబాకు సపోట రసంతో అభిషేకం నిర్వహించారు. ఉదయం ఏకవారాభిషేకం, నక్షత్రహారతి, ధుని పూజ వైభవంగా జరిగాయి, మధ్యాహ్న హారతి, సంధ్యాహారతి, సేజ్ హారతి తదితర వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి రూ.1.62 లక్షలు సీజ్

బంజారాహిల్స్: ఓ అపార్ట్‌మెంట్‌లో కొనసాగుతున్న పేకాట శిబిరంపై బంజారాహిల్స్ పోలీసులు దాడులు చేసి 12 మంది పేకాట రాయుళ్ళను అరెస్ట్ చేయడమే కాకుండా వీరి నుంచి రూ.1.62 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు ఎస్ఐ ఎస్. కరుణాకర్‌రెడ్డి తెలిపిన మేరకు...శ్రీనగర్‌కాలనీలోని గుల్మార్గ్ అపార్ట్‌మెంట్స్‌లోని ఓ ఫ్లాట్‌లో పేకాడుతున్నట్లుగా పోలీసులకు సమాచారం అందగా పోలీసులు దాడులు చేసి కె. శ్రీనివాసరావు, జి. వెంకటేష్, విహెచ్. సురేష్, ఆర్. శివప్రసాద్‌రెడ్డి, వి. రాంలాల్, శాకార్కర్, టి. అప్పారావు, జి. సురేష్‌చారి, ఎం. బాబు, వి. వెంకటేష్, ఎం. రామకృష్ణలను అరెస్ట్ చేశారు. నిర్వాహకులు వై. మల్లారెడ్డి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఇందులో జూనియర్ ఆర్టిస్టులు పెయింటర్లు, నిర్మాణరంగ సంస్థ యజమానులు, చెఫ్‌లు, డ్రైవర్లు ఉన్నట్లుగా పోలీసులు తెలిపారు.

బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ మైనారిటీ సెల్ అధ్యక్షునిగా సర్దార్



సర్దార్

రహమత్‌నగర్ : ఎస్ఆర్‌టీ నగర్‌కు చెందిన సీనియర్ నాయకుడు యండి సర్దార్ బోరబండ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షునిగా నియామకమైయ్యారు. ఈ మేరకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చేతుల మీదుగా ఆదివారం నియామక పత్రాన్ని తీసుకున్నారు.

ఓయూలో విద్యార్థి నేతల అరెస్ట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో బీబీసీ డాక్యుమెంటరీ పై చర్చను పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, బీఆర్ఎస్వీ, గిరిజన శక్తి ఆధ్వర్యంలో గుజరాత్ అల్లర్లపై బీబీసీ రూపొందించిన డాక్యుమెంటరీ పై చర్చ జరుపుతుండగా పోలీసులు అడ్డుకొని విద్యార్థి నేతలను అరెస్ట్ చేశారు. వర్సిటీల్లో బీబీసీ డాక్యుమెంటరీ ప్రదర్శనలపై యూజీసీ నిషేధం విధించడం సిగ్గుచేటని, వెంటనే ఎత్తివేయాలని విద్యార్థి నేతలు ధ్వజమెత్తారు. ఓయూలో ప్రదర్శనకు అనుమతి కోరగా అధికారులు యూజీసీ నిర్ణయం మేరకు అనుమతి నిరాకరించిందని పేర్కొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలంటూ అవగాహన



అవగాహన కల్పిస్తున్న మదర్ థెరిసా యూత్ అసోసియేషన్ సభ్యులు

బంజారాహిల్స్: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మదర్ థెరిసా యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్టాప్‌లైన్ వద్ద వాహనాలు ఆపడంతో పాటు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించాలని, సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. అదే విధంగా డ్రగ్స్ తీసుకోవడం వల్ల ఏర్పడే అనర్థాలను వాహనదారులకు వివరించారు. కార్యక్రమంలో సుందర్‌రాజ్, జైశీల్, నవీన్, షారోన్, జార్జ్, ఇమ్మానుయేలు, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

జెమ్‌స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్ ప్రారంభం



జెమ్‌స్టోన్ జ్యువలరీ ప్రారంభిస్తున్ననిర్వాహకులు

పంజగుట్ట: సోమాజిగూడలోని మలబార్ గోల్డ్, డైమండ్ షోరూంలో జెమ్‌స్టోన్ జ్యువెలరీ ఫెస్టివల్‌ను ఆదివారం ప్రారంభించారు. ఫెస్టివల్ కోసం ప్రత్యేకంగా రత్నాలతో కూడిన వినూత్న డిజైన్లను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాల్లోని అన్ని షోరూంలలో ఈ నెల 20వ తేదీ వరకు జెమ్‌స్టోన్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు సంస్థ చైర్మన్ ఎం.పి.అహమ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా కస్టమర్ల చేతులమీదుగా నూతన ఆభరణాలు ప్రదర్శించారు.



తెలుగు టెలివిజన్ రచయితల సంఘం అడ్‌హాక్ కమిటీ

అడ్‌హాక్ కమిటీ ఎన్నిక

శ్రీనగర్‌కాలనీ: సంక్షేమమే లక్ష్యంగా సంఘటితమై చిరకాల స్వప్నమైన టీవీనగర్‌ను సాధించుకుందామని తెలుగు టెలివిజన్ రచయితల సంఘం ఫౌండర్ ప్రెసిడెంట్, అడ్‌హాక్ కమిటీ చైర్మన్ నాగబాల సురేష్‌కుమార్ అన్నారు. సంఘం నూతన ఎన్నికలు జరపడానికి తెలుగు టెలివిజన్ టెక్నీషియన్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఫెడరేషన్ అధ్యక్షులు నాని అధ్యక్షతన అడ్‌హాక్ కమిటీని ఆదివారం ఎర్రగడ్డలో ఎన్నుకొని పలు భవిష్యత్ కార్యచరణ నిర్ణయాలను తీసుకున్నారు.ఐక్యతతో టీవీ కళాకారుల అభ్యున్నతికి పాటుపడదామని ఫెడరేషన్ అధ్యక్షులు నాని పేర్కొన్నారు. అడ్‌హాక్ కమిటీ కన్వీనర్లుగా శ్రీశైలమూర్తి, సత్యంయాబి తదితరులు పాల్గొన్నారు.

ఐటీ అధికారులమంటూ రూ.30లక్షలకు టోకరా

పంజగుట్ట: ఐటీ అధికారులమని చెప్పి ఒక వ్యక్తిని కిడ్నాప్ చేసి రూ.30 లక్షలు వసూలు చేసిన ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. యూసూఫ్‌గూడ, నవోదయా కాలనీకి చెందిన కన్స్ట్రక్షన్స్ నిర్వాహకుడు బి.వి.మురళీకృష్ణ గత నెల 27వ తేదీన తన ఇద్దరు పిల్లల్ని అమీర్‌పేటలోని నీరజ్ పబ్లిక్‌స్కూల్‌లో డ్రాప్ చేసేందుకు వచ్చాడు. స్కూల్‌లో డ్రాప్ చేసి వెళ్లే క్రమంలో ఇద్దరు వ్యక్తులు అడ్డుకుని తాము ఐటీ అధికారులమని చెప్పి నీవు 60 లక్షలు ఐటీ కట్టాలంటూ బెదిరించి కారులో ఎక్కి బాటసింగారం వైపు తీసుకువెళ్లారు. మీ భార్యకు ఫోన్ చేసి డబ్బులు ఇవ్వాలని అడుగు అని బెదిరించగా మురళీకృష్ణ అతని భార్య లావణ్యకు ఫోన్ చేసి డబ్బులు అడిగాడు. ఆమె ఇంట్లో ఉన్న 30 లక్షలు ఆమె సోదరుడు రాజేష్‌కు ఇచ్చి పంపాడు. నిందితులు నాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద రాజేష్‌ను కలుసుకుని రూ.30 లక్షలు తీసుకుని మురళీకృష్ణను వదిలేశారు. వారు నిజమైన ఐటీ అధికారులని భావించిన బాధితుడు ఇన్నిరోజులు పోలీసులకు ఫిర్యాదు చేయకుండా శనివారం రాత్రి పంజగుట్ట పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు.

మున్నూరు కాపు మహిళలు ఆర్థికంగా ఎదగాలి

పంజగుట్ట: మున్నూరు కాపు మహిళలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలని ప్రొగ్రెస్సీవ్ తెలంగాణ ఫౌండేషన్ అధ్యక్షులు రౌత్ కనకయ్య అన్నారు. ఆదివారం ఎర్రమంజిల్ లోని మున్నూరు కాపు కార్యాలయంలో మున్నూరు కాపు మహిళా పరస్పర సహకార పొదుపు, పరపతి సంఘం ప్రథమ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కనకయ్య మాట్లాడుతూ .. మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే ఇల్లు బాగుపడుతుందన్నారు. న్యాయవాది వేల్పుల శ్రీనివాస్, సర్దార్ పుటం పురుషోత్తమ రావు పాల్గొన్నారు.

పేదల సమస్యలు తీర్చడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

పంజగుట్ట: తెలంగాణలో అనేక సమస్యలు ఉన్నాయని కాని అధికార పార్టీ మాత్రం ఓట్లు సంపాదించుకునే మార్గంలో మాత్రమే నిమజ్ఞమయ్యిందని మాజీ ఐఏఎస్ అధికారి, సోషల్ డెమోక్రటిక్ ఫోరం కన్వీనర్ ఆకునూరి మురళి అన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోషల్ డెమోక్రటిక్ ఫోరం జనరల్ బాడీ సమావేశం, ఫోరంలో కొత్తగా చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా ఆకునూరి మురళి మాట్లాడుతూ .. తెలంగాణ విద్య, వైద్యం, అవినీతి, సామాజిక సమస్యలు ఉన్నాయని వీటిపై ప్రభుత్వం స్పందించడంలేదని ఆగ్రహంవ్యక్తం చేశారు. కో కన్వీనర్లు డాక్టర్ గోపీనాథ్, ఆంజనేయులు, శంకర్, ప్రొఫెసర్ రమ పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220379
9640081203

బడ్జెట్ రూ.2.9 లక్షల కోట్లు.!

- 2023–24 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ కసరత్తు పూర్తి
- నేటి ఉదయం 10:30 గంటలకు శాసనసభ ముందుకు..



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2023–24) గాను రూ.2.9 లక్షల కోట్ల వరకు అంచనాలతో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టే అవకాశాలున్నాయని తెలుస్తోంది. 2022–23కు రూ.2.56 లక్షల కోట్ల అంచనాలతో బడ్జెట్ ప్రవేశ పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం.. ఈసారి ఆ మొత్తానికి 10 శాతం కంటే కొంచెం ఎక్కువగా రూ. 2.9 లక్షల కోట్ల వరకు బడ్జెట్ అంచనాలను ప్రతిపాదించనుందని సమాచారం. ఎన్నికల ఏడాది కావడంతో సంక్షేమం, అభివృద్ధిని యథాతథంగా కొనసాగిస్తూ కొన్ని కొత్త పథకాలను జోడిస్తూ ప్రజారంజక బడ్జెట్ పెట్టే కసరత్తు పూర్తయిందని, సంక్షేమమే ప్రధాన ఎజెండాగా ఈసారి బడ్జెట్ పెట్టే అవకాశాలున్నాయని ఆర్థికశాఖ వర్గాల ద్వారా తెలిసింది. సోమవారం ఉదయం 10:30 గంటలకు రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు శాసనసభలో 2023–24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఆ తర్వాత శాసన మండలిలో రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రవేశపెడతారు.

సాగునీటికి, సంక్షేమానికి భారీగానే..

గత కొన్నేళ్లుగా బీఆర్‌ఎస్ మార్కుతో అమలవుతోన్న సంక్షేమ పథకాలన్నీ ఎన్నికల ఏడాదిలో యథాతథంగా కొనసాగేలా బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధమైనట్టు సమాచారం. ఈ పథకాలకు తోడు విద్య, వైద్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పన, మన ఊరు–మన బడి లాంటి పథకాలకు ప్రత్యేక కేటాయింపులు ఈ బడ్జెట్‌లో ఉండనున్నాయని ఆర్థికశాఖ వర్గాలంటున్నాయి. వీటితో పాటు సాగునీటి రంగానికి కూడా ఈసారి భారీ బడ్జెట్ పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం తెచ్చిన అప్పులు ఈ ఏడాది నుంచే తిరిగి చెల్లించాల్సి ఉండడంతో దాని కోసం, పాలమూరు–రంగారెడ్డి లాంటి ప్రాజెక్టులు వేగవంతం చేసేందుకు, ఆగిపోయిన పలు ప్రాజెక్టులను పూర్తి చేసి ఎన్నికల నాటికి ప్రజలకు అందించేలా.. రూ.35 వేల కోట్లకు పైగా సాగునీటి రంగానికి ప్రతిపాదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. రైతుబంధు లాంటి ప్రతిష్టాత్మక పథకం కొనసాగింపుతో పాటు కొత్తగా పంటల బీమా పథకం అమలు చేసేందుకు గాను ఈసారి వ్యవసాయానికి రూ.25 వేల కోట్ల వరకు కేటాయింపులుంటాయని తెలుస్తోంది. పంటల బీమా పథకం కోసం రూ.1,200 కోట్లు, రైతు బంధు పథకం కింద రూ. 8 వేల కోట్ల వరకు ప్రతిపాదించనున్నట్టు సమాచారం. ఇక దళిత బంధుకు గత ఏడాది పెట్టిన బడ్జెట్‌లో ఖర్చు కాకుండా మిగిలిన మొత్తాన్ని ఈ ఏడాదికి బదలాయిస్తూ రూ.20 వేల కోట్ల వరకు కేటాయింపుల్ని ఈ పథకానికి చూపెట్టనున్నట్టు తెలుస్తోంది. దళిత బంధు తరహాలోనే గిరిజన బంధును రూ. 5 వేల కోట్లు (అంచనా) కూడా ప్రకటించే అవకాశముందని, అయితే గిరిజన బంధుకు మార్గదర్శకాలు కూడా సిద్ధం కాని నేపథ్యంలో ఎన్నికల నాటికి బడ్జెట్‌ను ఖర్చు పెట్టగలిగేందుకు ఉన్న అవకాశాలను బట్టి ఈ పథకాన్ని బడ్జెట్‌లో పొందుపరిచే అవకాశాలున్నాయని గిరిజన సంక్షేమ శాఖ వర్గాలు చెబుతున్నాయి.

సొంత రాబడులపైనే ఆశలు..

రాష్ట్ర ప్రభుత్వం సొంత ఆదాయంపైనే ఆధారపడి బడ్జెట్ కేటాయింపులు ప్రతిపాదించనున్నట్టు ఆర్థికశాఖ వర్గాలు చెబుతున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.1.08 లక్షల కోట్ల వరకు పన్ను రాబడులు అంచనా వేయగా, అంచనాలకు తగ్గట్టునే ఈ ఏడాది పన్ను ఆదాయం రూ.లక్ష కోట్లు దాటనుంది. ఈ నేపథ్యంలో సొంత పన్నులు.. ముఖ్యంగా ఎక్సైజ్, రిజిస్ట్రేషన్ శాఖల ఆదాయాలను పరిగణనలోకి తీసుకుని గత బడ్జెట్ కంటే 10%నికి పైగా ఎక్కువ అంచనాలను రూపొందించినట్టు సమాచారం. అప్పుల విషయానికొస్తే ఎఫ్‌ఆర్‌బీఎం చట్ట నిబంధనల మేరకు జీఎస్‌డీపీలో 3.5% వరకు ప్రతిపాదించనున్నారు.

ఉద్యోగులకు కొత్త ఆరోగ్య పథకం

ఉద్యోగులకు నగదు రహిత ఆరోగ్య పథకం అమలు కోసం ఉద్యోగుల భాగస్వామ్యంతో కొత్త పథకాన్ని అమలు చేసే యోచనలో భాగంగా రూ.750 కోట్ల కార్పస్ ఫండ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. ఇందులో తన వాటాగా రూ.350 కోట్లు ప్రతిపాదించనున్నట్లు సమాచారం. గత బడ్జెట్ తరహాలోనే సొంత జాగా ఉంటే ఇల్లు కట్టుకునేందుకు రూ.3 లక్షల పథకం కింద రూ.12 వేల కోట్లు, ప్రతి గ్రామపంచాయతీకి రూ.10 లక్షల అభివృద్ధి నిధుల కోసం రాష్ట్రంలోని 12 వేల గ్రామ పంచాయతీలకు రూ.1200 కోట్లు కేటాయించనున్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటి పథకాలను కొనసాగించనున్నారు. ఆసరా పింఛన్లకు రూ.15 వేల కోట్ల వరకు ప్రతిపాదించనున్నారు. ఇక ఎన్నికల హామీలో నెరవేర్చడంలో భాగంగా రూ.లక్ష లోపు రైతు రుణమాఫీకి ఈసారి నిధులు కేటాయిస్తారని, ఈ పద్దు కింద రూ.20 వేల కోట్లు అవసరమవుతాయనే చర్చ జరుగుతోంది. విద్యుత్ సబ్సిడీలు, ఆర్టీసీకి ఆసరా కోసం కూడా ప్రత్యేక కేటాయింపులు చూపెట్టనున్నారు. ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్ల పద్దుకు రూ.30 వేల కోట్లు, అప్పులు, వడ్డీల చెల్లింపునకు రూ.25 వేల కోట్ల వరకు కేటాయించనున్నట్టు సమాచారం.

కేంద్రం ఇచ్చే గ్రాంట్ ఇన్ ఎయిడ్ అంచనాలపై ఆసక్తి

కేంద్రం ఇచ్చే గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దు కింద భారీగా అంచనాలు ప్రతిపాదించడం, కేంద్రం నుంచి ఆశించిన మేర నిధులు రాక డీలా పడిపోవడం ఆనవాయితీగా మారిపోయింది. గత ఏడాది రూ.38 వేల కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద వస్తాయని ఆశించినా రూ.10 వేల కోట్లు కూడా రాలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ ఈ అంచనాలు రూ.40 వేల కోట్లు దాటినా, ఈసారి కూడా గత ఏడాదిలాగానే మంజూరయ్యాయి. దీంతో ఈసారి గ్రాంట్ ఇన్ ఎయిడ్, కేంద్ర పన్నుల్లో వాటా పద్దుల కింద రాష్ట్ర ప్రభుత్వం ఎంత అంచనా వేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈసారి కేసీఆర్ మార్కు బడ్జెట్ అంకెలు ఉంటాయని, రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.3 లక్షలు దాటిన నేపథ్యంలో బడ్జెట్ అంచనాలు కూడా రూ.3 లక్షల కోట్లు ఉంటాయనే ప్రచారం జరిగినా, వాస్తవికతకు అనుగుణంగానే ప్రభుత్వం ముందుకెళ్లనుందని సమాచారం. ఇక 2022–23 ఆర్థిక సంవత్సరంలో రూ.2.56 లక్షల కోట్ల బడ్జెట్ అంచనా వేసినా.. అప్పులు, గ్రాంట్ ఇన్ ఎయిడ్ పథకాల్లో కేంద్రం నిధుల కోత పెట్టిన కారణంగా సవరించిన అంచనాలు రూ.2.25 లక్షల కోట్లకు పరిమితమయ్యే అవకాశాలున్నాయని చెబుతున్నారు.

కుట్రపూరిత కథనాలే

- ఓఎస్డీతో కలసి నేను విజయవాడ వెళ్లినట్లు అభూత కల్పనలు: సీఎస్ జవహర్‌రెడ్డి
- పొరపాటును అంగీకరిస్తూ బేషరతుగా క్షమాపణలు కోరాల్సిందే
- లేదంటే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవు



సాక్షి, అమరావతి: 'సీఎస్‌తో కలసి వెళ్లిన ఓఎస్డీ' శీర్షికన ఎల్లో మీడియా ప్రచురించిన కథనాలను ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కె.ఎస్.జవహర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. దారుణమైన అబద్ధాలను ఆలంబనగా చేసుకుని ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలు, ఆంధ్రజ్యోతి వెబ్‌సైట్, ఏబీఎన్ చానల్ రాష్ట్రంలో ఉద్యోగులందరికీ అధినేత అయిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని చులకన చేస్తూ, కుట్రపూరితంగా కట్టుకథలు అల్లాయని స్పష్టం చేశారు. ఓ అత్యున్నత స్థాయి అధికారిని, వ్యవస్థను కించపరుస్తూ తప్పుడు కథనాలు ప్రచురించడం ఏమాత్రం సమంజసం కాదన్నారు. ఉద్యోగులందరిలో అత్యున్నస్థాయి అధికారిని టార్గెట్ చేస్తూ అవాస్తవాలను ప్రచురించడం, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతిష్టకు భంగం కలిగించడం ద్వారా ఏ జర్నలిజం విలువల ఆధారంగా పని చేస్తున్నారని సూటిగా ప్రశ్నించారు. తాను ఖండనలో పొందుపరిచిన అన్ని విషయాలను అంతే ప్రాధాన్యతతో, బేషరతుగా క్షమాపణలు కోరుతూ ప్రచురించాలన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన సత్యదూరమైన న్యూస్ ఐటమ్‌ను ఆయా పత్రికల్లో ఏ పేజీల్లో ఎంత ప్రాముఖ్యతతో ప్రచురించారో, ఏ సమయంలో ఎంత ప్రాధాన్యతతో చానల్‌లో కథనాలను ప్రసారం చేశారో అంతే ప్రాముఖ్యత, ప్రాధాన్యతతో ఖండనను ప్రసారం చేస్తూ జరిగిన పొరపాటుకు క్షమాపణలు కూడా కోరాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో ఆ న్యూస్ ఐటమ్‌కు బాధ్యులపై న్యాయ నిపుణుల సలహా, ప్రభుత్వ నిబంధనలకు లోబడి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీట్ నంబర్ 1 డి... వెళ్లింది హైదరాబాద్

వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురం మండలం అహోబిలపురం సమీపంలో రూ.5 కోట్లతో పునర్నిర్మించిన శ్రీ భానుకోట సోమేశ్వరాలయం మహా కుంభాభిషేకాన్ని ఫిబ్రవరి 4వతేదీ ఉదయం 9.58 గంటలకు నిర్వహించాలని ముహూర్తాన్ని నాలుగు నెలల క్రితమే 2022 అక్టోబర్ 14 నిర్ణయించారని సీఎస్ తెలిపారు. ఈ పవిత్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాలో తాను ఫిబ్రవరి 2వతేదీ రాత్రి 11 గంటలకు రేణిగుంట ద్వారా కడప చేరుకున్నట్లు వివరించారు. 3వ తేదీ ఉదయం 9.50 గంటలకు కడప కలెక్టర్, ఇతర జిల్లా ఉన్నతాధికారులు ఆలయ కార్యక్రమాల్లో పాల్గొన్నారని వివరించారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు తాను చదువుకున్న జిల్లా పరిషత్ హైస్కూల్ ముద్దనూరులో విద్యార్థులతో సమావేశం ముగియగానే 4.40కి బయలుదేరానని, సుమారు 8.15 గంటలకు రేణిగుంట విమానాశ్రయంలో కలెక్టర్, ఇతర అధికారులు తనకు మర్యాదపూర్వకంగా వీడ్కోలు పలికారని తెలిపారు. రాత్రి 9 గంటలకు స్పైస్‌జెట్ ఎస్‌జీ 3003 సిరీస్ ద్వారా 1 డి సీట్‌లో ప్రయాణించి హైదరాబాద్ చేరుకున్నట్లు జవహర్‌రెడ్డి వివరించారు. వాస్తవాలు ఇలా ఉంటే శుక్రవారం రోజు సీఎస్‌తో కలసి ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి విజయవాడ వెళ్లారని, ఒకే వాహనంలో ప్రయాణించారని ప్రచురించిన కథనాలు ఊహాజనితం, సత్యదూరమని చెప్పారు. దారుణమైన ఈ అబద్ధాలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

SECUNDERABAD CANTONMENT BOARD
Sardar Patel Road, Court Compound, Secunderabad-500 003

PUBLIC NOTICE

This is for the information of the general public that the following transferees have applied for transfer of property as mentioned against their names. Their requests have been processed and the names of the transferees are to be recorded in the tax register as maintained by this office, as per section 81 of the Cantonments Act.,2006.

Sl. No.	Name of the existing owner as per the tax records. Shri/Smt.	Name of the Transferee. Shri / Smt.	Locality	Sale Deed Doc.No. & Date
1	SRI S BALAIAH	SRI NILA VENKATESH	HNO 1-27-0117, BAPUJI NAGAR, BOWENPALLY	SALE DEED NO. 2024/2016, DT. 19/05/2016
	SRI NILA VENKATESH	MRS B PADMASHRI W/O K UDAY KUMAR		SALE DEED NO. 39/2019, DT. 09/01/2019
2	D NANDINI	MR MUNIPALLY MANIK PRABHU S/O MR MUNIPALLY RAMCHANDER	FNO 102/FF, VAISHNAVI ARCADE, PEDDA THOKATTA, BOWENPALLY	SALE DEED NO 771/2022, DT. 25/04/2022
3	SMT S MADHAVI	MRS TALARI PRAVEENA W/O T RAMACHANDRUDU	FNO 3/B-2 (3-6-145 TO 148), KRUPA APRT-B BLK, BOOSAREDDYGUDA	SALE DEED NO 2266/2021, DT. 06/12/2021
4	M SATHYANARAYANA REDDY AND OTHERS	SMT BOBBILI MOUNIKA REDDY W/O B LALITH SHESHANK REDDY D/O SRI M JAGAN MOHAN REDDY	PNO 6 TO 10/SY 247/248, CHINNA THOKATTA, BOWENPALLY	SETTLEMENT DEED NO 96/2016, DT. 30/01/2016
5	SRI YADA NARESH	1. SRI NETHI VENKATESH 2. SMT NETHI SRILAXMI	PNO 79/GF/FF/SF, BALAJI NAGAR, KAKAGUDA	SALE DEED NO 124/2022, DT. 27/01/2022
6	DR CH MADHAVI	V SAHITHI REDDY D/O DR CH MADHAVI	PNO 24/201/FF, CHANDRAGIRI CHS, TRIMULGHERY	SETTLEMENT DEED NO 717/2021, DT. 24/03/2021
7	SMT SUNITHA JAIN	SRI V NOGALIESHWAR REDDY-OCCUPANT S/O V RAM REDDY	HNO 178, PICKET	SALE DEED NO 2037/2022, DT. 11/11/2022
8	SHRI D NAGENDRANATH	SRI SONGA NAGARAJU S/O SONGA BASU	PNO 44 AND 45/GF, VANITHA CHS, DOVETON BAZAR	SALE DEED NO 86/2023, DT. 13/01/2023
9	T CHANDRAKALA	SRI K MOHAN KUMAR S/O K HEMA PRAKASA RAO	PNO 64/P/GF/FF, NEW VASAVI COLONY, KAKAGUDA	SALE DEED NO 1089/2005, DT. 02/07/2005
10	B NARAHARI	SRI BHARATH SINGH-OCCUPANT S/O SRI MOOL SINGH	HNO 1421/GF/FF, PIONEER BAZAR, BOLARUM	SALE DEED NO 1125/2018, DT. 30/05/2018
11	K VENKATESHWAR RAO	KANCHARLA RAGHAVA CHOUDARY S/O LATE KANCHARLA VENKATESWARA RAO	PNO 6/GF/FF/SF, VIKRAMPURI COLONY, KAKAGUDA	WILL DEED DT. 15/01/2021 DEATH CERTIFICATE OF LATE K VENKATESHWAR RAO LEGAL HEIR CERTIFICATE DATED:21/10/2021 NO OBJECTION CERTIFICATE FROM MOTHER AND HIS DAUGHTERS
12	SRI M J VASANTH KUMAR S/O SRI M V JESHWANTH RAO	SMT M MANGESHWARI W/O M J HEMANTH KUMAR	PNO 35/SF, SARVASUKHI COLONY, MARREDPALLY	SALE DEED NO 864/2021, DT. 15/04/2021
13	A MAIMUNA GIRACH ALIAS MAIMUNA A D/O LATE HAJI OSMAN ADAM SAIT REP BY GPA HOLDER MR IQBAL ADAM GIRACH	SRI GANESH MADUGULA S/O LATE MADUGULA LAXMAN	FNO F-201, CHATRAPATHI APARTMENTS, BOWENPALLY	SALE DEED NO 76/2023, DT. 12/01/2023
	D PADMAJA	SRI DHEERAJ JAIN RAMSANNA	PNO 12/102/FF, RAGHAVA CHS (VENT I), KARKHANA	SALE DEED NO 176/2015, DT. 14/02/2015
14	SRI DHEERAJ JAIN RAMSANNA	MRS ZAINAB W/O MOHAMMED WALIUDDIN		SALE DEED NO 1198/2019, DT. 18/06/2019
15	G PRAVEEN KUMAR S/O LATE G MOHAN RAO	SRI KADARI RAVINDER KUMAR S/O SRI KADARI RAJAIAH NARSIMHA	PNO 152/GF, TRIMURTHY WEAKER SECTION-I, MAHENDRA HILLS, EAST MARREDPALLY	SALE DEED NO 2317/2022, DT. 22/12/2022
16	DR A SANDHYA REDDY	SRI GUNDA VEERA VENKATA SURYA BHAGAWAN S/O SRI GUNDA SRI RAMA MURTHY	PNO 21P AND 22/203/FF, SHOBANA CHS, MARREDPALLY	SALE DEED NO 1093/2018, DT. 25/05/2018
17	KHAJA HAKEEMUDDIN & BROS (SAYEEDUNNISA BEGUM, ZULEKHA TAYYABA, ABDUL KHADEER, ZUBAIDA TAYYABA, KHAJA NAZEEMUDDIN QUADRI)	SMT REHANA BEGUM-OCCUPANT W/O YOUSUF AAB KHAN	HNO 56/A, BOWENPALLY	SALE DEED NO 1852/2018, DT. 07/09/2018 LEGAL HEIRS /FAMILY MEMBERS CUM AFFIDAVIT DT. 20/12/2019 DEATH CERTIFICATE OF LATE KHAJA NAZEEMUDDIN QUADRI
18	SMT ZAHIRA BEE THROUGH MR MIRAJ MOHD KHAN (SON IN LAW OF LATE ZAHIRA BEE)	MRS REHANA BEGUM-OCCUPANT D/O MR MIRAJ MOHD KHAN W/O MR YOUSUF AAB KHAN	HNO 56, BOWENAPALLY	SETTLEMENT DEED NO 1946/2019, DT. 14/10/2019
19	SRI LAXMA REDDY	JUSUIT PROVINCE SOCIETY, HYDERABAD	BNO 158, BEGUMPET BUNGALOWS, BOWENPALLY	SALE DEED NO 3308/1984, DT. 24/12/1984
20	LT COL B R CHETTY	SRI SUBRAMANIAN GANESH MURALI S/O LATE SRI K SUBRAMANIAN	FNO 5-B/FF TYP 4, A.W.H.O GOUTHAM NAGAR COLONY, SIKH ROAD	SALE DEED NO 1259/2022, DT. 11/07/2022
	SRI M OM PRAKASH	JAMAL BEE, FAZALULLAH SHARIEF AMANULLAH SHARIEF RHAMATULLAH SHARIEF INAYATULLAH SHARIEF ZEENATHUNNESSA BEGUM LURIMMOSSA BEGUM AHMEDULLA SHARIEF NAZEERUNNISSA BEGUM BADRUNNISSA BEGUM FAREEDUNNISSA BEGUM		SALE DEED NO 594, DT. 21/03/1978
21	JAMAL BEE FAZALULLAH SHARIEF AMANULLAH SHARIE FRHAMATULLAH SHARIEF INAYATULLAH SHARIEF ZEENATHUNNESSA BEGUM LURIMMOSSA BEGUM AHMEDULLA SHARIEF NAZEERUNNISSA BEGUM BADRUNNISSA BEGUM FAREEDUNNISSA BEGUM	1. MR MOHAMMED SHOUKA THULLAH SHARIF 2. MR MOHAMMED FEROZULLAH SHARIF-OCCUPANTS	HNO 1-2-3 (2-7-142), BEARERS LINES, MUDFORT	SALE DEED NO 1572/2018, DT. 28/07/2018
	1. MR MOHAMMED SHOUKATHULLAH SHARIF 2. MR MOHAMMED FEROZULLAH SHARIF-OCCUPANTS	MR ABDULLAH SHARIEF-OCCUPANT S/O INAYATHULLAH SHARIEF		SALE DEED NO 915/2022, DT. 18/05/2022
22	SMT PADMA	1. SMT R SHAILAJA 2. SMT UMA MAHESHWARI	PNO 16, PICKET CHS, PICKET	GIFT SETTLEMENT DEED NO 781/782/2009, DT. 26/06/2009 AND 1683/1684/2011 DT. 31/12/2011
	1. SMT R SHAILAJA 2. SMT UMA MAHESHWARI	SMT R SHAILAJA W/O SRI M SRINIVAS D/O SRI T K RAMASWAMY		GIFT SETTLEMENT DEED NO 73/2018 AND 74/2018, DT. 11/01/2018
23	K KAMALA DEVI	SMT R SAVITHRI	PNO 13/A, MARREDPALLY STABLES	SALE DEED NO 1806/2013, DT. 16/12/2013
	SMT R SAVITHRI	SRI JOSEPH FRANCIS S/O SRI FRANCIS JOSEPH		SALE DEED NO 1825/2016, DT. 15/06/2016
24	A NAGA PAVANI	MRS NANGUNOORI VANAJA W/O NANGUNOORI PRABHAKAR RAO	PNO 22/GF/FF, ANSH ARCADE, TRIMULGHERY	SALE DEED NO 1693/2021, DT. 04/09/2021

Any person having any objection to the above transfer/mutation in the name of the transferee in tax records of this office are required to inform this office in writing within (21 twenty one days) of publication of this notice. If no objection is received within this stipulated time, this office will take necessary decision to enter the name of transferee in the tax register of this office .

No. SCB/TB/217, Office of the Cantonment Board,
Court House Compound, S.P. Road,
Secunderabad - 500 003.
Date : 04-02-2023.

Sd/- Vijaykumar B Nair
Dy. Chief Executive Officer,
Secunderabad Cantonment Board

ముగిసిన వాణీ జయరామ్ అంత్యక్రియలు

- నివాళులర్పించిన సినీ, రాజకీయ ప్రముఖులు
- వాణీజయరామ్‌ది సహజ మరణమేనని పోలీసుల ధ్రువీకరణ

తమిళ సినిమా: ప్రముఖ గాయని వాణీజయరామ్ భౌతికాయానికి ఆదివారం మధ్యాహ్నం చెన్నైలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. అంతకు ముందు వాణీజయరామ్ పార్థివ దేహానికి తమిళనాడు సీఎం స్టాలిన్, పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు అంజలి ఘటించారు. ప్రఖ్యాత గాయని పి.సుశీల వాణీజయరామ్ మృతికి సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆమె ఆదివారం ఓ వీడియోను మీడియాకు విడుదల చేశారు. అందులో తనకు ఈ విషయం ఆలస్యంగా తెలిసిందని హైదరాబాద్‌లో ఉన్న తన మనవరాలు ఫోన్ చేసి వాణీజయరామ్ కన్నుమూసిన విషయం తెలుసా అని అడిగిందన్నారు. దాంతో తాను షాక్‌కు గురైనట్లు పేర్కొన్నారు. వాణీజయరామ్‌తో కలిసి తాను 100 పాటలు పాడినట్లు గుర్తు చేసుకున్నారు. ఆమె పెద్దగా నవ్వే వారు కాదని, తాను జానకి, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కలిసి ఉన్నప్పుడు మాత్రమే వాణీ జయరామ్ నవ్వేవారని చెప్పారు. ఏడు స్వరాల పాటను ఆమె మినహా ఎవరు పాడలేరని, వాణీజయరామ్‌ది ప్రత్యేక స్వరం అని పి.సుశీల కొనియాడారు. కాగా వాణీజయరామ్‌ది అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన విషయం తెలిసిందే. విచారణ అనంతరం ఆమెది సహజ మరణమేనని పోలీసులు ధ్రువీకరించారు. వాణీజయరామ్ తలకు బలమైన గాయం కావడం, ముఖం రక్తసిక్తమై ఉండటం, చేతి రేఖలు వంటి ఆధారాలను తుడిచి వేయడంతో మొదట అనుమానాస్పద మృతిగా భావించారు. వాణీజయరామ్ తన గదిలోని అద్దంతో కూడిన టీపాయ్‌పై పడటంతో తలకు బలమైన దెబ్బ తగలడం వల్ల మృతి చెందినట్లు విచారణలో నిర్ధారణ అయ్యిందన్నారు. పోలీసులు తుపాకులతో 30 రౌండ్లు గాలిలో ఫైర్ చేసిన అనంతరం వాణీజయరామ్ భౌతికకాయానికి చెన్నై బీసెంట్ నగర్‌లోని శ్మశానవాటిలో అంత్యక్రియలు నిర్వహించారు.



నివాళులర్పిస్తున్న తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్

నగర వార్తలు

ఘనంగా హజ్రత్ అలీ జయంతి ఉత్సవాలు

- ఈద్ ఏ విలాదతే హజ్రత్ అలీ పండగ
- విద్యుత్ దీపాల అలంకరణతో సర్వాంగ సుందరంగా ఇళ్లు, వీధులు
- పాతబస్తీ నుంచి మౌలాలీ వరకు భారీ ర్యాలీ



సాక్షి, సిటీబ్యూరో: హజ్రత్ అలీ జయంతిని ఆదివారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. సౌదీ అరేబియా మక్కా నగరంలోని కాబా గృహంలో జన్మించిన హజ్రత్ అలీ తనకు మహ్మద్ ప్రవక్త ఇచ్చిన ఎన్నో బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేసి... తన చివరి గడియ వరకు ధర్మ రక్షణకు జీవితం అంకితం చేశారని ప్రముఖ షియా మత గురువు అల్లమా ఏజాజ్ ఫరుఖీ తెలిపారు. ఆయన జయంతి సందర్భంగా నగరంలో వివిధ ఆషూర్‌ఖానాల నుంచి షియా ముస్లింలు మౌలాలీ వరకు భారీ ర్యాలీ నిర్వహించారన్నారు. ఈ ఏడాది నగరంలోని యాకుత్‌పూరా మౌలాకా చిల్లా, డబీర్‌పూరా బీబీకా అలావా, బర్గాయే హజ్రత్ అబ్బాస్, యూసుఫ్‌గూడ ఆషూర్‌ఖానా, హుస్సేనీఆలం ఆషర్‌ఖానా, ఎంఎం పహాడీ ఆషూర్‌ఖానా, రైన్‌బజార్ ఇమామ్‌బాడా నుంచి మౌలాలీ వరకు భారీ ర్యాలీలను నిర్వహించారన్నారు. ర్యాలీలతో పాటు షియా ముస్లింలు ఈ రోజు కొత్త దుస్తులు ధరిస్తారని, తమ ఇళ్లకు, వీధుల్లో రంగురంగుల విద్యుత్తు దీపాలు అలంకరించి సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఆషూర్‌ఖానాల్లో హజ్రత్ అలీ గొప్పతనాన్ని కొనియాడుతూ ఖసీదాలు, కవితలు చదివారు. జయంతిని పురస్కరించుకొని అన్ని షియా ధార్మిక సంస్థలు ఏర్పాట్లు చేశారు.

టీచర్ల బదిలీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



బీసీ ఉపాధ్యాయ సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు

పంజగుట్ట: ఉపాధ్యాయుల ప్రత్యేక బదిలీల కింద అగ్రకులాలకు చెందిన వారు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చెల్ జిల్లాల్లో నిండిపోయారని, బీసీ, ఎస్సీ, ఎస్టీలు మాత్రం బస్సు సౌకర్యం కూడా లేని ప్రాంతాలకు వెళ్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. ఇదంతా సీఎంఓ కార్యాలయంలో ఉన్న ఓ అగ్రకుల అధికారి చేస్తున్న నిర్వాకమని ఆరోపించారు. ఈ అన్యాయాన్ని అందరూ కలిసికట్టుగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ... భార్య ఒకచోట, భర్త మరొకచోట ఉద్యోగాలు చేయలేక తీవ్ర అవస్థలు పడుతున్నారని వెంటనే భార్యాభర్తలు ఒకేచోట ఉద్యోగం చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బదిలీల పేరుతో తీవ్ర అవినీతి జరుగుతోందని ఆరోపించారు. ఉపాధ్యాయులతో పెట్టుకున్న చంద్రబాబుకు పట్టినగతే కేసీఆర్‌కు కూడా పట్టడం ఖాయమని ఆయన హెచ్చరించారు. మన ఊరు మన బడి కార్యక్రమానికి రూ. 7256 కోట్లు కేటాయించారని కేవలం కేటీఆర్ నియోజకవర్గమైన సిరిసిల్లలో కేజీ టు పీజీ కట్టారని మిగిలిన చోట ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. ఉద్యోగుల వయస్సు పెంచడాన్ని కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఎంతో మంది చదువుకుని నిరుద్యోగులు రోడ్డున తిరుగుతుంటే ఉద్యోగులకు వయస్సు పెంచడం దారుణమన్నారు. కేటీఆర్ మాది కుటుంబపాలనే 4 కోట్లమంది మా కుటుంబమే అంటున్నాడు కానీ ఆయన ఇంట్లోనే 4 ఉద్యోగాలు ఇచ్చుకుని మిగిలిన వారికి ఎందుకు ఉద్యోగాలు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీసీ ఇంజినీర్స్ ఫోరం అధ్యక్షుడు సమ్మన్న, బీసీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుంకరి శ్రీనివాస రావు, ప్రధాన కార్యదర్శి నరేంద్ర స్వామి, వివిధ బీసీ సంఘాల నాయకులు కూకచర్ల శ్రీనివాస్, కనకాల శ్యామ్, నరేంద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రేమికుల కోసం 'వీర్తుస గ్రీన్ విండ్స్ ప్రాజెక్ట్'

సంస్థ సీఈఓ వెంకటేశ్వర్లు

సాక్షి, సిటీబ్యూరో: అద్భుతమైన ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదించేందుకు.. ప్రకృతి ప్రేమికుల డ్రీమ్ హోమ్ కోసమే 'వీర్తుస గ్రీన్ విండ్స్ ప్రాజెక్ట్'ను చేపట్టామని వీర్తుస లైఫ్ స్పేసెస్ సీఈఓ వైగండ్ల వెంకటేశ్వర్లు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లాలోని కడ్తాల్–తలకొండపల్లి రోడ్డులో వీర్తుస గ్రీన్ విండ్స్ వెంచర్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆదివారం వీర్తుస గ్రీన్ విండ్స్ వెంచర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సినీ నటీమణులు అనసూయ, ఈషా రెబ్బ, సినీ నటుడు, జబర్దస్త్ ఫేమ్ చమ్మక్ చంద్రలతో కలిసి ఆయన నూతన వెంచర్‌ను ప్రారంభించి, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... డీటీసీపీ ఆమోదించిన తమ నూతన వెంచర్ 26.16 ఎకరాల్లో వంద శాతం వాస్తుతో 150 నుంచి 600 గజాల ప్లాట్లు చేశామన్నారు. దీనితోపాటు అందమైన ఆర్చ్, ప్రాజెక్ట్ చుట్టూ ప్రహరీ, 24 గంటలు పనిచేసే సీసీ కెమెరాల వ్యవస్థ, 33–40 ఫీట్ల సీసీ రోడ్లు, భూగర్భ విద్యుత్ తదితర హైక్లాస్ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఈ ప్లాట్లను కొనుగోలు చేసే కస్టమర్లు వారికి ఇష్టమైన రీతిలో కలల గృహాలను, విల్లాలను నిర్మించుకోవచ్చన్నారు. అనసూయ మాట్లాడుతూ... హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వాటిలో ఒకటి శ్రీశైలం హైవే రహదారి అని అన్నారు. 'వీర్తుస గ్రీన్ విండ్స్' అద్భుతమైన స్థలం అని, ఇందులో ప్లాట్లు కొనుగోలు చేయవచ్చని అనసూయ పేర్కొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సినీనటి అనసూయ, సంస్థ సీఈఓ వెంకటేశ్వర్లు తదితరులు

కొలీజియం వ్యవస్థను రద్దు చేయాలి : ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్



లాలాపేట: రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమైన కొలీజియం వ్యవస్థను రద్దు చేసి దాని స్థానంలో జాతీయ న్యాయ కమిషన్‌ను పునరుద్ధరించాలని దక్షిణ భారత సమితి కన్వీనర్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 75 సంవత్సరాల స్వతంత్ర భారతంలో... 74 సంవత్సరాల రాజ్యాంగ అమలు చరిత్రలో నేటికీ 80 శాతం ఉన్నత వర్గాలే న్యాయస్థానాల్లో అధిపత్యం చలాయిస్తున్నారన్నారు. వారి జనాభా కేవలం 15 శాతమే అన్నారు. దేశంలో 85 శాతం ఉన్న బహుజనులకు కేవలం 20 శాతం అవకాశాలు సైతం దక్కడం లేదన్నారు. న్యాయ వ్యవస్థ స్వయం ప్రతిపత్తి పేరుతో పైరవీల ద్వారా కులం, కుటుంబం, ఆధిపత్యం, డబ్బు ప్రభావం వంటి న్యాయ వ్యతిరేక పద్ధతులతో ఉన్నత వర్గాలు తమకు అనుకూలంగా వాడుకుంటున్నారని వివరించారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని జాతీయ న్యాయ కమిషన్‌ను పునరుద్ధరించి దాని ద్వారా న్యాయస్థానాల్లో ఉత్తమ ప్రతిభ కలిగిన అన్ని వర్గాలకు అవకాశం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

విశ్వనాథ్, వాణీజయరాంలకు నివాళి

- వారి నిష్క్రమణలతో కుంగిన సంగీత శిఖరం!
- ఉప్పల శ్రీనివాస్ గుప్తా, జస్టిస్ చంద్రకుమార్



నివాళులర్పిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా తదితరులు

వనస్థలిపురం: సంప్రదాయ కళలైన సంగీతం, నృత్యాన్ని ఉన్నత శిఖరాలకు చేర్చిన మహానుభావులు దర్శకుడు కె.విశ్వనాథ్, గాయని వాణీజయరాం అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం వనస్థలిపురంలో ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ దర్శకుడు విశ్వనాథ్, గాయని వాణీజయరాం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా హాజరైన తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ తదితరులు మాట్లాడుతూ... విశ్వనాథ్, వాణీజయరాంలు తెలుగు సినిమాలకు గొప్ప గౌరవాన్ని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని అన్నారు. వారి నిష్క్రమణలతో సంగీత శిఖరం కుంగిపోయిందన్నారు. కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు సిరిపురం అప్పారావు మాట్లాడుతూ... శంకరాభరణం సినిమా తరువాత యువతలో సంగీతం, నృత్యం నేర్చుకోవాలనే అభిలాష పెరిగిందన్నారు. ఆకృతి సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శంకర్, శివ, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
సోమవారం ॥ 6-2-2023

సన్నిధి



మంచి మాట

నాణ్యతతో మాన్యత

నాణ్యత లేని మనిషి నాసిరకం మనిషి అవుతాడు. నాసిరకం మనిషి గడ్డిపోచ కన్నా హీనం అవుతాడు. నాసిరకం మనిషి విలువలేని మనిషి, అనవసరం అయిన మనిషి అయిపోతాడు ఆపై అనర్థదాయకమైన మనిషిగానూ అయిపోతాడు. విద్య , సమాజం, సాహిత్యం, సంగీతం, కళలు, వృత్తులు, విధి నిర్వహణ... ఇలా అన్నింటా నాసిరకం మనుషులు కాదు నాణ్యమైన వాళ్లే కావాలి. నాణ్యత ఎంత కరువు అయితే అంత కీడు జరుగుతుంది. నాణ్యత ఎంత ఉంటే అంత మంచి జరుగుతుంది. నాణ్యత అన్నది సంస్కారం; మనిషికి ఉండాల్సిన సంస్కారం. నాణ్యత లోపిస్తే మనిషికి సంస్కారం లోపించినట్లే. నాణ్యత గురించి మనిషికి ఆలోచన ఉండాలి. మనిషికి నాణ్యమైన ఆలోచనలు ఉండాలి.

నాసిరకం ఆహారం, నీరు తీసుకోవడంవల్ల మన ఆరోగ్యం చెడిపోతుంది అని మనకు తెలిసిందే. నాసిరకం ఆలోచనాసరళివల్ల మన జీవితం చెడిపోతుంది అని అవగతం చేసుకోవాలి. నాణ్యమైన అభిరుచి, ప్రవర్తన, పనితీరు సాటివాళ్లలో మనకు గొప్పస్థాయిని ఇస్తాయి. చదువు నాణ్యమైంది అయితే అది వర్తమానంలోనివారికి, భావితరాలవారికి ప్రయోజనాన్ని చేకూరుస్తుంది. చదవు నాసిరకంది అయితే పెనునష్టం జరుగుతుంది. గత ఆరు దశాబ్దులుగా నాసిరకం వ్యక్తులు ఎం.ఎ., ఎం.ఫిల్., పిహెచ్.డి. పట్టభద్రులు అవడంవల్ల, నాసిరకం వ్యక్తులు సాహితీ విమర్శకులు, కవులు, అధ్యాపకులు అవడంవల్ల, నాసిరకం రచనలకు పురస్కారాలు వస్తూ ఉండడంవల్ల తెలుగుసాహిత్యం, కవిత్వం పతనం అవుతూ నిరాదరణకూ, ప్రజల ఏవగింపుకు గురి అయిపోవడం క్షేత్రవాస్తవంగా తెలియ వస్తోంది; అంతేకాదు వీళ్లవల్ల తెలుగుభాష కూడా వికలం అయిపోతూ ఉంది. ఏది ప్రక్రియ అవుతుందో కూడా తెలియని నాసిరకం వ్యక్తులవల్ల మరేభాషలోనూ లేని ప్రక్రియల పైత్యం తెలుగుకవితలో ముదిరిపోయింది. నాసిరకం వ్యక్తుల వల్ల మత, కుల, ప్రాంతీయత, వాదాల ఉన్మాదం తెలుగుసాహిత్యాన్ని, కవిత్వాన్ని, భాషను ధ్వంసం చేస్తోంది.

> నాణ్యమైన వృత్తికారులవల్ల వృత్తి పరిఢవిల్లుతుంది. నాణ్యమైన కళాకారులవల్ల కళ పరిఢవిల్లుతుంది. నాణ్యమైన క్రీడాకారులవల్ల క్రీడ పరిఢవిల్లుతుంది. నాణ్యమైన మనుషులవల్ల సంఘం పరిఢవిల్లుతుంది. నాణ్యతవల్ల నాణ్యత నెలకొంటుంది; నాణ్యతవల్ల భవ్యత వ్యాపిస్తుంది. మనుషులమై పుట్టిన మనం మళ్లీ మనుషులమై పుడతామో లేదో? కనుక ఈ జన్మలో నాణ్యతనే కోరుకుందాం; నాణ్యతనే అందుకుందాం.

ఒక నాసిరకం వైద్యుడివల్ల రోగులకు సరైన వైద్యం జరగకుండా కీడు జరుగుతుంది. నాసిరకం కట్టడాలు కూలిపోతే ప్రజలకు జరిగే నష్టం భర్తీ చెయ్యలేనిది. నాసిరకం భావజాలాలవల్ల పలువురి బతుకులు బలి అవుతూ ఉండడమే కాదు పలువురు దుష్టులై సంఘానికి హానికరం అయ్యారు, అవుతున్నారు. నాసిరకం మనస్తత్వం వల్లే అసమానతలు, నేర ప్రవృత్తి వంటివి సమాజాన్ని నిత్యమూ బాధిస్తున్నాయి. నాసిరకం చదువుల వల్ల, పనితీరువల్ల, ఆలోచనలవల్ల, ప్రవర్తనలవల్ల, మనిషికీ, సమాజానికీ, ప్రపంచానికీ విపత్తులు కలుగుతూ ఉన్నాయి, ఉంటాయి.

కొందరి నాసిరకం చింతనవల్ల, దృక్పథంవల్ల, పోకడవల్ల మామూలు మనుషులుగా కూడా పనికిరానివాళ్లు, సంప్రదాయానికి చెందని వాళ్లు దైవాలుగా అయిపోయి అహేతుకంగా, అశాస్త్రీయంగా ఆలయాలు, అర్చనలు, హారతులతో పూజింపబడుతూ ఉన్న దుస్థితి మనలో తాండవిస్తోంది. ఈ పరిణామం నైతికత, సంస్కృతి, ధార్మికతలకు ముప్పు అవుతోంది. ఇలాంటివి కాలక్రమంలో ప్రజల్లో చిచ్చుపెడతాయి.

నాసి వాసికెక్కకూడదు; నాణ్యత మాన్యత చెరిగిపోదు. నాణ్యత ప్రతిమనిషికీ ఎంతో అవసరం. మనిషి నాణ్యతకు అలవాటుపడాలి. నాణ్యత తప్పకుండా కావాల్సింది, ప్రయోజనకరమైంది ఆపై ప్రగతికరమైంది. నాణ్యతను వద్దనుకోకూడదు, వదులుకోకూడదు. నాణ్యతను మనం అనుగమించాలి, అనుసంధానం చేసుకోవాలి. నాణ్యతతో మనం క్షేమంగానూ, శ్రేష్ఠంగానూ బతకాలి.

– రోచిష్మాన్

గురువాణి

వాగ్భూషణమ్ భూషణం



లోకంలో భగవంతుడిచ్చిన అందం ఒకటి ఉంటుంది. దానిని మరింత ఉద్దీపింపచేయడానికి భూషణాలు వాడతారు. భుజాలకు కేయూరాలు, మెడలో చంద్రహారాలు, సూర్యహారాలు వంటి ఆభరణాలతో అలంకరించుకుంటారు. శరీరానికి చందనం పులుముకుంటారు. మెడలో పుష్పహారాలు, సిగలో పూలు ధరిస్తారు. ఇవన్నీ కాలగతిలో క్షీణించిపోతాయి. కానీ చక్కటిమాట ఎవరు మాట్లాడతారో ఆ మాటలు ఎంతకాలం గడిచినా శాశ్వతత్వాన్ని తెచ్చిపెడతాయి తప్ప క్షీణించవు. భర్తృహరి అదే అంటాడు...''కేయురాణి న భూషయంతి పురుషం, హారాన చంద్రోజ్జ్వలా/న స్నానం, న విలేపనం, న కుసుమం, నాలంకృతా మూర్ధజా/ వాణ్యేకా సమలంకరోతి పురుషం, యా సంస్కృతాధార్యతే/ క్షీయంతే ఖిల భూషణాని సతతం, వాగ్భూషణం భూషణం.''

అందుకే వాగ్దేవీ కటాక్షం ఉండాలంటారు. మంచి మాటలు, సారవంతమయిన మాటలు మనుషుల జీవితాలనే మార్చేస్తాయి. అన్నం పెడితే మళ్ళీ ఆకలి వేస్తుంటుంది, నీళ్ళు ఎన్నిసార్లిచ్చినా దాహం వేస్తూనే ఉంటుంది. బట్టలయినా కొంతకాలానికి జీర్ణమయి పోతాయి, కొత్తవి అవసరమవుతుంటాయి. కానీ ఒక మంచిమాట జీవితాలను ప్రభావితం చేస్తుంటుంది. మాటలకు దేశకాలాలతో సంబంధం లేదు. వాక్కు సారవంతంగా... మధురాతిమధురంగా ఉండాలి. ప్రేమతో మాట్లాడిన మాట హృదయంలోకి చొచ్చుకుపోతుంది. వాక్కు సరస్వతీ దేవి అనుగ్రహం. మంచి మాటలు నోటివెంట రావాలంటే ఆమె అనుగ్రహం కోసం ప్రార్థిస్తాం...

కృష్ణ పరమాత్మ అర్జునుడికి ధైర్యం నూరిపోసే మిషమీద నాలుగు మాటలు చెప్పినట్లుగా కనిపించే భగవద్గీత ద్వాపరయుగం నాటిదైనా... దేశకాలాలతో సంబంధం లేకుండా ఇప్పటికీ మనిషిని ఉద్ధరించడానికి ఉపయోగపడుతూనే ఉన్నది కదా! శంకర భగవత్పాదులు 72 అవైదికమైన వాదనలను ఖండన చేసేటప్పుడు ఎక్కడా ఉద్రేకపడకుండా పరమ ప్రేమభావనలతో మాట్లాడుతూ ఎదుటివారు తమ లోపాన్ని తాము తెలుసుకునేట్లు చేసి ఉత్తమమైన, సంస్కారవంతమైన, శాస్త్రీయమైన మార్గాన్ని పట్టుకునేటట్లు చేయగలిగారు.. ఎలా... కేవలం వాదనాపటిమచేత...అంటే వాక్కుచేత.నిరాశా నిస్పృహలతో మరణించడానికి సిద్ధంగా ఉన్న సీతమ్మకు హనుమ కేవలం కొన్ని మాటలు కథగా చెప్పి ఆమెచేత ఆ ప్రయత్నం విరమింపచేశారు.

అదీ వాగ్భూషణమ్ భూషణం.. అంటే.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సువార్త

తగిన సమయంలో హెచ్చించు దేవుడు



దేవుడు తగిన సమయమందు మిమ్మును హెచ్చించునట్లు ఆయన బలిష్టమైన చేతి కింద దీనమనస్కులై యుండుడి (1 పేతురు 5:6). ప్రతిదానికి సమయం ఉంది అని పరిశుద్ధ గ్రంథం సెలవిస్తుంది. ప్రసంగి గ్రంథంలో జ్ఞానియైన సొలొమోను కూడా ఈ విషయాన్ని ప్రస్తావించాడు. సర్వశక్తుడైన దేవుడు ప్రతి విషయాన్ని తన సమయంలో చేస్తాడు. అది ఆయన నిత్య స్వభావం. సమయానికి ముందు కార్యాలు చేసి తన ప్రణాళికలను చులకన చెయ్యడు. సమయమంతా అయిపోయాక చేసి తన ప్రజలను నిరుత్సాహపరచడు. ప్రేమ గల దేవుడు ఏది చేసినా తన చిత్త ప్రకారం తన సమయంలో చేస్తాడు. అది అందరికి ప్రయోజనకరమైనది. తాను సృష్టిని శాసించువాడైనప్పటికి కాలం సంపూర్ణమైనప్పుడు ఈ లోకానికి మనుష్యునిగా దిగివచ్చాడు. దేవుడు ఎందుకు ముందే రాలేదు? అని కొందరు ప్రశ్నిస్తుంటారు. దానికి సమాధానం దేవుడు తన సమయంలో స్పందిస్తాడు. ఎప్పుడు చేస్తే బావుంటుందో దేవునికి బాగా తెలుసు. అయితే తాను చేయబోయే కార్యానికి ముందు దేవుడు ఒక అమోఘమైన వాగ్దానాన్ని ఇస్తాడు. వేచి చూచే సమయాన్ని నిర్ణయిస్తాడు. ఆ సమయంలో మనకు కొన్ని పాఠాలు నేర్పిస్తాడు. దేవుని పాఠశాలలో ఆత్మీయ పాఠాలు నేర్చుకున్నవాడు కచ్చితంగా ప్రపంచానికి ఆశీర్వాదకరంగా ఉంటాడు.

దేవుని నుండి హెచ్చింపును పొందాలంటే మనిషి చేయాల్సింది దీనమనస్సుతో వ్యవహరించుట. దేవుని కొరకు, ఆయన కార్యాల కొరకు కనిపెట్టుట అనేది క్రైస్తవ జీవితంలో ఒక అద్భుత అనుభవం. కనిపెట్టే సమయం వృథా చేస్తున్న సమయం కానేకాదు. దేవుని కొరకు ఎదురు చూచువారు నూతనబలాన్ని పొందుతారన్న లేఖన సత్యం ఇచ్చే ధైర్యం అంతా ఇంతా కాదు. కల్దీయ దేశాన్ని విడిచి కనాను దేశానికి వచ్చిన అబ్రాహాము తనకు ఇవ్వబడిన వాగ్దాన నెరవేర్పు చూడడానికి ఇరవై ఐదు సంవత్సరాలు పట్టింది. తనకు దేవుడు ఇచ్చిన కలలు నెరవేరడానికి భక్తుడైన యోసేపుకు పదమూడు సంవత్సరాలు పట్టింది. గొల్యాతును జయించిన తరువాత ఇశ్రాయేలు దేశానికి రాజుగా అలంకరింపబడడానికి దావీదుకు సమయం పట్టింది. ఆ సమయంలో వారెన్నో పాఠాలు నేర్చుకున్నారు. చెక్కుచెదరని విశ్వాసంలో అభివృద్ధి చెందారు. దేవుని గుణలక్షణాలను అర్థం చేసుకున్నారు. దేవుని ప్రణాళికలకు తమను తాము సంపూర్తిగా సమర్పించుకున్నారు.

ఆధ్యాత్మిక ప్రపంచంలో సహనం ఓర్పు చాలా కీలకమైనవి. గుడ్డును పొదగడం ద్వారా కోడిపిల్ల వస్తుంది గానీ దానిని అర్ధాంతరంగా పగులకొట్టడం ద్వారా కాదు.

తగిన సమయమందు స్పందించకుండా దేవుడు ఉండలేడు. ఊహించలేని మేళ్ళతో నిన్ను నింపి తన నామాన్ని మహిమపరచుకుంటాడు. ఆమేన్!!

–డా. జాన్ వెస్లీ, క్రైస్ట్ వర్షిప్ సెంటర్

ఇస్లాం వెలుగు

సాఫల్యానికి దారి



ఇరుగు పొరుగు, బంధువులు, బాటసారులు, పేదసాదలను ఆదుకోవడం, తల్లిదండ్రులను సేవించడం ఇహపర సాఫల్యానికి రాజమార్గం. పవిత్ర ఖురాన్‌లో ఇలా ఉంది. 'దైవాన్నే ఆరాధించండి. ఆయన దైవత్వంలో ఎవరికీ సాటి కల్పించకండి. తల్లిదండ్రుల పట్ల సత్ ప్రవర్తనతో మెలగండి. బంధువులు, అనాథలు, నిరుపేదలతో మంచిగా మసలుకోండి. బంధువులకు, పరిచయం లేని పొరుగువారికి, మీ దైనందిన కార్యకలాపాలలో మీకు తారసపడే మిత్రులకు, బాటసారులకు, మీ అధీనంలో ఉన్న సేవకులకు మేలు చేయండి. దేవుడు అహంకారులను, ప్రగల్భాలు పలికే వారిని ఎన్నటికీ ప్రేమించడు.'(4 – 36) అంతేకాదు, తాము పిసినారితనం వహించడమేగాక, ఇతరులక్కూడా పిసినారితనం నూరిపోసే వారిని సైతం దైవం ప్రేమించడు. కనుక అందరి హక్కులు నెరవేర్చడంతో పాటు, విశాల హృదయంతో సత్కార్యాల్లో పాలుపంచుకోవాలి. పవిత్ర ఖురాన్‌లో మరోచోట ఇలా ఉంది: 'దైవమార్గంలో తమ సంపదను ఖర్చు పెట్టేవారి పోలిక, ఒక విత్తనం నాటగా అది ఏడు వెన్నులు ఈని ప్రతి వెన్నులో వందేసి గింజలున్నట్లు ఉంటుంది. ఈ విధంగా దైవం తాను తలచిన వారి కర్మఫలాన్ని అనేక రెట్లు పెంచుతాడు. ఆయన అన్నీ తెలిసినవాడు, ఎంతో ఉదార స్వభావుడు.' దైవమార్గంలో ఖర్చు చెయ్యడంతో పాటు, చేసిన మేలు గుర్తు చేసి గ్రహీతల మనసు నొప్పించని వారి కోసం వారి ప్రతిఫలం దైవం దగ్గర సిద్ధంగా ఉంది. దైవం నిరపేక్షాపరుడు, విశాల హృదయం కలవాడు.' కనుక లోకుల మెప్పుకోసం ప్రదర్శనా బుద్ధితో దానధర్మాలు చేసి, ఎత్తిపొడుపు మాటల ద్వారా వారి మనసు నొప్పించి దానధర్మాలను వృథా చేసుకోకూడదు. అలాంటి వారు చేసే దానధర్మాల ఉపమానం ఎలా ఉందంటే, భారీ వర్షం కురవగానే పైనున్న పల్చని పొర కాస్తా తుడిచిపెట్టుకుపోయి నున్నగా మిగిలే రాయితో సమానం. సత్యాన్ని తిరస్కరించే వారికి దైవం సన్మార్గం చూపడు.

కేవలం దైవ ప్రసన్నత కోసం చిత్తశుద్ధితో తమ సంపద ఖర్చుపెట్టేవారు మెరక ప్రాంతంలో ఉండే తోట లాంటివారు. ఆ తోట వర్షాలు బాగా పడితే రెండింతలు ఫలసాయాన్నిస్తుంది. అంతగా వర్షాలు లేకపోయినా సన్నటి జల్లులు పడినా దానికి సరిపోతుంది. మీరు చేసే పనులన్నీ దైవం గమనిస్తున్నాడు. (సూరె బఖరా 261నుండి – 265 వరకు).

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

సినిమా



రామ్‌చరణ్

ఇట్స్ డ్యాన్సింగ్ టైమ్

హీరో రామ్‌చరణ్ డ్యాన్స్ మోడ్‌లోకి వెళ్లారు. శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా తర్వాతి షెడ్యూల్ నేటి నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానుందని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో ఓ సాంగ్‌ను చిత్రీకరించనున్నారు. సో.. రామ్‌చరణ్‌కు ఇది డ్యాన్సింగ్ టైమ్. డిఫరెంట్ లొకేషన్స్‌లో పాట చిత్రీకరణ జరగనుండటం విశేషం. తొలుత హైదరాబాద్‌లో చిత్రీకరణ జరిపి తర్వాత వైజాగ్, రాజమండ్రిలో షూటింగ్ జరిపేలా ప్లాన్ చేశారట చిత్రయూనిట్. అంజలి, శ్రీకాంత్, ఎస్‌జే సూర్య, సునీల్, నవీన్ చంద్ర ప్రధాన పాత్రలు చేస్తున్న ఈ సినిమాకు తమన్ సంగీతం అందిస్తున్నారు.

కాంబినేషన్ రిపీట్



విజయ్ దేవరకొండ

'గీతగోవిందం' (2018) వంటి సూపర్ హిట్ ఫిల్మ్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై 'దిల్' రాజు, శిరీష్ ఈ సినిమాను నిర్మించనున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడికానున్నాయి. మరోవైపు శివ నిర్వాణ దర్శకత్వంలో రూపొందుతున్న 'ఖుషి' చిత్రంలో విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో సమంత హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ కూడా మొదలైంది. అయితే సమంత అనారోగ్యం, కాల్షీట్స్ సర్దుబాటు కారణాల వల్ల ఈ చిత్రం షూటింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది. కాగా ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన మ్యూజిక్ సిట్టింగ్స్ శరవేగంగా జరుగుతున్నాయి. హేషామ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందిస్తున్నారు. అలాగే దర్శకుడు సుకుమార్‌తో విజయ్ దేవరకొండ ఓ సినిమాకి కమిట్ అయిన సంగతి తెలిసిందే.

నవ్వులే నవ్వులు



వెంకటేశ్, అశోక్ గల్లా

అశోక్ గల్లా కొత్త చిత్రం షురూ అయింది. డైరెక్టర్ ప్రశాంత్ వర్మ ఈ చిత్రానికి కథ అందించగా, అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్నారు. సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా ముహూర్తపు సన్నివేశానికి నమ్రత కెమెరా స్విచ్చాన్ చేయగా, వెంకటేష్ క్లాప్ కొట్టారు. బోయపాటి శ్రీను గౌరవ దర్శకత్వం వహించగా, మిర్యాల రవీందర్ రెడ్డి, సాహు గారపాటి, హరీష్ పెద్ది కలిసి స్క్రిప్టుని ప్రశాంత్ వర్మకు అందజేశారు. అశోక్ గల్లా మాట్లాడుతూ–''ఈ సినిమాలో నా పాత్ర రఫ్‌గా ఉంటుంది'' అన్నారు. ''ప్రశాంత్ వర్మగారు చాలా మంచి వినోదాత్మక కథ అందించారు'' అన్నారు అర్జున్ జంధ్యాల. ''నాలుగేళ్లుగా ఈ కథను రాసుకున్నాను'' అన్నారు ప్రశాంత్ వర్మ. ఈ చిత్రానికి సమర్పణ: నల్లపనేని యామిని, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: ప్రసాద్ మూరెళ్ల, సహ నిర్మాత: కె.సాగర్.

అమిగోస్‌తో హ్యాట్రిక్ సాధించాలి – ఎన్టీఆర్



రవిశంకర్, రాజేంద్ర రెడ్డి, ఆషిక, ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, నవీన్ యెర్నేని

''నవీన్, రవిశంకర్‌గార్లు నిర్మించిన రెండు చిత్రాలు(వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి) ఈ సంక్రాంతికి విడుదలై సూపర్‌హిట్స్ అయ్యాయి. అంత సుడి ఉన్న నిర్మాతలు తీసిన 'అమిగోస్' కూడా బ్లాక్ బస్టర్ అయి హ్యాట్రిక్ సాధించాలి'' అని హీరో ఎన్టీఆర్ అన్నారు. కల్యాణ్ రామ్, ఆషికా రంగనాథ్ జంటగా రాజేంద్ర రెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అమిగోస్'. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో ఎన్టీఆర్ మాట్లాడుతూ– ''ఇంజినీరింగ్ చదివిన రాజేంద్రగారు వారి తల్లితండ్రులు వద్దంటున్నా ఇండస్ట్రీకి వచ్చారు. 'అమిగోస్' మొదలయ్యేలోపు వారి అమ్మగారు కాలం చేస్తే, లాస్ట్ షెడ్యూల్ సమయంలో నాన్నగారు కూడా చనిపోయారు. రాజేంద్రగారి తల్లితండ్రులు భౌతికంగా ఇక్కడ లేకపోయినా ఆయన సాధించిన ఈ మొదటి మెట్టు విజయాన్ని వారు చూశారు. 'జై లవ కుశ'లో నేను మూడు పాత్రలు చేశా. మూడు విభిన్న పాత్రలు చేయడం ఎంత కష్టమో నాకు తెలుసు. 'అమిగోస్' లో కల్యాణ్ అన్న మూడు పాత్రల్లో ఎంతో అద్భుతంగా నటించారు'' అన్నారు.

> కొరటాల శివగారు, నా కాంబినేషన్‌లో సినిమా ఈ నెలలో ప్రారంభించి, మార్చిలో షూటింగ్ మొదలుపెడతాం. 2024 ఏప్రిల్ 5న ఆ సినిమాని విడుదల చేస్తాం.
> – ఎన్టీఆర్

కల్యాణ్ రామ్ మాట్లాడుతూ– ''బింబిసార' తర్వాత ఎలాంటి సినిమా చేయాలనే ఆలోచన ఉన్న నాకు 'అమిగోస్' పర్ఫెక్ట్ మూవీ. 18 ఏళ్ల పాటు నన్ను ఆదరిస్తూ, భరిస్తూ వచ్చిన మీకు (ప్రేక్షకులు, అభిమానులు) చాలా థ్యాంక్స్. ఈ సినిమా చూసి ఎట్టి పరిస్థితుల్లోనూ నిరుత్సాహపడరు'' అన్నారు. ''నన్ను, 'అమిగోస్' స్క్రిప్టును నమ్మి అవకాశం ఇచ్చిన కల్యాణ్ రామ్‌గారికి, నిర్మాతలు రవి, నవీన్‌గార్లకు రుణపడి ఉంటాను'' అన్నారు రాజేంద్ర రెడ్డి. ''అమిగోస్' ని హిట్ చేసి, మాకు హ్యాట్రిక్ ('వాల్తేరు వీరయ్య, వీరసింహారెడ్డి') విజయాలను అందించాలి'' అన్నారు నవీన్ యెర్నేని. ''బింబిసార' తర్వాత కల్యాణ్‌గారి నెక్ట్స్ లెవల్ పెర్ఫార్మెన్స్‌ను ఈ చిత్రంలో చూస్తారు'' అన్నారు వై.రవిశంకర్. ఈ వేడుకలో డైరెక్టర్ బుచ్చిబాబు, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఇండస్ట్రీ నుంచి చాలా నేర్చుకున్నా – ఉపేంద్ర

''**తె**లుగు సినిమా ఇండస్ట్రీని చూసి చాలా నేర్చుకుని, రాసుకుని సినిమాలు చేశాను. దర్శకుడు చంద్రు మూడేళ్లు కష్టపడి 'కబ్జ' చిత్రాన్ని ఇక్కడి వరకు తీసుకువచ్చారు''అని ఉపేంద్ర అన్నారు. ఆర్.చంద్రు దర్శక నిర్మాణంలో రూపొందిన చిత్రం 'కబ్జ'. ఉపేంద్ర, శ్రియ జంటగా సుదీప్ కీలక పాత్రలో నటించిన ఈ మూవీ మార్చి 17న విడుదలవుతోంది. ఈ చిత్రాన్ని నిర్మాత ఎస్.సుధాకర్ రెడ్డి సమర్పణలో హీరో నితిన్ రుచిరా ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎన్. సినిమాస్ పతాకాలపై తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సినిమా టైటిల్ సాంగ్‌ను విడుదల చేశారు చిత్రయూనిట్. ఆర్.చంద్రు మాట్లాడుతూ–''మార్చి 17న పునీత్ రాజ్‌కుమార్‌గారి జయంతి.. ఆ రోజు మా 'కబ్జ'ని రిలీజ్ చేస్తున్నాం'' అన్నారు. ''ఉపేంద్రగారితో వర్క్ చేయడాన్ని నా అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు శ్రియ. కాగా ఆస్కార్ ముంగిట నిలిచిన 'ఆర్ఆర్ఆర్' సినిమాను నిర్మించిన డీవీవీ దానయ్య, 'నాటు నాటు..' పాట రాసిన చంద్రబోస్‌ను ఉపేంద్ర అండ్ టీమ్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు సాయినాథ్, హనుమంత రెడ్డి, లగడపాటి శ్రీధర్, హీరో విశ్వక్‌సేన్ తదితరులు పాల్గొన్నారు.



ఉపేంద్ర, శ్రియ



జాకీష్రాఫ్

మూడు దశాబ్దాల తర్వాత...

హీరో రజనీకాంత్, బాలీవుడ్ నటుడు జాకీష్రాఫ్ మూడు దశాబ్దాల తర్వాత కలిసి నటిస్తున్నారు. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జైలర్'. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో జాకీష్రాఫ్ నటించనున్నారని, ఆయన షూటింగ్‌లో పాల్గొంటున్నారని యూనిట్ ప్రకటించింది. కాగా 1987లో వచ్చిన హిందీ చిత్రం 'ఉత్తర్ దక్షిణ్' తర్వాత రజనీకాంత్, జాకీష్రాఫ్ మళ్లీ కలిసి నటిస్తున్న సినిమా 'జైలర్' కావడం విశేషం. దాదాపు 36 ఏళ్ల తర్వాత రజనీ, జాకీష్రాఫ్ కలిసి నటిస్తున్నారన్నమాట.

శ్రీదేవి శోభన్‌బాబు



సంతోష్, గౌరి

సంతోష్ శోభన్, గౌరి జి.కిషన్ జంటగా ప్రశాంత్ కుమార్ దిమ్మల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శ్రీదేవి శోభన్‌బాబు'. సుస్మిత కొణిదెల, విష్ణు ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదలవుతోంది. సంతోష్ శోభన్ మాట్లాడుతూ–''1970 నేపథ్యంలో ఓ పల్లెటూరులో జరిగే అందమైన కథ ఇది'' అన్నారు. ''నా మనసుకు ఎంతో దగ్గరైన సినిమా ఇది'' అన్నారు నిర్మాత సుస్మిత. ''ఈ సినిమా చూసిన తర్వాత మన కుటుంబ సభ్యులందరూ కలుసుకుంటే బావుంటుందనే ఆలోచన వస్తుంది'' అన్నారు ప్రశాంత్. ఈ కార్యక్రమంలో నటి గౌరి జి.కిషన్, నిర్మాత విష్ణు ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శరణ్య పొట్ల పాల్గొన్నారు.

గిరిజన నేపథ్యంలో...



శ్రీకర్, శ్రావణి

శ్రీకర్ కృష్ణ, శ్రావణి నిక్కీ, అజయ్ ఘోష్, జయ నాయుడు, అమ్మ రమేష్, షఫీ క్వాద్రి ముఖ్య పాత్రల్లో గౌతమ్ మైలవరం దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'సిరిమల్లె పువ్వా'. షకీరా మూవీస్‌పై కౌసర్ జహాన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలకానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథులుగా హాజరైన డైరెక్టర్స్ చంద్రమహేష్, సముద్ర, నిర్మాత తుమ్మల ప్రసన్నకుమార్ ఈ చిత్రం టీజర్, పాటలు విడుదల చేశారు. కౌశర్ జహాన్ మాట్లాడుతూ– ''ఒక గిరిజన అమ్మాయి ప్రేమలో పడుతుంది.. ఆ తర్వాత ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంది? గిరిజన వర్గాలకు జరిగిన అన్యాయం ఏంటి? అనేది మా చిత్ర కథ'' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: సత్యానంద్ వి, సంగీతం: జీబు.

సూర్యాపేట్ జంక్షన్



ఈశ్వర్, నైనా

ఈశ్వర్, నైనాసర్వార్ జంటగా నటించిన చిత్రం 'సూర్యాపేట్ జంక్షన్'. నాదెండ్ల రాజేష్ దర్శకత్వంలో అనిల్ కుమార్ కాట్రగడ్డ, ఎన్ఎస్ రావు, విష్ణువర్ధన్ నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ని ఈశ్వర్ విడుదల చేసి, మాట్లాడుతూ–''వాస్తవ కథని సినిమాటిక్‌గా మలుచుకుని తీశాం'' అన్నారు. ''మాస్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది'' అన్నారు రాజేష్. ''ఈ చిత్రం మంచి సక్సెస్ అవుతుందని నమ్ముతున్నాం'' అన్నారు నిర్మాతలు.

హారర్ కామెడీ



అనన్య

యశ్వంత్, రాకింగ్ రాకేష్, అనన్య, హిందోలా చక్రవర్తి, పూజ, సిమ్రాన్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'ఊ అంటావా మావా ఊఊ అంటావా మావ'. రేలంగి నరసింహారావు దర్శకత్వంలో తుమ్మల ప్రసన్న కుమార్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న రిలీజ్ కానుంది. ''కామెడీ అండ్ హారర్ చిత్రమిది. కశ్మీర్, హైదరాబాద్‌లలో చిత్రీకరించాం'' అన్నారు ప్రసన్న కుమార్.



తేజ్‌నారాయణ్, బ్రాత్‌వైట్ అజేయ సెంచరీలు

వెస్టిండీస్, జింబాబ్వే జట్ల మధ్య తొలి టెస్టును వర్షం వెంటాడుతోంది. తొలి రోజు 51 ఓవర్ల ఆట సాధ్యమైతే... రెండో రోజు 38 ఓవర్లు మాత్రమే పడ్డాయి. బులవాయోలో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో రెండో రోజు కూడా జింబాబ్వే బౌలర్లు వికెట్ తీయడంలో విఫలమయ్యారు. ఓవర్‌నైట్ స్కోరు 112/0తో ఆట కొనసాగించిన వెస్టిండీస్ ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 221 పరుగులు సాధించింది. ఓవర్‌నైట్ ఓపెనర్లు క్రెయిగ్ బ్రాత్‌వైట్ (246 బంతుల్లో 116 బ్యాటింగ్; 7 ఫోర్లు)... తేజ్‌నారాయణ్ చందర్‌పాల్ (291 బంతుల్లో 101 బ్యాటింగ్; 10 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలు పూర్తి చేసుకున్నారు. విండీస్ దిగ్గజ క్రికెటర్ శివనారాయణ్ చందర్‌పాల్ తనయుడైన తేజ్‌నారాయణ్ తన అంతర్జాతీయ కెరీర్‌లో తొలి సెంచరీ సాధించగా... క్రెయిగ్ బ్రాత్‌వైట్‌కిది 12వ శతకం. 1999లో న్యూజిలాండ్‌తో హామిల్టన్‌లో జరిగిన తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ ఓపెనర్లు అడ్రియన్ గ్రిఫిత్ (114), షెర్విన్ క్యాంప్‌బెల్ (170) సెంచరీలు చేసిన తర్వాత... మళ్లీ విండీస్ ఓపెనర్లు టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో శతకాలు చేయడం విశేషం.



‘స్వర్ణ’ సురభి


సురభి


కీర్తన

సాక్షి, హైదరాబాద్: ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ ఖాతాలో మూడో స్వర్ణ పతకం చేరింది. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఆదివారం జరిగిన జిమ్నాస్టిక్స్ అండర్–18 బాలికల టేబుల్ వాల్ట్ ఈవెంట్‌లో తెలంగాణకు చెందిన కె.సురభి ప్రసన్న పసిడి పతకం సాధించింది. సురభి 11.63 పాయింట్లు స్కోరు చేసి అగ్రస్థానంలో నిలిచింది. ఫ్లోర్ ఎక్సర్‌సైజ్ ఈవెంట్‌లో సురభి నాలుగో స్థానంలో నిలిచి త్రుటిలో కాంస్య పతకాన్ని చేజార్చుకుంది. అథ్లెటిక్స్‌లో 2000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో డిండి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల అథ్లెటిక్స్ అకాడమీ విద్యార్థిని చెరిపెల్లి కీర్తన (పాలకుర్తి) రజత పతకం సొంతం చేసుకుంది. కీర్తన 7 నిమిషాల 17.37 సెకన్లలో గమ్యానికి చేరి రెండో స్థానంలో నిలిచింది. బాలికల కబడ్డీ మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 28–46తో మధ్యప్రదేశ్ జట్టు చేతిలో ఓడిపోయింది. ఈనెల 11 వరకు జరగనున్న ఈ క్రీడల్లో తెలంగాణ 3 స్వర్ణాలు, 3 రజతాలు, 6 కాంస్యాలతో కలిపి మొత్తం 12 పతకాలతో 11వ స్థానంలో ఉంది.

తేజస్విన్... పసిడి జంప్

బోస్టన్: న్యూ బ్యాలెన్స్ ఇండోర్ గ్రాండ్‌ప్రి అథ్లెటిక్స్ మీట్‌లో భారత్‌కు చెందిన తేజస్విన్ శంకర్ హైజంప్‌లో స్వర్ణ పతకం సాధించాడు. 24 ఏళ్ల తేజస్విన్ 2.26 మీటర్ల దూరం ఎగిరి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 2007 ప్రపంచ చాంపియన్, 2010 కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత డొనాల్డ్ థామస్ (బహామస్) 2.23 మీటర్లతో రజత పతకంతో సరిపెట్టుకున్నాడు. అమెరికాలోని కన్సాస్ స్టేట్‌లో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్నాక ఆడిన తొలి టోర్నీలో తేజస్విన్ స్వర్ణం సాధించడం విశేషం. గత ఏడాది బర్మింగ్‌హామ్ కామన్వెల్త్ గేమ్స్‌లో తేజస్విన్ కాంస్య పతకాన్ని సాధించాడు.




హర్మన్‌ప్రీత్

కాలికట్ హీరోస్ విజయం

బెంగళూరు: ప్రైమ్ వాలీబాల్ లీగ్‌లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో కాలికట్ హీరోస్ జట్టు 10–15, 15–9, 15–8, 15–14, 15–11తో ముంబై మెటియోస్ జట్టును ఓడించింది. నేడు జరిగే మ్యాచ్‌లో అహ్మదాబాద్ డిఫెండర్స్‌తో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు తలపడుతుంది. రాత్రి 7 గంటలకు మొదలయ్యే ఈ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

వేలంపై కాదు... పాక్‌తో సమరంపైనే దృష్టి

- భారత జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్
- టి20 ప్రపంచకప్‌లో 12న పాక్‌తో పోరు
- ముంబైలో 13న డబ్ల్యూపీఎల్ వేలం

కేప్‌టౌన్: మహిళల టి20 ప్రపంచకప్‌లో పాకిస్తాన్‌తో జరిగే సమరంపైనే తాము దృష్టి పెట్టామని, మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) కోసం నిర్వహించే వేలంపై ఆలోచించడం లేదని భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ పేర్కొంది. దక్షిణాఫ్రికా గడ్డపై అండర్–19 అమ్మాయిల జట్టు సాధించిన వరల్డ్‌కప్ స్ఫూర్తితో తమ ప్రపంచ కప్ వేట సాగుతుందని చెప్పింది. మెగా ఈవెంట్‌లో హర్మన్ సేన 12న జరిగే తమ తొలి మ్యాచ్‌లో పాక్‌తో తలపడుతుంది. మరుసటి రోజే ముంబైలో మహిళా క్రికెటర్ల వేలం కార్యక్రమం జరుగుతుంది. ఆదివారం జట్టు కెప్టెన్లతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హర్మన్ మాట్లాడుతూ ‘ప్రపంచకప్పే అన్నింటికంటే ముఖ్యమైంది. దాని తర్వాతే ఏదైనా..! ఐసీసీ మెగా ఈవెంట్‌పైనే మేం దృష్టి సారించాం. మిగతావి ఎప్పుడూ ఉండేవే. ఓ క్రికెటర్‌గా ఏది ప్రధానమో ఏది అప్రధానమో నాకు బాగా తెలుసు. దేనిపై దృష్టి సారించాలో కూడా తెలుసు. గత నెల షఫాలీ వర్మ నేతృత్వంలోని అండర్–19 మహిళల జట్టు సాధించిన వరల్డ్‌కప్‌ను మేమంతా చూశాం. జూనియర్ టీమ్ స్ఫూర్తితో మేం కూడా ప్రపంచకప్ సాధించాలనే పట్టుదలతో ఉన్నాం’ అని వివరించింది. అలాగే దేశంలో జరిగే మహిళల లీగ్‌లతో జాతీయ జట్లకు చాలా మేలు జరుగుతుందని చెప్పింది. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ దేశాల్లో జరుగుతున్న లీగ్‌లతో ఆ జట్లు ఏ స్థాయిలో ఉన్నాయో... అలాగే డబ్ల్యూపీఎల్‌తో మన జాతీయ జట్టు, అమ్మాయిలకు ఎంతో ప్రయోజనం ఉంటుందని, నాణ్యమైన విదేశీ క్రికెటర్లతో కలిసి ఆడటం వల్ల నైపుణ్యం పెరుగుతుందని భారత కెప్టెన్ తెలిపింది.

వేలం ఇబ్బందికరమే

న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సారథులు ప్రపంచకప్ సమయంలోనే క్రికెటర్ల వేలం జరగనుండటం ఇబ్బందికరమని అభిప్రాయపడ్డారు. ‘కొందరు క్రికెటర్లు వేలంలో అమ్ముడుపోతారు. మరికొందరేమో మిగిలిపోతారు. ఇంకొందరికి ఎక్కువ ధర, కొందరికి తక్కువ ధర లభిస్తుంది. ఇది క్రికెటర్ల మానసిక స్థితిపై ప్రభావం చూపిస్తుంది’ అని న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డివైన్ పేర్కొంది. ఆసీస్ కెప్టెన్ మెగ్ లానింగ్ మాట్లాడుతూ ‘నిజంగా ఇది (వేలం) ఇబ్బందికర పరిణామమే. ప్రపంచకప్‌లో ఆడేందుకు వచ్చిన అమ్మాయిలను తప్పకుండా ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. కొందరు జీర్ణించుకుంటారు. ఇంకొందరు జీర్ణించుకోలేరు. ఇది కాస్త ఆటపై ప్రభావం చూపుతుంది’ తెలిపింది.

టాపార్డరే కీలకం: మిథాలీ



న్యూఢిల్లీ: ఈనెల 10 నుంచి దక్షిణాఫ్రికా వేదికగా జరిగే సీనియర్ మహిళల టి20 వరల్డ్‌కప్‌లో భారత అవకాశాలు టాపార్డర్ రాణించడంపైనే ఆధారపడి ఉంటాయని దిగ్గజ క్రికెటర్ మిథాలీ రాజ్ తెలిపింది. ‘భారత టాపార్డరే కీలకం. ఓపెనర్ స్మృతి మంధాన ఫామ్‌లో ఉంది. ఆమె మ్యాచ్ విన్నర్. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కూడా బాగా ఆడుతోంది. ఇటీవలే సఫారీలో అండర్–19 మెగా ఈవెంట్ గెలుచుకొచ్చిన షఫాలీ వర్మ, రిచా ఘోష్‌ల అనుభవం కూడా భారత సీనియర్ జట్టుకు ఉపకరిస్తుంది. అయితే ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లాంటి మేటి జట్లను ఓడిస్తే మిగతా జట్లపై విజయం సులువవుతుంది. బౌలింగ్‌లో సవాళ్లు ఎదురవుతాయి. ఈ కఠిన పరీక్షను ఎదుర్కోవాలంటే బౌలర్లు తమ ప్రదర్శనను మెరుగుపర్చుకోవాల్సిందే’ అని మిథాలీ విశ్లేషించింది.

తొలి టెస్టుకు హాజల్‌వుడ్ దూరం!



న్యూఢిల్లీ: భారత జట్టుతో తొలి టెస్టులో బరిలోకి దిగకముందే ఆస్ట్రేలియా జట్టు ఇబ్బందుల్లో పడింది. నాలుగు టెస్టుల గావస్కర్–బోర్డర్ ట్రోఫీ సిరీస్‌లో భాగంగా ఈనెల 9 నుంచి భారత్, ఆస్ట్రేలియా మధ్య నాగ్‌పూర్‌లో తొలి టెస్టు జరగనుంది. అయితే ఆస్ట్రేలియా ప్రధాన పేసర్లలో ఒకడైన జోష్ హాజల్‌వుడ్ కాలి కండరాల గాయం నుంచి ఇంకా కోలుకోకపోవడంతో అతను తొలి టెస్టుతోపాటు రెండో టెస్టుకూ దూరం కావడం ఖాయమైంది. 32 ఏళ్ల హాజల్‌వుడ్ ఇప్పటివరకు ఆసీస్ తరఫున 59 టెస్టులు ఆడి 222 వికెట్లు తీశాడు. ఇప్పటికే చేతి వేలి గాయంతో మిచెల్ స్టార్క్ తొలి టెస్టుకు దూరం కాగా... ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ కూడా తొలి టెస్టులో ఆడటం సందేహంగా మారింది.

ముంబై జట్టు మెంటార్‌గా జులన్


జులన్




దేవిక

ముంబై: డబ్ల్యూపీఎల్ ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్ తమ కోచింగ్ బృందాన్ని ఆదివారం ప్రకటించింది. ఈ బృందంలో అందరూ మాజీ మహిళా క్రికెటర్లే ఉండటం విశేషం. ఇటీవల ఆటకు గుడ్‌బై చెప్పిన భారత బౌలింగ్ దిగ్గజం జులన్ గోస్వామిని తమ జట్టు మెంటార్, బౌలింగ్ కోచ్‌గా ముంబై నియమించుకుంది. 40 ఏళ్ల జులన్ మూడు ఫార్మాట్‌లలో కలిపి 284 మ్యాచ్‌ల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి 355 వికెట్లు పడగొట్టడంతోపాటు 1,924 పరుగులు సాధించింది. 2014 నుంచి 2016 వరకు భారత జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా పనిచేసిన మాజీ ఆల్‌రౌండర్ దేవిక పల్షికార్‌ను బ్యాటింగ్ కోచ్‌గా నియమించారు. 2006 నుంచి 2008 మధ్యకాలంలో దేవిక భారత్ తరఫున ఒక టెస్టు, 15 వన్డేలు ఆడింది. 2018లో ఆసియా కప్ విజేతగా నిలిచిన బంగ్లాదేశ్ జట్టు శిక్షణ బృందంలో దేవిక సభ్యురాలిగా ఉంది.

హెడ్ కోచ్‌గా చార్లెట్

ముంబై జట్టు హెడ్ కోచ్ బాధ్యతల్ని ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ చార్లెట్ ఎడ్వర్డ్స్‌కు కట్టబెట్టారు. 2017లో క్రికెట్‌కు వీడ్కోలు పలికిన 43 ఏళ్ల చార్లెట్‌కు కోచింగ్‌లో విశేష అనుభవం ఉంది. మూడు ఫార్మాట్‌లలో కలిపి 309 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన చార్లెట్ 10,273 పరుగులు సాధించింది. ఇంగ్లండ్ దేశవాళీ క్రికెట్‌లో సదరన్ వైపర్స్ జట్టుకు, సదరన్ బ్రేవ్ (హండ్రెడ్ టోర్నీ) జట్టుకు, ఆస్ట్రేలియాలో మహిళల బిగ్‌బాష్ లీగ్‌లో సిడ్నీ సిక్సర్స్ జట్టు హెడ్ కోచ్‌గా పనిచేసిన చార్లెట్ అమెరికా క్రికెట్ జట్టుకు కూడా కొంతకాలం శిక్షణ అందించారు. మరోవైపు డబ్ల్యూపీఎల్ వేలం కార్యక్రమం ఈనెల 13న ముంబైలో జరుగుతుంది. ఒక్కో జట్టు కనిష్టంగా 15 మందిని గరిష్టంగా 18 మంది క్రికెటర్లను కొనుగోలు చేసేందుకు వీలుంది. ఒక్కో జట్టు వేలంలో రూ. 12 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

అశు ‘కంచు పట్టు’

వరల్డ్ రెజ్లింగ్ ర్యాంకింగ్ సిరీస్ టోర్నీ

జాగ్రెబ్ (క్రొయేషియా): యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాగ్రెబ్ ఓపెన్ వరల్డ్ ర్యాంకింగ్ సిరీస్ టోర్నమెంట్‌లో పురుషుల గ్రీకో రోమన్ 67 కేజీల విభాగంలో భారత రెజ్లర్ అశు కాంస్య పతకాన్ని సాధించాడు. కాంస్య పతక పోరులో 23 ఏళ్ల అశు 5–0తో అడోమస్ గ్రిగాలియునస్ (లిథువేనియా)పై నెగ్గాడు. అశుకు 500 స్విస్ ఫ్రాంక్‌లు (రూ. 44 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. అంతకుముందు క్వాలిఫయింగ్ రౌండ్‌లో అశు 0–9తో రెజా అబ్బాసి (ఇరాన్) చేతిలో ఓడిపోయాడు. అయితే రెజా ఫైనల్ చేరుకోవడంతో... రెజా చేతిలో ఓడిపోయిన వారి మధ్య ‘రెపిచాజ్’ పద్ధతిలో అశుకు కాంస్య పతకం కోసం పోటీ పడే అవకాశం లభించింది. ‘రెపిచాజ్’ తొలి బౌట్‌లో అశు 8–0తో పోహిలెక్ (హంగేరి)పై...



రెండో బౌట్‌లో 9–0తో హావర్డ్ (నార్వే)పై గెలుపొంది కాంస్య పతక బౌట్‌కు అర్హత సాధించాడు.

భార్యపై వినోద్ కాంబ్లీ దాడి

కేసు నమోదు చేసిన పోలీసులు

ముంబై: భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీ తన భార్యపై దాడికి పాల్పడటంతో ముంబై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం మద్యం తాగొచ్చిన కాంబ్లీ భార్య ఆండ్రియాను దుర్భాషలాడుతూ వంటగదిలోని కుకింగ్ పాన్‌ను ఆమెపైకి విసిరాడు. ఇది ఆమె తలకు బలంగా తగిలి గాయమైంది. వెంటనే ఆసుపత్రికి వెళ్లిన ఆండ్రియా చికిత్స అనంతరం పోలీసులను ఆశ్రయించింది. 51 ఏళ్ల కాంబ్లీపై ఐపీసీ సెక్షన్లు 324 (ప్రమాదకరమైన వాటితో గాయపరచడం), 504 (ఉద్దేశపూర్వకంగా అవమానించి శాంతికి భంగం కలిగించడం) కింద కేసులు నమోదు చేశారు.



భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్–4 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

టెన్త్ క్లాస్‌లో.. పదికి పది ఇలా!

పదో తరగతి..ప్రతి విద్యార్థి జీవితంలో అత్యంత కీలకమైన దశ! టెన్త్‌లో సాధించే మార్కులు, సబ్జెక్ట్ నైపుణ్యాలు భవితకు పునాదిగా నిలుస్తాయి. అంతేకాదు పదో తరగతి సబ్జెక్ట్‌ల్లో పొందే మార్కుల ఆధారంగా చేరాల్సిన ఉన్నత విద్య కోర్సుపై స్పష్టత వస్తుంది. ఇంతటి కీలకమైన టెన్త్ క్లాస్ వార్షిక పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. తెలుగు రాష్ట్రాల్లో పదో తరగతి-2023 పరీక్షలు.. ఏప్రిల్ 3వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో.. పదోతరగతి పరీక్షల్లో తాజా మార్పులు.. పరీక్ష విధానం.. వార్షిక పరీక్షల్లో మెరుగైన స్కోర్‌కు మార్గాల గురించి తెలుసుకుందాం..

» ఏపీ, తెలంగాణలో ఏప్రిల్ 3 నుంచి పదోతరగతి వార్షిక పరీక్షలు
» రెండు రాష్ట్రాల్లోనూ ఆరు పేపర్లలోనే పరీక్షలు నిర్వహణ
» అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలే కీలకం
» మంచి స్కోర్ సాధించేందుకు సబ్జెక్ట్ నిపుణుల సూచనలు


పదో తరగతి ప్రత్యేకం

‘పదో తరగతిలో విద్యార్థులు మంచి మార్కులు, జీపీఏ సాధించాలంటే.. పాఠ్యపుస్తకాల అభ్యసనంతోపాటు అనువర్తిత దృక్పథం సొంతం చేసుకోవాలి. చదివే ప్రతి అంశాన్ని సంపూర్ణంగా అవగాహన చేసుకుంటూ.. ఆయా సబ్జెక్ట్ అంశాలపై పట్టు సాధించాలి’ అంటున్నారు సబ్జెక్ట్ నిపుణులు.

ఏప్రిల్ 3వ తేదీ నుంచి

రెండు తెలుగు రాష్ట్రాల్లో 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి వార్షిక పరీక్షలు ఏప్రిల్ మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పటి నుంచే చక్కటి ప్రణాళికతో చదువు కొనసాగిస్తే.. మంచి మార్కులు సాధించడం కష్టమేమీ కాదు.

ఆరు పేపర్లుగానే

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోనూ ఈ ఏడాది నుంచి ఆరు పేపర్లుగా పదో తరగతి పరీక్షలు జరగనున్నాయి. పేపర్–1, పేపర్–2 విధానానికి స్వస్తి పలికారు. దీనికి బదులుగా ప్రతి పేపర్‌లోనూ పార్ట్–ఎ, పార్ట్–బిలు ఉంటాయి. ఇంతకు ముందు జరిగిన పేపర్–1,పేపర్–2 విధానంలో విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడిని దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సబ్జెక్ట్ నిపుణుల విశ్లేషణ. రెండు పేపర్ల స్థానంలో ఒకే పేపర్‌గా ఏపీలో 100 మార్కులకు, తెలంగాణలో 80 మార్కులకు ప్రతి సబ్జెక్ట్‌లోనూ పరీక్షలు నిర్వహించనున్నారు. మొత్తం సిలబస్ అంశాల నుంచి ఒకే పేపర్‌లో ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుంది. పరీక్షకు కేటాయించే వ్యవధిని పెంచడం విద్యార్థులకు ఊరటనిచ్చే అంశం. తెలంగాణలో పరీక్ష సమయాన్ని మూడు గంటలుగా, ఏపీలో 3:15 గంటలుగా పేర్కొన్నారు.

సైన్స్ ఒకే పేపర్.. పార్ట్–ఎ, పార్ట్–బిగా

- గతంలో సైన్స్‌లో.. పీఎస్(ఫిజికల్ సైన్స్), ఎన్‌ఎస్(నేచురల్ సైన్స్) పేరుతో రెండు పేపర్లు ఉండేవి. ఇప్పుడు పీఎస్, ఎన్‌ఎస్ రెండింటినీ ఒకే పేపర్‌గా.. పార్ట్–ఎ, పార్ట్–బి పేరుతో ప్రశ్నలు అడుగుతారు. పార్ట్–ఎలో పీఎస్(భౌతిక రసాయన శాస్త్రం), పార్ట్–బి(జీవ శాస్త్రం) నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఏపీలో పార్ట్–ఎ, పార్ట్–బిలు 50 మార్కులు చొప్పున, తెలంగాణలో.. పార్ట్–ఎ, పార్ట్–బిలు 40 మార్కులకు చొప్పున ఉంటాయి.
- ఆయా సబ్జెక్ట్‌లకు సంబంధించి బ్లూ ప్రింట్స్, మోడల్ పేపర్స్‌ను పరిశీలిస్తూ.. సబ్జెక్ట్ వారీగా ఆయా అంశాలకు ఉన్న వెయిటేజీకి అనుగుణంగా ప్రిపరేషన్ సాగించాలి. ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలో మంచి స్కోర్ సాధించొచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ పదో తరగతి పరీక్ష పేపర్ల స్వరూపం

మ్యాథమెటిక్స్

- ఒక మార్కు ప్రశ్నలు 12(12 మార్కులు), రెండు మార్కుల ప్రశ్నలు 8(16 మార్కులు), నాలుగు మార్కుల ప్రశ్నలు 8(32 మార్కులు), ఎనిమిది మార్కుల ప్రశ్నలు 5(40 మార్కులు).

జనరల్ సైన్స్

- పార్ట్–ఎ.. పీఎస్‌లో ఒక మార్కు ప్రశ్నలు 6(6 మార్కులు); రెండు మార్కుల ప్రశ్నలు 4(8 మార్కులు), నాలుగు మార్కుల ప్రశ్నలు 3(12 మార్కులు), ఎనిమిది మార్కుల ప్రశ్నలు 3(24 మార్కులు).
- పార్ట్–బి.. జీవ శాస్త్రంలో ఒక మార్కు ప్రశ్నలు 6(6 మార్కులు); రెండు మార్కుల ప్రశ్నలు 4(8 మార్కులు); నాలుగు మార్కుల ప్రశ్నలు 5(20 మార్కులు); ఎనిమిది మార్కుల ప్రశ్నలు 2(16 మార్కులు).

సోషల్ స్టడీస్

- ఒక మార్కు ప్రశ్నలు 12(12 మార్కులు), రెండు మార్కుల ప్రశ్నలు 8(16 మార్కులు), నాలుగు మార్కుల ప్రశ్నలు 8(32 మార్కులు), ఎనిమిది మార్కుల ప్రశ్నలు 5(40 మార్కులు).

ఇంగ్లిష్

రెండు మార్కుల ప్రశ్నలు 5(10 మార్కులు); రెండు మార్కుల ప్రశ్నలు 3(6 మార్కులు), ప్యాసేజ్ ఆధారిత మరో రెండు మార్కుల ప్రశ్నలు 2(4 మార్కులు) అడుగుతారు. పోస్టర్ ఆధారిత ప్రశ్నలు 5(10 మార్కులు). సెక్షన్–బికు 40 మార్కులు. సెక్షన్–సికు 30 మార్కులు.

తెలుగు.. పద్య,గద్య భాగాలు, వ్యాకరణం

- ఎనిమిది మార్కుల ప్రశ్నలు 7(56 మార్కులు), 4 మార్కుల ప్రశ్నలు 3(12 మార్కులు), స్వల్ప సమాధాన, బహుళైచ్ఛిక ప్రశ్నలకు 32 మార్కులు.
- అన్ని సబ్జెక్ట్‌లలోనూ 100 మార్కులకు పరీక్ష జరుగుతుంది.

తెలంగాణ పదో తరగతి పరీక్ష పేపర్ల స్వరూపం

- సూక్ష్మ లఘు సమాధాన ప్రశ్నలు ఆరు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు రెండు మార్కులు(మొత్తం 12 మార్కులు).
- లఘు సమాధాన ప్రశ్నలు 6 ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు (మొత్తం 18మార్కులు).
- వ్యాసరూప సమాధాన ప్రశ్నలు ఆరు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు అయిదు మార్కులు (మొత్తం 30 మార్కులు).
- పార్ట్–బి పేరుతో బిట్ పేపర్ నుంచి 20 మార్కులకు బహుళైచ్ఛిక ప్రశ్నలు అడుగుతారు.
- ఇలా మొత్తం పార్ట్–ఎ, పార్ట్–బి నుంచి 80 మార్కులకు ప్రతి సబ్జెక్ట్‌లో పరీక్ష జరుగుతుంది.

సబ్జెక్టుల వారీగా ప్రిపరేషన్ ఇలా

మ్యాథమెటిక్స్

పదో తరగతి స్థాయిలో విద్యార్థులు క్లిష్టంగా భావించే సబ్జెక్ట్ మ్యాథమెటిక్స్. సిలబస్ అంశాలను పూర్తిగా అధ్యయనం చేస్తూ.. ప్రాక్టీస్ చేయడం ద్వారా ఈ సబ్జెక్ట్‌పై పట్టు సాధించొచ్చు. సంఖ్యా వ్యవస్థ; బీజగణితం; నిరూపక రేఖాగణితం; రేఖా గణితం; క్షేత్రమితి; త్రికోణమితి; సంభావ్యత, సాంఖ్యకశాస్త్రంపై సంపూర్ణ అవగాహన పెంచుకోవాలి. ప్రాబ్లమ్ సాల్వ్ చేయడంతోపాటు కారణాల నిరూపణ, వ్యక్తీకరణ, ఒక సమస్యను ఇతర అంశాలతో అనుసంధానం చేయడం వంటి నైపుణ్యాలు పొందాలి. ముఖ్యమైన నిర్వచనాలు, సూత్రాలను నోట్స్ రూపంలో రాసుకుంటే.. రివిజన్ సమయంలో ఉపయుక్తంగా ఉంటుంది. పాఠ్యపుస్తకంలో ప్రతి చాప్టర్ చివరన ఇచ్చే సమస్యలను తప్పకుండా ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, నిర్మాణాత్మక సమస్యలకు సమాధానాలు కనుగొనేందుకు ప్రాక్టీస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. వాస్తవ సంఖ్యలు; సమితులు; బహుపదులు; రెండు చరరాశులలోని రేఖీయ సమీకరణాల జత అధ్యాయాలలోని గ్రాఫ్ ఆధారిత సమస్యలు; సంభావ్యత; సాంఖ్యక శాస్త్రం ; త్రికోణమితి; క్షేత్రమితిలోని ముఖ్యమైన సమస్యలను సాధన చేయాలి.

-కె.సారథి, మ్యాథమెటిక్స్ సబ్జెక్ట్ నిపుణులు

సైన్స్ పేపర్.. పార్ట్–ఎ.. పీఎస్

సైన్స్ సబ్జెక్ట్‌లో పార్ట్–ఎ ఫిజికల్ సైన్స్(పీఎస్)లో మంచి మార్కులు సాధించాలంటే.. అప్లికేషన్ అప్రోచ్‌తో చదవడం ఎంతో ముఖ్యం. ఆయా చాప్టర్లకు సంబంధించిన అంశాలను నిజ జీవిత సంఘటనలతో అన్వయించుకుంటూ ప్రిపరేషన్ సాగిస్తే.. విషయ పరిజ్ఞానం మరింత పెంపొందించుకోవచ్చు. విషయ అవగాహనతోపాటు, ప్రశ్నించడం -పరికల్పన చేయడం; ప్రయోగాలు–క్షేత్ర పర్యటనలు; సమాచార నైపుణ్యాలు–ప్రాజెక్ట్ పనులు; పటాలు–వాటి ద్వారా భావ ప్రసారం వంటి వాటిపైనా కృషి చేయాలి. కాంతి పరావర్తనం, కాంతి వక్రీభవనం, విద్యుత్ ప్రవాహం, రసాయన బంధం, పరమాణు నిర్మాణం, కార్బన్ సమ్మేళనాలపై పట్టు సాధించాలి. మూలకాల ధర్మాలు–వర్గీకరణ, రసాయన సమీకరణాలను బాగా ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేయడం వల్ల లఘు, అతి స్వల్ప, బహుళైచ్ఛిక ప్రశ్నలకు సులువుగా సమాధానాలిచ్చే పట్టు లభిస్తుంది. ప్రశ్నను ఎలా అడిగినా సమాధానం ఇచ్చే సంసిద్ధత లభించి.. మంచి మార్కులు సొంతమవుతాయి.

-ఎం.రవీంద్ర, ఫిజిక్స్ సబ్జెక్ట్ నిపుణులు

సైన్స్ పేపర్.. పార్ట్–బి ఎన్‌ఎస్(నేచురల్ సైన్సెస్)

సైన్స్ పేపర్‌లోనే పార్ట్–బిగా ఉండే జీవశాస్త్రంలో రాణించేందుకు.. అవగాహన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలను పెంచుకోవాలి. పుస్తకాల్లోని ఆయా అంశాలకు సంబంధించి ఫ్లో చార్ట్‌లు, బ్లాక్ డయాగ్రమ్స్‌లను సొంతంగా రూపొందించుకోవాలి. విశ్లేషణాత్మక, తులనాత్మక అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. నేర్చుకున్న అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయించే విధంగా చదవాలి. ప్రయోగాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ప్రయోగ నిర్వహణ ప్రక్రియపై అవగాహన పొందడం ఎంతో మేలు చేస్తుంది. ఆయా అంశాలకు సంబంధించి చాప్టర్‌లో పేర్కొన్న అభ్యాసాలకు సంబంధించి విశ్లేషణ, కారణాలు, పోలికలు, బేధాలు తెలుసుకుంటూ చదవాలి. డయాగ్రమ్స్ విషయంలో భాగాలను గుర్తించడమే కాకుండా.. వాటి ప్రాముఖ్యతను వర్ణించగలిగే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

-పి.నీలకంఠం, సబ్జెక్ట్ టీచర్

తెలుగు

ఫస్ట్ లాంగ్వేజ్‌గా ఉండే తెలుగు పేపర్‌లో మంచి మార్కులు సాధించేందుకు విద్యార్థులు.. ముందుగా పద్యభాగం, గద్యభాగంలోని అన్ని అంశాలను గుర్తుంచుకోవాలి. వాటిని పునశ్చరణ చేసుకోవాలి. పాఠాన్ని కేవలం చదవడంతో సరి పెట్టకుండా.. సారాంశాన్ని, ఉద్దేశాన్ని తెలుసుకోవాలి. ప్యాసేజ్ పేరిట ఉండే అపరిచిత గద్యం ఎంతో ముఖ్యం. ఈ విషయంలో సొంతగా ఆలోచిస్తూ చదవాలి. ఉపవాచకానికి సంబంధించి ఇతివృత్తం, ప్రాముఖ్యత, పాత్రలు, వాటి ప్రాధాన్యత, వ్యక్తుల ప్రవర్తన శైలి తదితర అంశాల ద్వారా ఇచ్చే సందేశాన్ని తెలుసుకోవాలి. వ్యాకరణంలో మంచిగా ప్రతిభ చూపాలంటే.. సంధులు, సమాసాలు, సంయుక్తార్థాలు, ఉత్పత్యర్థాలు, జాతీయాలు బాగా చదవాలి.

-జి.వెంకట రమణ, ఎస్‌ఏ-తెలుగు

ఇంగ్లిష్

ఇంగ్లిష్ పేపర్‌లో మంచి మార్కులు పొందేందుకు వెర్బల్, నాన్-వెర్బల్ అంశాలు బాగా చదవాలి. ఉదాహరణకు లేబుల్స్, బార్ డయాగ్రమ్స్, పై చార్ట్స్ తదితర అంశాలను అధ్యయనం చేయాలి. సొంతంగా విశ్లేషించేలా నైపుణ్యం పెంచుకోవాలి. ఇందుకోసం పాత ప్రశ్న పత్రాల సమాధానాలను పరిశీలించడం కూడా మేలు చేస్తుంది. ప్రతి పాఠం చివరలో ఉండే కాంప్రహెన్సివ్ ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ప్రతి పాఠానికి సంబంధించి సారాంశాన్ని గ్రహించి సొంతగా రాసుకునే అలవాటు చేసుకోవాలి. పోయెట్రీ ప్రశ్నల్లో మంచి మార్కుల సాధన కోసం సదరు పద్యంలో ముఖ్య పదాలు, యాంటానిమ్స్, సినానిమ్స్‌పై దృష్టి సారించాలి. వీటితోపాటు పార్ట్స్ ఆఫ్ స్పీచ్, డైరెక్ట్, ఇన్‌డైరెక్ట్ స్పీచ్, యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్, ఫ్రేజల్ వెర్బ్స్. ఈ విషయంలో చదవడంతోపాటు ప్రాక్టీస్ కూడా చేస్తే మెరుగైన మార్కులు పొందేందుకు మరింత ఆస్కారం లభిస్తుంది. అదే విధంగా అపరిచిత గద్యం(అన్ నోన్ ప్యాసేజెస్) సారాంశాన్ని గ్రహించేలా చదవాలి. లెటర్ రైటింగ్‌కు సంబంధించి పంక్చుయేషన్స్, బాడీ ఆఫ్ ది లెటర్ వంటి అంశాలపై పట్టు ఎంతో అవసరం.

-డి.హనుమంతరావు, ఎస్‌ఏ-ఇంగ్లిష్

సోషల్ స్టడీస్

ఈ సబ్జెక్ట్‌లో మంచి మార్కులు పొందాలంటే.. సమకాలీన అంశాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. పాఠ్య పుస్తకంలోని ఏదైనా ఒక అంశాన్ని చదువుతున్నప్పుడు దానికి సంబంధించి మన నిజ జీవితంలో జరుగుతున్న సంఘటనలతో పోల్చుకుంటూ చదవాలి. సమకాలీన అంశాల విషయంలో ప్రతిస్పందన, ప్రశ్నించడం, ప్రశంస/అభినందనలపై సాధన చేయడం ఎంతో అవసరం. అవగాహనకు సంబంధించి ఒక నిర్దిష్ట అంశాన్ని చదివి.. సొంత పరిజ్ఞానంతో రాసే నైపుణ్యం పెంచుకోవాలి. జాగ్రఫీ, ఎకనామిక్స్‌లో భారతదేశం -భౌగోళిక స్వరూపం, శీతోష్ణస్థితి, భారతదేశ నీటి వనరులు, వలసలు, ఆహార భద్రత, ఉత్పత్తి-ఆదాయం, సుస్థిరాభివృద్ధి పాఠ్యాంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

హిస్టరీలో రెండు ప్రపంచ యుద్ధ కాలాల సమయంలో ప్రపంచం; సమకాలీన సామాజిక ఉద్యమాలపై దృష్టి పెట్టాలి. భారత జాతీయోద్యమ చరిత్రను ప్రత్యేక దృష్టితో చదవాలి. సివిక్స్‌కు సంబంధించి రాజ్యాంగం మూల సూత్రాలు, రాజ్యాంగంలో పేర్కొన్న అంశాలను ఏఏ దేశాల రాజ్యాంగల నుంచి అనుసరించారు తదితర కోణాల్లో చదవాలి.

-బి.శ్రీనివాస్, సబ్జెక్ట్ టీచర్

పదో తరగతి వార్షిక పరీక్షలు.. ముఖ్యాంశాలు

- ఏపీ, తెలంగాణలో ఏప్రిల్ 3 నుంచి వార్షిక పరీక్షలు.
- రెండు రాష్ట్రాల్లో పేపర్–1, పేపర్–2 విధానానికి స్వస్తి.
- కేవలం ఆరు పేపర్లలోనే పరీక్షలు.
- ఏపీలో ప్రతి సబ్జెక్ట్‌లో 100 మార్కులకు, తెలంగాణలో ప్రతి సబ్జెక్ట్‌కు 80 మార్కులకు పరీక్ష.
- సైన్స్‌కు సంబంధించి పార్ట్–ఎగా పీఎస్, పార్ట్–బిగా ఎన్‌ఎస్ సబ్జెక్ట్‌లతో ఒకటే ప్రశ్న పత్రం.
- వ్యాసరూప సమాధాన ప్రశ్నల్లో ఇంటర్నల్ ఛాయిస్ విధానం.

పదో తరగతి విద్యార్థులు.. దృష్టి సారించాల్సిన అంశాలు

- సిలబస్‌లో ఆయా సబ్జెక్ట్‌లు, చాప్టర్లలో సిలబస్‌ను పరిశీలించాలి.
- ముఖ్యమైన చాప్టర్లను వెయిటేజీ ఆధారంగా వర్గీకరించుకోవాలి.
- అత్యధిక వెయిటేజీ ఉండే అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.
- ఇప్పటి నుంచే ప్రాక్టీస్ ఆధారిత ప్రిపరేషన్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి.
- అవగాహన, ప్రతిస్పందన, స్వీయ విశ్లేషణ నైపుణ్యాలు పెంచుకోవాలి.
- మ్యాథమెటిక్స్, సైన్స్ సబ్జెక్ట్‌లకు సంబంధించి బేసిక్ కాన్సెప్ట్స్, థీరమ్స్‌ను బాగా అధ్యయనం చేయాలి.
- ప్రతి అంశాన్ని సొంతంగా విశ్లేషించే విధంగా ప్రాక్టీస్ చేయాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	910	60,842
నిఫ్టీ ▲	244	17,854

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	12,007	▽	194
డోజోన్స్	33,926	▽	128
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,902	▲	82
డాక్స్	15,477	▽	33
షాంఘై (3వ తేదీ ముగింపు)	3,263	▽	22
నికాయ్	27,509	▲	107

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	81.41	83.08
£	బ్రిటన్ పౌండ్	88.03	91.16
€	యూరో	98.76	102.13
¥	జపాన్ ఎన్ (100)	62.98	65.05
AU$	ఆస్ట్రేలియా డాలర్	56.94	59.33
S$	సింగపూర్ డాలర్	61.69	63.75
SAR	సౌదీ రియాల్	20.24	22.01
UAE D	యూఏఈ దిర్హామ్	21.31	23.07
¥	చైనా యువాన్	10.26	12.85


పన్ను భారం తగ్గించుకోవాలంటే..



- ఈఎల్ఎస్ఎస్, పీపీఎఫ్, ఎన్‌పీఎస్ మెరుగు
- బీమా, రాబడి కోసం యులిప్‌లు
- ఎన్ఎస్‌సీ, ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీలు
- కేవలం పన్ను ఆదా ఒక్కటే చూడొద్దు
- రిస్క్, రాబడి కోణంలో ఎంపిక ఉండాలి

వేతన జీవులకు ఆదాయపన్ను చట్టంలోని పలు సెక్షన్లు గణనీయంగా పన్ను మినహాయింపులు ఇస్తున్నాయి. పాత పన్ను విధానంలో రూ.5 లక్షల వరకు ఆదాయంపై పన్ను లేకపోగా, అందుబాటులోని అన్ని మినహాయింపులు, తగ్గింపు ప్రయోజనాలను వినియోగించుకుంటే మరో రూ.5 లక్షల ఆదాయంపైనా పన్ను భారం లేకుండా చూసుకోవచ్చు. ఆర్థిక సంవత్సరం ఆరంభం నుంచే తమ ఆదాయం, పన్ను బాధ్యతలకు అనుగుణంగా ప్రణాళిక వేసుకుని, పెట్టుబడులు చేసుకోవడం మెరుగైన మార్గం. కానీ, చాలా మందికి ఇది ఆచరణలో అసాధ్యంగా ఉంటుంది. ఆర్థిక సంవత్సరం చివరిలోనే పన్ను ఆదా బాధ్యతలపై ఎక్కువ మంది దృష్టి సారిస్తుంటారు. ఈ సమయంలో పన్ను భారం తగ్గించుకునేందుకు అందుబాటులో ఉన్న సాధనాలపై కథనం ఇది.

ఏడాది చివర్లో వ్యవధి తక్కువగా ఉన్నప్పుడు, హడావిడిగా చేసే పెట్టుబడుల్లో తప్పులకు చోటు ఇవ్వకూడదు. అదే సమయంలో పన్ను ఆదా ఒక్కటే ప్రామాణిక అంశం కూడా కాకూడదు. ఒకవైపు పన్ను ఆదా ప్రయోజనాన్ని ఇస్తూనే, మరోవైపు చేసిన పెట్టుబడి మంచి ప్రతిఫలాన్ని కూడా అందించేలా ఉండాలి. పైగా మనలో కొందరు చిన్న వయసులో ఉంటారు. మరికొందరు మధ్య వయసులో, కొందరు రిటైర్మెంట్‌కు దగ్గర్లో ఉండొచ్చు. కొందరి ఆర్జన మెరుగ్గా, కొందరి ఆర్జన మధ్యస్థంగా, తక్కువగాను ఉండొచ్చు. ఆదాయానికి అనుగుణంగా తీసుకునే రిస్క్ సామర్థ్యం మారిపోతుంటుంది. ఉదాహరణకు ఈఎల్ఎస్ఎస్ అన్నది సెక్షన్ 80సీ కింద అర్హత కలిగిన పన్ను సాధనాల్లో ఒకటి. అచ్చం ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే ఈ సాధనంలో పెట్టుబడులపై రాబడి దీర్ఘకాలంలో ఏటా 12 శాతానికి పైనే లభిస్తుంది. ఇందులో వ్యయాలు చాలా తక్కువ. మూడేళ్ల లాకిన్ పీరియడ్ ముగిసిన తర్వాత లిక్విడిటీ సమస్యే ఉండదు. కానీ, కొందరికి ఈక్విటీలు నచ్చకపోవచ్చు. కొందరికి పెట్టుబడులు అన్నింటినీ ఈక్విటీలకు కేటాయించడం ఇష్టం లేకపోవచ్చు. అందుకనే అందుబాటులో సాధనాలు, వాటి మంచి చెడులను అర్థం చేసుకుంటే, ఇన్వెస్టర్లు తమకు నచ్చినవి ఎంపిక చేసుకోవచ్చు.



యులిప్‌లు



యులిప్‌లలో గడిచిన ఐదేళ్ల కాలంలో వార్షిక రాబడి 8–9 శాతం మధ్య ఉంది. యులిప్ అన్నది ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసే బీమా సాధనం. బీమా సంస్థలు ఒకవైపు పాలసీదారులకు బీమా రక్షణ ఇస్తూ.. మరోవైపు ఈక్విటీ, డెట్ సాధనాల్లో పెట్టుబడులు పెట్టి, వచ్చిన రాబడిని పంచుతాయి. యులిప్‌లోనూ ఎన్‌పీఎస్‌లో మాదిరే ఈక్విటీ, డెట్ మధ్య కేటాయింపులను మార్చుకునే సౌలభ్యం ఉంది. ఇలా మార్చుకుంటే పన్ను కట్టక్కర్లేదు. ఈక్విటీల విలువలు గరిష్టాలకు చేరినప్పుడు డెట్‌కు మారి, మార్కెట్లు దిద్దుబాటుకు గురైనప్పుడు తిరిగి ఈక్విటీల్లోకి పెట్టుబడులను మళ్లించుకోవచ్చు. రాబడులపై పన్ను లేకపోవడం మరో ఆకర్షణీయ అంశం. యులిప్‌లో పెట్టుబడులపై ఐదేళ్ల పాటు లాకిన్ ఉంటుంది. ఆ తర్వాత కోరుకున్నప్పుడు పాక్షిక ఉపసంహరణలు చేసుకోవచ్చు. ఎన్‌పీఎస్‌లో మాదిరి ఇందులో ఫండ్ మేనేజర్‌ను మార్చుకోవడానికి అవకాశం లేదు. యులిప్‌ను జీవితంలో ముఖ్యమైన లక్ష్యాల కోసం పెట్టుబడి సాధనంగా ఉపయోగించుకోవచ్చు. వార్షిక పెట్టుబడితో పోలిస్తే జీవిత బీమా కవరేజీ కనీసం 10 రెట్లు ఉంటే సెక్షన్ 10(10డీ) కింద మెచ్యూరిటీ సమయంలో తీసుకునే మొత్తంపైనా పన్ను ఉండదు.

ఎన్‌పీఎస్- మూడు ప్రయోజనాలు

NATIONAL PENSION SCHEME

ఇందులో రాబడులు గడిచిన ఐదేళ్ల కాలంలో వార్షికంగా 8–11 శాతం మధ్య ఉన్నాయి. ఇందులో చేసే పెట్టుబడులు రిటైర్మెంట్ వరకు లాకిన్‌లోనే ఉంటాయి. డెట్ నుంచి ఈక్విటీ, ఈక్విటీ నుంచి డెట్‌కు అలోకేషన్‌ను మార్చుకునే సౌలభ్యం ఉంది. ఎన్‌పీఎస్‌కు సంబంధించి మూడు రకాల ప్రయోజనాలు ఉన్నాయి. ఒకటి సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షలను ఇందులో ఇన్వెస్ట్ చేసి, ఆ మొత్తంపై పన్ను లేకుండా చూసుకోవచ్చు. సెక్షన్ 80సీసీడీ (1బీ) కింద రూ.50,000 మొత్తంపై అదనపు పన్ను మినహాయింపు కూడా అందుబాటులో ఉంది. ఉద్యోగి మూలవేతనం, డీఏలో 10 శాతాన్ని ఎన్‌పీఎస్‌కు కంపెనీలు జమ చేస్తే, ఆ మొత్తంపైనా పన్ను ఉండదు. సెక్షన్ 80సీసీడీ (2) కింద ఈ ప్రయోజనాన్ని క్లెయిమ్ చేసుకోవచ్చు. కనుక ఎన్‌పీఎస్ ఇచ్చే ప్రయోజనాలతను వేరొక సాధనంతో పోల్చడం సరికాదు. ఎన్‌పీఎస్‌లో ఈక్విటీ, కార్పొరేట్ బాండ్స్, గవర్నమెంట్ బాండ్స్ (గిల్ట్ ఫండ్స్) అనే మూడు కేటగిరీలు ఉంటాయి. ఇన్వెస్టర్లు ఈక్విటీలకు గరిష్టంగా 75 శాతం మించకుండా కేటాయింపులు చేసుకోవచ్చు. మిగిలిన రెండింటిలో నూరు శాతం కేటాయింపులకు అనుమతి ఉంది. మూడింటి మధ్య తమ రిస్క్‌స్థాయిని బట్టి కేటాయింపుల్లో మార్పులు చేసుకోవచ్చు. ఏడాదిలో నాలుగు సార్లు ఇలా చేసుకునేందుకు అనుమతి ఉంది. పనితీరు నచ్చకపోతే ఫండ్ మేనేజర్లను కూడా మార్చుకోవచ్చు. మార్కెట్ల పట్ల అవగాహన ఉన్న వారికి ఇది అనుకూలమైన టూల్. వీటికి అదనంగా ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ విభాగం కూడా ఉంది.

ఎన్‌పీఎస్‌లో విభాగాల వారీ రాబడులు

విభాగం	ఏడాది	మూడేళ్లు	ఐదేళ్లు (%లో)
ఈక్విటీ ఫండ్స్	2.91	14.76	11.10
కార్పొరేట్ బాండ్‌ఫండ్స్	3.30	7.31	7.66
గిల్ట్‌ఫండ్స్	3.29	6.09	8.02
ఆల్టర్నేట్ ఫండ్స్	6.27	7.13	7.55

సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్



ఇది ఐదేళ్ల పథకం. తర్వాత మరో మూడేళ్లు పొడిగించుకోవచ్చు. ఇందులో వడ్డీ రేటు ప్రస్తుతం 8 శాతంగా ఉంది. 60 ఏళ్లు దాటిన వారు క్రమం తప్పకుండా ప్రతి 3 నెలలకు ఒకసారి (త్రైమాసికం ఆరంభంలో) ఆదాయం అందుకునేందుకు ఇది అనుకూలం. ఇందులో పెట్టుబడులను సెక్షన్ 80సీ కింద చూపించి మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. పెట్టుబడిపై వచ్చే వడ్డీ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది. కాకపోతే 60 ఏళ్లు నిండిన వారికి ఏటా రూ.50 వేల వరకు వడ్డీ ఆదాయంపై పన్ను మినహాయింపు అమల్లో ఉంది. అంటే ఈ పథకంలో రూ.6.5 లక్షల వరకు ఇన్వెస్ట్ చేయడం ద్వారా ఒక ఏడాదిలో రూ.50,000 పన్ను లేని ఆదాయం అందుకోవచ్చు. వార్షికాదాయం రూ.50వేలు మించితే టీడీఎస్ అమలు చేస్తారు.

పీపీఎఫ్

ఇందులో ప్రస్తుత వడ్డీ రేటు 7.1 శాతం. పెట్టుబడులు 15 ఏళ్ల పాటు లాకిన్‌లో ఉంటాయి. పెట్టుబడిపై సెక్షన్ 80సీ కింద మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. పెట్టుబడి, రాబడి, ఉపసంహరణ ఇలా ఏ దశలోనూ పన్ను చెల్లించాల్సిన అవసరం లేని సాధనం ఇది. కనుక స్థిరాదాయ పథకాలతో పోలిస్తే మెరుగైనది. బ్యాంక్ ఎఫ్‌డీలపైనా ఇంతే వడ్డీ రేటు లభిస్తున్నప్పటికీ, అది పన్ను పరిధిలోకి వస్తుంది. పీపీఎఫ్‌ను అన్ని ప్రభుత్వరంగ, ప్రైవేటు వాణిజ్య బ్యాంకుల్లో ప్రారంభించొచ్చు. పోస్టాఫీసులోనూ దీన్ని తెరవొచ్చు. బ్యాంకుల్లో మరింత సౌకర్యంగా ఉంటుంది. సొంత ఖాతా నుంచే పీపీఎఫ్ కంట్రిబ్యూషన్ బదిలీ చేసుకోవచ్చు. కోరుకున్నప్పుడు ఈ–స్టేట్‌మెంట్ తీసుకోవచ్చు. ఆరో ఏట తర్వాత పాక్షిక ఉపసంహరణకు అనుమతి ఉంటుంది. నాలుగో ఏడాది చివరి నాటికి ఉన్న బ్యాలన్స్‌నుంచి సగం తీసుకోవచ్చు. 15 ఏళ్ల కాల వ్యవధి తర్వాత మరో ఐదేళ్లు పొడిగించుకోవచ్చు. మూడో ఏట నుంచి ఆరో ఏట వరకు బ్యాలన్స్‌పై రుణం తీసుకునే సదుపాయం కూడా ఉంది.




ఈఎల్ఎస్ఎస్ పథకాల రాబడులు

విభాగం	మూడేళ్లు	ఐదేళ్లు (%లో)
కెనరా రొబెకో ట్యాక్స్‌సేవర్	20.82	15.44
మిరే అస్సెట్ ట్యాక్స్ సేవర్	19.24	14.31
డీఎస్‌పీ ట్యాక్స్ సేవర్ 18.42	12.43	
ఐడీఎఫ్‌సీ ట్యాక్స్ అడ్వాంటేజ్	23.54	12.09
ఐసీఐసీఐ ప్రు.లాంగ్‌టర్మ్ ఈక్విటీ	16.21	11.90




ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ (ఈఎల్ఎస్ఎస్) పథకాల్లో చేసే ప్రతీ పెట్టుబడికి మూడేళ్ల లాకిన్ ఉంటుంది. ఆ తర్వాతే ఉపసంహరించుకోగలరు. ప్రస్తుతం మార్కెట్లు అనిశ్చితుల మధ్య ఉన్నాయి. కనుక ఒకే విడత ఏకమొత్తంలో ఇన్వెస్ట్ చేయడం కంటే, నెలవారీ వాయిదాల రూపంలో పెట్టుబడులు పెట్టుకోవడం అనుకూలం. లంప్‌సమ్‌గా ఇన్వెస్ట్ చేస్తే కనీసం, ఐదు, ఏడేళ్లపాటు కదపకుండా కొనసాగించడం ద్వారా రాబడులు పొందొచ్చు. ఇన్వెస్ట్ చేసిన తర్వాత, ఒకవేళ మార్కెట్లు కిందకు పడిపోయి నష్టాలు చూపిస్తుంటే, ఆందోళన చెందే తరహా వ్యక్తిత్వం ఉన్న వారికి అనుకూలం కాదు. ఒక ఆర్థిక సంవత్సరంలో ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో రూ.1.5 లక్షల మొత్తం ఇన్వెస్ట్ చేసి ఆ మేరకు పన్ను లేకుండా చూసుకోవచ్చు. ఉపసంహరించుకున్నప్పుడు దీర్ఘకాల మూలధన లాభాల పన్ను అమలవుతుంది. రూ.లక్షకు మించిన లాభంపై 10 శాతం పన్ను చెల్లించాలి.



జీవిత బీమా పథకాలు

జీవిత బీమా ఎండోమెంట్ ప్లాన్లలో రాబడి దీర్ఘకాలానికి 5 శాతంగా ఉంటుంది. పన్ను ఆదా కోసం ఇది మెరుగైన ఎంపిక కాదు. దీనికంటే కూడా యులిప్‌లు మెరుగైనవి. లేదంటే ఈఎల్ఎస్ఎస్, పీపీఎఫ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. బీమా ఎండోమెంట్ ప్లాన్లలో జీవిత బీమా కవరేజీ కూడా చెల్లించే ప్రీమియానికి నామమాత్రంగానే ఉంటుంది. రూ.50 లక్షల టర్మ్ ఇన్సూరెన్స్ రూ.12,0000 ప్రీమియానికి వస్తుంది. కానీ, ఎండోమెంట్ ప్లాన్‌లో రూ.50 లక్షల కవరేజీ కావాలంటే ఏటా రూ.4–5 లక్షలు చెల్లించాల్సి వస్తుంది. జీవితానికి రక్షణ కోణంలోనే బీమా ఉత్పత్తులు కొనుగోలు చేయాలి.

సుకన్య సమృద్ధి యోజన



ప్రస్తుత వడ్డీ 7.6%. కుమార్తెల పేరిట ప్రారంభించి, పెట్టుబడులు పెట్టుకునే పథకం ఇది. వారికి 18 ఏళ్లు వచ్చే వరకు దీన్ని కొనసాగించుకోవచ్చు. పదేళ్లలోపు ఆడపిల్లలను కలిగిన తల్లిదండ్రులు ఈ పథకాన్ని పరిశీలించొచ్చు. ఏటా రూ.1.50 లక్షల పెట్టుబడిపై సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు పొందొచ్చు. గడువు ముగిసిన తర్వాత తీసుకునే మొత్తంపైనా పన్ను ఉండదు. ఈ పథకంలో వడ్డీ రేటును కేంద్ర ప్రభుత్వం ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తుంటుంది. బ్యాంకు శాఖలు, తపాలా కార్యాలయాల్లో ప్రారంభించుకోవచ్చు. కనీస పెట్టుబడి రూ.1,000. గరిష్టంగా ఇద్దరు కుమార్తెల పేరిట దీన్ని తెరుచుకునేందుకు అనుమతి ఉంది. ఇద్దరి పేరిట ఖాతాలు తెరిచినా సెక్షన్ 80సీ కింద ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలకే పన్ను మినహాయింపు కోరగలరు.

ఎన్ఎస్‌సీ, పన్ను ఆదా ఎఫ్‌డీలు

ఎన్ఎస్‌సీలను పోస్టాఫీసు నుంచి కొనుగోలు చేసుకోవచ్చు. పన్ను ఆదా ఎఫ్‌డీని బ్యాంకుల్లో తీసుకోవచ్చు. రెండింటిలోనూ లాకిన్ పీరియడ్ ఐదేళ్లు. ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీపై డీసీబీ బ్యాంక్ అత్యధికంగా 8.10 శాతం రేటును ఆఫర్ చేస్తుంటే, యాక్సిస్ బ్యాంక్ రూ.7.75 శాతం ఇస్తోంది. మిగిలిన బ్యాంకుల్లో 6.70 శాతం నుంచి 7.50 శాతం మధ్య రేట్లు ఉన్నాయి. పన్ను ఆదా ఎఫ్‌డీ అంటే పెట్టుబడిపైనే. వడ్డీ రాబడి పన్ను పరిధిలోకి వస్తుంది. వ్యక్తిగత ఆదాయానికి కలుస్తుంది. ఎన్ఎస్‌సీ కేవలం పోస్టాఫీసులోనే కొనుగోలు చేసుకోగలరు. దీంతో పోలిస్తే ట్యాక్స్ సేవింగ్ ఎఫ్‌డీని బ్యాంకుల్లో ప్రారంభించడం, క్లోజ్ చేసుకోవడం సులభం. కొన్ని బ్యాంక్‌లు ఆన్‌లైన్‌లోనూ ఆఫర్ చేస్తున్నాయి. ఎన్ఎస్‌సీలో ప్రస్తుతం 7 శాతం రేటు అమల్లో ఉంది. ఎన్ఎస్‌సీలో పెట్టుబడిని సెక్షన్ 80సీ కింద మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. వడ్డీ రాబడి పన్ను పరిధిలోకి వస్తుంది.

రిటైర్మెంట్ మ్యూచువల్ ఫండ్స్



వీటిల్లో గత మూడేళ్ల కాలంలో చూస్తే వార్షిక రాబడులు 7–13 శాతం మధ్య ఉన్నాయి. రిటైర్మెంట్ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను సైతం సెక్షన్ 80 సీ కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ మ్యూచువల్ ఫండ్స్ పథకాలు పెట్టుబడుల్లో 40 శాతాన్ని ఈక్విటీలకు, 55–60 శాతాన్ని డెట్ సాధనాలకు కేటాయిస్తుంటాయి. ఫ్రాంక్లిన్ పెన్షన్ ఫండ్, యూటీఐ రిటర్మెంట్ బెనిఫిట్ పెన్షన్ ఫండ్ ఇందుకు ఉదాహరణలు. వీటిల్లో రిస్క్ తక్కువ. తక్కువ రిస్క్ ఉండాలని కోరుకునే ఇన్వెస్టర్లు రిటైర్మెంట్ కోసం వీటిల్లో ఇన్వెస్ట్ చేసి సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. వీటిల్లో పెట్టుబడులకు ఐదేళ్ల లాకిన్ ఉంటుంది. రాబడి మాత్రం పన్ను పరిధిలోకి వస్తుంది. డెట్‌కు ఎక్కువ కేటాయింపులు చేస్తే, డెట్ ఫండ్స్ మాదిరిగా లాభంపై 20 శాతం పన్ను చెల్లించాలి. లాభం నుంచి ద్రవ్యోల్బణ ప్రభావాన్ని మినహాయించొచ్చు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

6-2-2023	
విశాఖ	460–00
చిత్తూరు	473–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	445–00
విజయవాడ	445–00
5-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	412–00
వరంగల్	414–00

ఐపీఓ బాటన ఐఆర్ఈడీఏ, వాప్కోస్

న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరంలో 2 ప్రభుత్వ రంగ కంపెనీలు పబ్లిక్ ఇష్యూలను చేపట్టే ప్రణాళికలున్నట్లు దీపమ్ కార్యదర్శి తుహిన్ కాంత పాండే తెలియజేశారు. శుద్ధ ఇంధన రంగ ఫైనాన్స్ మినీ రత్న కంపెనీ ఐఆర్ఈడీఏ, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీ సంస్థ వాప్కోస్ జాబితాలో ఉన్నట్లు పేర్కొన్నారు. తాజా బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ. 51,000 కోట్ల లక్ష్యంలో భాగంగా ఈ రెండు కంపెనీల డిజిన్వెస్ట్‌మెంట్‌ను చేపట్టనున్నట్లు తెలియజేశారు.

ఫండ్ పెట్టుబడులను కానుకగా ఇవ్వొచ్చా..?

ఫండ్ పథకంలో నాకు పెట్టుబడులు ఉన్నాయి. వీటిని ఎవరికైనా బహుమతిగా ఇవ్వొచ్చా? – శ్రీలలిత

మ్యూచువల్ ఫండ్స్ పథకంలోని యూనిట్లు ఒకరికి బదిలీ చేయడం కానీ, బహుమతిగా ఇవ్వడం కానీ కుదరదు. ఇన్వెస్టర్ తన పేరిట ఉన్న యూనిట్లు వేరొకరికి బదిలీ చేయడం అన్నది కేవలం.. ఇన్వెస్టర్ మరణించిన సందర్భాల్లోనే చోటు చేసుకుంటుంది. అటువంటి సందర్భంలో నామినీ క్లెయిమ్ దాఖలు చేసుకోవాల్సి ఉంటుంది. మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను పిల్లలకు బహుమతిగా ఇవ్వాలని అనుకుంటే నేరుగా వారి పేరుతో ఇన్వెస్ట్ చేయడం ఒక్కటే మార్గం. పిల్లల వయసు 18 ఏళ్లలోపు ఉన్నా ఇది సాధ్యపడుతుంది. అటువంటప్పుడు పిల్లలు మేజర్ అయ్యే వరకు తల్లిదండ్రులే సంబంధిత పెట్టుబడులపై సంరక్షకులుగా నిర్ణయాధికారం కలిగి ఉంటారు. పిల్లల పుట్టిన తేదీ సర్టిఫికెట్‌తో పాటు, గార్డియన్ కేవైసీ వివరాలను మ్యూచువల్ ఫండ్ సంస్థ అడుగుతుంది. పిల్లల పేరిట (మైనర్లు) ఉన్న ఫండ్ పెట్టుబడులను విక్రయించగా వచ్చిన ఆదాయం.. తల్లిదండ్రుల ఆదాయానికి కలిపి చూపించాల్సి ఉంటుంది. ఒకవేళ పిల్లల వయసు 18 ఏళ్లు నిండిన తర్వాత పెట్టుబడులను వెనక్కి తీసుకుంటే అది వారి వ్యక్తిగత ఆదాయం కిందకే వస్తుంది. మీ పేరిట ఉన్న పెట్టుబడులను విక్రయించేసి, వచ్చిన మొత్తాన్ని పిల్లల బ్యాంకు ఖాతాకు బదిలీ చేయాలి. ఆ తర్వాత వారి పేరిట కొనుగోలు చేసుకోవాలి. మూడో వ్యక్తి (థర్డ్ పార్టీ) నుంచి పెట్టుబడిని ఫండ్స్ సంస్థలు ఆమోదించవు. ఫండ్స్ యూనిట్లు కొనుగోలు చేస్తున్న వ్యక్తి స్వయంగా ఆ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుంది. కనుక బహుమతిగా ఇవ్వాలనుకునే వారికి నగదు బదిలీ చేసి, కొనుగోలు చేసుకోవడం ఒక్కటే మార్గం.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను ప్రతి నెలా ఇన్వెస్ట్ చేస్తున్న ఓ మ్యూచువల్ ఫండ్ పథకం స్టార్ రేటింగ్ 4 ఉండేది కాస్తా, 3కు తగ్గింది. అందుకుని ఈ పెట్టుబడులను విక్రయించేసి, తిరిగి 4 లేదా 5 స్టార్ పథకంలో ఇన్వెస్ట్ చేయాలని అనుకుంటున్నాను. అయితే ఈ మొత్తం ఒకే విడత చేయాలా..? లేక సిస్టమ్యాటిక్ విత్ డ్రాయల్ (ఎస్‌డబ్ల్యూపీ) రూపంలో చేసుకోవాలా? – రాజ్‌దీప్ సింగ్


ఓ పథకం నుంచి వైదొలిగేందుకు స్టార్ రేటింగ్‌ను 4 నుంచి 3కు తగ్గించడం ఒకే కారణంగా ఉండకూడదు. 3 స్టార్ చెత్త పనితీరుకు నిదర్శనం కానే కాదు. 3 స్టార్ రేటింగ్ కలిగిన చాలా పథకాలు ఆయా విభాగాల్లోని సగటు పనితీరుకు మించి రాబడులను ఇస్తున్నాయి. ఒక్కసారి ఒక పథకంలో పెట్టుబడులు కొనసాగించకూడదని నిర్ణయించుకున్న తర్వాత ఇక ఎస్‌డబ్ల్యూపీ ఆలోచనే అక్కర్లేదు. కాకపోతే ఎగ్జిట్‌లోడ్, మూలధన లాభాల అంశాలను దృష్టిలో పెట్టుకుని నిర్ణయించుకోండి. విడతలుగా పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం సరైనది. ముందుగా ఎగ్జిట్ లోడ్ లేని, దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష వరకు పన్ను లేని మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు. ఇది పన్ను ఆదా అవుతుంది.

తాన్లా ప్లాట్‌ఫామ్స్ | జియోజిత్ ఫైనాన్షియల్ | కొనొచ్చు

సాక్షి స్టాక్స్

ప్రస్తుత ధర: రూ. 630 టార్గెట్: రూ. 920

ఎందుకంటే: కమ్యూనికేషన్స్ ప్లాట్‌ఫామ్‌ను సర్వీసులుగా అందించే సీపాస్ (ఇక్పు) కంపెనీ తాన్లా ప్లాట్‌ఫామ్స్. దేశీయంగా అతిపెద్ద సంస్థగా నిలుస్తోంది. దాదాపు 40 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది. వార్షికంగా 800 బిలియన్ల ఇంటరేక్షన్స్‌ను హ్యాండిల్ చేస్తోంది. 2020–25 మధ్య కాలంలో దేశీయంగా సీపాస్ పరిశ్రమ 30 శాతం వార్షిక వృద్ధిని సాధించగలదని అంచనా. ఇందుకు ప్రధానంగా గరిష్టస్థాయిలోని ప్రభుత్వ నియంత్రణలు, వేగంగా పెరుగుతున్న మొబైల్ కస్టమర్ల సంఖ్య సహకరించనున్నాయి. ట్రూబ్లక్, వైజ్‌లీ ప్లాట్‌ఫామ్ తదితర ప్లాట్‌ఫామ్ బిజినెస్‌ల ద్వారా ఆదాయం పుంజుకోనున్నట్లు కంపెనీ యాజమాన్యం భావిస్తోంది. వైజ్‌లీ.. క్లౌడ్ ఆధారిత బ్లాక్‌చైన్ వినియోగిత ప్లాట్‌ఫామ్. డేటా ప్రైవసీ, సెక్యూరిటీ, ట్రేకబిలిటీ సేవలందిస్తోంది. అంతేకాకుండా తక్కువ లేటెన్సీ(డేటా బదిలీలో ఆలస్యం)సహా ఉత్తమ స్కేలబిలిటీ(సామర్థ్యం)ను కలిగి ఉంది. గతేడాది(2021–22)కల్లా రూ. 808 కోట్ల నికర నగదు నిల్వలతో పటిష్ట బ్యాలన్స్ షీట్‌ను కలిగి ఉంది. రుణ, ఈక్విటీ(డీఈ) నిష్పత్తి సైతం నామమాత్రంగా 0.03గా నమోదైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23) తొలి అర్ధభాగం(ఏప్రిల్–సెప్టెంబర్)లో ఆదాయం నీరసించినప్పటికీ ఇకపై నిలకడను సాధించనుంది.



నవీన్ ఫ్లోరిన్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 4,004 టార్గెట్: రూ. 5,090

ఎందుకంటే: గత నాలుగు నెలల్లో స్పెషాలిటీ కెమికల్స్ కంపెనీ నవీన్ ఫ్లోరిన్ ఇంటర్నేషనల్ కౌంటర్ 17 శాతంపైగా దిద్దుబాటుకు లోనయ్యింది. ఇందుకు ప్రధానంగా అంతర్జాతీయ స్థాయిలో డిమాండు మందగిస్తుందన్న ఆందోళనలు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2022–23) రెండో త్రైమాసికం(జులై–సెప్టెంబర్)లో నమోదైన అనుకోని ఇతర వ్యయాలు కారణమయ్యాయి. కంపెనీ 2022–2025 మధ్య కాలంలో పటిష్ట పనితీరు చూపే అవకాశముంది. వెరసి రానున్న మూడేళ్లలో నికర లాభం వార్షికంగా 39 శాతం చొప్పున వృద్ధి సాధించే వీలుంది. అయితే షేరు దిద్దుబాటుతో మార్కెట్లు ఈ అంశాన్ని కొద్ది రోజులుగా విస్మరించినట్లు కనిపిస్తోంది. హైడ్రో ఫ్లోరోఒలిఫిన్స్(హెచ్ఎఫ్‌వో) సరఫరాకు గ్లోబల్ సంస్థ హనీవెల్ నుంచి నవీన్‌కు అదనపు కాంట్రాక్టు లభించేందుకు వీలుంది. కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్ అండ్ మ్యాన్యుఫాక్చరింగ్ సంస్థ(సీడీఎంవో)గా మాలిక్యూల్స్ తయారీ పెంపుతోపాటు, స్పెషాలిటీ కెమికల్స్ కొత్త ప్రొడక్టులను జత చేసుకునే అవకాశముంది. పలు దీర్ఘకాలిక కాంట్రాక్టులను కలిగి ఉన్న కంపెనీగా భవిష్యత్ పనితీరుపై ఆశావహ అంచనాలున్నాయి.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

యాక్సిస్ ఎంఎఫ్ బిజినెస్ సైకిల్స్ ఫండ్.



యాక్సిస్ మ్యుచువల్ ఫండ్ సంస్థ కొత్తగా బిజినెస్ సైకిల్స్ ఫండ్‌ను ప్రవేశపెట్టింది. ఈక్విటీ, ఈక్విటీ ఆధారిత సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా దీర్ఘకాలంలో మూలధనాన్ని వృద్ధి చేయడం ఈ స్కీమ్ ప్రధాన ఉద్దేశం. ఇందులో కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ఈ న్యూ ఫండ్ ఆఫర్ ఫిబ్రవరి 16తో ముగుస్తుందని సంస్థ సీఈవో నిగమ్ తెలిపారు. నిఫ్టీ 500 టీఆర్ఐ దీనికి ప్రామాణికం.

మిరే అసెట్ నుంచి ఫ్లెక్సీ క్యాప్ ఫండ్.



మిరే అసెట్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్స్ (ఇండియా) సంస్థ తాజాగా ఫ్లెక్సీ క్యాప్ ఫండ్‌ను ఆవిష్కరించింది. స్టాక్స్‌లో పెట్టుబడి తీరులో వైవిధ్యాన్ని పాటించడం దీని ఉద్దేశం. 5 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం ఇన్వెస్ట్ చేయదల్చుకునే మదుపుదారులకు ఇది అనువైనది. ఈ ఫండ్‌లో కనీసం రూ. 5,000 నుంచి ఇన్వెస్ట్ చేయొచ్చు. ఫిబ్రవరి 17తో ఈ న్యూ ఫండ్ ఆఫర్ ముగుస్తుంది.

పీజీఐఎం ఇండియా గిల్ట్ ఇండెక్స్ ఫండ్



పీజీఐఎం ఇండియా ఫండ్ క్రిసిల్ ఐబీఎక్స్ గిల్ట్ ఇండెక్స్ – ఏప్రిల్ 2028 ఫండ్‌ను ప్రారంభించింది. ఈ ఆఫర్ 16 వరకు అందుబాటులో ఉంటుంది. ఫండ్‌లో ప్రభుత్వ సెక్యూరిటీలకు 98%, టి–బిల్స్‌కు 2% వెయిటేజ్ ఉంటుంది. నెలవారీ ప్రాతిపదికన ఇండెక్స్‌ను సమీక్షించి, రీబ్యాలెన్స్ చేస్తారు. ఫండ్ 2028 ఏప్రిల్ 5న మెచ్యూర్ అవుతుంది. కనీసం రూ. 5,000 నుంచి ఆ పైన రూ. 1,000 చొప్పున ఇన్వెస్ట్ చేయొచ్చు.

వరుసగా గ్రూప్‌-1 పరీక్షలా!

అభ్యర్థుల్లో ఆందోళన.. రోజువిడిచి రోజు నిర్వహించాలని డిమాండ్‌

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (టీఎస్‌పీఎస్సీ) గ్రూప్‌–1 మెయిన్‌ (ప్రధాన) పరీక్షల తేదీలపై అభ్యర్థుల్లో ఆందోళన పెరుగుతోంది. వరుసగా పరీక్షలు ఉండటం అభ్యర్థులపై ఒత్తిడి పెరుగుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందువల్ల పరీక్ష తేదీల్లో మార్పులు చేయాలని, కనీసం రోజువిడిచి రోజు పరీక్షలు ఉండేలా షెడ్యూల్‌ రూపొందించాలనే డిమాండ్‌ పెరుగుతోంది. గ్రూప్‌–1 మెయిన్‌ కేటగిరీలో ఏడు పరీక్షలున్నాయి. జనరల్‌ ఇంగ్లిష్‌ క్వాలిఫైయింగ్‌ పరీక్ష కాగా, మిగతా 6 పేపర్లు ప్రధానపరీక్షలు. ఒక్కో పరీక్షకు గరిష్టంగా 150 మార్కులు లెక్కన మొత్తం 1,050 మార్కులుంటాయి. ఈ ఏడింటిలో ఒకటి మినహా మిగతా ఆరు పరీక్ష లను జూన్‌ 5 నుంచి 12 వరకు (11వ తేదీ మినహా) నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

ఏపీపీఎస్సీలో అలా...

ఉమ్మడి రాష్ట్రంలో ఏపీపీఎస్సీ మెయిన్‌ పరీక్షల తేదీలను ఒక్కో పరీక్షకు ఒక రోజు అంతరం ఉండేలా షెడ్యూల్‌ను రూపొందించి నిర్వహించింది. 2012లో గ్రూప్‌–1 మెయిన్‌ పరీక్షలను సెప్టెంబర్‌ 18, 20, 22, 24, 26, 28 తేదీల్లో చేపట్టింది. అలాగే విభజన తర్వాత ఏపీపీఎస్సీ పరిధిలో 2016లో జరిగిన మెయిన్‌ పరీక్షల్లో జనరల్‌ ఇంగ్లిష్‌ పరీక్ష సెప్టెంబర్‌ 13న నిర్వహించగా సెప్టెంబర్‌ 14, 17, 19, 21, 23 తేదీల్లో ఐదు పేపర్లకు సంబంధించిన పరీక్షలు జరిగాయి.

ఒత్తిడితో ఉక్కిరిబిక్కిరి...

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత ప్రభుత్వం తొలిసారి గ్రూప్‌–1 ఉద్యోగాల భర్తీ చేపట్టడం... 503 ఉద్యోగ ఖాళీలు ఉండటంతో అభ్యర్థులు పట్టుదలతో సిద్ధమవుతున్నారు. అయితే పరీక్షలను వరుసగా నిర్వహిస్తే అభ్యర్థులు మానసిక ఒత్తిడికి గురయ్యే ప్రమాదం ఉందని, వారి ఏకాగ్రత దెబ్బతినే అవకాశం ఉందని సైకియాట్రిస్టులు చెబుతున్నారు.



గత విధానాన్ని అనుసరించాలి..

పరీక్షలను వరుసగా కాకుండా రోజువిడిచి రోజు నిర్వహిస్తే అభ్యర్థులకు ఉపశమనం లభిస్తుంది. అలా కాకుండా వరుసగా నిర్వహిస్తే ఒత్తిడికి గురై పరీక్షలను పక్కాగా రాయడంలో విఫలమయ్యే అవకాశం ఉంది. అందువల్ల ఉమ్మడి ఏపీలో నిర్వహించిన పరీక్షల విధానాన్ని టీఎస్‌పీఎస్సీ పరిశీలించి నిర్ణయం తీసుకోవాలి.

– ఏఎస్‌ నారాయణ, గ్రూప్‌–1 మెయిన్స్‌ అభ్యర్థి



సరికొత్త చాయ్‌.. చుహిచా!

బ్లాక్‌ టీ, గ్రీన్‌ టీ, లెమన్‌ టీ, జింజర్‌ టీ, హెర్బల్‌ టీ... ప్రపంచవ్యాప్తంగా చాయ్‌ ప్రియులు ఇలా రకరకాల టీల రుచిని, ఘుమఘుమలను నిత్యం ఆస్వాదిస్తుంటారు. కానీ జపాన్‌లోని క్యోటో యూనివర్సిటీకి చెందిన సుయోషీ మరోకా అనే పరిశోధకుడు ఓ సరికొత్త 'టీ'ని ప్రయోగశాలలో తయారు చేశాడు. దానికి చుహిచా అని పేరు పెట్టాడు. దీని పేరే కాదు.. తయారీ కూడా అత్యంత విచిత్రమైనదే!! ఎందుకంటే.. ఈ టీని జిప్సీ మాథ్‌ అనే గొంగళిపురుగుల విసర్జితాల నుంచి తయారు చేస్తారు కాబట్టి..!! ఓ రోజు ల్యాబ్‌కు తన సీనియర్‌ తీసుకొచ్చిన కొన్ని గొంగళిపురుగులకు చెర్రీ ఆకులను ఆహారంగా అందించిన మరోకా... ఆ మర్నాడు వాటి విసర్జితాల శుభ్రపరుస్తుండగా వాటి నుంచి సువాసన రావడంతో ఈ చాయ్‌ తయారీ ఆలోచనను ఆచరణలో పెట్టినట్లు అతను చెప్పుకొచ్చాడు. అతను అంతటితోనే ఆగలేదు.. ఈ చాయ్‌ను వాణిజ్య స్థాయిలో తీసుకొచ్చేందుకు అవసరమైన సుమారు రూ. 13 లక్షల నిధుల కోసం ప్రస్తుతం ఆన్‌లైన్‌లో క్రౌడ్‌ ఫండింగ్‌ బాటపట్టాడు. జపాన్‌ పొరుగునున్న చైనాలో పట్టుపురుగుల విసర్జితాల నుంచి తయారు చేసే టీని చైనీయులు ఎన్నో వందల ఏళ్ల ఔషధంగా సేవిస్తుండటం కొసమెరుపు.

క్లుప్తంగా...

వైభవంగా శ్రీచక్ర తీర్థం



యాదగిరిగుట్ట: పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కొనసాగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీస్వామి, అమ్మవార్లకు శ్రీచక్ర తీర్థం వేడుకలను ఆచార్యులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నిత్య పూజల అనంతరం అనంతరం మహా పూర్ణాహుతిని నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి, అమ్మవార్లను ప్రత్యేక పల్లకిపై అలంకరించి తిరువీధుల్లో ఊరేగించి, పుష్కరిణిలో శ్రీచక్ర స్నానం చేశారు. వేడుకల్లో ఇన్‌చార్జి ఈవో రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి పాల్గొన్నారు. భక్తులు పుష్కరిణిలో శ్రీచక్ర తీర్థాన్ని తీసుకునేందుకు పోటీపడ్డారు. రాత్రి దేవతోద్వాసన, శ్రీపుష్పయాగం, డోలారోహణం వేడుకలను జరిపించారు. సోమవారం శతఘటాభిషేకంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

కేంద్రమంత్రి నిర్మలతో గవర్నర్‌ తమిళిసై భేటీ



కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు అభివృద్ధి ప్రణాళిక అందజేస్తున్న గవర్నర్‌ తమిళిసై

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌.. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయ్యారు. ఆదివారం మధ్యాహ్నం ఢిల్లీ వచ్చిన గవర్నర్‌ కేంద్రమంత్రిని కలిసి తెలంగాణ భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలను సమర్పించారు. ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌ దేశ భవిష్యత్తుకు తార్కాణంగా నిలుస్తుందని నిర్మలా సీతారామన్‌ను అభినందించారు. అనంతరం సాయంత్రం ఢిల్లీ జేఎల్‌ఎన్‌ స్టేడియంలో జరిగిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా కుమారుడి వివాహ రిసెప్షన్‌కు గవర్నర్‌ హాజరయ్యారు.

వైభవంగా శాంతి కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న చినజీయర్‌ స్వామి

శంషాబాద్‌ రూరల్‌: మండలంలోని శ్రీరామ నగరంలో సమతా కుంభ్‌ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శాంతికల్యాణం జరిగింది. శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ చిన జీయర్‌స్వామి పర్యవేక్షణలో వేదికపై 108 దివ్య దేశాధీశులకు ఒకేసారి కల్యాణోత్సవం నిర్వ హించారు. ఒకేచోట జరిగిన ఈ కల్యాణోత్స వం అద్భుతమని చినజీయర్‌ స్వామి అన్నారు.

భవిష్యత్తులో మహమ్మారిల నియంత్రణ

అమెరికా వర్సిటీతో ఎల్లా ఫౌండేషన్‌ ఒప్పందం

సాక్షి, న్యూఢిల్లీ: భవిష్యత్తులో మనుషులు, జంతువులు, మొక్కలు ఎలాంటి మహమ్మారిలతో ఇబ్బందులు పడకుండా వైరస్‌లను నియంత్రించడానికి హైదరాబాద్‌కు చెందిన ఎల్లా ఫౌండేషన్‌ అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్‌ విస్కాన్సిన్‌–గ్లోబల్‌ హెల్త్‌ ఇన్‌స్టిట్యూట్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆదివారం ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర శాస్త్ర, సాంకేతిక, వ్యవసాయ విద్య పరిశోధన, బయోటెక్నాలజీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం ఎల్లా ఫౌండేషన్‌ డైరెక్టర్, భారత్‌ బయోటెక్‌ సహ వ్యవస్థాపకులు కృష్ణ ఎల్లా, సుచిత్ర ఎల్లా మాట్లాడుతూ ప్రస్తుతం అందరూ చర్చిస్తున్న వన్‌వరల్డ్, వన్‌హెల్త్‌ గురించి ఎల్లా ఫౌండేషన్‌ తరఫున అమెరికా విస్కాన్సిన్‌ వర్సిటీకి చెందిన గ్లోబల్‌ హెల్త్‌ ఇన్‌స్టిట్యూట్‌ (జీహెచ్‌ఐ) కూడా ఆలోచిస్తోందన్నారు. భవిష్యత్తు ఆరోగ్య సమస్యలు, వాటిని అధిగమించడానికిగాను జీహెచ్‌ఐతో కలిసి పనిచేయనున్నామన్నారు.

రూ.520కే గన్‌ డెలివరీ!

ఆయుధాల పేరుతో అందినంత దోచుకుంటున్న సైబర్‌ నేరగాళ్లు

- ఫేస్‌బుక్‌లోని 'మార్కెట్‌ ప్లేస్‌' కేంద్రంగా వల
- నాటు, నీటు గన్స్‌ విక్రయిస్తామంటూ ప్రచారం
- చిన్న మొత్తాలు ట్రాన్స్‌ఫర్‌ చేయించుకుని మోసం
- పోలీసులకు ఫిర్యాదు చేయని బాధితులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న సైబర్‌ క్రైమ్‌ నిపుణులు



సాక్షి, హైదరాబాద్‌: కంటికి కనిపించకుండా కేవలం ఫోన్‌ ద్వారానే కథ నడుపుతూ అందినకాడికి దండుకునే సైబర్‌ నేరగాళ్లు ఎప్పటికప్పుడు కొత్త ఎత్తులు వేస్తున్నారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో తయారైన నాటు, నీటు తుపాకులను తక్కువ ధరకు విక్రయిస్తామంటూ ఫేస్‌బుక్‌లోని మార్కెట్‌ ప్లేస్‌ కేంద్రంగా ప్రచారం చేసి మోసాలకు పాల్పడుతున్నారు. తుపాకీకి డబ్బు ఇప్పుడు చెల్లించాల్సిన పనిలేదని, కేవలం రూ.520 అడ్వాన్స్‌గా చెల్లిస్తే డెలివరీ చేస్తామని, ఆ తర్వాత మిగిలిన డబ్బులు చెల్లించాలని నమ్మబలుకుతున్నారు. ఇందులో బాధితులు కోల్పోతున్నది చిన్న మొత్తాలే కావడంతో ఎవరూ పోలీసుల వరకు వెళ్లి ఫిర్యాదులు చేయడం లేదు. దీన్నే అదనుగా భావిస్తున్న అనేక ముఠాలు ఈ తరహా నేరాలకు పాల్పడి అనునిత్యం రూ.లక్షల్లో కొల్లగొడుతున్నాయి.

వీడియో రూపంలో ప్రకటన..

ఫేస్‌బుక్‌లో ఆల్‌ ఇండియా డెలివరీ పేరుతో ఓ పేజ్‌ ఏర్పాటు చేసిన సైబర్‌ నేరగాళ్లు అందులో తుపాకులు, తపంచాలు, కత్తులకు సంబంధించిన వీడియోలు పోస్టు చేస్తున్నారు. ఈ పేజ్‌ పైనే 86384 67582 అనే మొబైల్‌ నంబర్‌ కూడా ఉంటోంది. దేశవ్యాప్తంగా ఎక్కడికైనా డెలివరీ చేస్తామంటూ ఓ లింకును పెడుతున్నారు. ఈ ప్రకటనకు ఆకర్షితులైన వాళ్లు ఈ లింక్‌ క్లిక్‌ చేస్తే.. అది నేరుగా వాట్సాప్‌కు వెళ్తోంది. ఫేస్‌బుక్‌ పేజ్‌ పైన ఉన్న నంబర్‌తోనే పని చేసే ఈ వాట్సాప్‌ ఖాతాకు డిస్‌ప్లే పిక్చర్‌ (డీపీ)గా ఆయుధాలను పక్కన పెట్టుకుని పడుకున్న యువకుడి ఫొటో ఉంటోంది. ఫేస్‌బుక్‌ ద్వారా ఈ వాట్సాప్‌ ఓపెన్‌ కావడంతోనే తెరిచిన వ్యక్తి ఆ ఆయుధాల వివరాలు తెలుసుకోవాలని భావిస్తున్నట్లు సందేశం సైతం పోస్టు అవుతోంది.

రకరకాల ఫొటోలు షేర్‌ చేసి..

ఆ వెంటనే స్పందిస్తున్న సైబర్‌ నేరగాళ్లు వివిధ రకాల తుపాకులకు సంబంధించిన 20–30 ఫొటోలు షేర్‌ చేస్తున్నారు. ఎదుటి వారిని పూర్తిగా నమ్మించడానికి ఈ ఫొటోలు కూడా ఇంటర్‌నెట్‌ నుంచి డౌన్‌లోడ్‌ చేసినట్లు ఉండకుండా జాగ్రత్తపడుతున్నారు. చేత్తో పట్టుకుని, వాహనాలపై ఉంచి, వస్త్రాల్లో భద్రంగా కట్టి ఉంచిన తుపాకుల ఫొటోలనే షేర్‌ చేస్తున్నారు. వీటిని చూసిన వాళ్లు అవతలి వారి దగ్గరే అవి ఉన్నట్లు భావిస్తున్నారు. ఇవతలి వ్యక్తి వాటి ఖరీదు చెప్పమంటూ ఆరా తీస్తే... తొలుత ఓ తుపాకీ ఎంచుకుని దాన్ని తనకు రిటర్న్‌ షేర్‌ చేయమంటూ సైబర్‌ నేరగాడు సూచిస్తున్నాడు. అలా చేసిన తరువాత ఆ తుపాకీ ధరను రూ.3 వేల నుంచి రూ.5 వేల మధ్య చెప్పి, ఎక్కడకు కావాలంటే అక్కడకు తెచ్చి ఇస్తామంటున్నాడు.

పరీక్షించడం కోసమూ చెల్లింపులు..

తమ వద్ద ఏ తుపాకీ ఖరీదు చేసినా దాంతో పాటు పది తూటాలు ఉచితంగా ఇస్తామంటూ నమ్మిస్తున్నారు. ఆయుధానికి పూర్తి మొత్తం ముందుగా చెల్లించాల్సిన పనిలేదని, అడ్వాన్స్‌గా కేవలం రూ.520 చెల్లిస్తే డెలివరీ చేస్తామని, ఆ తర్వాత మిగిలిన డబ్బులు చెల్లించాలని నమ్మబలుకుతున్నారు. తుపాకులపై ఆసక్తి ఉన్న వాళ్లు, తక్కువ ధరకు వస్తోందని భావించిన వారిలో కొందరు ఇది నిజమా? కాదా? అనేది తెలుసుకోవడానికి చెల్లింపులు చేస్తున్నారు. ఈ అడ్వాన్స్‌ను 89509 45896 నంబర్‌కు వాట్సాప్‌ చేయాలంటూ సైబర్‌ నేరగాళ్లు సూచిస్తున్నారు. ఆ మొత్తం పంపే వరకు సందేశాలు పంపుతూనే ఉంటున్నారు. ఒకసారి తన ఖాతాలో ఆ డబ్బు పడిన తర్వాత బాధితుల నంబర్లను బ్లాక్‌ చేయడం, వేరే నంబర్‌ నుంచి కాల్‌ చేసినా ఎత్తకపోవడం వంటివి చేస్తున్నారు. తాము కోల్పోయింది చిన్న మొత్తమే అనే భావనతో బాధితులూ ఫిర్యాదులు చేయట్లేదు. దీంతో సైబర్‌ నేరగాళ్లు మరింత రెచ్చిపోతున్నారు.



తుపాకుల ప్రచారంపై ఫేస్‌బుక్‌ పేజీలో పెట్టిన పోస్ట్‌. (ఇన్‌సెట్‌లో) వాట్సాప్‌ డీపీలో ఉన్న ఫొటో

ఇది మోసం కాకపోయినా నేరమే..

ఇలాంటి మోసాల్లో ఒక బాధితుడు కోల్పోయేది తక్కువే అయినా... వారి సంఖ్య ఎక్కువగా ఉంటుండటంతో నేరగాళ్లకు చేరేది రూ.లక్షల్లోనే ఉంటుంది. ఈ తరహా నేరాల్లో నేరగాళ్లు వినియోగిస్తున్న ఫోన్‌ నంబర్లు, బ్యాంకు ఖాతాలు బోగస్‌ వివరాలతో లింకై ఉంటాయి. అందువల్ల వాటి ఆధారంగా సైబర్‌ నేరగాళ్లను పట్టుకోవడం కష్టసాధ్యం. అయితే బాధితులు ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తే మాత్రం ఆ బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్‌ చేయించడం ద్వారా వారిని కొంతవరకు కట్టడి చేయొచ్చు. ఇలాంటి మోసపూరిత ప్రకటనల ఉచ్చులో ఎవరూ పడకూడదు. ఇది మోసం కాకుండా నిజంగా ఆయుధాలు డెలివరీ అయినా అదీ నేరమే అవుతుంది. లైసెన్సు లేకుండా ఎవరూ ఎలాంటి ఆయుధాలూ కలిగి ఉండరాదు.

– డి.ప్రభాకర్‌ నాయుడు, సైబర్‌ క్రైమ్‌ నిపుణుడు

మేడారానికి పోటెత్తిన భక్తులు

ఆదివారం 1.50 లక్షల మందికిపైగా రాక



ఎస్‌ఎస్‌ తాడ్వాయి: ములుగు జిల్లా మేడారంలో మినీజాతర ముగిసినప్పటికీ భక్తుల రాక కొనసాగుతూనే ఉంది. ఆదివారం 1.50 లక్షల మందికిపైగా భక్తులు తరలిరావడంతో అమ్మవార్ల గద్దెల ప్రాంగణం కిటకిటలాడింది. మాఘశుద్ధ పౌర్ణమి కావడంతో వనదేవతలను దర్శించుకునేందుకు రాష్ట్రంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అమ్మవార్ల గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానికి గంటల తరబడి సమయం పట్టింది. రద్దీని అదుపు చేసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. ఏర్పాట్లను ఈవో రాజేంద్రం పర్యవేక్షించారు.

పక్షుల వయ్యారం వీక్షకుల విహారం..



- ఉత్సాహంగా ముగిసిన బర్డ్‌వాక్‌
- అరుదైన పక్షులను కెమెరాల్లో బంధించిన పక్షి ప్రేమికులు



పక్షులను తిలకిస్తున్న సందర్శకులు

జన్నారం: మంచిర్యాల జిల్లా జన్నారం ఫారెస్ట్‌ డివిజన్‌ పరిధిలోని కవ్వాల్‌ అభయారణ్యంలో రెండురోజులు నిర్వహించిన బర్డ్‌ వాక్‌ ఆదివారం ముగిసింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పక్షిప్రేమికులకు అటవీ అధికారులు శనివారం రాత్రి కామన్‌పల్లి వాచ్‌టవర్, ఘనిశెట్టికుంటల్లో బస ఏర్పాటు చేశారు. ఢిల్లీ, హైదరాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్, జిల్లాలతోపాటు జవహర్‌లాల్‌ నెహ్రూ ఆర్కిటెక్, ఫైనార్ట్స్‌ వర్సిటీ, హైదరాబాద్‌ ఫారెస్ట్‌ కాలేజ్‌ రీసెర్చ్‌ ఇనిస్టిట్యూట్, కామారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు బర్డ్‌వాక్‌లో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం ఆరు గంటలకు పక్షి ప్రేమికులు కల్పకుంట ప్రాంతానికి వెళ్లారు. అక్కడ అరుదైన పక్షులను వారు తమ కెమెరాల్లో బంధించారు. ఆసియా, ఐరోపా ఖండాలలో సంచరించే పక్షులు ఇక్కడ కనిపించడం అదృష్టమని హైదరాబాద్‌కు చెందిన ఇర్షాద్, కిశోర్, ఢిల్లీకి చెందిన ఆనందిత తెలిపారు. వివిధ రకాల అరుదైన పక్షులను కవ్వాల్‌ అటవీ ప్రాంతంలో గుర్తించినట్లు వెల్లడించారు. అక్కడి నుంచి మైసమ్మ కుంట, ఘనిశెట్టి కుంట ప్రాంతాలలో పర్యటించి అరుదైన పక్షుల ఫొటోలు తీసుకున్నారు. బర్డ్‌ వాచర్లకు ఎఫ్‌డీవో మాధవరావు, రేంజ్‌ అధికారులు హఫీజొద్దీన్, రత్నాకర్‌రావు ఏర్పాట్లు చేశారు. అనంతరం గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బర్డ్‌ వాచర్ల అనుభవాలను తెలుసుకున్నారు.





పీపుల్స్‌ ప్లాజా వేదికగా 'రాల్‌-ఇ'

- ప్రారంభమైన ఎలక్ట్రిక్‌ వాహనాల ర్యాలీ
- ఈవీలకు ప్రోత్సాహం: జయేశ్‌ రంజన్‌



పీపుల్స్‌ప్లాజా వద్ద ర్యాలీలో ఎలక్ట్రిక్‌ వాహనాలు

ఖైరతాబాద్‌ (హైదరాబాద్‌): దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రికల్‌ ర్యాలీ 'రాల్‌–ఇ' నగరంలోని పీపుల్స్‌ ప్లాజా వేదికగా ఘనంగా ప్రారంభమైంది. వారం పాటు జరిగే ఈ ర్యాలీ ఆదివారం 400 వందలకు పైగా ఎలక్ట్రిక్‌ వాహనాల (ఈవీ)లతో ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్‌ రంజన్‌ ప్రారంభించారు. అనంతరం జయేశ్‌ రంజన్‌ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ఎలక్ట్రిక్‌ వాహనాల వైపు మొగ్గుచూపాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా కొనుగోలుదారులకు రాయితీలను ఇస్తుందన్నారు. ఈవీల ప్రాముఖ్యతను తెలియజేసేందుకు మొదటిసారిగా ఇ–మొబిలిటీ వీక్‌ను నిర్వహిస్తున్నారన్నారు. ఇందులోభాగంగా పీపుల్స్‌ ప్లాజా, మియాపూర్, శంషాబాద్, ముంబై హైవే నుంచి అందరూ ఎలక్ట్రిక్‌ వాహనాలతో రాల్‌–ఇ ర్యాలీతో హైటెక్స్‌ వరకు చేరుకుంటారన్నారు. సౌకర్యవంతంగా ఉండటంతోపాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే ఈ ఎలక్ట్రిక్‌ వాహనాలను కొనుగోలు చేయాలని సూచించారు. నగరంలోనే ఎలక్ట్రిక్‌ వాహనాల తయారీ కూడా జరుగుతోందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ నటుడు అడివి శేష మాట్లాడుతూ.. యువత ఈవీల వైపు దృష్టి సారించాలని చెప్పారు. ఈ సందర్భంగా గ్రావ్‌టన్‌ మోటార్స్‌కు చెందిన షెరాజ్, రాహుల్‌లు ఎలక్ట్రిక్‌ వాహనాలతో చేసిన స్టంట్స్‌ అందర్నీ ఆకట్టుకున్నాయి. ర్యాలీలో దర్శకుడు నాగ్‌ అశ్విన్, సెంట్రల్‌ జోన్‌ డీసీపీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఓ..లింగా.. ఓ...లింగా..

ఘనంగా పెద్దగట్టు జాతర



దేవరపెట్టెను తరలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల తదితరులు

సూర్యాపేట: తెలంగాణలో రెండో అతిపెద్ద జాతరైన శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతర ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం దురాజ్‌పల్లిలోని లింగమంతులస్వామి ఆలయ ప్రాంతం 'ఓ..లింగా.. ఓ...లింగా' నామస్మరణతో మార్మోగింది. ఆదివారం అర్ధరాత్రి మంద గంపల ప్రదక్షిణలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు ట్రాక్టర్లు, ఆటోలు, డీసీఎంలలో వచ్చారు. అర్ధరాత్రి యాదవులు సంప్రదాయ దుస్తుల్లో డోలు వాయిద్యాలు, భేరీ చప్పుళ్లు, కటారు విన్యాసాలు చేస్తూ గట్టుపైకి వచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు.

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి

సూర్యాపేట మండలం కేసారంలో లింగమంతుల స్వామి అమ్మవార్లకు విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆదివారం రాత్రి పట్టువస్త్రాలు సమర్పించారు. జాతరలో మొదటిరోజు సూర్యాపేట రూరల్‌ కేసారం గ్రామంనుంచి దేవరపెట్టెను యాదవ కులస్తులు కాలినడకన పెద్దగట్టుకు చేర్చారు. అర్ధరాత్రి దాటిన తర్వాత దేవర పెట్టె గొల్లగట్టుకు చేరుకుంది. రెండోరోజు సోమవారం చౌడమ్మతల్లికి బోనాలు సమర్పించనున్నారు. జాతరకు సోమవారం రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌ యాదవ్‌ వచ్చి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

ఒకేరోజు మూడు పరీక్షలు

- ఈనెల 26న టీఎస్‌పీఎస్సీ, కేంద్ర సంస్థల పరీక్షలు
- డీఏఓ, జేఈ, పీఆర్‌టీ పరీక్షలతో అభ్యర్థుల అయోమయం
- ఏళ్ల తర్వాత ప్రకటన వెలువడినా పరీక్ష రాయలేని పరిస్థితి
- డీఏఓ పరీక్ష తేదీలో మార్పులు కోరుతున్న అభ్యర్థులు

సాక్షి, హైదరాబాద్‌: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహిస్తున్న అర్హత పరీక్షలు అభ్యర్థులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఒకే రోజు మూడు పరీక్షలు నిర్వహిస్తుండడంతో ఎన్నో ఆశలతో సన్నద్ధమైన అభ్యర్థులు నష్టపోయే పరిస్థితి తలెత్తింది. ఈ నెల 26వ తేదీన జరిగే పరీక్షలను చూస్తే రెండు, మూడు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఏదో ఒక పరీక్షకే పరిమితమవాల్సిన పరిస్థితి నెలకొంది. 26న తెలంగాణ స్టేట్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ డీఏఓ (డివిజనల్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌) ఉద్యోగ అర్హత పరీక్ష నిర్వహిస్తోంది. 53 డీఏఓ ఉద్యోగ ఖాళీల భర్తీకి దాదాపు పదిహేనేళ్ల తర్వాత ప్రకటన వెలువడింది. ఈ పరీక్షకు 1.06 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆర్థిక శాఖకు అనుబంధంగా ఉన్న ఈ పోస్టులు అత్యంత కీలకమైనవి. ఈ పరీక్షను ఈనెల 26వ తేదీన ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. పరీక్ష తేదీకి వారం ముందు హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టనుంది. అయితే అదే రోజున కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించి పరీక్షలు జరగనున్నాయి. ఇక కేంద్రీయ విద్యాలయాల్లో ప్రైమరీ టీచర్‌ (పీఆర్‌టీ) ఉద్యోగ అర్హత పరీక్ష ఉండగా.. అదే రోజున స్టాఫ్‌ సెలక్షన్‌ కమిషన్‌ జూనియర్‌ ఇంజనీర్‌ పేపర్‌–2 పరీక్షను సైతం నిర్వహిస్తోంది. సాధారణంగా ఉద్యోగ పరీక్షల నిర్వహణ విషయంలో రాష్ట్రాలు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. కేంద్రీయ నియామక సంస్థలు నిర్వహించే ఉద్యోగ పరీక్షల తేదీలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రాష్ట్ర స్థాయి ఉద్యోగాల భర్తీకి పరీక్షలు నిర్వహించాలని ఉద్యోగరంగ నిపుణులు చెపుతున్నారు. ఒకవేళ ముందస్తుగా రాష్ట్ర నియామక సంస్థలు పరీక్షల తేదీలను ప్రకటిస్తే.. అవసరమైన పక్షంలో అభ్యర్థుల ప్రయోజనాల రీత్యా వాటిని మార్పు చేయడం మంచిదని వారు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 26న జరిగే డీఏఓ, పీఆర్‌టీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు డీఏఓ పరీక్ష తేదీలో మార్పు చేయాలని కోరుతున్నారు.

ఏ పరీక్ష రాయాలో అర్థం కావడంలేదు...

డివిజనల్‌ అకౌంట్స్‌ ఆఫీసర్‌ ఉద్యోగంతో పాటు కేంద్రీయ విద్యాలయాల్లో పీఆర్‌టీ ఉద్యోగ పరీక్షకు సన్నద్ధమవుతున్నాను. కానీ ఈ రెండు పరీక్షలు ఒకే రోజున ఉన్నాయి. రెండింటికీ కష్టపడి చదివాను. ఒకే రోజు రెండు పరీక్షలు ఉండడంతో ఏ పరీక్షను వదులుకోవాలో అర్థం కావడం లేదు.

– జె.తేజస్విని, డీఏఓ, పీఆర్‌టీ అభ్యర్థి

ఒక అవకాశం దెబ్బతిన్నట్లే..

దాదాపు ఆర్నెల్లుగా డీఏఓ, పీఆర్‌టీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాను. ఇందుకోసం అశోక్‌నగర్‌లో ప్రత్యేకంగా ఫీజు చెల్లించి కోచింగ్‌ తీసుకుంటున్నాను. కానీ ఒకే రోజు రెండు పరీక్షలు ఉండటంతో నేను ఒక అవకాశాన్ని వదులుకోవాలి. నియామక సంస్థల మధ్య సమన్వయం లేకపోవడంవల్ల అభ్యర్థుల అవకాశాలు దెబ్బతినడంఎంతవరకు సమంజసం.

–పరిమళ, డీఏఓ, పీఆర్‌టీ అభ్యర్థి

టీఎస్‌పీఎస్సీ పరీక్ష తేదీలను మార్పు చేయాలి

కేంద్ర నియామక సంస్థలు పరీక్షలు నిర్వహించే రోజున రాష్ట్ర స్థాయి నియామక సంస్థలు ఆయా ఉద్యోగాలకు ఎలాంటి పరీక్షలు నిర్వహించవద్దు. ఒక వేళ ఒకే రోజు కేంద్ర, రాష్ట్ర స్థాయి పరీక్షలు ఉంటే టీఎస్‌పీఎస్సీ తేదీల్లో మార్పులు చేయాలి. 14 సంవత్సరాల తర్వాత డీఏఓ ఉద్యోగ ప్రకటన వచ్చింది. ఇలాంటి అవకాశాలను అభ్యర్థులు నష్టపోకుండా టీఎస్‌పీఎస్సీ తక్షణ చర్యలు చేపట్టాలి. లేకుంటే అభ్యర్థులతో కలసి ఆందోళన చేస్తాం. –ముత్తినేని వీరయ్య, చైర్మన్, టీపీసీసీ వికలాంగుల విభాగం

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.